

ఈనాడు



విజయవాడ 15-8-2025 శుక్రవారం సిటీ సంపుటి 52 . సంచిక 6

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16+14 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru




Godrej
Godrej Enterprises Group
ఇంటిలో స్మార్ట్ హోం లాకర్,
ఇస్తుంది చింత నుండి విముక్తి
Avail Special Offers*
*T&C apply
For more information
1800 209 9955
secure@godrej.com
www.godrejenterprises.com
Matrix
Smart Home Lockers
Please visit:
Godrej interio
Vijayawada: P Obul Reddy & Sons 9849983805, GMGC Solutions Private Limited 9490272227, Sri Ragavendra Enterprises 9032303877, Durga Hardware & Plywood 9164092272, Eluru: Anatha Enterprises 9396579579, Guntur: P Obul Reddy & Sons 9849983806, Ongole: P Obul Reddy & Sons 9849983807, Nellore: P Obul Reddy & Sons 9032900067, Simhapuri Interiors 7013071241

ఈనాడు

విజయవాడ 15-8-2025 శుక్రవారం సిటీ సంపుటి 52 . సంచిక 6

THE LARGEST CIRCULATED TELUGU DAILY


రూ. 6-50 పేజీలు 16+14 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru





ఈనాడు



విజయవాడ 15-8-2025 శుక్రవారం సిటీ సంపుటి 52 . సంచిక 6 | THE LARGEST CIRCULATED TELUGU DAILY | రూ. 6-50 పేజీలు 16+14 | www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru





స్వయం సమృద్ధ భారత్

ఆ దిశగానే దేశం పయనిస్తోంది

ప్రధాన ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తున్నాం

లోపలి పేజీలో

పంద్రాగస్టు ప్రసంగంలో రాష్ట్రపతి ముర్ము

వైకాపాకు ఘోర పరాభవం

పులివెందులలో లతారెడ్డికి **6,033**

ఒంటిమిట్టలో ముద్దు కృష్ణారెడ్డికి **6,267** మెజారిటీలు

పులివెందుల జడ్పీటీసీ ఉపఎన్నికలో డిపాజిట్ గల్లంతు

ఈనాడు - అమరావతి, కడప

'30 సంవత్సరాల తర్వాత ఓటు వేశాను. అందరికీ దండాలు'

వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల జడ్పీటీసీకి జరిగిన ఉప ఎన్నికలో బ్యాలట్ పేపరుకు జతచేసి ఒక ఓటరు వేసిన ఈ చీటీ... నాలుగు దశాబ్దాలుగా ఆ నియోజకవర్గాన్ని వైఎస్ కుటుంబం చెరబట్టి, అక్కడి ప్రజలకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ఎలా కాలరాసిందన్నది కళ్లకు కట్టింది. ఇది ఆ ఒక్క ఓటరు ఆవేదనే కాదు. దశాబ్దాలుగా వైఎస్ కుటుంబ అరాచకాలతో నలిగిపోతూ.. కనీసం తమ ఓటు తాము వేసుకోలేని పులివెందుల నియోజకవర్గ ప్రజల మానసిక వేదనకు అక్షరరూపం. ఇన్నాళ్లూ వైఎస్ కుటుంబ కబంధహస్తాల్లో చిక్కుకుని విలవిల్లాడిన పులివెందుల ప్రజలు ఈ ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటేసి, నచ్చిన అభ్యర్థిని గెలిపించుకోగలిగారు. పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల్లో వైకాపా అభ్యర్థికి డిపాజిట్ కూడా దక్కకుండా చేసి.. ఇన్నాళ్లూ వైఎస్ కుటుంబం సాగించిన అణచివేతకు తగిన గుణపాఠం చెప్పారు. నిర్బంధాలు, బెదిరింపులు, హత్యలు, దాడులతో పులివెందులపై వైఎస్ రాజారెడ్డి, వైఎస్ రాజశేఖరరెడ్డి హయాం నుంచి ఇప్పుడు జగన్ వరకు సాగిస్తున్న పెత్తనానికి తెదేపా గండికొట్టింది. వైకాపా అధ్యక్షుడు జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల నియోజకవర్గంలో. . జడ్పీటీసీ ఉప ఎన్నికలో వైకాపాకు డిపాజిట్ దక్కకుండా చేసింది. అసెంబ్లీ ఎన్నికల్లో 11 సీట్లకే పరిమితమైన జగన్ పార్టీకి ఇది మరో ఘోర పరాభవం. వైకాపా ఓటమి నేపథ్యంలో ఇన్నాళ్లూ పులివెందుల నియోజకవర్గంలో వైఎస్ కుటుంబం దాష్టీకాలపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరుగుతోంది.

ఏ ఎన్నికలైనా ఏకపక్షమే

వైఎస్ కుటుంబం పులివెందులను అడ్డాగా మార్చుకుని ఆధిపత్యం చెలాయిస్తూ వచ్చింది. వైఎస్ రాజారెడ్డి హయాం నుంచీ ఎన్నికల ప్రక్రియను అపహాస్యంగా మార్చేసింది. మూడు దశాబ్దాలకు (మిగతా 2లో)



రిటర్నింగ్ అధికారి ఓబులమ్మ నుంచి డిక్లరేషన్ అందుకుంటున్న పులివెందుల జడ్పీటీసీ తెదేపా అభ్యర్థి మారెడ్డి లతారెడ్డి



రిటర్నింగ్ అధికారి ఓబులమ్మ నుంచి డిక్లరేషన్ అందుకుంటున్న ఒంటిమిట్ట జడ్పీటీసీ తెదేపా అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డి

అయితే ఏకగ్రీవం.. లేకపోతే ఏకపక్షం

వైఎస్ కుటుంబం ఎవర్ని నిలబెడితే వాళ్లదే గెలుపు

తెగించి పోటీచేస్తే దాడులు...

క్షేత్రస్థాయిలో ఇబ్బందులున్నా.. సమర్థత చాటారు

పులివెందులలో స్వేచ్ఛగా ఎన్నికలు జరిపించిన ఉన్నతాధికారులు

ప్రజాతీర్పు బయటపడింది: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు: మంత్రి లోకేశ్

6లో

ఆపరేషన్ సిందూర్ వీరులకు సర్వోత్తమ యుద్ధసేవా పతకాలు

1,090 మంది పోలీసులకు గౌరవం

లోపలి పేజీలో

మేఘ విస్ఫోటం.. మహా విషాదం



ఆకస్మిక వరదలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆరేళ్ల బాలుడు

ఆకస్మిక వరదతో జమ్మూలో 46 మంది మృతి

- అందులో ఇద్దరు సీఐఎస్ఎఫ్ సిబ్బంది..
- ప్రవాహంలో చిక్కుకున్న 167 మందిని రక్షించిన సహాయక బృందాలు
- వారిలో 38 మంది పరిస్థితి విషమం
- మచైల్ మాతా యాత్ర నిలిపివేత
- మృతులకు రాష్ట్రపతి, ప్రధాని సంతాపం

జమ్మూ: జమ్మూ కశ్మీర్ కొండల్లో మేఘ విస్ఫోటం బీభత్సం సృష్టించింది. మచైల్ మాతా దేవి దర్శనానికి వెళ్తున్న యాత్రికులపై విరుచుకుపడింది. ఒక్కసారిగా వచ్చి పడిన ఆకస్మిక వరదతో 46 మంది ప్రాణాలు కోల్పోయారు. చాలా మంది గల్లంతయ్యారు. చనిపోయిన వారిలో ఇద్దరు సీఐఎస్ఎఫ్ సిబ్బంది ఉన్నారు. 167 మందిని సహాయక బృందాలు రక్షించాయి. అయితే వారిలో 38 మంది పరిస్థితి విషమంగా ఉంది. మరణాల సంఖ్య మరింతగా పెరిగే అవకాశముందని భావిస్తున్నారు. మేఘ విస్ఫోటంతో (క్లౌడ్ బరస్ట్) ఒక్కసారిగా (మిగతా 2లో)



జమ్మూకశ్మీర్‌లోని కిశ్త్‌వాడ్ జిల్లాలో కుంభవృష్టి తర్వాత సహాయక చర్యలు

ఉరిమిన కృష్ణమ్మ

- రెండో ప్రమాద హెచ్చరికకు చేరువై క్రమంగా తగ్గుముఖం



కృష్ణా జిల్లా అవనిగడ్డ వద్ద అక్విడెక్టును అనుకొని ప్రవహిస్తున్న వరద

2లో

ఛాంపియన్

సంజును ఇస్తాం
గైక్వాడ్‌ను ఇస్తారా!

రాజస్థాన్ ప్రతిపాదన ● తిరస్కరించిన చెన్నై


శాంసన్

దిల్లీ: రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ సంజు శాంసన్ భవిష్యత్తుపై సందిగ్ధత కొనసాగుతోంది. తనను విడుదల చేయాలంటూ సంజు ఇప్పటికే విజ్ఞప్తి చేయగా.. అతనికి సరితూగే బదిలీ కోసం రాజస్థాన్ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. వికెట్ కీపర్- బ్యాటర్ సంజు బదిలీ కోసం పలు ఫ్రాంఛైజీలను రాజస్థాన్ ప్రధాన యజమాని మనోజ్ బదాలె నేరుగా సంప్రదిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా సంజు స్థానంలో రుతురాజ్ గైక్వాడ్ లేదా రవీంద్ర జడేజా బదిలీ కోసం చెన్నై సూపర్ కింగ్స్‌కు అతను ప్రతిపాదించాడు. ఆల్‌రౌండర్ శివమ్ దూబె పేరు కూడా ప్రస్తావనకు రాగా.. రాజస్థాన్ ప్రతిపాదనను చెన్నై తిరస్కరించింది! తమ ప్రధాన ఆటగాళ్లలో ఏ ఒక్కరిని కూడా వదులుకునేందుకు సిద్ధంగా లేనట్లు స్పష్టంచేసిందని సమాచారం. దీంతో రాజస్థాన్, చెన్నై మధ్య బదలాయింపు ప్రక్రియ దాదాపుగా లేనట్లేనని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మరికొన్ని ఫ్రాంఛైజీలతో కూడా రాజస్థాన్ సంప్రదింపులు కొనసాగిస్తోంది. ఒకవేళ బదలాయింపు సాధ్యంకాకపోతే సంజు రాజస్థాన్‌తోనే కొనసాగాల్సి రావొచ్చు. ఆటగాడి విడుదల, బదలాయింపు పూర్తిగా ఫ్రాంఛైజీ ఇష్టం. ఆటగాడు విజ్ఞప్తి మాత్రమే చేయగలడు. దీంతో సంజు భవిష్యత్తు ఏ మలుపు తీసుకుంటుందో అన్నది ఆసక్తిగా మారింది.

మహిళా అథ్లెట్లకు జన్యుపరీక్ష

దిల్లీ: ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌కు అర్హత సాధించే భారత మహిళా అథ్లెట్లందరికీ ఎస్‌ఆర్‌వై జన్యుపరీక్షను భారత అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫ్ఐ) తప్పనిసరి చేసింది. ప్రపంచ అథ్లెటిక్స్ ఆదేశాల మేరకు ఏఎఫ్ఐ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రపంచ ఛాంపియన్‌షిప్స్ సెప్టెంబరు 13న టోక్యోలో ఆరంభం కానున్నాయి. ఎస్‌ఆర్‌వై జన్యువు ఉందా లేదా అన్నది తెలుసుకోవడానికి ఎస్‌ఆర్‌వై పరీక్ష చేస్తారు. పాజిటివ్ వస్తే మహిళల విభాగంలో పోటీపడేందుకు అనుమతించరు. ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌లో మహిళల విభాగంలో పాల్గొనాలనుకునే అథ్లెట్లందరికీ ఈ పరీక్షను తప్పనిసరి చేస్తూ ప్రపంచ అథ్లెటిక్స్ జూన్ 20న నిర్ణయం తీసుకుంది. జీవిత కాలంలో ఒక్కసారి ఈ పరీక్ష చేయించుకుంటే సరిపోతుంది. ఈ పరీక్ష ద్వారా అథ్లెట్ లింగనిర్ధరణ చేయొచ్చు. సాధారణంగా ఎస్‌ఆర్‌వై జన్యువు పురుషుల్లో ఉంటుంది. "అత్యున్నత స్థాయిలో మహిళల విభాగంలో పోటీపడాలనుకునే అథ్లెట్ శారీరకంగా మహిళ అయ్యుండాలి" అని ప్రపంచ అథ్లెటిక్స్ అధ్యక్షుడు సెబాస్టియన్ కో గతంలో వ్యాఖ్యానించారు.

వేస్ పేస్ కన్నుమూత


వేస్ పేస్

కోల్‌కతా

మ్యూనిచ్ ఒలింపిక్స్ (1972)లో కాంస్యం గెలిచిన భారత హాకీ జట్టు సభ్యుడు, టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్ తండ్రి వేస్ పేస్ గురువారం కోల్‌కతాలో కన్నుమూశారు. ఆయన వయసు 80 ఏళ్లు. పార్కిన్సన్ వ్యాధితో బాధపడుతున్న వేస్‌ను మంగళవారం ఆస్పత్రిలో చేర్చారు. ఆయన అంత్యక్రియలు సోమ లేదా మంగళవారం నిర్వహిస్తారు. విదేశాల్లో స్థిరపడ్డ వేస్ ఇద్దరు కుమార్తెల రాక కోసం కుటుంబం వేచి చూస్తోంది. వేస్ భార్య జెన్నిఫర్ భారత బాస్కెట్‌బాల్ జట్టు మాజీ కెప్టెన్. భారత హాకీ జట్టులో మిడ్‌ఫీల్డర్ అయిన వేస్‌కు దేశంలో క్రీడలతో సుదీర్ఘ అనుబంధం ఉంది. ఫుట్‌బాల్, క్రికెట్, రగ్బీ వంటి ఇతర క్రీడలను కూడా ఆయన ఆడారు. 1996 నుంచి 2002 వరకు భారత రగ్బీ ఫుట్‌బాల్ యూనియన్ అధ్యక్షుడిగా కూడా పని చేశారు. 1945లో గోవాలో జన్మించిన వేస్ ఆటలు ఆడడంతో పాటు బాగా చదువుకున్నాడు. హాకీలో ఇన్నింగ్స్ ముగిశాక స్పోర్ట్స్ మెడిసిన్ వైద్యుడయ్యారు. ఆసియా క్రికెట్ కౌన్సిల్, బీసీసీఐ, భారత డేవిస్‌కప్ జట్టు సహా అనేక క్రీడా సంఘాలకు సలహాదారుగా పనిచేశారు. వేస్ 1971 హాకీ ప్రపంచకప్‌లో కాంస్యం గెలిచిన భారత జట్టు సభ్యుడు కూడా. కానీ తర్వాతి ఏడాది ఒలింపిక్స్‌లో కాంస్యం గెలవడమే ఆయన కెరీర్‌కు హైలైట్. లియాండర్ పేస్ భారత టెన్నిస్‌లో మేటి ఆటగాడిగా ఎదగడం వెనుక ఆయన పాత్ర ఎంతో కీలకం. భారత డేవిస్‌కప్ జట్టుకు పదేళ్లు డాక్టర్‌గా సేవలందించిన వేస్.. లియాండర్ పేస్‌కు మేనేజర్‌గానూ వ్యవహరించారు.

లియాండర్ వెనుక

భారత క్రీడా వర్గాల్లో వేస్ పేస్ అంటే ఎంతో గౌరవం ఉంది. హాకీ ఆటగాడైనప్పటికీ ఆయన ఆ ఆటకే పరిమితం కాలేదు. స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణుడిగా హాకీ, క్రికెట్, టెన్నిస్, ఫుట్‌బాల్.. ఇలా వివిధ క్రీడలకు చెందిన అథ్లెట్లకు సహకారమందించాడు. మృదు స్వభావిగా, తెలివైన వ్యక్తిగా సన్నిహితులకు వేస్ పేస్ తెలుసు. అయితే దేశ క్రీడా చరిత్రలో తనకంటూ ఓ విశిష్ట స్థానమున్నప్పటికీ టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్ తండ్రిగా, అతడి విజయం వెనకున్న శక్తిగానే వేస్ ఎక్కువ మంది క్రీడాభిమానులకు తెలుసు. ఆయన మార్గనిర్దేశకత్వంలోనే లియాండర్ కెరీర్‌లో ఉన్నత శిఖరాలను అందుకున్నాడు. 18 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లతో భారత టెన్నిస్ చరిత్రలోనే అత్యంత విజయవంతమైన ఆటగాడిగా నిలిచాడు. 10 మిక్స్‌డ్ టైటిళ్లు, ఎనిమిది డబుల్స్ అతడి ఖాతాలో ఉన్నాయి. తన తండ్రి కోరిక మేరకే తాను టెన్నిస్‌ను ఎంచుకున్నానని లియాండరే చాలా సార్లు చెప్పాడు. ధ్యాన్‌చంద్-అశోక్ కుమార్ కాకుండా ఒలింపిక్స్‌లో పతకాలు గెలిచిన తండ్రీకొడుకుల జోడీ లియాండర్, వేస్ పేస్‌లే. లియాండర్ 1996 అట్లాంటా ఒలింపిక్స్‌లో పురుషుల సింగిల్స్ కాంస్యం సాధించాడు. ఆ క్రీడల్లో భారత్ గెలిచిన పతకం అదొక్కటే. ఇంటర్నేషనల్ టెన్నిస్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కించుకున్న తొలి ఆసియా పురుషుడిగా కూడా లియాండర్ నిలిచాడు. తన కెరీర్‌లో తన తండ్రి పాత్ర ఎంత కీలకమో అతడు ఎప్పుడూ చెబుతూ ఉంటాడు. వేస్ మరణంతో భారత క్రీడా రంగంలో ఓ ఉజ్వల శకం ముగిసిందని హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టిర్కీ వ్యాఖ్యానించాడు. "హాకీ ఇండియాకు ఇది విచారకమైన రోజు. డాక్టర్ పేస్ మరణంతో హాకీలో ఓ గొప్ప శకానికి తెరపడింది. క్రీడలంటే ఆయనకున్న ప్రేమ నాకు ఎంతో ప్రేరణనిచ్చింది" అని అన్నాడు.


తండ్రితో లియాండర్ పేస్

"దాదాపు పాతికేళ్లుగా డాక్టర్ వేస్ పేస్ నాకు తెలుసు. 2002 బుసాన్ ఆసియా క్రీడల్లో ఆయన భారత జట్టు వైద్యుడు. ఆసియా గేమ్స్, కామన్వెల్త్ గేమ్స్, ఒలింపిక్స్‌లో క్రమం తప్పకుండా జాతీయ జట్టుతో కలిసి పనిచేశారు. స్వయంగా ప్రపంచ స్థాయి ఆటగాడైన ఆయనకు ప్రొఫెషనల్ అథ్లెట్ మనస్తత్వం బాగా అర్థమవుతుంది. క్రీడాకారులకు చికిత్స అందించడానికి అది బాగా ఉపయోగపడింది. వేస్ అంకుల్ మరణం ఒక్క టెన్నిస్ ప్లేయర్లకే కాదు.. మొత్తం భారత క్రీడారంగానికే తీరని లోటు"
– సానియా మీర్జా

వీనస్.. సింగిల్స్‌లోనూ

అమెరికా తారకు యుఎస్ ఓపెన్ వైల్డ్‌కార్డ్


వీనస్

న్యూయార్క్: వయసు 45 ఏళ్లు. గ్రాండ్‌స్లామ్ బరిలో దిగి చాలా నెలలు అయింది. ఈ స్థితిలో మరో ప్లేయర్ అయితే రిటైర్ అవుతారు లేదా కోచ్‌గా మారతారు. కానీ అమెరికా స్టార్ వీనస్ విలియమ్స్ రాకెట్ వదిలేయలేదు. ఫిట్‌నెస్ సంపాదించింది. ఆత్మవిశ్వాసాన్ని కూడా గట్టుకుని సింగిల్స్‌లో పోటీకి సిద్ధమైంది. ఇప్పటికే రిలీ ఒపెల్కాతో కలిసి యుఎస్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ (ఆగస్టు 19-20)లో ఆడే అవకాశాన్ని చేజిక్కించుకున్న వీనస్.. తాజాగా ఆగస్టు 24న మొదలయ్యే సింగిల్స్ డ్రాలోనూ వైల్డ్‌కార్డ్ ఎంట్రీని దక్కించుకుంది. రెనీ రిచర్డ్స్ (47 ఏళ్లు, 1981) తర్వాత సింగిల్స్‌లో ఆడబోతున్న పెద్ద వయస్కురాలిగా నిలిచింది. మిక్స్‌డ్ డబుల్స్ అయితే పర్వాలేదు కానీ.. ఈ వయసులో సింగిల్స్ బరిలో నిలవడం పెద్ద సవాలే. బహుశా కెరీర్‌లో వీనస్‌కు ఇదే చివరి టోర్నీ అయ్యే అవకాశం ఉండడంతోనే అమెరికా టెన్నిస్ సంఘం సింగిల్స్‌లో ఆమెకు వైల్డ్‌కార్డ్ ఇచ్చి ఉండొచ్చు. 2023 యుఎస్ ఓపెన్ ఆఖరిగా ఆడిన వీనస్.. గర్భాశయ కణితులకు శస్త్ర చికిత్స చేయించుకుని ఆడకపోవడంతో దాదాపు 16 నెలలు ఆటకు దూరమైంది. ఇటీవలే డీసీ ఓపెన్‌తో పునరాగమనం చేసింది. వీనస్ తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించేటప్పటికి ప్రస్తుతం యుఎస్ ఓపెన్ సింగిల్స్ డ్రాలో ఉన్న చాలామంది అమ్మాయిలు.. పుట్టకపోవడం విశేషం. 2000, 2001 యుఎస్ ఓపెన్లో వీనస్ విజేతగా నిలిచింది. ఆమె ఖాతాలో అయిదు వింబుల్డన్ ట్రోఫీలు కూడా ఉన్నాయి. చెల్లి సెరెనా విలియమ్స్ తోడుగా 14 డబుల్స్ టైటిళ్లు నెగ్గిన వీనస్.. రెండు మిక్స్‌డ్ డబుల్స్ ట్రోఫీలు కూడా సాధించింది. రికార్డు స్థాయిలో ఆమె అయిదు ఒలింపిక్ పతకాలు నెగ్గింది.

భారత్ ప్రపంచకప్ గెలవాలంటే..


మిథాలీరాజ్

దిల్లీ: పెద్ద మ్యాచ్‌ల్లో ఒత్తిడిని తట్టుకోవడంతో పాటు.. ప్రతి చిన్న అవకాశాన్ని అందిపుచ్చుకుంటేనే భారత మహిళల క్రికెట్ జట్టు తొలి ప్రపంచకప్ గెలిచే అవకాశం ఉంటుందని మాజీ కెప్టెన్ మిథాలీరాజ్ పేర్కొంది. "రెండు సార్లు ప్రపంచకప్‌నకు చేరువగా వచ్చాం. కానీ అందుకోలేకపోయాం. సొంతగడ్డపై సాధిస్తే అంతకుమించిన ఆనందం ఏం ఉంటుంది. కానీ.. ప్రపంచకప్ సాధించాలంటే మైదానంలో అన్నివేళలా అప్రమత్తంగా ఉండాలి. పెద్ద మ్యాచ్‌ల్లో ఒత్తిడిని తట్టుకోవడంతో పాటు.. ఏ చిన్న అవకాశాన్ని వదులుకోవద్దు. అలాంటి వాటిని అందిపుచ్చుకుంటేనే మ్యాచ్‌ను మలుపు తిప్పొచ్చు. మిగిలిన జట్లకు ఛాంపియన్ జట్టుకు తేడా అదే. అలా చేయగలిగితే భారత్ తొలి ప్రపంచకప్ సాధించగలదు" అని మిథాలీ తెలిపింది. "ప్రపంచకప్‌లో ఆడడం ఏ ప్లేయర్‌కైనా ఎంతో స్ఫూర్తినిచ్చే అంశం. ఇప్పటివరకు మహిళల విభాగంలో భారత్ ప్రపంచకప్ గెలవలేదు. ఎలాగైనా టైటిల్ అందుకోవాలనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ బరిలో దిగాలి" అని మిథాలీ చెప్పింది. వచ్చే నెల వన్డే ప్రపంచకప్ ఆరంభం కానుంది.

గుకేశ్‌కు నాలుగో స్థానం


గుకేశ్

సెయింట్ లూయిస్ (అమెరికా): సెయింట్ లూయిస్ చెస్ టోర్నమెంట్ ర్యాపిడ్ విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ నాలుగో స్థానంలో నిలిచాడు. గురువారం ఆఖరిదైన తొమ్మిదో రౌండ్లో ఫాబియానో కరువానా (అమెరికా)పై అతడు విజయం సాధించాడు. అంతకుముందు అమెరికా గ్రాండ్‌మాస్టర్ డొమింగెజ్ పెరెజ్ (ఏడో రౌండ్), వెస్లీ సో (ఎనిమిదో రౌండ్) చేతిలో గుకేశ్ ఓడాడు. మొత్తం 10 పాయింట్లతో అతడు నాలుగో స్థానాన్ని దక్కించుకున్నాడు. కరువానా (14) అగ్రస్థానంలో నిలవగా.. అరోనియన్ (అమెరికా, 13), మాక్సిమ్ లాగ్రేవ్ (ఫ్రాన్స్, 11).. రెండు, మూడో స్థానాలు సాధించారు.

అర్జున్ తెందుల్కర్ పెళ్లి కుదిరింది!

ముంబయి: క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్ తనయుడు అర్జున్ తెందుల్కర్ పెళ్లి నిశ్చయమైంది! స్నేహితురాలు సానియా చందోక్‌ను అతడు వివాహం చేసుకోబోతున్నాడు! అయితే ఈ విషయాన్ని రెండు కుటుంబాలు అధికారికంగా వెల్లడించలేదు. కొద్దిమంది సన్నిహితుల మధ్య బుధవారం నిశ్చితార్థం జరిగినట్లు తెలిసింది. అర్జున్ సోదరి సారా తెందుల్కర్‌కు సానియా స్నేహితురాలు. ముంబయికి చెందిన వ్యాపారవేత్త రవి ఘాయ్ మనవరాలే సానియా. ఆమె కూడా వ్యాపారవేత్త. ముంబయిలో మిస్టర్ పాస్ పెట్ స్పా సంస్థను నడుపుతోంది. చాలా ఏళ్ల నుంచి సారాతో సానియాకు అనుబంధం ఉంది. సచిన్-అంజలి జంట 30వ పెళ్లి రోజు వేడుకను పురస్కరించుకుని ఇటీవల సారా ఇన్‌స్టాలో తల్లిదండ్రుల ఫొటోలు పోస్టు చేసింది. తన స్నేహితురాలు సానియా ఫొటోలను కూడా పంచుకుంది. ఇందులో అర్జున్-సానియా కలిసి ఉన్న చిత్రాలు కూడా ఉన్నాయి.


సానియా చందోక్, అర్జున్

రూ.3,000 వార్షిక టోల్‌పాస్ నేటి నుంచే అమల్లోకి



దిల్లీ: జాతీయ రహదారులు, జాతీయ ఎక్స్‌ప్రెస్‌వేలపై ప్రయాణించే వాణిజ్యేతర వాహనదారుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.3 వేల వార్షిక టోల్ పాస్ శుక్రవారం నుంచి అమల్లోకి రానుంది. రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌లో ఈ పాస్‌ను యాక్టివేట్ చేసుకొనేందుకు ఓ లింక్‌ను అధికారులు అందుబాటులోకి తెచ్చారు. భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ), రహదారి రవాణా, హైవే మంత్రిత్వశాఖ వెబ్‌సైట్లలో కూడా ఈ లింకు ఉంటుంది. కార్లు, జీపులు, వ్యానులు తదితర వాణిజ్యేతర వాహనాలకు మాత్రమే ఈ పాస్ వర్తిస్తుంది. దీంతో ఇక టోల్ చెల్లింపులకు ఫాస్టాగ్ కార్డులు పదేపదే రీఛార్జ్ చేసుకోవాల్సిన అవసరం లేదు. సంవత్సరంలో 200 ట్రిప్పుల వరకు జాతీయ రహదారులపై ఈ పాస్‌తో ప్రయాణించొచ్చు.

దుస్సాహసానికి దిగితే.. ఖబడ్దార్

● పాక్‌కు భారత్ హెచ్చరిక

దిల్లీ: భారత్‌కు వ్యతిరేకంగా ద్వేషపూరిత వాగ్దాటిని కొనసాగించవద్దని విదేశీ వ్యవహారాల శాఖ పాకిస్థాన్‌ను గురువారం హెచ్చరించింది. పాకిస్థాన్ ఏదైనా దుస్సాహసానికి ఒడిగడితే ఆ దేశం బాధాకరమైన పర్యవసానాలు ఎదుర్కోక తప్పదని స్పష్టం చేసింది. ఇటీవల పాకిస్థాన్ సైన్యాధిపతి అసీమ్ మునీర్ భారత్‌కు అణుబాంబు బెదిరింపులు చేశారు. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్, మరో నేత బిలావల్ భుట్టో జర్దారీ కూడా భారత వ్యతిరేక వ్యాఖ్యలకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో పాక్ నాయకులు చేస్తున్న ద్వేషపూరిత, యుద్ధోన్మాద వ్యాఖ్యల్ని తాము గమనిస్తున్నామని విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. స్వీయ వైఫల్యాలను కప్పిపుచ్చేందుకు భారత వ్యతిరేక వాదనలకు దిగడం పాకిస్థాన్ నేతలకు పరిపాటిగా మారిందని ఆయన పేర్కొన్నారు.


రణధీర్ జైస్వాల్

పాకిస్థాన్‌లో కొత్త ఆర్మీ రాకెట్ ఫోర్స్

● ప్రధాని షెహబాజ్ ప్రకటన

ఇస్లామాబాద్: చైనా స్ఫూర్తితో పాకిస్థాన్ కూడా అత్యాధునిక సాంకేతికతతో ఆర్మీ రాకెట్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. ఈ దళం నియంత్రణలో బాలిస్టిక్, హైపర్ సోనిక్, క్రూజ్ క్షిపణులు ఉంటాయి. ఈ విషయాన్ని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రకటించారు. 'దేశ సైనిక పురోగతిలో ఇది ఒక కీలక మైలురాయి. మే నెలలో భారత్‌తో జరిగిన యుద్ధం పాకిస్థాన్‌కు గొప్ప విజయం" అని చెప్పుకొచ్చారు. నాలుగు రోజుల్లోనే పొరుగుదేశం అహంకారాన్ని అణచివేశామని షరీఫ్ తెలిపారు. భారత్-పాక్‌ల మధ్య కాల్పుల విరమణకు సహాయపడిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు కృతజ్ఞతలు చెప్పారు.

'మే'లో గెలిచింది మేమే

పాకిస్థాన్ గురువారం తన 79వ స్వాతంత్ర్య దిన వేడుకల్ని ఘనంగా నిర్వహించింది. గత మే నెలలో జరిగిన విదేశీ దాడుల్ని తిప్పికొట్టామన్న గర్వ భావనతో ఈ వేడుక జరుపుకొంటున్నామని దేశాధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను తన సందేశంలో ప్రస్తావించారు.

ఝుండా ఊంచా రహే హమారా


ఉత్తర్‌ప్రదేశ్‌లోని మొరాదాబాద్‌లో గురువారం విద్యార్థుల తిరంగా ర్యాలీ

మహా సముద్రంలో 5,000 మీటర్ల లోతుకు..

దిల్లీ: మహా సముద్రంలో ఐదు వేల మీటర్ల లోతు వరకు వెళ్లిన ఘనతను ఇద్దరు భారతీయులు సాధించారు. ఆక్వానాట్‌లు సబ్‌మెర్సిబుల్ 'నాటైల్' ద్వారా ఈ ఘనత సాకారం చేశారు. 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ' శాస్త్రవేత్త రాజు రమేశ్ ఈ నెల 5న పోర్చుగీస్ వద్ద సముద్రంలో 4,025 మీటర్ల లోతుకు చేరుకున్నారు. భారత నౌకాదళ విశ్రాంత కమాండర్ జతీందర్ పాల్‌సింగ్ ఆ మరుసటిరోజు 5,002 మీటర్ల వరకు వెళ్లగలిగారు.

అమ్మానాన్నలకు ఆప్యాయత పంచితే రూ.లక్ష

గ్యాంగ్‌టక్: వృద్ధ తల్లిదండ్రుల బాగోగులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న కుమారులు, కుమార్తెలను సిక్కిం ప్రభుత్వం సత్కరించనుంది. 199 మందిని ఎంపిక చేసి వారికి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం 'శ్రవణ్ కుమార్' పేరిట అవార్డులు ప్రదానం చేయబోతోంది. దీంతో పాటు రూ.లక్ష చొప్పున నగదు బహుమతి అందజేయనుంది. కుటుంబ విలువలు, బంధాలను బలోపేతం చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డులను ప్రవేశపెట్టింది.



భారత్‌పై సుంకాల మీద ట్రంప్, పుతిన్ చర్చల ప్రభావం

అమెరికా ఆర్థిక మంత్రి స్పష్టీకరణ

న్యూయార్క్: అమెరికా, రష్యా అధ్యక్షులు ట్రంప్, పుతిన్‌ల మధ్య శుక్రవారం జరిగే చర్చలు విఫలమైతే భారత్‌పై అదనపు సుంకాల భారం మరింత పెరిగే అవకాశముందని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ స్పష్టం చేశారు. 'ప్రతి ఒక్కరూ పుతిన్ తీరుతో అసహనంగా ఉన్నారు. ఆయన మరింత పిచ్చి ప్రతిపాదనలతో చర్చలకు వచ్చే అవకాశముంది' అని పేర్కొన్నారు. రష్యా నుంచి చమురుతో షాడో షిప్‌లు ప్రపంచమంతా వెళ్తున్నాయని, వాటిని గుర్తించి అడ్డుకుంటామన్నారు.

అమెరికాతో స్నేహమే: భారత్

దిల్లీ: అమెరికాతో సంబంధాలపై ముందుకే సాగుతామనే ఆశాభావాన్ని భారత్ వ్యక్తం చేసింది. 'భారత్, అమెరికా అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్యంతో పరస్పర ప్రయోజనాలు, ప్రజాస్వామ్య విలువలు, ప్రజల మధ్య సంబంధాలు ముడిపడి ఉన్నాయి. ఈ బంధం పలు సవాళ్లను తట్టుకుని నిలిచింది' అని విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ పేర్కొన్నారు.

స్వయం సమృద్ధ భారత్

● పంద్రాగస్టు ప్రసంగంలో రాష్ట్రపతి

దిల్లీ: స్వయం సమృద్ధ దేశంగా అవతరించే దిశలో భారత్ పయనిస్తోందని, 2047 నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా నిలుస్తామనే దృఢ విశ్వాసంతో ముందడుగు వేస్తోందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. శుక్రవారం జరగనున్న 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతినుద్దేశించి గురువారం సాయంత్రం ఆమె ప్రసంగించారు. 'సుదీర్ఘకాలం విదేశీయుల ఏలుబడిలో ఉన్న దేశం.. స్వాతంత్ర్యం వచ్చేనాటికి ఎంతో పేదరికంలో ఉండేది. గత 78 ఏళ్లలో అన్ని రంగాల్లో ఎంతో పురోగతి సాధించాం. ఇప్పుడు ముమ్ముందుకు దూసుకువెళ్తున్నాం. గత ఆర్థిక సంవత్సరంలో 6.5% వృద్ధి సాధించడమే మన ఘనతకు ఒక నిదర్శనం. ప్రపంచ ఆర్థిక రంగంపై ఒత్తిళ్లు ఉన్నా దేశీయంగా డిమాండు పెరుగుతూనే ఉంది. ద్రవ్యోల్బణం అదుపులో ఉంది. ఎగుమతులు ఊపందుకుంటున్నాయి. ఆర్థికరంగం బాగుందని సూచికలన్నీ చెబుతున్నాయి. సంస్కరణలతోపాటు రైతుల శ్రమ, అంకితభావం దీనికి కారణం. పేదల అభ్యున్నతికి ప్రభుత్వం చేపట్టిన చర్యలతో ఆర్థిక అసమానతలు తగ్గుతున్నాయి. ప్రాంతీయ తారతమ్యాలు మాయమవుతున్నాయి. ఆర్థికంగా వెనుకబడిన రాష్ట్రాలు, ప్రాంతాలు ఇప్పుడు ముమ్ముందుకు వస్తున్నాయి. క్రీడా రంగంలోనూ మన దేశం ఎంతో రాణిస్తోంది. మన క్రీడాకారులు సాధిస్తున్న రికార్డులే దీనికి నిదర్శనం. రక్షణ రంగంలోనూ మన అమ్మాయిలు రాణిస్తున్నారు. నూతన విద్యా విధానం ద్వారా సమూల మార్పులు వచ్చాయి. యువత తమ కలల్ని సాకారం చేసుకునే వాతావరణం నెలకొల్పాం. అంతరిక్ష రంగంలోనూ అనూహ్యరీతిలో విస్తరిస్తున్నాం.

చరిత్రలో నిలిచేలా ఉగ్రవాదంపై పోరు

ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాదంపై మనం చేసిన పోరు, సాధించిన విజయం చరిత్రలో నిలిచిపోతాయి. రక్షణరంగంలో స్వావలంబనకు, దేశ ఐక్యతకు ఈ పరిణామం నిదర్శనం. వ్యూహపరమైన స్పష్టత, సాంకేతిక సత్తాతో మన సైన్యం పనిచేసి ఉగ్రమూకల పీచమణిచింది. మనం ఎవరిపైనా దండెత్తడానికి వెళ్లబోమని, మన పౌరుల్ని రక్షించుకునేందుకు ఎదురుదాడిలో వెనుకాడేది లేదని ఈ ఆపరేషన్ చాటింది. దేశంలో చేపట్టిన సంస్కరణలు, విధానాలు ప్రతి ఒక్క పౌరుడి ఉజ్వల భవితకు వేదికగా నిలుస్తాయి" అని ముర్ము పేర్కొన్నారు.

ఆపరేషన్ సిందూర్ వీరులకు సర్వోత్తమ యుద్ధ సేవా పతకాలు

1,090 మంది పోలీసులకు గౌరవం

దిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సైనిక, పోలీసు సిబ్బందికి గ్యాలంట్రీ పతకాలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆపరేషన్ సిందూర్ వ్యూహకర్తలకు, అమలు చేసిన సైనిక సిబ్బందికి 127 గ్యాలంట్రీ, 40 సర్వీస్ అవార్డులను ఇచ్చింది. వీరితోపాటు దేశవ్యాప్తంగా 1,090 మంది పోలీసు సిబ్బందికి గ్యాలంట్రీ అవార్డులను ప్రకటించింది. ఇందులో ఆపరేషన్ సిందూర్‌లో సేవలందించిన 18 మంది బీఎస్ఎఫ్ సిబ్బంది ఉన్నారు. 290 మందికి మెన్షన్-ఇన్-డిస్పాచ్‌ను రాష్ట్రపతి ఆమోదించారు. వీరిలో 115 మంది సైన్యం నుంచి, ఐదుగురు నేవీ నుంచి, 167 మంది వైమానిక దళం నుంచి ఉన్నారు.
■ 2జీ వంటి భారీ అవినీతి, నీట్ పేపర్ లీక్, ఛోటా రాజన్, సైబర్ క్రైం కేసుల దర్యాప్తులో పాల్గొన్న 21 మంది సీబీఐ అధికారులకు రాష్ట్రపతి పోలీసు పతకాలు లభించాయి. వీరిలో డీఎస్పీలు అశోక్ కుమార్, విజయ వైష్ణవి, హెడ్ కానిస్టేబుల్ చితిమిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, కానిస్టేబుళ్లు సతీశ్ కుమార్, ఏడిద రాంబాబు ఉన్నారు.
పూర్తి వివరాలు www.eenadu.net లో..

ఒత్తిడికి వెంటనే.. చెక్




మీరు ఒత్తిడిలో ఉంటే.. అప్పటికప్పుడు దాన్ని తగ్గించుకునేందుకు-
✦ దీర్ఘశ్వాస తీసుకోండి. ✦ ఎక్కువ దూరం ఆలోచించకుండా, తదుపరి చర్యపై మాత్రమే దృష్టిపెట్టండి.
✦ ఒత్తిడి తాత్కాలికమే తప్ప, శాశ్వతం కాదని గ్రహించండి. ✦ ఇలాంటి కఠిన పరిస్థితులను మీరు గతంలోనూ ఎదుర్కొన్న సంగతిని గుర్తుచేసుకోండి.
– సుమిత్ శర్మ, వైద్యుడు

కశ్మీర్‌కు రాష్ట్ర హోదాపై స్పందన తెలపండి

● కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం

దిల్లీ: జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించడంపై స్పందన తెలపాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. పహల్గాం ఉగ్రదాడి సహా క్షేత్రస్థాయి వాస్తవాలను విస్మరించలేమంది. రాష్ట్రహోదా అంశంపై త్వరగా విచారణ జరపాలని దాఖలైన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది చేసిన అభ్యర్థనపై ఈ మేరకు ఆదేశించి, తదుపరి విచారణను ఎనిమిది వారాలకు వాయిదా వేసింది. ఇలాంటి పిటిషన్లను గతంలోనూ సర్వోన్నత న్యాయస్థానం తోసిపుచ్చిందని, ఇప్పుడూ అలాగే చేయాలని కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోరారు.

శ్రీనగర్: పహల్గాం ఉగ్రదాడి గురించి సుప్రీంకోర్టు ప్రస్తావించడం చూస్తే జమ్మూకశ్మీర్ సుస్థిరతపై కేంద్రానికి నమ్మకం లేదన్నది తెలుస్తోందని పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ విమర్శించారు. జమ్మూకశ్మీర్‌పై పట్టును వదులుకోవడం కేంద్రానికి ఇష్టం లేనట్లుందన్నారు.



స్థానిక సంస్థల నిర్లక్ష్యం వల్లే కుక్కల సమస్య

● మధ్యంతర ఉత్తర్వులపై తీర్పు రిజర్వు

దిల్లీ: వీధి కుక్కల బెడద తీవ్రం కావడానికి స్థానిక సంస్థల బాధ్యతారాహిత్యమే ప్రధాన కారణమని సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం పేర్కొంది. పార్లమెంటు రూపొందించిన చట్టాలు, నిబంధనలు అమలుకాకపోవడం, జంతు సంతతి నియంత్రణ చర్యలు చేపట్టకపోవడంతోనే దిల్లీలో సమస్య తీవ్రమైందని స్పష్టం చేసింది. నగరం నుంచి వీధి శునకాలను తరలించాలంటూ ద్విసభ్య ధర్మాసనం వెలువరించిన ఆదేశాలను నిలిపివేయాలన్న (స్టే) అభ్యర్థనలపై తీర్పును రిజర్వు చేసింది. వీధి కుక్కల తరలింపు వివాదంపై విచారణను జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి.అంజరియాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం గురువారం సుమోటోగా చేపట్టింది. జంతు సంక్షేమ మండలి, స్థానిక సంస్థల అధికారుల నిర్లక్ష్యంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ దిల్లీ నుంచి వీధి కుక్కలన్నింటినీ తరలించాలన్న జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్‌ల ధర్మాసనం ఆదేశాలను సమర్థించారు.


ఇక్కడున్న ఊరేదీ.. ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ ప్రాంత హర్సిల్ గ్రామం వద్ద భాగీరథిలో, ఆకస్మిక వరదలతో ఊరు తుడుచుకుపోయి ఏర్పడిన తాత్కాలిక సరస్సు





ఈనాడు

విజయవాడ 15-8-2025 శుక్రవారం సిటీ సంపుటి 52 . సంచిక 6

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16+14 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

విద్యుత్ ప్రాజెక్టులు పూర్తికావాల్సిందే

పెండింగ్‌లో ఉన్నవాటిపై దృష్టి

ప్రతి వారం సమీక్షించనున్న అధికారులు

ఈనాడు, అమరావతి: విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకున్న సంస్థలు ఏళ్లుగా జాప్యం చేస్తున్నాయి. ప్రాజెక్టుల ఏర్పాటుకు కేటాయించిన 2 లక్షల ఎకరాలకుపైగా భూములు వృథాగా పడివున్నాయి. ప్రభుత్వానికి జీఎస్టీ రూపేణా ఆదాయం రాకపోగా.. యువత ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారు. దీంతోపాటు రాష్ట్ర విద్యుత్ ప్రణాళికపై ప్రభావం పడుతోంది. డిమాండ్ మేరకు విద్యుత్ అందించేందుకు అధిక ధరకు బహిరంగ మార్కెట్‌లో డిస్కంలు కొంటున్నాయి. ఆ భారాన్ని ట్రూఅప్ పేరుతో వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్నాయి. ఇక మీదట వినియోగదారులపై అదనపు భారాలు వేయకుండా కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రాజెక్టుల ఏర్పాటుకు ఉన్న సమస్యలపై సంస్థలతో చర్చించాలని నిర్ణయించింది. నిర్దేశిత గడువులోగా ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు ఉన్న ఇబ్బందుల పరిష్కారంపై దృష్టిసారించింది. దీనికోసం ప్రతివారం కొన్ని కంపెనీలతో అధికారులు సమావేశమై.. ప్రాజెక్టుల నిర్మాణాన్ని చేపట్టేందుకు ఉన్న సమస్యలపై చర్చిస్తారు. రాబోయే ఆరు నెలల్లో సాధ్యమైనన్ని ప్రాజెక్టులను గ్రౌండింగ్ చేసేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. విద్యుత్ ప్రాజెక్టుల పూర్తికి సంకల్పించారు.

38 పునరుత్పాదక ప్రాజెక్టులకు ఒప్పందం

రాష్ట్రంలో 2014-19 మధ్య 10,247 మెగావాట్ల సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుల ఏర్పాటుకు 5 సంస్థలతో నాటి ప్రభుత్వం ఒప్పందాన్ని కుదుర్చుకుంది. అందులో ఇప్పటివరకు సుమారు 7,500 మెగావాట్ల సామర్థ్యంగల విద్యుత్ ప్రాజెక్టులు మాత్రమే ఉత్పత్తిలోకి వచ్చాయి. సంస్థలు ప్రాజెక్టుల ఏర్పాటుకు భూములు తీసుకుని దశాబ్ద కాలం దాటినా సుమారు 2,500 మెగావాట్ల సామర్థ్యం ఉన్న ప్రాజెక్టులు ఇప్పటికీ పూర్తికాలేదు. కూటమి ప్రభుత్వం గత ఏడాది జూన్ నుంచి 38 ప్రాజెక్టుల ఏర్పాటుకు ఒప్పందాలు కుదుర్చుకుంది. వాటితో కలిపి ఇప్పటివరకు వివిధ ప్రభుత్వాల హయాంలో అనుమతులు ఇచ్చిన పవన, సౌర, పంప్డ్ స్టోరేజి ప్రాజెక్టులు (పీఎస్‌పీ), కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ), ఎలక్ట్రోలైజర్స్, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులను నిర్దేశిత వ్యవధిలో గ్రౌండింగ్ చేసేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందింది.

గ్రౌండింగ్‌పై వైకాపా ప్రభుత్వం దృష్టి పెట్టని ఫలితం

రాష్ట్రంలో 2014 నుంచి ఇప్పటి వరకు 80,798 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుల ఏర్పాటుకు వివిధ సంస్థలు అనుమతులు పొందాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వడమే తప్ప వాటి గ్రౌండింగ్‌పై దృష్టి సారించలేదు. దీనివల్ల పన్నుల రూపేణా రావాల్సిన ఆదాయాన్ని ప్రభుత్వం కోల్పోతోంది.

వివిధ క్యాటగిరీ ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితి (మెగావాట్లలో)

క్యాటగిరీ	మొత్తం సామర్థ్యం	పూర్తయినవి	నిర్మాణంలో ఉన్నవి	నిర్మాణం ప్రారంభించాల్సినవి
సౌర	30,761	5,006	4,267	21,488
పవన	24,997	4,380	3,928	16,689
పీఎస్‌పీ	25,040	---	3,530	21,510
	80,798	9,386	11,725	59,687

- వీటిలో విండ్, సోలార్ హైబ్రిడ్ ప్రాజెక్టులు ఉన్నాయి.
- రిలయన్స్ సంస్థ 500 సీబీజీ ప్లాంట్లు.. రూ.65,456 కోట్ల పెట్టుబడులు. 2.52 లక్షల మందికి ఉపాధి. ఇప్పటికి నాలుగు సీబీజీ ప్లాంట్ల నిర్మాణాన్ని ప్రారంభించింది.
- ఎలక్ట్రోలైజర్స్ తయారీ ప్రాజెక్టు ఏర్పాటుకు ఒప్పందం. దీని ద్వారా రూ.2 వేల కోట్ల పెట్టుబడులు.. 500 మందికి ఉపాధి.
- గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుకు రూ.12 వేల కోట్ల పెట్టుబడులు.. 2,600 మందికి ఉపాధి.

2024 జూన్ నుంచి అనుమతించిన ప్రాజెక్టులు.. పెట్టుబడి వివరాలు

విద్యుత్ క్యాటగిరీ	ప్రాజెక్టుల సంఖ్య	ఉత్పత్తి (మె.వా)	పెట్టుబడి (రూ.కోట్లు)	ఉపాధి
పవన విద్యుత్	16	3,505	25,084	5,435
సౌర ప్రాజెక్టులు	15	12,180	60,138	41,260
పీఎస్‌పీలు	7	11,760	58,809	22,690
	38	27,445	1,44,031	69,385

రాబోయే 5 రోజుల్లో ఉత్తరాంధ్రలో భారీ వర్షం

కొన్ని జిల్లాలకు ఆకస్మిక వరద ముప్పు

ఈనాడు, విశాఖపట్నం: పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర తీరాలకు సమీపంలో అల్పపీడనం కొనసాగుతోంది. ఇది పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ శుక్రవారం నాటికి ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరాలవైపు ప్రయాణించే అవకాశముందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. అలాగే తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, యానాంలలో ఆకస్మిక వరదలు వచ్చే ప్రమాదముందని ఐఎండీ హెచ్చరించింది. మరోవైపు బీకానేర్ (రాజస్థాన్), బిలాస్‌పూర్, కళింగపట్నం మీదుగా అల్పపీడన ప్రాంతం వరకు రుతుపవన ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాబోయే ఐదు రోజుల్లో ఉత్తరాంధ్రలోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. శుక్రవారం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల్లో భారీ వానలు పడతాయని, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలకు అవకాశముందని పేర్కొంది. మచిలీపట్నం, కాకినాడ, గంగవరం, విశాఖపట్నం, కళింగపట్నం పోర్టులకు మూడో నంబరు ప్రమాద హెచ్చరికలు కొనసాగుతున్నాయి. గురువారం విజయనగరం, శ్రీకాకుళం, ఏలూరు, అనకాపల్లి, తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు తదితర జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. సాయంత్రం 6 గంటల వరకు అత్యధికంగా విజయనగరం జిల్లా శృంగవరపుకోటలో 5.2 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

దేశవ్యాప్తంగా క్లెయిం చేయని ఫిక్స్‌డ్ డిపాజిట్లు రూ.లక్ష కోట్లు


- అవగాహనరాహిత్యమే అందుకు కారణం
- ఆర్బీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లక్ష్మీకాంతరావు



ఈనాడు, అమరావతి: మరణించిన ఖాతాదారులకు సంబంధించి దేశవ్యాప్తంగా రూ.లక్ష కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లను వారి సంబంధీకులు క్లెయిం చేయలేదని ఆర్బీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.లక్ష్మీకాంతరావు తెలిపారు. అవగాహన రాహిత్యమే అందుకు కారణమని పేర్కొన్నారు. ఇలాంటి ఎన్నో సందేహాల్ని నివృత్తి చేయడానికి దేశవ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గురువారం విజయవాడ సమీపంలోని నున్నలో యూబీఐ, ఎస్‌బీఐ, కెనరా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు సహా వివిధ బ్యాంకుల ఆధ్వర్యంలో 'మెగా జన సురక్ష శిబిరాన్ని' నిర్వహించారు. లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ.. ఏళ్లుగా క్రియాశీలకంగా లేని బ్యాంకు ఖాతాల్ని రీ-కేవైసీ చేసుకోవడం ద్వారా యాక్టివేట్ చేయించుకోవచ్చని సూచించారు. అటల్ పెన్షన్ యోజన, పీఎం సురక్ష బీమా యోజన, పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన, ఉచిత రూపే డెబిట్ కార్డు ప్రయోజనాల్ని ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ సీవీఎన్ భాస్కరరావు వివరించారు. కార్యక్రమంలో ఆర్బీఐ రీజినల్ డైరెక్టర్ బషీర్, జీఎం ఆర్‌కే మహానా తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉత్పత్తి వ్యయం తగ్గించాలి

- స్వల్పకాలిక కొనుగోళ్లు నియంత్రించాలి
- సమీక్షలో సీఎం చంద్రబాబు



ఈనాడు, అమరావతి: విద్యుత్ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడంతో పాటు.. నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యంగా 'ఇంధన పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సిస్టం (ఈపీఎంఎస్) ఉండాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. విద్యుత్ సంస్థల నిర్వహణలో సాంకేతికత అందిపుచ్చుకోవాలని, లైన్ల నిర్వహణ వ్యయాన్ని తగ్గించేందుకు ఏఐతో పనిచేసే డ్రోన్లను వినియోగించాలని, మానవరహితంగా సబ్‌స్టేషన్లను నిర్వహించే సాంకేతికత అందిపుచ్చుకోవాలని నిర్దేశించారు. ఇంధనశాఖపై సచివాలయంలో రెండోరోజు గురువారం సమీక్షించారు. 'తక్కువ ధరకు విద్యుత్ పంపిణీ చేసినప్పుడే వినియోగదారులకు ప్రయోజనం చేకూరుతుంది. విద్యుత్ కొనుగోళ్లలో డిస్కంలు నిధులు భారీగా ఆదా చేయాలి. కృత్రిమ మేధను వినియోగించి ముందస్తుగా విద్యుత్ డిమాండ్ అంచనా వేయాలి. కెపాసిటీ ప్లానింగ్ టూల్స్ ద్వారా కచ్చితమైన అంచనాలు రూపొందించాలి. రాష్ట్రంలోని వేర్వేరు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి, పంపిణీకి ప్రణాళికలు రూపొందించే అంశాన్ని పరిశీలించాలి. ఈపీఎంఎస్ ద్వారా కచ్చితమైన డిమాండ్ అంచనాలతో మార్కెట్ కొనుగోళ్లు సమర్థంగా నిర్వహించాలి. గత ఏడాది స్వల్పకాలిక ఒప్పందాల ద్వారా 4,535 మిలియన్ యూనిట్ల విద్యుత్ కొనుగోలుకు డిస్కంలు రూ.3,880 కోట్లు ఖర్చు చేశాయి. 2026లో మార్కెట్ కొనుగోళ్లు తగ్గించాలి. దీంతో పాటు యూనిట్ ఉత్పత్తి వ్యయం తగ్గించాలి' అని అధికారులను సీఎం ఆదేశించారు.

2025-26లో సుమారు 4వేల ఎంయూల పునరుత్పాదక విద్యుత్‌ను పెంచుకోవడం, ఇతర ఉత్పత్తి సంస్థల నుంచి అదనపు విద్యుత్‌ను తీసుకోవడం ద్వారా స్వల్పకాలిక మార్కెట్‌లో కేవలం 396 ఎంయూల విద్యుత్ మాత్రమే కొనేలా ప్రణాళిక రూపొందించినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ సీఎంకు వివరించారు. 'విద్యుత్ కొనుగోళ్లను సమన్వయం చేయడం ద్వారా రూ.176 కోట్లు ఆదా చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. వివిధ మార్గాల్లో విద్యుత్ కొనుగోళ్లలో ఆదా చేయడం ద్వారా యూనిట్ విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని ప్రస్తుతమున్న రూ.5.19 నుంచి రూ.4.80కు తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నాం' అని సీఎస్ చెప్పారు.

పంప్డ్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్‌పై దృష్టి

వివిధ పునరుత్పాదక ప్రాజెక్టుల నుంచి వచ్చే మిగులు విద్యుత్‌ను నిల్వ చేసే సాంకేతికతపై దృష్టి సారించాలని సీఎం సూచించారు. విద్యుత్ నిల్వకు బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టం (బీఈఎస్ఎస్)ను పరిశీలించాలన్నారు. నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్, ట్రాన్స్‌కోల ద్వారా ఏర్పాటు చేసే వెయ్యేసి మెగావాట్ల బెస్ ప్రాజెక్టుల ద్వారా విద్యుత్ నిల్వ చేసి, పీక్ డిమాండ్ సమయంలో వినియోగించడం వల్ల మొత్తం రూ.588 కోట్లు ఆదా చేసే అవకాశం ఉందని సీఎస్ వివరించారు. సమీక్షలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొన్నారు.

బలమైన శక్తిగా భారత్

'ఎక్స్'లో స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన సీఎం

ఈనాడు, అమరావతి: ప్రపంచ దేశాల్లో భారత్ బలమైన శక్తిగా ఎదుగుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ప్రజలకు ఎక్స్ వేదికగా స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ సమగ్రత, భద్రత, ప్రగతికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

నారావారిపల్లెకు స్కోచ్ అవార్డు

- అధికారులను అభినందించిన సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: పీఎం సూర్యఘర్ పథకం కింద సీఎం స్వగ్రామం నారావారిపల్లెకు స్కోచ్ అవార్డు దక్కింది. పైలట్ ప్రాజెక్టుగా ఎ.రంగంపేట, కందులవారిపల్లి, చిన్నరామాపురం, నారావారిపల్లెలో 1600 ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టులను తక్కువ వ్యవధిలో అధికారులు పూర్తిచేశారు. దీనికి గుర్తింపుగా 'స్వర్ణ నారావారిపల్లె' కింద గుర్తిస్తూ స్కోచ్ గ్రూప్ తిరుపతి జిల్లా కలెక్టర్‌కు లేఖ పంపింది. సెప్టెంబరు 20న డిల్లీలో జరిగే స్కోచ్ సదస్సులో అధికారులు అవార్డును అందుకోనున్నారు. విద్యుత్‌శాఖపై సమీక్ష ముగిసిన తర్వాత అవార్డు గురించి అధికారులు సీఎంకు తెలిపారు.

ఇతర అవార్డులు

- హైడ్రోజన్ వ్యాలీ డిక్లరేషన్‌ను ప్రకటించినందుకు 'స్పెషల్ స్టేట్ అవార్డు'ను ముంబయికి చెందిన రెన్యూవబుల్ ఎనర్జీ ప్రమోషన్ అసోసియేషన్ (ఆర్ఈపీఏ) ప్రకటించింది.
- హైడ్రోజన్ ఎకానమీ, విజన్ 2047 కింద 'ప్రెస్టీజియస్' అవార్డు
- పీఎస్‌యూ విభాగంలో గవర్నెన్స్ నౌ కేటగిరీలో ఏపీఎస్‌పీడీసీఎల్ ఎండీ కమలాకర్‌బాబుకు అవార్డ్ ఆఫ్ ఎక్సలెన్స్‌తో పాటు ఈ ఏడాదిలో వచ్చిన వివిధ అవార్డులను సీఎస్ విజయానంద్ సీఎంకు వివరించారు. అవార్డులు సాధించిన ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి, ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావును సీఎం అభినందించారు.

మృత్యుంజయురాలు.. అంజమ్మ



చిరుతపులి దాడి నుంచి తప్పించుకున్న అంజమ్మ

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: నిద్రిస్తున్న చిన్నారిపై చిరుతపులి దాడి చేసి గాయపరిచిన ఘటన ప్రకాశం జిల్లా దోర్నాల మండలం చిన్నారుట్ల చెంచు గిరిజనగూడెంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. గూడేనికి చెందిన కుడుముల అంజయ్య, లింగేశ్వరిలు తమ మూడేళ్ల కుమార్తె అంజమ్మతో కలిసి బుధవారం రాత్రి ఇంట్లో నిద్రించారు. తలుపులు వేసుకోకపోవడంతో రాత్రి ఒకటిన్నర సమయంలో చిరుతపులి వచ్చి అంజమ్మ మెడను నోటితో పట్టుకుని వెళుతుండగా.. ఆ అలికిడికి తల్లిదండ్రులు లేచి కేకలు వేశారు. దీంతో చిరుతపులి చిన్నారిని వదిలేసి వెళ్లిపోయింది. అంజమ్మ మెడ వెనుక భాగంలో గాయాలవ్వడంతో తల్లిదండ్రులు సున్నిపెంట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం అటవీశాఖ సిబ్బంది బాధితురాలిని పెద్దదోర్నాల వైద్యశాలకు తరలించారు. చిన్నారికి ప్రాణాపాయం తప్పింది. చిరుతపులిపై నిఘా ఏర్పాటుచేసి, మనుషులపై దాడి చేయకుండా అవసరమైన చర్యలు చేపడతామని మార్కాపురం అటవీ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ సందీప్ కృపాకర్ తెలిపారు.

ఇదీ సంగతి!



ఇప్పుడేమైంది సార్! ఎలాగూ మీరు ఉండేది బెంగళూరులోనే కదా!!

డ్రైవర్ రహిత మినీబస్సులు

ఐఐటీ హైదరాబాద్‌లో అందుబాటులోకి



ఈనాడు డిజిటల్, హైదరాబాద్: డ్రైవర్ అవసరం లేకుండా నడిచే మినీ బస్సులు ఇప్పుడు హైదరాబాద్ వచ్చేశాయి. అయితే ప్రజలకింకా అందుబాటులోకి రాలేదు. ప్రస్తుతం ఐఐటీ హైదరాబాద్ పూర్తిస్థాయిలో ఈ బస్సులను వినియోగిస్తోంది. ఐఐటీ హైదరాబాద్ అభివృద్ధి చేసిన అటానమస్ నావిగేషన్ డేటా అక్విజిషన్ సిస్టం టెక్నాలజీని ఉపయోగించి ఈ డ్రైవర్ రహిత బస్సులను తయారుచేశారు. ప్రస్తుతం మూడు రోజుల నుంచి ఇవి ఐఐటీ క్యాంపస్‌లో రోజువారీ సేవలు అందిస్తున్నాయి. దీంతో దేశంలోనే తొలిసారిగా ఐఐటీ హైదరాబాద్ డ్రైవర్ రహిత బస్సులను అందుబాటులోకి తెచ్చినట్లయిందని సిబ్బంది తెలిపారు.

విద్యుత్తు వినియోగంతో..: ఐఐటీ హైదరాబాద్‌లోని ప్రత్యేక పరిశోధన విభాగం 'టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్ ఆన్ అటానమస్ నావిగేషన్ (టీహన్)' ఈ డ్రైవర్ లెస్ బస్సుల్లో ఉపయోగించే సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసింది. ఇవి పూర్తిగా విద్యుత్తుతో నడుస్తాయి. ప్రస్తుతం విశ్వవిద్యాలయం రెండు రకాల బస్సులను అందుబాటులోకి తెచ్చింది. అందులో ఒకటి ఆరు సీట్లు, మరొకటి పద్నాలుగు సీట్ల వాహనం. ఐఐటీ క్యాంపస్‌లోని విద్యార్థులు, అధ్యాపకులు ఈ డ్రైవరు లేని వాహనాల్లోనే ప్రధాన గేటు నుంచి వర్సిటీలోని అన్నిచోట్లకు ప్రయాణిస్తున్నారు. ఈ బస్సుల్లో ప్రయాణించిన వారి నుంచి చాలావరకు సానుకూల స్పందన వచ్చిందని.. 90 శాతం మంది సంతృప్తి చెందినట్టు టీహన్ పేర్కొంది.

ఉరిమిన కృష్ణమ్మ


ప్రకాశం బ్యారేజీ నుంచి సముద్రంలోకి ప్రవాహం

రెండో ప్రమాద హెచ్చరికకు చేరువై క్రమంగా తగ్గుముఖం

ఈనాడు, అమరావతి: ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహంతో కృష్ణా నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు భారీగా పెరిగింది. ప్రకాశం బ్యారేజీ వద్ద దాదాపు రెండో ప్రమాద హెచ్చరిక స్థాయిలో పెరిగి, క్రమంగా తగ్గింది. మధ్యాహ్నం ఒంటి గంట వేళ గరిష్ఠ ఇన్‌ఫ్లో 5,65,807 క్యూసెక్కులు, అవుట్ ఫ్లో 5,65,201 క్యూసెక్కులుగా నమోదైంది. బుధ, గురువారాల్లో 5 లక్షల క్యూసెక్కుల వరకు పెరగడంతో బెజవాడ వాసులు ఆందోళన చెందారు. ప్రవాహం 5.67 లక్షల క్యూసెక్కులకు చేరితే రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. రాత్రి 7గంటలకు ఇన్‌ఫ్లో 5,39,473, అవుట్ ఫ్లో 5,38,867 క్యూసెక్కులకు తగ్గింది.

■ పెనుగంచిప్రోలు వద్ద మున్నేరు వరదలో ఓ మృతదేహం కొట్టుకొచ్చింది. స్థానికులు గుర్తించారు. మృతుడు రేపల్లె వాసిగా తేలింది. శనగపాడు వద్ద వాగు దాటే క్రమంలో ఇద్దరు వ్యక్తులు వరదలో చిక్కుకోగా, గ్రామస్థులు బయటికి తీశారు. మాగల్లు వద్ద కాచివాగు పొంగి వందల ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. నందిగామ మండలం గొల్లమూడి గ్రామంలోని ఓ కోళ్లఫారం లోకి వైరా ఏటి ప్రవాహం రావడంతో 7 వేల కోళ్లు చనిపోయాయి.

■ నందిగామ మండలం కూడలి- పల్లంపల్లి గ్రామాల మధ్య వరద పోటెత్తి రాకపోకలు నిలిచాయి. రుద్రవరం, సోమవరం గ్రామాల మధ్య కల్వర్టు కొట్టుకుపోయింది. గంపలగూడెం మండలం వినగడప వంతెనపై వరద పోటెత్తుతోంది. వాహనాల రాకపోకలను పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో గండివాగు, నడివాగు పొంగడంతో 2వేల ఎకరాల్లో పొలాలు నీట మునిగాయి.


ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి వద్ద నూతనంగా నిర్మించిన కాంక్రీట్ గోడ వద్ద బుడమేరు ప్రవాహం

1.71 లక్షల ఎకరాల్లో పంటల మునక

ఈనాడు, అమరావతి: ఇటీవలి వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల్లోని 79 మండలాల్లో 1.71 లక్షల ఎకరాల్లో పంట పొలాలు నీట మునిగాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో 1.49 లక్షల ఎకరాల మేర వరి పంట ఉంది. చాలాచోట్ల పత్తి, మినుము, పెసర, వేరుశనగ, కంది, మొక్కజొన్న, సజ్జ పంటలు ముంపులోనే ఉన్నాయి. గుంటూరు, బాపట్ల, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, కృష్ణా, పల్నాడు, ఏలూరు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, కర్నూలు, తూర్పు గోదావరి, అనంతపురం, వైఎస్సార్ కడప జిల్లాల్లో పంటలు దెబ్బతిన్నాయి.


పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం కొండాయపాలెంలో మునిగిన పంట పొలాలు చూపిస్తున్న రైతు సూర్యచంద్రరావు


ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలానికి వెళ్లే దారిలో జాతీయ రహదారి పక్కనే నీట మునిగిన పొలాలు

గుంటూరును వీడని ముంపు

● తటాకాలను తలపిస్తున్న వరి పొలాలు
● నగరంలోని పలు కాలనీల్లో మురుగు మేటలు

ఈనాడు, అమరావతి: కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలోని గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 48 వేల హెక్టార్లలో వరి పొలాలు నీట మునిగినట్లు వ్యవసాయ శాఖ గుర్తించింది. వెద పద్ధతిలో సాగు చేసిన వరి 30-35 రోజుల వ్యవధిలో ఉండటంతో మూడు రోజులు పూర్తిగా నీటిలో ఉండిపోతే ఆకులు, కాండం కుళ్లిపోతాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పొలాల నుంచి వరద నీటిని బయటకు పంపేందుకు ప్రయత్నిస్తున్నారు.

■ మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసిన 8,600 బేళ్ల పొగాకును గుంటూరులోని చుట్టుగుంట వద్ద ఉన్న కేంద్ర గిడ్డంగుల సంస్థ గోదాముల్లో నిల్వ చేశారు. గోదాముల్లోకి వర్షపు నీరు చేరడంతో 2,700 బేళ్ల పొగాకు తడిసిపోయాయి. ఒక్కో బేలు విలువ సగటున రూ.9 వేలు ఉన్నందున సుమారు రూ.50 లక్షల నష్టం వాటిల్లిందని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ నరసింహారెడ్డి తెలిపారు. కేంద్ర గిడ్డంగుల సంస్థ ఉన్నతాధికారులు, మార్క్‌ఫెడ్ ఇన్‌ఛార్జి ఎండీ గోదాముల వద్ద పరిస్థితిని అంచనా వేశారు.

■ గుంటూరు నగరంలోని అనేక లోతట్టు ప్రాంతాలు ముంపులోనే ఉన్నాయి. చుట్టుగుంట, మురికిపేట, మిర్చియార్డు ప్రాంతాల్లోని కాలనీలను గురువారం కూడా వర్షపు నీరు వీడలేదు. మురికిపేట, ఏటీ అగ్రహారంలోని కొన్ని వీధుల్లో నీరు తగ్గుముఖం పట్టడంతో స్థానికులు బురద తొలగిస్తున్నారు. రైతుబజార్లలో కూరగాయలు, దుకాణాలు నీటిపాలవడంతో వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు. గురువారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటించారు. నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు క్షేత్రస్థాయిలో పర్యటించి బాధితుల సమస్యలు తెలుసుకున్నారు.


గుంటూరు జిల్లా పెదకాకాని మండలం నంబూరు వద్ద హైలెవల్ కెనాల్‌కు పడిన గండి నుంచి వరద ప్రవాహం


ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహంతో గుంటూరు జిల్లా తాడికొండ-కంతేరు మధ్య ఎర్రవాగు ఉద్ధృతి

కట్టే దశలోనే.. కొట్టుకుపోయింది!

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లా వరరామచంద్రాపురం మండలం అన్నవరం వాగుపై నిర్మాణంలో ఉన్న లోలెవెల్ చప్టా గురువారం ఉదయం కూలిపోయింది. మూడు రోజుల క్రితం బీటలు వారి రెండు చోట్ల కుంగిపోయింది. తాజా వర్షాలకు మొత్తం కూలిపోగా, కొంతభాగం వరదలో కొట్టుకుపోయింది. తాత్కాలిక రహదారి పనులకు ఆటంకం ఏర్పడింది. ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి.



బెజవాడలో రహదారికి బీటలు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: విజయవాడలో టూటౌన్-పాతబస్తీని కలిపే లోబ్రిడ్జి రహదారి గురువారం కుంగిపోయింది. రహదారి చాలావరకు పక్కనున్న కాలువలో కొట్టుకుపోగా, రక్షణ గోడ కొంతభాగం కూలిపోయింది. అధికారులు వందల సంఖ్యలో ఇసుక, కంకర బస్తాలను రోడ్డుకు దన్నుగా కాలువ లోపలి వైపునుంచి పేర్చారు. నగరపాలక సంస్థ, నీటిపారుదల శాఖ అధికారులు సమన్వయంతో మరమ్మతులు చేయాలని కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు.


బీటలు వారిన రోడ్డు

జాతి నిర్మాణానికి పునరంకితం అవుతామని ప్రతిజ్ఞ చేద్దాం

గవర్నర్ అబ్దుల్ నజీర్

ఈనాడు, అమరావతి: జాతి నిర్మాణానికి పునరంకితమవుతామని స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రతిజ్ఞ చేద్దామని గవర్నర్ అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆయన సందేశమిచ్చారు. "79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు. మనం స్వేచ్ఛా ఫలాలను ఆస్వాదించడానికి కారణమైన స్వాతంత్ర్య సమరయోధులందరినీ స్మరించుకునే రోజు స్వాతంత్ర్య దినోత్సవం. అలాగే స్వాతంత్ర్య పోరాటానికి స్ఫూర్తినిచ్చిన సత్యం, అహింస, శాంతి, సోదరభావం వంటి గొప్ప ఆదర్శాలకు పునరంకితమవుదాం" అని పేర్కొన్నారు.

మేఘ విస్ఫోటం.. మహా విషాదం

(మొదటి పేజీ తరువాయి)

కురిసిన భారీ వర్షంతో వచ్చిన వరదలు పలు భవనాలు, దుకాణాలను తుడిచిపెట్టాయి. వరదల కారణంగా తీవ్ర విషాదం నెలకొనడంతో మచైల్ మాతా దేవి యాత్రను నిలిపేశారు. మృతులకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీసహా పలువురు సంతాపం ప్రకటించారు. జమ్మూ కశ్మీర్ ఎల్జీ మనోజ్ సిన్హా, సీఎం ఒమర్‌తో కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడారు.

ఏటా జరిగే మచైల్ మాతా యాత్ర కిశ్త్‌వాడ్ జిల్లాలోని చశోతీ గ్రామం మీదుగా సాగుతుంది. వాహనాల్లో అక్కడికి వచ్చిన భక్తులు. . అక్కడి నుంచి 9,500 అడుగుల ఎత్తున్న ఉన్న ఆలయానికి 8.5 కిలోమీటర్ల దూరం కాలినడకన వెళ్తారు. ఎప్పటిలాగే భారీగా భక్తులు గురువారం చశోతీకి చేరుకున్నారు. మధ్యాహ్నం 12, 1 గంటల మధ్య వరద ఒక్కసారిగా విరుచుకుపడింది. దీంతో సామూహిక వంటశాలతోపాటు సమీపంలోని దుకాణాలు, సెక్యూరిటీ అవుట్‌పోస్టు కొట్టుకుపోయాయి. బురద నీరు, సిల్ట్, శిథిలాలు కొండపై నుంచి వేగంగా కొట్టుకొచ్చాయి. క్షణాల్లో మొత్తం ధ్వంసమైంది. ఇళ్లు పేకమేడల్లా కొట్టుకుపోయాయి. పెద్ద బండరాళ్లు దిగువకు వచ్చి పడ్డాయి. రోడ్లు మూసుకుపోయాయి.

యాత్ర నిలిపివేత

పెను విషాదం నేపథ్యంలో మచైల్ మాతా యాత్రను నిలిపేశారు. ఈ యాత్ర జులై 25న ప్రారంభమైంది. సెప్టెంబరు 5న ముగియాల్సి ఉంది. చశోతీ కిశ్త్‌వాడ్‌కు 90 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. 9 రోజుల కిందటే మేఘ విస్ఫోటంతో ఉత్తరాఖండ్‌లోని ధరాలీ గ్రామం తుడిచిపెట్టుకుపోయింది. మళ్లీ అంతటి విషాదం చశోతీలో చోటుచేసుకుంది. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాల ఆధ్వర్యంలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

■ చశోతీ విషాదంతో శుక్రవారం సాయంత్రం జరగాల్సిన 'ఎట్ హోం' టీ పార్టీని రద్దు చేసుకున్నట్లు జమ్మూ కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలనూ నిలిపివేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.


జమ్మూకశ్మీర్‌లోని కిశ్త్‌వాడ్ జిల్లాలో గురువారం కురిసిన కుంభవృష్టి కారణంగా చశోతీ గ్రామంలో దెబ్బతిన్న ఇళ్లు

హిమాచల్‌లో 472 రోడ్ల మూసివేత

హిమాచల్ ప్రదేశ్‌లోనూ భారీ వర్షాలు కొనసాగుతున్నాయి. అక్కడ బుధవారం మేఘ విస్ఫోటాలు చోటుచేసుకున్నాయి. శిమ్లా, లాహౌల్-స్పితి ప్రాంతాల్లో పలు నిర్మాణాలు కొట్టుకుపోయాయి. 472 రహదారులను మూసివేశారు.

■ దిల్లీలో భారీ వర్షాలు పడుతున్నాయి. ఇప్పటికే రాజధాని.. 4 నెలల ముందుగానే వార్షిక సగటు వర్షపాతాన్ని దాటేసింది. గురువారం నాటికి నగరంలో 818.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇది వార్షిక సగటు 774.4 మిల్లీమీటర్ల కంటే అధికం.

వైకాపాకు ఘోర పరాభవం

(మొదటి పేజీ తరువాయి)

పైగా అక్కడ స్వేచ్ఛగా ఎన్నికలు జరిగిన దాఖలాలే లేవు. వైఎస్ కుటుంబం ఊరికో పది మందిని పెంచి పోషిస్తూ, వారితో అరాచకాలు చేయించేది. ఎన్నికలొస్తే ప్రజల్ని భీతావహుల్ని చేసి, పోలింగ్‌కు రాకుండా చేసి, ఏకపక్షంగా ఓట్లు వేసుకునేవారు. స్థానిక సంస్థల ఎన్నికలను మెజారిటీ సందర్భాల్లో ఏకగ్రీవం చేసుకున్నారు. ఒకటీ అరా సందర్భాల్లో పోటీ జరిగినా అది నామమాత్రమే. 'పోటీచేస్తున్న అభ్యర్థుల్ని, ఓటర్లను భయభ్రాంతుల్ని చేసి ఓటింగ్‌కు రాకుండా చేసేవారు. 2024 ఎన్నికల సందర్భంగా వైఎస్ షర్మిల, వివేకా కుమార్తె సునీతల ఎన్నికల ప్రచారానికీ అనేక అడ్డంకులు సృష్టించారంటే... వారి నైజం ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు' అని పులివెందుల నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకుడు ఒకరు పేర్కొన్నారు. 'ఓటర్లను లోబరచుకునేందుకు మొదట మెత్తగా చెప్పేవారు. వినకపోతే బెదిరించేవారు. ఆదాయ మార్గాల్ని దెబ్బతీస్తామని భయపెట్టేవారు. అప్పటికీ వినకపోతే ప్రలోభపెట్టేవారు. అయినా దారికి రానివారిపై దాడులు చేసేవారు' అని వైఎస్ కుటుంబ అరాచకాల్ని ప్రత్యక్షంగా చూసిన మరో నాయకుడు వెల్లడించారు.

ఎదురు నిలిస్తే అంతే సంగతులు

■ 1987లో మండల పరిషత్ ఎన్నికల్లో లింగాల మండలం వెలిదండ్లలో తెదేపా ఏజెంట్‌గా ఉన్న వినుతుర్ల రాజగోపాల్‌రెడ్డిని పోలింగ్ బూత్ లోనే కొందరు దుండగులు పొడిచి చంపేశారు.

■ సింహాద్రిపురం మండలానికి చెందిన రామలింగారెడ్డి తెదేపా ఏజెంటుగా ఉన్నందుకు పులివెందులలో హత్యకు గురయ్యారు.

■ రాష్ట్రంలో తెదేపా అధికారంలో ఉన్నప్పుడు మాత్రమే పులివెందులలో పోటీ చేయగలిగిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

ఉమేశ్‌చంద్ర ఎస్పీగా రావడంతో..

■ 1996లో ఉమేశ్‌చంద్ర కడప ఎస్పీగా ఉండగానే లోక్‌సభ ఎన్నికలు జరిగాయి. ఎక్కడికక్కడ రౌడీ, ఫ్యాక్షన్ మూకలను కట్టడి చేసి, ఉమేశ్‌చంద్ర ఆ ఎన్నికల్ని అత్యంత పకడ్బందీగా నిర్వహించడంతో వైఎస్ కుటుంబ అరాచకాలకు చాలావరకు అడ్డుకట్ట పడింది. కడప లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి ఉమేశ్‌చంద్ర ధాటికి కేవలం 5,445 ఓట్ల అతి తక్కువ మెజారిటీతో బయటపడ్డారు.

■ ఉమేశ్‌చంద్ర కడప ఎస్పీగా ఉన్నంతకాలం వైఎస్ కుటుంబ ఆగడాలు సాగలేదు. ఆయన బదిలీపై వెళ్లాక మళ్లీ వారి అరాచకాలు పెచ్చుమీరాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు అక్కడ వారు ఆడింది ఆటగా సాగుతోంది.

ప్రజలు ధైర్యంగా ఓట్లేశారు

– బీటెక్ రవి, పులివెందుల తెదేపా ఇన్‌ఛార్జి

జగన్‌కు బుద్ధిచెప్పాలని ప్రజల గట్టిగా నిర్ణయించుకుని ఓట్లు వేశారు. ఇదివరకు పులివెందులలో ధైర్యంగా ఓట్లు వేసే పరిస్థితులు లేవు. పోలింగ్ కేంద్రాలకు రానిచ్చేవారు కాదు. ఈసారి పక్కాగా ఏర్పాట్లు చేయడంతో ప్రజలకు భరోసా లభించింది. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓట్లేశారు.

ప్రజలు ఓట్లు ఎలా వేయాలో మర్చిపోయారు

– పేర్ల పార్థసారథిరెడ్డి, తెదేపా నేత

ఇన్నాళ్లూ ఓటు వేసే అవకాశం రాకపోవడంతో కొందరు బ్యాలట్ పత్రంపై ఓటుముద్ర ఎలా వేయాలో మర్చిపోయారు. మేం ఎన్నికల ప్రచారానికి కనంపల్లె వెళ్లినప్పుడు... అక్కడ ప్రజలు ఓటుముద్ర ఎలా వేయాలో, బ్యాలట్‌ను ఎలా మడవాలో తెలియదన్నారు.

వారి అరాచకాలు ఇక సాగవు

– భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ

ఇన్నాళ్లూ పులివెందులలో వైఎస్ కుటుంబ అరాచకాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. వాటిపై ప్రజలు చేసిన తిరుగుబాటే ఈ ఎన్నికల్లో తెదేపా ఘన విజయం. ఇక ఇక్కడ జగన్ ఆటలు సాగవు.

గ్రహం అనుగ్రహం

15-8-2025 శుక్రవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; వర్ష రుతువు, శ్రావణ మాసం, బహుళపక్షం
సప్తమి: రా. 1-22 తదుపరి అష్టమి
అశ్విని: ఉ. 10-08 తదుపరి భరణి
వర్జ్యం: ఉ. 6-23 నుంచి 7-53 వరకు
తిరిగి రా. 7-04 నుంచి 8-33 వరకు
అమృత ఘడియలు: తె. 4-00 నుంచి 5-29 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-17 నుంచి 9-07 వరకు
తిరిగి మ. 12-29 నుంచి 1-20 వరకు
రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ.5.46; సూర్యాస్తమయం: సా.6.23

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
తాడేపల్లిగూడెం	34.1	26.0
రాజమహేంద్రవరం	33.0	24.0
విశాఖపట్నం	32.8	26.0
నెల్లూరు	32.6	25.7
శ్రీకాకుళం	32.0	27.0
విజయనగరం	32.0	25.0
నరసాపురం	31.4	24.6
ఒంగోలు	31.3	25.2
గుంటూరు	31.0	26.0
విజయవాడ	30.0	24.2
ఖమ్మం	30.0	22.4
హనుమకొండ	29.5	23.5
నల్గొండ	29.5	21.4
అనంతపురం	29.3	23.4
కడప	29.0	25.0
కర్నూలు	28.9	22.3
మెదక్	28.6	21.0
హైదరాబాద్	28.0	21.6
కరీంనగర్	27.0	23.0
నిజామాబాద్	25.7	24.2
మహబూబ్‌నగర్	25.3	21.9

సీమకు జల సిరి తెచ్చేలా.. కుప్పానికి నీళ్లు వచ్చేలా

- జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో చేయలేని విస్తరణ పని
- ఎన్డీయే ప్రభుత్వంలో 6 నెలల్లోనే కొలిక్కి

ఈనాడు - అమరావతి

ఎక్కడో శ్రీశైలం జలాశయం.. మరెక్కడో కుప్పం
ఎంత ఎత్తుకు ఎత్తిపోస్తే... ఎన్ని కిలోమీటర్లు ప్రయాణిస్తే నీళ్లు చేరతాయి?
ఎన్ని కొండల్ని తొలచి, ఎన్ని లోయల్ని అనువుగా మలిస్తే ఇది సాధ్యమవుతుంది
ఏళ్లనాటి కలను ఈ నెలాఖరుకు తీర్చేందుకు జలవనరుల శాఖ యుద్ధప్రాతిపదికన పనులు చేస్తోంది.

హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) పథకంలో ప్రవాహ సామర్థ్యం పెంచుతూ దారిలో సీమజిల్లాల్లో సాగు, తాగునీటి అవసరాలు తీరుస్తూ కుప్పం వరకు నీళ్లు తీసుకువెళ్తున్నారు. శ్రీశైలం నుంచి 600 కి.మీ. ప్రయాణించి నీళ్లు అక్కడికి చేరనున్నాయి. జగన్ ప్రభుత్వంలో ఐదేళ్లలో చేయని హంద్రీనీవా విస్తరణ, లైనింగ్ పనులను ఎన్డీయే ప్రభుత్వం ఆరునెలల్లోనే పూర్తిచేసి సీమకు జలకళ తీసుకొస్తోంది. హెచ్ఎన్ఎస్ఎస్‌ను రెండుదశల్లో నిర్మించినా... కుప్పానికి కాలువలు నిర్మించినా అక్కడికి ఇంతకాలం నీరు చేరలేదు. 2023లో నాటి సీఎం జగన్ సినిమా సెట్టింగులా కుప్పం వరకు నీళ్లు పారించినట్లు హైడ్రామా సృష్టించారు. ఈ ఎన్డీయే హయాంలో రూ.వేల కోట్ల పనులు వేగంగా పూర్తిచేస్తున్నారు. తొలిదశలో కాలువలు వెడల్పు చేసి నీళ్లు ఇచ్చేశారు.

కొండల్ని తొలిచి... లోయల్ని అనువుగా చేసి

శ్రీశైలం నుంచి హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా 410 కి.మీ. దూరంలో చెర్లోపల్లి జలాశయానికి నీళ్లు చేరతాయి. మధ్యలో అనేక జలాశయాలు నింపుతారు. ప్రధాన కాలువ నుంచి పుంగనూరు బ్రాంచి కాలువలో 200 కి.మీ. ప్రయాణించాలి. అనంతరం 123.64 కి.మీ. కుప్పం బ్రాంచి కాలువలో ప్రయాణిస్తే నీళ్లు చివరికి చేరతాయి. ఈ బ్రాంచి కాలువ తవ్వకం పెద్ద సవాల్‌గా సాగింది. కొండలు, లోయలు, ఎత్తుపల్లాలతో కూడిన ప్రాంతమది. కొండల్ని తొలచి, లోయల్లో సైఫన్లుగా పైపులు ఏర్పాటుచేసి టన్నెళ్లు తవ్వి నీళ్లు తీసుకువెళ్లేలా అనువుగా మార్చాల్సి వచ్చింది. ఈ కాలువ వల్ల 6,300 ఎకరాలకు నీరందుతుంది. 110 చెరువుల్లో నీటిని నింపుతారు. కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లోని 8 మండలాల్లో 4.02 లక్షల మంది ప్రజలకు తాగునీటి వసతి ఏర్పడుతుంది.

ఆరు చోట్ల సైఫన్‌లు

కుప్పం కాలువలో ఆరుచోట్ల లోయలు ఉన్నాయి. కైగల్, పాలార్ నదీ లోయల్లో నీళ్లు మళ్లించాలి. అక్కడ పైపు సైఫన్లు ఏర్పాటుచేశారు. ఆరు భాగాలుగా 12-47 మీటర్ల ఎత్తులో పైపులతో ఈ సైఫన్లు ఏర్పాటుచేశారు. ఐదుచోట్ల టన్నెళ్లు తవ్వాల్సి వచ్చింది. కొంత కాలువ, కొంత అక్విడక్టు, కొంత సైఫన్, కొంత టన్నెల్... ఇలా పని చేసుకుంటూ కుప్పం వరకు కాలువ ఏర్పాటుచేయాల్సి వచ్చింది. 282 కట్టడాలు నిర్మించారు. 2019 లోపు అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలోనే సింహభాగం పనులు పూర్తయ్యాయి. అయినా కుప్పం వరకు నీళ్లు చేరలేదు.

తాజాగా 6 నెలల్లో ఏం జరిగింది?

హంద్రీనీవా సుజల స్రవంతి పనులు ఎప్పుడో పూర్తిచేసి రెండు దశల్లో జలాశయాలకు నీళ్లు ఇచ్చినా ప్రవాహ సామర్థ్యం సరిగా లేకుండా పోయింది. డిజైన్ ప్రకారం లైనింగ్ పనులు చేయాలి. హంద్రీనీవా తొలిదశ విస్తరణ 2014-19 మధ్య ప్రారంభమైంది. రూ.4,317 కోట్లతో చేపట్టి 47% పనులు పూర్తిచేశారు. 2019 నుంచి 2024 వరకు పనుల ప్రతిపాదనలు మారినా జరిగిందేమీ లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తొలిదశలో ప్రధాన కాలువ వెడల్పు పనులతో పాటు రెండోదశలో లైనింగ్, పుంగనూరు బ్రాంచి కాలువ, కుప్పం బ్రాంచి కాలువల్లో లైనింగ్ పనులు రూ.2,226 కోట్ల ఒప్పంద విలువతో చేపట్టారు. తొలిదశ కాలువ వెడల్పు చేసి నీళ్లు వదిలేశారు.

★ రెండోదశలో కాలువ వెడల్పు కాకుండా లైనింగ్ పనులకు ప్రాధాన్యం ఇచ్చారు. 216.300 కి.మీ నుంచి 400.500 కి.మీ వరకు ఐదు ప్యాకేజీలుగా లైనింగ్ పనులు జరుగుతున్నాయి. దీంతోపాటు పుంగనూరు బ్రాంచి కాలువలో 207 కి.మీ. మేర, కుప్పం బ్రాంచి కాలువలో 130 కి.మీ. మేర కాలువ లైనింగ్ పనులు చేస్తున్నారు. నెలాఖరుకు ఇవి పూర్తిచేసి కుప్పం నీళ్లు పంపబోతున్నారు. దీంతో ఏళ్లనాటి కల సాకారం కాబోతోంది.

ఏపీడబ్ల్యూసీఎఫ్‌సీకి రూ.23.46 కోట్ల నష్టం

- ఐఎఫ్ఎస్ మాజీ అధికారిపై ఈడీ అభియోగపత్రం

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ఉమెన్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు (ఏపీడబ్ల్యూసీఎఫ్‌సీకి) రూ.23.46 కోట్ల మేర నష్టం కలిగించడంతో పాటు నిధుల్ని అక్రమంగా మళ్లించిన కేసులో ఐఎఫ్ఎస్(ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్) మాజీ అధికారి ఆకుల కిషన్‌పై ఈడీ దాఖలు చేసిన అభియోగ పత్రాన్ని పీఎంఎల్ఏ కేసుల ప్రత్యేక న్యాయస్థానం తాజాగా పరిగణనలోకి తీసుకుంది. కిషన్ ఆ కార్పొరేషన్‌లో ఉన్నత స్థానంలో కొనసాగిన 2005 ఏప్రిల్-2008 కాలంలో ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డారంటూ హైదరాబాద్ సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ దర్యాప్తు చేపట్టింది. ఇందిరమ్మ మహిళా ఉపాధి పథకం కింద అనర్హులకు, తన బినామీలకు నిబంధనలకు విరుద్ధంగా కిషన్ రూ.15.39 కోట్ల రుణాలను మంజూరు చేసినట్లు ఈడీ దర్యాప్తులో తేలింది. సీఈవో సంతోష్‌కుమార్‌తో కలిసి నకిలీ ఒప్పందాల ద్వారా రహస్యంగా బ్యాంకు ఖాతాలను తెరిచి.. కార్పొరేషన్ పేరిట రూ.7.5 కోట్లను సేకరించి ఆ ఖాతాల్లో జమ చేసినట్లు గుర్తించింది. అనంతరం ఆ సొమ్మును వ్యక్తిగత ఖాతాల్లోకి మళ్లించినట్లు వెల్లడైంది. అధిక ధరలకు సామగ్రి కొనుగోలు చేసి ఆర్థికంగా లబ్ధి పొందినట్లు బయటపడింది. ఇలాంటి పనులతో కార్పొరేషన్‌కు రూ.23.46 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు ఈడీ నిర్ధారించింది. ఈకేసులో ఈడీ ఇప్పటికే కిషన్‌తోపాటు ఇతర నిందితులకు సంబంధించిన రూ.1.26 కోట్ల విలువైన స్థిరాస్తుల్ని జప్తు చేసింది.

వరుస సెలవులతో తిరుమలకు పెరుగుతున్న భక్తులు

తిరుమల, న్యూస్‌టుడే: వరుస సెలవులతో శ్రీవారి దర్శనానికి భక్తుల రద్దీ పెరుగుతోంది. శుక్రవారం నుంచి మూడు రోజులు సెలవులు ఉండటంతో గురువారం సాయంత్రం నుంచే తిరుమలకు వస్తున్న భక్తుల సంఖ్య పెరిగింది. గురువారం సాయంత్రానికే ఎటువంటి దర్శన టోకెన్లు లేని భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2, నారాయణగిరి షెడ్లు నిండిపోయి రింగురోడ్డులోని శిలాతోరణం వరకు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. వీరికి శ్రీవారి దర్శనం దాదాపు 16 గంటల సమయం పట్టనుంది. రూ.300 ఎస్ఈడీ, తిరుపతిలో ఆఫ్‌లైన్‌లో సమయ నిర్దేశిత సర్వదర్శనం(ఎస్ఎస్‌డీ) టోకెన్లు పొందిన భక్తులకు మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది.



రింగురోడ్డులోని క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

దివ్యాంగ విద్యార్థికి అండగా నిలిచిన మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: నీట్ ర్యాంక్ సాధించిన తిరుపతికి చెందిన దివ్యాంగ విద్యార్థి దాసారెడ్డి హరిహర బ్రహ్మారెడ్డికి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అండగా నిలిచారు. వైద్య కళాశాలలో సీటు కోల్పోతామన్న ఆందోళనకు పరిష్కారం చూపారు. నీట్ యూజీ పరీక్ష ఫలితాల్లో దివ్యాంగ కేటగిరీలో 1,174 ర్యాంకు సాధించిన బ్రహ్మారెడ్డికి ప్రభుత్వ వైద్యకళాశాలలో సీటు లభించే అవకాశం ఉంది. ఈ నెల 19న కౌన్సెలింగ్‌కు హాజరుకావాల్సి ఉంది. నీట్ నిబంధనల ప్రకారం ఇంటర్‌లో తప్పనిసరిగా ఇంగ్లిష్‌ను తొలి లేదా రెండో భాషగా ఎంచుకోవాలి. ఇంటర్ మార్కుల మెమోలో ఫస్ట్ లాంగ్వేజ్ వద్ద ఈ (ఎగ్జెంప్టెడ్) అని ఉండడంతో మెడికల్ సీటు కోల్పోతామని విద్యార్థి, తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. సమస్య పరిష్కరించాలని కోరుతూ మంత్రి లోకేశ్‌ను ఆశ్రయించారు. గతంలో ఐఐటీ, ఎన్ఐటీ విద్యార్థులకు ఇంగ్లిష్ సబ్జెక్టులో కనీస మార్కులు 35 కలుపుతూ జారీచేసిన జీఓ ద్వారా 25 మంది దివ్యాంగ విద్యార్థులకు అండగా నిలిచిన లోకేశ్.. అదే ఉత్తర్వుల ద్వారా ఈ విద్యార్థికీ మార్కుల జాబితాలో కనీస మార్కులు కలిపి సమస్యకు పరిష్కారం చూపారు.

ఒంటరి మహిళలే లక్ష్యం.. నగలు దోచుకుని అఘాయిత్యం



నిందితుడు సజు

- 50 మందిపై అత్యాచారం చేసి బెదిరించిన యువకుడి అరెస్టు

చెన్నై (ఆర్కేనగర్), న్యూస్‌టుడే: మహిళలు ఒంటరిగా కనిపిస్తే చాలు వారిపై అత్యాచారం చేసి వీడియోలు తీసి, నగలు దోచుకొని ఆపై బెదిరింపులకు పాల్పడుతున్న యువకుడిని కర్ణాటక పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. కేరళలోని ఇడుక్కికి చెందిన సజు(24) తమిళనాడు దిండుక్కల్ నగరంలోని నాగల్‌నగర్‌లో ఉంటున్నాడు. ఇటీవల ఓ రోజు ఉదయాన్నే స్థానిక కార్మిక అడ్డాకు వెళ్లి పని కోసమని ఓ మహిళను తన కారులో తీసుకెళ్లాడు. నిర్మానుష్య ప్రాంతంలో ఆమెపై అత్యాచారం చేసి, సెల్‌ఫోన్‌తో వీడియో తీసి, నగలు దోచుకున్నాడు. బాధితురాలు దిండుక్కల్ నగర నార్త్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గాలించి సజును కేరళలో అరెస్టు చేశారు. అతడి ఫోన్‌లో పలువురు మహిళల అసభ్యకర వీడియోలు గుర్తించారు. పలువురు ఒంటరి మహిళలపై అత్యాచారం చేసి విషయం ఎవరికీ చెప్పకుండా వీడియో తీసి బెదిరించే వాడినని నిందితుడు పోలీసుల ఎదుట ఒప్పుకొన్నట్లు తెలిసింది. కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో సుమారు 50 మంది బాధితులున్నట్లు పోలీసులు తెలిపారు. విలాసాలకు అలవాటుపడిన సజు కారులోనే జీవిస్తూ నేరాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు వివరించారు.

రాష్ట్ర పట్టణ ప్రణాళిక విభాగంలో ఇద్దరికి డైరెక్టర్లుగా పదోన్నతి

ఈనాడు, అమరావతి: రాష్ట్ర పట్టణ ప్రణాళిక విభాగంలో ఇద్దరు అదనపు సంచాలకులకు డైరెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఏపీ రెరాలో అదనపు సంచాలకులుగా ఉన్న కె.నాగసుందరి, పట్టణ ప్రణాళిక విభాగం డైరెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న అదనపు సంచాలకుడు బి.శ్రీనివాసులు పదోన్నతి పొందారు.

మద్యం కేసు నిందితుల బెయిల్ పిటిషన్లపై విచారణ వాయిదా

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులోని నిందితుల బెయిల్ పిటిషన్లపై విజయవాడలోని ఏసీబీ కోర్టులో గురువారం జరగాల్సిన విచారణ వాయిదా పడింది. సజ్జల శ్రీధర్‌రెడ్డి పిటిషన్ ఈ నెల 18కి, దిలీప్ పిటిషన్ 19కి, బాలాజీ కుమార్ యాదవ్, నవీన్ కృష్ణ పిటిషన్లపై 20కి విచారణను కోర్టు వాయిదా వేసింది. రూ.11 కోట్ల నగదు జమపై రాజ్ కెసిరెడ్డి వేసిన పిటిషన్‌పై విచారణ సైతం 20కి వాయిదా పడింది.

జల వివాదాల కమిటీకి పేర్లు ప్రతిపాదించండి

రాష్ట్రానికి కేంద్ర జలశక్తిశాఖ లేఖ

ఈనాడు,అమరావతి: రెండు తెలుగు రాష్ట్రాల మధ్య జలవివాదాల పరిష్కారానికి ఏర్పాటుచేసే కమిటీ కోసం ఆంధ్రప్రదేశ్ నుంచి సభ్యుల పేర్లు తెలియజేయాలని కేంద్ర జలశక్తి శాఖ కోరింది. ఈ మేరకు ఏపీ జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌కు కేంద్ర జలశక్తి శాఖ సంయుక్త కార్యదర్శి ప్రదీప్‌కుమార్ అగర్వాల్ గురువారం లేఖ రాశారు. 'జులై 16న దిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొని తాజా జల వివాదాలపై చర్చించారు. పెండింగ్ అంశాలను పరిష్కరించేందుకు అధికారులు, నిపుణులతో కమిటీ ఏర్పాటుచేయాలని అంగీకరించారు. ఈ కమిటీలో ఇరు రాష్ట్రాలతో పాటు కేంద్రం నుంచి సభ్యులను నామినేట్ చేయాలని నిర్ణయించారు. కానీ సభ్యులుగా ఎవరిని నియమించాలో ఇంకా ఎలాంటి ప్రతిపాదనలు రాలేదు. ఏపీ వెంటనే కమిటీ సభ్యుల పేర్లను తెలియజేయాలి' అని లేఖలో కోరారు. తెలంగాణకు కూడా కేంద్ర జలశక్తి శాఖ లేఖ రాసినట్లు తెలిసింది.


ఈనాడు

నిలుపరా నీ జాతి నిండు గౌరవము

'గడపదాటితే అందరం భారతీయులం... ఈ దేశం మన గురుకులం... ఇక్కడి పుట్టుక పుణ్యఫలం'- ఇది స్వాతంత్ర్య దినోత్సవ శుభవేళ మనమంతా ప్రత్యేకంగా ఉపాసించాల్సిన దివ్య భావన. ఇదే దేశ ప్రగతికి దీవెన. భారతదేశం పంచాక్షరి. వందేమాతరం పంచాక్షరి. ఆత్మప్రత్యయంగా, ఆభిజాత్యంగా గుండెల్లో ఆ రెండూ గూడుకట్టుకున్నవాడే నిజమైన భారతీయుడు. అప్పుడే భారతదేశం చిత్రపటంగా కాకుండా నిలువుటద్దంగా గోచరిస్తుంది. 'చేయెత్తి జైకొట్టు తెలుగోడా...' అంటూనే వేములపల్లి శ్రీకృష్ణ- 'దేశాన్ని దిగమింగి పోయినారోయి- మోసాన్ని గుర్తెరిగి కాపాడవోయి' అని ప్రబోధించారు. 'నేను తెలుగువాణ్ని' దగ్గర ఆగిపోకుండా, 'భారతీయుణ్ని' దాకా ప్రయాణించాలని అర్థం. 'భా' అంటే వెలుగు, వికాసం. వాటిపట్ల అనురక్తి కలిగి ఉండటమే- భారతీయం. కలమెత్తినా, గళమెత్తినా మన దేశపు జెండాకున్నంత పొగరు- కలం పలుకులో, గళం కులుకులో తళుకులీనడం భారతీయత. దాని అసలు పేరు జాతీయత!

'ప్రతి దేశానికీ తనదైన ఆత్మచైతన్యం ఉంటుంది' అన్నారు అరవిందులు. వ్యక్తి చైతన్యాన్ని ఆ సమష్టి చైతన్యానికి అనుసంధానించడమే జాతీయతా భావమంటే. భారతీయ ఆత్మను అణువణువునా జీర్ణించుకున్న వ్యక్తుల్లో- 'నేను' చెరిగిపోయి అది 'మనం'లో చేరుతుంది. స్వార్థం- సమాజ పరమార్థంగా మారిపోతుంది. లోకహితానికి దారితీస్తుంది. అలాంటివారి మాటల్లోంచి, చేతల్లోంచి కాంతిపరివేషం తోస్తుంది. 'ఇండియా- అనే పదాన్ని వివేకానందుల నోట వింటున్నప్పుడు ఆ వాక్కులోని భావసాంద్రత మాకు గగుర్పాటు కలిగించేది. కాంతిపరివేషం తోచేది' అని సిస్టర్ క్రిస్టెయిన్ స్పష్టంగా రాశారు. అంతటి భావ తీవ్రత, జాతీయత రక్తంలో కరిగిపోయిన నిస్వార్థ వ్యక్తి ఒక్క పిలుపిస్తే- 'నీవొక జీవజాతిని జనించినవాడవు... నీవే విజయధ్వజమ్ము ఎగురవేసెడివాడవు- లేచి నిల్వరా!' అంటూ ఆ పిలుపు మనిషి మనిషినీ ఉత్తేజపరుస్తుంది. జాతి జాతి అంతా దేశభక్తితో ఉగ్రూతలూగుతుంది. ముందుకురుకుతుంది. ఈరోజు మనం పాడే పాటలన్నీ- ఆ జాతీయతను బలంగా ఆకాంక్షిస్తూ ఆలపించే వైతాళికగీతాలు! ఆ జాతీయ భావనపై అమృతవృష్టిని కురిపించే గారాబు మబ్బుతునకలు!

జాతీయ పతాకాన్ని చొక్కా జేబుకు గుచ్చి పెట్టుకుంటే చాలదు. జెండా అనేది మామూలు వస్త్ర విశేషం కాదని, అది సర్వతంత్ర స్వతంత్ర భారతదేశపు మహత్వపూర్ణ మహోన్నత చిహ్నమనే ఎనలేని గర్వవీచిక ఎదలోపల ఎగసిపడుతూ ఉండాలి. 'ఒక మనిషి అలవాట్లన్నీ కలిపి లెక్కేస్తే- ఆ మనిషి వ్యక్తిత్వం అవుతుంది' అన్నారు స్టీఫెన్ కోవె. ఒక జాతిలోని వ్యక్తిత్వాల కూడిక- ఆ జాతిశీలానికి ప్రతీక. 'జాతీయభావం లోపించడం కారణంగా- జాతిశీలం భ్రష్టుపడుతోంది' అని ఆవేదన చెందారు రవీంద్ర కవీంద్రుడు. విదేశాలకు పోయి పాడు పనులు చేసే వారికి, విదేశీయుల పట్ల ఇక్కడ అమర్యాదగా చెడుగా ప్రవర్తించేవారికి మరీ ముఖ్యంగా వర్తిస్తుంది ఇది. అందుకే 'ఏ దేశమేగినా ఎందుకాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని' అని ఊరుకోలేదు రాయప్రోలు- 'నిలుపరా నీ జాతి నిండు గౌరవము' అంటూ పిలుపిచ్చారు. దేశాన్ని గౌరవించడమంటే తన సమాజాన్నీ తననూ గౌరవించుకోవడమే. తన ఆత్మగౌరవాన్ని దేశ గౌరవానికి ముడివేసినప్పుడే... జాతీయతను తనలో పెంచి పోషించినప్పుడే... సాధ్యం అవుతుంది అది. దాన్నే గురజాడ 'దేశమును ప్రేమించుమన్నా మంచి అన్నది పెంచుమన్నా' అని సరళంగా చెప్పారు. 'దేశమనియెడి దొడ్డ వృక్షానికి భక్తి కుసుమాలు వికసించడం'- ఈ యుగావసరం!



లక్ష్యం లేని జీవితాన్ని మించిన ప్రమాదకారి మరొకటి లేదు. ఉన్నతమైన లక్ష్యమూ దానికి తగిన జీవన విధానమూ జీవితం విలువను పెంచుతాయి.

– మహర్షి అరవిందో ఘోష్

నిజమైన దేశభక్తి

స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు దేశ ప్రగతికి పునాది రాళ్లు. అవి జాతికి సంక్రమించిన జన్మ హక్కులు. స్వేచ్ఛ వ్యక్తిగతమైనది. స్వాతంత్ర్యం సామాజికమైనది. స్వాతంత్ర్యం లేకుండా స్వేచ్ఛ ఉండదు. స్వేచ్ఛ లేని స్వాతంత్ర్యానికి అర్థం లేదు. స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు లేని సమాజం అశాంతికి, అలజడికి లోనవుతుంది. హక్కులను, బాధ్యతలను సమన్వయం చేసుకుంటూ సంయమనంతో వ్యవహరించడం పైనే దేశ సామాజిక పరిస్థితులు ఆధారపడి ఉంటాయి.

'అది నాః స్యామ శరదః శతమ్'- అని యజుర్వేదం పేర్కొంది. ఎవరికీ బానిసలు కాకుండా నిత్య స్వతంత్రులుగా జీవించే భాగ్యాన్ని అనుగ్రహించమని దైవాన్ని ప్రార్థించాలనేది వేదవాక్కు. దేశం పురోగమించాలంటే ప్రజలు నైతిక సూత్రాలకు లోబడి జీవించాలి. ప్రజల్లో దేశభక్తి, త్యాగం, సహనం వంటి మేలిమి గుణాలు దేశ సంస్కృతిని ప్రతిబింబిస్తాయి. స్వేచ్ఛ అనేది మానవజాతికి ఊపిరితో సమానం. ఉచ్ఛ్వాస నిశ్వాసాలతో దేహంలో జీవకళ తొణికిసలాడినట్లే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో దేశంలో



అంతర్యామి

చైతన్యం వెల్లివిరుస్తుంది. బాధ్యతతో కూడిన స్వేచ్ఛా జీవనమే స్వాతంత్ర్యంగా మహాత్మా గాంధీ పేర్కొన్నారు.

ఏ జాతికైనా అసలైన సిరిసంపదలు... దేశ ప్రజల ఆత్మబలం, మనోధైర్యాలు. దేశభక్తి సమాజాన్ని ఏకీకృతం చేస్తుంది. దేశభక్తి అంటే- దేశం పట్ల ప్రేమాభిమానాలు, విధేయత, అంకిత భావాలను ప్రదర్శించడం; దేశ సాంస్కృతిక, చారిత్రక వారసత్వాన్ని గౌరవించడం; దేశ యశస్సుకు, శ్రేయస్సుకు కట్టుబడి వ్యవహరించడం. ఏ దేశ గౌరవమైనా అక్కడి ప్రజల జీవన విధానంపై, వారు అనుసరిస్తున్న పద్ధతులపై ఆధారపడి ఉంటుంది. పౌరులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించడమే అసలైన దేశభక్తి అని, బాధ్యతాయుతమైన పౌర సమాజంతోనే దేశంలో శాంతి నెలకొంటుందని మనుస్మృతి స్పష్టంచేసింది. సమైక్యతను పాటిస్తూ సమగ్రతను అనుసరిస్తూ వ్యక్తులు తమ దేశం పట్ల విధేయతను కనబరచడం ద్వారా మాతృభూమి రుణం తీర్చుకోవచ్చని మహాభారతం శాంతిపర్వంలో ధర్మరాజుకు భీష్ముడు ఉపదేశించాడు. దేశ భద్రత, ఐక్యత, సంపద, సంస్కృతి, గౌరవాలను కాపాడటం సైతం దేశభక్తిని ప్రకటించడమే! ప్రకృతిని పరిరక్షించడం, ప్రజల మధ్య సహకారాన్ని పెంపొందించడం కూడా దేశభక్తి అవుతుందని పద్మ పురాణం విశ్లేషించింది.

మన భారత జనయిత్రి అపూర్వమైన, అపురూపమైన దివ్యధాత్రి. యోగభూమిగా, కర్మభూమిగా, పుణ్యభూమిగా తేజరిల్లుతోంది. భారతీయులందరూ క్రమశిక్షణతో వ్యవహరిస్తూ, బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ దేశాభ్యున్నతికి నిరంతరం పాటుపడాలని ఆర్ష ధర్మం నిర్దేశించింది. సత్యం, ధర్మం, శాంతి, న్యాయం అనే నాలుగు చక్రాలతోనే ప్రజాప్రగతిరథం ముందుకు పయనిస్తుంది. దేశమంటే చైతన్యయుతమైన ప్రజా సమూహం, తమ విధ్యుక్త ధర్మాలను నిబద్ధతతో పాటించే జనజీవన చేతనం. స్వతంత్రం, స్వయంకృషి, స్వావలంబనల మేలు కలయికతోనే వ్యక్తుల జీవితం సార్థకమవుతుంది. కర్తవ్యదీక్షలో పురోగమిస్తూ, కార్యోన్ముఖులై శ్రమేవ జయతే అనే సూత్రాన్ని నిరంతరం అవలంబించాలి. అదే మనం దేశమాతకు సమర్పించే అమూల్యమైన కానుక!

– డాక్టర్ కావూరి రాజేశ్ పటేల్

రక్షణ బంధంపై ట్రంప్ క్రీనీడలు!

ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్, పాకిస్థాన్‌లను తానే కాల్పుల విరమణకు ఒప్పించానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పుకొన్నారు. అలాంటిదేమీ లేదని ప్రధాని నరేంద్ర మోదీ కొట్టిపారేశారు. దాంతో ట్రంప్ ఉక్రోషం ఆపుకోలేక రకరకాల సాకులు చెప్పి భారత్‌పై సుంకాల పెంపునకు తెగబడినట్లు అర్థమవుతోంది. ఇక అప్పటి నుంచి రెండు దేశాల మధ్య సంబంధాలు క్షీణించాయి. ట్రంప్ ఆర్థిక బ్లాక్‌మెయిలింగ్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ తలొగ్గరాదని మన ప్రతిపక్షాలు సైతం ప్రభుత్వాన్ని సమర్థించాయి. ఈ విధంగా భారత్ పరిణత వైఖరిని అవలంబిస్తోంది.

భారతదేశానికి అమెరికా ప్రధాన వాణిజ్య భాగస్వామి మాత్రమే కాదు, రక్షణ భాగస్వామి కూడా. పలు ఆయుధాలను మనం అమెరికా నుంచి కొంటున్నాం. రెండు దేశాలూ 'క్వాడ్'లో భాగస్వాములుగా ఉన్నాయి. భారత్, అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్‌లతో ఏర్పడిన ఈ కూటమి శిఖరాగ్ర సమావేశం ఈ ఏడాది ఇండియాలో జరగాల్సి ఉంది. అయితే, మారిన పరిస్థితుల్లో అది జరుగుతుందా లేదా అనే అనుమానం వ్యక్తమవుతోంది.

చర్చలకు అవరోధాలు

నిజానికి భారత్, అమెరికాల మధ్య రక్షణ పొత్తు ఎన్నో ఏళ్లుగా బలపడుతూ వచ్చింది. రహస్య సైనిక సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడానికి, సైనిక సామగ్రి బట్వాడాకు పరస్పర రక్షణ స్థావరాలను ఉపయోగించుకోవడానికి, రెండు దేశాల దళాల మధ్య భద్రమైన సమాచార ప్రసారానికి, నిర్దిష్ట స్థలకాలాలకు సంబంధించిన సమాచార మార్పిడికీ వేర్వేరు ఒప్పందాలు కుదిరాయి. భారత్, అమెరికాలో రక్షణ పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు, విద్యావేత్తల మధ్య సహకార వృద్ధికి 'ఇండస్ ఎక్స్' ఒప్పందం కుదిరింది. అత్యాధునిక సాంకేతికతల్లో సహకారం పెంచుకోవడానికి రెండు దేశాల జాతీయ భద్రతా మండళ్లు అంగీకరించాయి. ఇండియాను అమెరికా ప్రధాన రక్షణ భాగస్వామిగా గుర్తించి వ్యూహపరమైన ఆయుధాల, సామగ్రి వాణిజ్యానికి ప్రథమస్థాయి ధ్రువీకరణ ఇచ్చింది.



భారత్, అమెరికా త్రివిధ సాయుధ బలగాలు అత్యధిక సంఖ్యలో సంయుక్త విన్యాసాలు నిర్వహిస్తున్నాయి. రెండు దేశాల సైన్యాలు తరచూ 'యుద్ధ అభ్యాస్' పేరిట, నౌకాదళాలు 'ఆపరేషన్ మలబార్' పేరిట విన్యాసాలు జరుపుతాయి. ఉభయ దేశాలు పదేళ్ల రక్షణ సహకార విస్తరణ ఒప్పందాన్ని కుదుర్చుకోవాలని భావిస్తున్నాయి. హిందూ, పసిఫిక్ మహాసముద్ర ప్రాంతాల్లో చైనా ప్రాబల్యం పెరగకుండా నిరోధించాలనే ఉమ్మడి లక్ష్యంతో పనిచేస్తున్నాయి. ప్రస్తుతం తేజస్ మార్క్-1 ఫైటర్ విమానాలకు అమెరికన్ కంపెనీ జీఈ ఎఫ్-404 ఇంజిన్లను సరఫరా చేస్తోంది. వాటి అందజేతలో జాప్యం భారత వాయుసేనకు నష్టదాయకమే. అధునాతన తేజస్ మార్క్-2 విమానాల కోసం జీఈ ఎఫ్-414 ఇంజిన్లను ఉమ్మడిగా ఉత్పత్తి చేసే విషయమై చర్చలు జరుగుతున్నాయి. వీటిని నౌకాదళం కోసం తయారు చేసే రెండు ఇంజిన్ల విమానాల్లోనూ వాడతారు. మరో అమెరికన్ కంపెనీ జనరల్ అటామిక్స్ నుంచి 31 ఎంక్యూ-9బీ సీ గార్డియన్/స్కై గార్డియన్ మానవ రహిత డ్రోన్ల కొనుగోలుకు గత డిసెంబరులో 350కోట్ల డాలర్ల ఒప్పందం కుదిరింది. ఈ డ్రోన్లను భారత్‌లోనే కూర్పు చేయడంతో పాటు అంతర్జాతీయ మరమ్మతులు, నిర్వహణ కేంద్రాన్ని నెలకొల్పడానికీ ఈ ఒప్పందం అనుమతిస్తోంది. ఆరు పీ-81 పొసైడన్ సముద్రతల నిఘా విమానాల కొనుగోలుకు వాషింగ్టన్‌తో జరుగుతున్న చర్చలకు తాజా వాణిజ్య వివాదం వల్ల బ్రేకు పడింది. అదనంగా అపాచీ హెలికాప్టర్లకూ భారత్ ఆర్డరు పెట్టదలచింది. ట్యాంక్ విధ్వంసక జావెలిన్ క్షిపణులు, స్ట్రైకర్ సిబ్బంది కవచ రవాణా శకటాలను ఇండియాలో తయారు చేయడానికి చర్చలు సాగుతున్నాయి. భారత్‌కు ఎఫ్35 యుద్ధ విమానాలను విక్రయిస్తామని ట్రంప్ ప్రకటించినా మోదీ అంగీకరించలేదు.

క్వాడ్ సభ అనుమానమే!


నేడు అమెరికా భారత్‌కు ప్రధాన ఆయుధ సరఫరాదారుల్లో ఒకటిగా నిలుస్తోంది. కానీ, ట్రంప్ కక్షపూరితంగా వాణిజ్య యుద్ధం ప్రకటించడం- అమెరికాతో భారత సైనిక పొత్తుపై ప్రతికూల ప్రభావం చూపవచ్చు. ఈ ఏడాది ఇండియాలో జరగాల్సిన క్వాడ్ శిఖరాగ్ర సభ రద్దయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదీ కాకుండా ఈ మధ్య ట్రంప్ పాకిస్థాన్‌పై వల్లమాలిన అభిమానం చూపుతున్నారు. ఇండియాను ఈ దారికి తెచ్చుకోవడం కోసం పాక్‌ను తురుపుముక్కగా వాడుకోవాలనుకుంటున్నారు. ఇది భారత్-అమెరికా రక్షణ సంబంధాలను ప్రభావితం చేయకమానదు.

'కిల్ స్విచ్' ఉందా?

చైనా, పాక్‌ల నుంచి ముప్పు ఎదుర్కొంటున్న ఇండియాకు అత్యాధునిక ఆయుధాలు చాలా అవసరం. ప్రస్తుతం ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా, యూరప్ దేశాలు నిమగ్నమవడం వల్ల అక్కడి నుంచి ఆయుధాలు సేకరించడం కష్టమవుతోంది. అయితే, ట్రంప్ వైఖరి వల్ల అమెరికా మీద ఆధారపడవచ్చా అనే సందేహాలు బలపడుతున్నాయి. రష్యాకు భారత్ సన్నిహితంగా ఉండటంపై అమెరికా కాంగ్రెస్ సభ్యులు కొందరు మండిపడుతున్నారు. దీనివల్ల భారత గడ్డపై అమెరికన్ ఆయుధాల సంయుక్తంగా తయారు చేయడానికి అడ్డంకులు ఎదురుకావచ్చు. అధునాతన సాంకేతిక బదిలీ కూడా అనుమానమే! అమెరికా మనకు సరఫరా చేసిన ఆయుధాలనే పాకిస్థాన్‌కూ అందజేసి మనపై ఒత్తిడి పెంచవచ్చు. భారత్-అమెరికా మధ్య రక్షణ సహకారం సన్నగిల్లితే ఇస్లామాబాద్ పేట్రేగిపోయే ప్రమాదం ఉంటుంది. మరోవైపు- అమెరికాను నమ్మలేమని, ఆ దేశంతో దీర్ఘకాల రక్షణ బంధాన్ని కొనసాగించడం అవివేకమని భారత్‌లో నిరసన గళాలు వినిపిస్తున్నాయి. పైగా ఇండియాకు అందించే ఆయుధాలను సరిగ్గా అవసరపడే సమయంలో పనిచేయకుండా చేసే 'కిల్ స్విచ్' అమెరికా చేతుల్లో ఉందనే సందేహం బలంగా వ్యక్తమవుతోంది. ట్రంప్ ఆయుధ సరఫరాను అడ్డుపెట్టుకుని భారత్ నుంచి వాణిజ్య, దౌత్యపరమైన ప్రయోజనాలను పిండుకోవాలని చూస్తున్నారు. వాణిజ్యాన్ని, రక్షణను వేరువేరుగా చూడాలనే పరిణత వైఖరిని భారత్, అమెరికా విధానకర్తలు ప్రదర్శించాలి. దీర్ఘకాలిక రక్షణ పొత్తుకు అది తప్పనిసరి.



హర్ష కాకడ్
విశ్రాంత మేజర్ జనరల్



నకముర‌య బోస్!

టోక్యోలో ప్రఖ్యాత రెస్టరెంట్ పేరు... నకమురయ. అది పరిచయం చేసిన 'ఇండో కరీ' అక్కడ ఏటా ఆరుపందల కోట్ల ప్లేట్లకు పైగా అమ్ముడవుతోందట. అయితే ఏంటీ? విదేశాల్లో భారతీయ కూరలు మంచి ఆదరణే పొందుతున్నాయి కదా అనవచ్చు. కానీ నకమురయ కోడికూరకు ఒక ప్రత్యేకత ఉంది. దాన్ని దాదాపు వందేళ్ల క్రితం అక్కడ అజ్ఞాతంలో ఉన్న భారత స్వాతంత్ర్య సమరయోధుడు ఒకరు మొదటిసారి తయారుచేశారట. ఆయన నేర్పిన తయారీ విధానాన్నే ఇప్పటికీ అనుసరిస్తూ ఎంతో ఆదరణ పొందుతోంది ఆ రెస్టరెంట్. భారత స్వాతంత్ర్య సమరయోధుడేంటీ, జపాన్ రెస్టరెంట్‌లో కూర వండటమేంటీ?... రండి అబ్బురపరిచే ఆ కథ తెలుసుకుందాం!

'ఆజాద్ హింద్ ఫౌజ్' అనగానే మనకు సుభాష్ చంద్రబోస్ గుర్తొస్తారు కానీ నిజానికి దానికి పునాదులు వేసింది రాస్ బిహారీ బోస్. ఆయన దేహ్రాదూన్‌లో ప్రభుత్వ కార్యాలయంలో క్లర్క్‌గా పనిచేస్తుండేవారు. తెర వెనుక స్వాతంత్ర్యోద్యమంలోనూ పాల్గొనేవారు. బెంగాల్ విభజనపై ఆగ్రహం చెందిన రాస్ బిహారీ లార్డ్ హార్డింగ్ మీద బాంబు విసిరారు. అలాంటివే మరికొన్ని పోరాటాల్లోనూ కీలకపాత్ర వహించి పోలీసులకు దొరక్కుండా జపాన్‌కు వెళ్లిపోయారు. అక్కడ భారత స్వాతంత్ర్య సంగ్రామం పట్ల సానుభూతి ఉన్న పలువురు ఆసియా నేతలను కూడగట్టారు. వారి మద్దతుతో ఉద్యమానికి సహాయపడటం కొనసాగించారు. ఆయనను తమకు అప్పగించమని బ్రిటిష్ ప్రభుత్వం జపాన్ మీద ఒత్తిడి చేయడంతో షింజుకు అనే ప్రాంతానికి వెళ్లి ఒక ఇంటి బేస్‌మెంట్‌లో తలదాచుకున్నారు రాస్‌బిహారీ. ఒకసారి ఆయన స్వయంగా కోడికూర వండి రుచి చూపిస్తే, ఆ ఇంటివారికది ఎంతో నచ్చింది.

కొన్నాళ్లకు ఆంక్షలు సడలించడంతో అజ్ఞాతంలోనుంచి బయటికి వచ్చిన బోస్ ఇంటి వాళ్లమ్మాయి తొషికోని వివాహం చేసుకున్నారు. ఇద్దరు పిల్లలు పుట్టాక క్షయతో ఆమె చనిపోయింది. అప్పటి వరకు ఉద్యమ పనులతోనే తలమునకలుగా ఉన్న రాస్‌బిహారీ అత్తమామలతో కలిసి వారి నకమురయ బేకరీకి అనుబంధంగా రెస్టరెంట్‌నీ తెరిచారు. అందులో ప్రత్యేకంగా చికెన్ కర్రీని పరిచయం చేయడంతో వ్యాపారం ఇబ్బడిముబ్బడిగా పెరిగింది. ఎంతగా అంటే జపాన్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో నమోదైన తొలి ఫుడ్ కంపెనీ అదే. 'బోస్ ఆఫ్ నకమురయ'గా ఆయన అక్కడ ఇంటింటి మనిషైపోయారు! మరోపక్క తన ఉద్యమ కార్యకలాపాలనూ కొనసాగించారు. రెండో ప్రపంచ యుద్ధ నేపథ్యంలో బ్యాంకాక్ వెళ్లి అక్కడ ఇండియన్ ఇండిపెండెన్స్ లీగ్‌ని ప్రారంభించారు. భారత స్వాతంత్ర్య సంగ్రామాన్ని వేగవంతం చేయడం దాని ఆశయం. దానికి అనుబంధంగా ఏర్పరచిన మిలిటరీ విభాగమే ఇండియన్ నేషనల్ ఆర్మీ. 1943లో దాన్ని సుభాష్ చంద్రబోస్‌కి అప్పగించిన రాస్‌బిహారీ ఆ తరవాత రెండేళ్లకు టోక్యోలో అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన నేర్పిన చికెన్ కర్రీ మాత్రం జపనీయుల నోరూరిస్తూ ఇప్పటికీ ఆయనను తలచుకునేలా చేస్తోంది.

– డి.పద్మశ్రీ

మూస ధోరణులు ఇంకెన్నాళ్లు?

ఆపన్న హస్తాలు

వర్ధమాన దేశాల్లో సామాజిక ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించడానికి మిగిలిన రాజ్యాలు పెద్దమొత్తంలో సహాయం అందిస్తుంటాయి. యుద్ధాలు, ఘర్షణలు, కరవులు తలెత్తిన సందర్భాల్లో మానవతా సంక్షోభాన్ని నివారించడానికీ ఈ విదేశీ సాయం అక్కరకొస్తుంది. 2023లో నార్వే తన స్థూల జాతీయాదాయం(జీఎన్ఐ)లో 1.1శాతాన్ని విదేశీ సాయంగా అందించింది. జర్మనీ(0.82శాతం), తుర్కియే(0.62శాతం), యూకే(0.58శాతం), కెనడా(0.38శాతం) తరవాతి స్థానాల్లో నిలుస్తున్నాయి. 2023లో అత్యధిక విదేశీ సాయం అందించిన పది దేశాలు, ఆ విలువ... (కోట్ల డాలర్లలో)

అమెరికా	6,200
జర్మనీ	3,800
జపాన్	1,900
యూకే	1,700
ఫ్రాన్స్	1,500
కెనడా	930
నెదర్లాండ్స్	660
నార్వే	650
తుర్కియే	600
ఇటలీ	560

(ఆధారం: ఓఈసీడీ నివేదిక-2024)

ప్రస్తుతం సుమారు 18లక్షల మంది భారతీయ విద్యార్థులు విదేశాల్లో చదువుతున్నారు. అలా చదివించడానికి వారి కుటుంబాలు సుమారు రూ. 75వేల కోట్లు ఖర్చు చేస్తున్నాయని అంచనా. వారందరికీ మన దగ్గరి విద్యాసంస్థల్లోనే సీట్లు కల్పించి, నాణ్యమైన చదువులను అందించగలిగితే పెద్దయెత్తున విదేశ మారకద్రవ్యం ఆదా అవుతుంది. గత కొన్నేళ్లుగా ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల వల్ల మన విద్యార్థులు విదేశాల్లో చదువుకోవడం నానాటికీ దుర్భరమవుతోంది. కాబట్టి మన విద్యార్థులకు ఇక్కడే ప్రపంచస్థాయి విద్యను అందుబాటులోకి తీసుకురావాలి.

భారతీయ ఉన్నత విద్యావ్యవస్థ నేడు అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. ముఖ్యంగా విశ్వవిద్యాలయాలు, ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో సీట్లు పెరగట్లేదు. పెద్దసంఖ్యలో యువతీ యువకులు ఉన్నత చదువుల పట్ల ఆసక్తి కనబరుస్తున్నా, అందుకు తగినన్ని అవకాశాలు దక్కట్లేదు. భవిష్యత్ అవసరాలు తీర్చడం కోసం వచ్చే అయిదేళ్లలో దేశీయంగా మరో 1,500 యూనివర్సిటీలు అవసరమవుతాయని అంచనా.

ప్రపంచ స్థాయిలో పేరున్నా...

దేశంలోని ఉన్నత విద్యాసంస్థల్లో సీట్ల కొరతను తీర్చడానికి రెండు మార్గాలున్నాయి. ఒకటి, ఇప్పటికే కొనసాగుతున్న విద్యాసంస్థల్లో సీట్ల సంఖ్యను పెంచడం. రెండోది, కొత్త విద్యాసంస్థలను ప్రారంభించడం. మొదటి మార్గానికి సంబంధించి అమెరికన్, భారతీయ విద్యాసంస్థలకు చెందిన కొన్ని వాస్తవాలను పరిశీలిద్దాం. ప్రపంచ స్థాయిలో 68వ ర్యాంకులో ఉన్న యూనివర్సిటీ ఆఫ్ టెక్సస్‌లో 53వేల మంది విద్యార్థులు నమోదు కాగా, 190వ స్థానాన్ని ఆక్రమించిన ఒహాయో స్టేట్ యూనివర్సిటీలో 60వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ రెండూ ప్రభుత్వ విద్యా సంస్థలే. అదే మన దేశంలో ప్రపంచ స్థాయిలో 123వ ర్యాంకు కలిగిన ఐఐటీ(దిల్లీ)లో 12,500 మందికి, 129వ స్థానంలో ఉన్న ఐఐటీ(బాంబే)లో 13,200మంది విద్యార్థులకు మాత్రమే ప్రవేశాలు కల్పించారు. ఇక రాష్ట్రస్థాయి విశ్వవిద్యాలయాలను పరిగణనలోకి తీసుకుంటే- ప్రపంచస్థాయి ర్యాంకుల సంగతి పక్కన పెట్టినా, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 9,500 మంది, ఉస్మానియా యూనివర్సిటీలో 10,200 మంది విద్యార్థులే ఉన్నారు. దీన్నిబట్టి చూసినా, జనాభా అవసరాలను దృష్టిలో పెట్టుకుని దేశీయ విశ్వవిద్యాలయాల్లో సీట్ల సంఖ్యను గణనీయంగా పెంచాలని అర్థమవుతుంది.

విద్యాసంస్థల్లో సీట్లు పెంచాలనే ప్రస్తావన రాగానే... అలా పెరిగితే నాణ్యత తగ్గుతుందని కొందరు అభ్యంతరం చెబుతుంటారు. అలాగైతే అమెరికా విశ్వవిద్యాలయాలు ఒక పక్క నాణ్యతను కాపాడుకుంటూనే, మరోవైపు విద్యార్థులకు భారీగా ప్రవేశాలు ఎలా కల్పిస్తున్నాయి? అందుకు సమాధానం- అవి శతాబ్దానికి పైగా అనుసరించిన ద్వివిధ(డ్యూయల్) విధానమే. అంటే ఒక పక్క తగిన విద్యార్హతలు లేని సంపన్న విద్యార్థుల నుంచి హెచ్చు ఫీజులు తీసుకుంటూ... ఆ ఫీజుల సాయంతో ఉపకార వేతనాలను ఏర్పాటుచేసి ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ప్రవేశాలను కల్పిస్తున్నాయి. ఈ పద్ధతి వల్ల ఆయా సంస్థలు ఆదాయంతో పాటు ఉన్నత విద్యా ప్రమాణాలను కూడా సాధించగలుగుతున్నాయి. భారత్‌లోనూ కొన్ని ప్రైవేటు విద్యాసంస్థలు అటువంటి విధానాన్నే అనుసరిస్తున్నా... దేశ జనాభా మరీ ఎక్కువగా ఉండటంవల్ల తగినన్ని విద్యావకాశాలు కల్పించలేకపోతున్నాయి.



విద్యావకాశాల విషయంలో డిమాండుకీ, అవకాశాలకీ మధ్య అంతరాన్ని పూడ్చాలంటే ముందుగా సాంప్రదాయక విద్యాసంస్థలు మూస పద్ధతుల నుంచి బయటకు రావాలి. ఆన్‌లైన్ కోర్సులు అందించడం వంటి విధానాలను అవి చేపట్టాలి. దేశంలోని ఐఐటీలన్నీ కలిసి ప్రారంభించిన 'నేషనల్ ప్రోగ్రాం ఆన్ టెక్నాలజీ ఎన్‌హాన్స్‌డ్ లెర్నింగ్ (ఎన్‌పీటీఈఎల్)' అనే ఆన్‌లైన్ వ్యవస్థ లక్షలాది మంది విద్యార్థులకు సేవలు అందిస్తోంది. ఆ కోవలోనే ఇటీవల డేటా అనలిటిక్స్, ఎలక్ట్రానిక్స్ బ్రాంచీల్లో బీఎస్సీ కోర్సులను తీసుకురావడం మంచి ఫలితాన్ని ఇచ్చింది.

అన్నీ పాశ్చాత్య నమూనాలే...

చివరగా భారతీయ విశ్వవిద్యాలయాల రూపకల్పనలో ఇంతవరకు విస్మరించిన ఒక విషయాన్ని ప్రస్తావించాలి. మన దేశంలోని చాలా యూనివర్సిటీలు పాశ్చాత్య విశ్వవిద్యాలయ నమూనా మీదే రూపుదిద్దుకున్నాయి. బనారస్ హిందూ విశ్వవిద్యాలయం వంటి వాటిని మొదట్లో భారతీయ దృక్పథంతో స్థాపించినా, కాలక్రమంలో అవి కూడా పాశ్చాత్య మూసలోకి మారిపోవడం కనిపిస్తుంది. అంటే ప్రతీ రంగంలోను, ప్రతీ శాస్త్రం మీదా పాశ్చాత్య దృక్పథాన్ని అనుసరించే బోధన సాగుతోందన్న మాట. ఉదాహరణకు విశ్వం మొత్తం ఒక మహాయంత్రంలా, ఒక గడియారంలా పని చేస్తుందని అంటుంది పాశ్చాత్య చింతన. దాన్నే న్యూటోనియన్ విప్లవం అంటారు. అందుకు భిన్నంగా విశ్వం చైతన్య స్వరూపమని చాటుతోంది ప్రాచీన భారతం. మన ఆత్మను, అంతర్యాన్ని పాశ్చాత్యుల కనుసన్నల అనుసారం వర్ణించుకోవడం మానుకుని, మన సొంత మేధస్సు ప్రకారం నిర్వచించుకునే ధోరణి రావాలి. భావిభారత విశ్వవిద్యాలయాలు ధైర్యంగా అలాంటి భారతీయతకు, భారతీయ చింతనకు అద్దం పట్టాలి.




ప్రొఫెసర్ వి.శ్రీనివాస చక్రవర్తి
ఐఐటీ-మద్రాస్‌లో ఆచార్యులు



మువ్వన్నెల జెండా ముచ్చట!

'అమ్మా.. ఇప్పుడు నేను తొందరగా పడుకుని, ఉదయాన్నే నిద్ర లేస్తాను. అసలే రేపు జెండా పండుగ! స్కూల్‌కి తొందరగా వెళ్లాలి కదా!' అంది గీత. 'సరే అయితే..! అన్నం తినేసి పడుకో' అంది వాళ్లమ్మ. చెప్పినట్లుగానే ఉదయం నాలుగు గంటలకే నిద్ర లేచింది గీత. వాళ్లమ్మనూ నిద్ర లేపింది. గబగబా స్నానం చేసేసి.. తయారవ్వసాగింది. వాళ్లమ్మతో జడ వేయించుకుంటూ.. 'అమ్మా! మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది కాబట్టి.. ఈరోజు అందరం కలిసి ఇంత పెద్ద వేడుక చేసుకుంటున్నాం. మువ్వన్నెల జెండా ఎగరేసుకుంటున్నాం. కానీ అసలు మనకూ ఒక జెండా ఉండాలని, అదీ ఇలాగే ఉండాలని ఎవరు అనుకుని ఉంటారు' అని అడిగింది గీత. 'పింగళి వెంకయ్య అని.. అప్పట్లో బ్రిటిష్ ఆర్మీలో పని చేస్తుండేవారు. ఆ సమయంలోనే పనిలో భాగంగా సౌత్ ఆఫ్రికా వెళ్లాల్సి వచ్చిందట. అక్కడి వాళ్లందరూ వాళ్ల జెండాకు సెల్యూట్ చేయమని చెప్పారట. అప్పుడే మన దేశానికీ ఒక జాతీయ జెండా ఉంటే బాగుంటుంది. అది ప్రపంచంలో మన దేశానికి గుర్తింపును తీసుకొస్తుందని అనుకున్నారు. ఆ జెండాకు తానే రూపాన్నివ్వాలని నిర్ణయించుకుని బోలెడు ప్రయత్నాలూ చేశారు. ఇతర



దేశాల జెండాలను పరిశీలించి.. దానికి సంబంధించి ఒక పుస్తకాన్ని కూడా రాశారు తెలుసా! చివరికి మహాత్మా గాంధీ సూచనలతో.. కాషాయ, తెలుపు, ఆకుపచ్చ రంగులు మధ్యలో అశోక చక్రంతో మన దేశ జాతీయ జెండాకు ప్రాణం పోశారు' అని చెప్పింది గీత వాళ్లమ్మ. 'ఒక జెండాను తయారు చేయడానికి మన స్వాతంత్ర్య సమరయోధులు ఇంత కష్టపడ్డారన్న మాట' అని ఆశ్చర్యంగా అంది గీత. 'అవును తల్లీ! మన జెండాలో కాషాయపు రంగు ధైర్యం, దేశభక్తికీ.. తెలుపు రంగు శాంతి, స్వచ్ఛతకు.. ఆకుపచ్చ రంగు పంటలకు గుర్తులు.. ఇక అశోక చక్రమేమో ధర్మానికి చిహ్నం' చెప్పింది వాళ్లమ్మ. 'చాలా బాగున్నాయమ్మా! ఈ విశేషాలన్నీ. సరే ఇక నేను వెళ్లొస్తాను.. ఈరోజు జెండా ఆవిష్కరణ అయ్యాక.. మీటింగ్‌లో ఇదే విషయం చెబుతాను. నా స్నేహితులంతా తెలుసుకుంటారు..!' అంది గీత. 'సరే గానీ నువ్వు జాగ్రత్తగా వెళ్లి రా.. బై!' అంది వాళ్లమ్మ. ★

హాయ్! బుజ్జీ!!


స్వాతంత్ర్య దినోత్సవ ఆఫర్లు
బజాజ్ ఎలక్ట్రానిక్స్
₹30,000* వరకు క్యాష్‌బ్యాక్
CASHBACK UPTO ₹30,000/-* IDFC FIRST Bank
CASHBACK UPTO ₹11,000/-* HDB FINANCIAL SERVICES
CASHBACK UPTO ₹10,000/-* BAJAJ FINSERV WE ACCEPT EMI CARDS
15% CASHBACK UPTO ₹10,000/-* TVS CREDIT
INSTANT DISCOUNT UPTO ₹7,500/-* HDFC BANK On Credit/Debit Card EMI
SAMSUNG
BIG celebration BIGGER screen. 1st - 31st Aug '25
100" (254cm)
98" (249cm)
Awesome India Offers
3 Year warranty
0 Down payment
30 months
Up to 20% cashback
SONY
BRAVIA 5
CINEMA IS COMING HOME
YOUR HOME. YOUR CINEMA.
The big screen experience you've always wanted
Range starts from Rs.1,44,990/-
98" (249cm)
BIGGER is BETTER
SPECIAL OFFERS!
3 YEARS WARRANTY
INSTANT CASHBACK UPTO Rs. 25,000/-
FIXED EMI Rs.19,995/-
LG
The GRAND 15 FEST
AI IS THE NEW FREEDOM
Experience the Next Generation of LG AI TV customized for YOU.
97" (246cm) LG OLED evo
100" (254cm) LG QNED evo
Exclusive Offers
3 YEAR WARRANTY
26% CASHBACK
30% OFF LG SOUNDBAR
FIXED EMI ₹2999
Life's Good.
LG
The GRAND 15 FEST
This Independence Day, India celebrates with LG's innovations.
Exclusive Offer
CASHBACK UPTO 25%* Upto ₹9,000/-*
On Select Front Load Washing Machines
SAMSUNG
The BIG Bespoke AI FEST
This Independence Day, upgrade to smart living with Bespoke AI Home Appliances.
upto 20% CASHBACK
Max amount ₹10,000*
Haier
DISCOVER THE FUTURE OF LAUNDRY with AI DBT
WASHING ASSURANCE 30-DAY MONEYBACK GUARANTEE
EXCITING OFFERS
0 DOWN PAYMENT
1 EMI OFF
20% CASH BACK
5 YEARS WARRANTY
REFRIGERATORS
RANGE STARTS FROM ₹12,490/-*
LG SAMSUNG Haier Whirlpool IFB
AIR CONDITIONERS
WIDEST RANGE OF AC's
RANGE STARTS FROM ₹24,990/-*
ATTRACTIVE CASHBACK* NO COST EMI*
INSTALLATION FREE*
LG Haier LLOYD BLUE STAR GENERAL DAIKIN SAMSUNG
iPhone 16 Starting at ₹29,200* ₹1383 X 24 month
iPhone 15 Starting at ₹28,800* ₹1325 X 24 month
iPhone 13 Starting at ₹17,300* ₹1017 X 18 month
MacBook Air M4 Starting at ₹56,900* ₹2788 X 24 month
iPad 11th Gen, Wifi Starting at ₹29,900* ₹1329 X 24 month
Up to 24 Months No Cost EMI
*Starting price inclusive of store discount, exchange benefits and bank cashback
Galaxy A56 | A36 5G
Seal the triple zero deal
Starting at ₹56/day*
SAMSUNG
Galaxy Z Fold7 | Z Flip7
Galaxy AI
JUST ARRIVED
Z Fold7 12GB | 256 GB ₹1,62,999*
Z Flip7 12GB | 256 GB ₹97,999*
Z Flip7 FE 12GB | 256 GB ₹79,999*
DAILY USE
ASUS Vivobook
Core i3 | 13th Gen
8GB RAM | 512 GB
OFFER PRICE ₹33,990*
MULTI-TASKING
DELL INSPIRON
Core i5/13th Gen
16GB RAM | 512GB
OFFER PRICE ₹53,990*
GAMING
hp VICTUS GAMING
Core i5 | 13th Gen | 16GB RAM
512 GB | RTX 3050
6 GB GRAPHICS CARD
OFFER PRICE ₹72,990*
AI ENABLED
Lenovo Yoga Slim 7
Core Ultra 5
16GB RAM | 1 TB | AI PC
OFFER PRICE ₹78,490*
FREE*
10% cashback upto 10000*
*0% interest
No Cost EMI Upto 24 Months*
Exchange Bonus Upto 10000*
vivo X200 FE Starting at ₹54,999* Instant Cashback ₹4,500*
vivo V50 Starting at ₹32,999* Instant Cashback ₹3,000*
V50e Starting at ₹26,999* Instant Cashback ₹2,000*
OnePlus Nord 5 Starting at ₹29,999* Cashback ₹2,000*
oppo Reno14 Series 5G Starting at ₹37,999* Instant Cashback ₹4,000*
oppo F29 Series 5G Starting at ₹21,999* Up to 10% instant Cashback
Redmi Note 14 Starting at ₹16,999* Cashback ₹1,000*
విజయవాడ: వినాయక థియేటర్ దగ్గర, బందరు రోడ్, గుణదల | మీనాక్షి టవర్స్, ఏలూరు రోడ్, సూర్యారావు పేట | F101, F102, F115, & F116, బొమ్మరిల్లు అపార్ట్‌మెంట్ నందమూరి నగర్ |
71-2-9, మోహన్ దాస్ థియేటర్ ప్రక్కన, వెంకటేశ్వరపురం, పటమట | D.No 76-8-8/5, క్రాంబ్వే రోడ్డు, శివాలయం, భవానిపురం |
గుడివాడ: Ground, 1st, 2nd Floors, Sy.No. 122/1, వార్డ్ నం.15, ఆంజనేయపేట, | మచిలీపట్నం: ఓల్డ్ D. No. 11/313, సిరి ఎస్టేట్, చెమ్మన్నగిరి పేట
Bajaj Electronics - A Trademark of Electronics Mart India Ltd. CIN No: L52605TG2018PLC126593. Regd. Office: 6-1-91/10, Ground Floor, Next to Telephone Bhavan, Secretariat Road, Saifabad, Hyderabad - 500004. Corporate Office: M. No. 6-3-665/A1 to 7, 3rd Floor, Opp. NIMS Hospital, Punjagutta Main Road, Hyderabad - 500082. Email: communications@bajajelectronics.in

జగన్‌ను ఓటర్లు బహిష్కరించారు



ఈనాడు, కడప: 'గతంలో పులివెందులలో ధైర్యంగా ఓట్లు వేసే పరిస్థితులు లేవు. అరాచకాలను కట్టడి చేయడంతో స్వేచ్ఛగా ప్రజలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. జగన్‌ను జనం బాయ్‌కాట్ చేశారు'. - మంత్రి సవిత

రాజకీయ పతనానికి నిదర్శనం...



'ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తి... అధికారుల గురించి అమర్యాదకరంగా, నీచంగా మాట్లాడటాన్ని ప్రజలు హర్షించడం లేదు. జగన్ రాజకీయ పతనానికి తాజా ఎన్నికలు ఓ నిదర్శనం'.
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాస్వామ్య ఫలితం.. పులివెందుల విజయం



ఈనాడు, విజయనగరం: 'పులివెందుల జడ్పీటీసీ స్థానంలో తెదేపా అభ్యర్థి విజయం ప్రజాస్వామ్య ఫలితం. కడప ప్రాంతంలో ఇంతవరకు నామినేషన్ వేయలేని విధంగా రూల్ ఆఫ్ జగన్ అమలైంది. కూటమి రాకతో ఆ పరిస్థితి మారింది. జగన్ సహా ఆ పార్టీ నాయకులు సంస్కారహీనుల్లా మాట్లాడుతున్నారు'.
- హోంమంత్రి వంగలపూడి అనిత

చంద్రబాబు సుపరిపాలనకు సంకేతం



బనగానపల్లి, న్యూస్‌టుడే: 'పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో ప్రజాస్వామ్యం గెలిచింది. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు 14 నెలల సుపరిపాలన కలిసొచ్చింది'. - మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

వైకాపా జెండా పీకేసే రోజులు దగ్గర్లోనే..



సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: జగన్‌రెడ్డి కుటుంబంపై ప్రజలు ఎంత కసిగా, వ్యతిరేకంగా ఉన్నారో పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల ఫలితాలు బట్టి తెలుస్తోంది. బాబాయిని చంపిన వ్యక్తులు పులివెందులలో ఉండకూడదని అక్కడి ప్రజలు నిర్ణయించారు. రాష్ట్రంలో వైకాపా జెండా పీకేసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి'.
- మంత్రి అచ్చెన్నాయుడు

ఫలితాలతో జగన్‌కు మతిభ్రమించింది



ఈనాడు, నెల్లూరు: 'కడప తన అడ్డా అనే భ్రమలో బతుకుతున్న జగన్.. పులివెందుల, ఒంటిమిట్టలో జరిగిన ఎన్నికలు, వాటి ఫలితాలు చూసి తట్టుకోలేకపోతున్నారు. మతి భ్రమించి, దిగజారి మాట్లాడుతున్నారు'.
- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

జగన్ దిగజారి మాట్లాడుతున్నారు



ఈనాడు, అమరావతి: 'పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల్లో ఓటమిని అంగీకరించి, సమీక్షించుకోవాల్సిన మాజీ సీఎం జగన్ దిగజారి మాట్లాడడం జుగుప్సాకరంగా ఉంది. 30ఏళ్ల తర్వాత ఓటు వేశాను.. అందరికి దండాలని ఒక ఓటరు పేపర్‌పై రాసి బ్యాలెట్‌లో వేశారంటే అక్కడ పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. చంద్రబాబు, రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి హాట్‌లైన్‌లో మాట్లాడుతున్నట్లు జగన్ విన్నారా?'. -మంత్రి పార్థసారథి

వైకాపా పట్ల వ్యతిరేకతకు నిదర్శనం



ఈనాడు, అమరావతి, నిడదవోలు, న్యూస్‌టుడే: పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థికి భారీ ఆధిక్యం రావడం, వైకాపాకు డిపాజిట్ దక్కకపోవడం చూస్తే, ఆ పార్టీ పట్ల ప్రజల్లో ఎంత వ్యతిరేకత ఉందో అర్థమవుతోంది'.
-మంత్రి కందుల దుర్గేష్

పిచ్చి ముదురుతుంది



సాలూరు, న్యూస్‌టుడే: పులివెందులలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరగడంతో తెదేపా అభ్యర్థులు అత్యధిక మెజార్టీతో గెలిచారు. ఈ ఓటమితో జగన్‌కు పిచ్చి ముదురుతుంది. సీఎం చంద్రబాబును విమర్శించే స్థాయి ఆయనకు లేదు'.
- మంత్రి సంధ్యారాణి

డిపాజిట్లు దక్కకుండా ఓడించారు



ఈనాడు, అమరావతి: 'వైకాపా అభ్యర్థికి పులివెందుల ప్రజలే డిపాజిట్లు కూడా దక్కకుండా ఓడించారు'.
- మంత్రి డీబీవీ స్వామి

ఆ విజయంతో సంతోషంగా ఉంది



ఉండి, న్యూస్‌టుడే: 'పులివెందుల, ఒంటిమిట్ట ఉప ఎన్నికల్లో ప్రజలు కూటమికి అపూర్వ విజయాన్ని అందించడం సంతోషంగా ఉంది. కొన్ని దశాబ్దాల తర్వాత పులివెందులలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు'.
- ఉప సభాపతి రఘురామకృష్ణరాజు

పులివెందుల ప్రజలే తిరస్కరించారు



అద్దంకి, జె.పంగులూరు, న్యూస్‌టుడే: పులివెందుల ప్రజలే జగన్ నాయకత్వాన్ని తిరస్కరించారు. కూటమి పాలనకు పట్టం కట్టారు. జగన్‌కు తెలిసిందల్లా విధ్వంసం, మనుషుల్ని తొక్కించడం, ప్రజల్ని రెచ్చగొట్టడం మాత్రమే'.
-మంత్రి గొట్టిపాటి రవికుమార్

పులివెందుల వాసులకు స్వాతంత్ర్యం



హిందూపురం, చిలమత్తూరు, న్యూస్‌టుడే: 'పులివెందుల వాసులకు ఒక రోజు ముందే స్వాతంత్ర్యం వచ్చింది. ఈ ఎన్నికలు రద్దు చేయాలని వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేయటంహాస్యాస్పదం'. -ఎమ్మెల్యే బాలకృష్ణ

ఎన్నికలు జరిగితే వైకాపాకు ఓటమే

ఈనాడు, అమరావతి: 'ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగితే వైకాపాకు ఓటమి ఖాయం. కనీసం డిపాజిట్లు కూడా దక్కవు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో తెదేపా అభ్యర్థుల విజయంతో ఆ ప్రాంత వాసులకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చింది'.
-తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య

పులివెందులలో పసుపు జెండా

- జగన్ ఇలాకాలో వైకాపాను మట్టికరిపించిన తెదేపా
- జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో డిపాజిట్ కోల్పోయిన అభ్యర్థి
- ఒంటిమిట్టలోనూ తెదేపా విజయభేరి


ఈనాడు, కడప: పులివెందులపై పసుపుజెండా రెపరెపలాడింది. నాలుగు దశాబ్దాలుగా వైఎస్ కుటుంబం బిగించిన ఉక్కుపిడికిలిని తెదేపా ఛేదించింది. ఆ మండలంలో జరిగిన జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో వైకాపాను చిత్తుచేసింది. వైకాపా అధినేత జగన్‌ సొంతజిల్లాలో గెలిపించుకోలేని ఘోర పరాభవాన్ని రుచిచూపించింది. ఈ నెల 12న జరిగిన ఉప ఎన్నికలో మొత్తం 11 మంది బరిలో నిలవగా తెదేపా అభ్యర్థి మారెడ్డి లతారెడ్డి 6,033 ఓట్ల మెజారిటీతో ఘనవిజయం సాధించారు. సమీప ప్రత్యర్థి, వైకాపా అభ్యర్థి హేమంత్‌రెడ్డి కేవలం 683 ఓట్లు సాధించి డిపాజిట్ కోల్పోయారు. కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, దశాబ్దాలుగా పులివెందులలో ఓటు ముఖమే ఎరుగని వారందరూ ఇప్పుడు స్వేచ్ఛగా ఓటేసేందుకు అవకాశం దక్కడం ఇవన్నీ తెదేపా అభ్యర్థి భారీ విజయానికి బాటలు వేశాయి. ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో తెదేపా అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డి 6,267 ఓట్లతో ఘనవిజయం సాధించారు. ఇక్కడ ఎలాగైనా గెలవాలని వైకాపా నేతలు అరాచకాలకు దిగారు. పోలింగ్ కేంద్రాల్లోకి చొచ్చుకెళ్లి ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసేందుకు ప్రయత్నించారు. అయినా ఆ పార్టీకి ఫలితాల్లో చేదు అనుభవమే ఎదురైంది.


జడ్పీటీసీ స్థానం	పోలైన ఓట్లు	తెదేపా	వైకాపా	మెజారిటీ
పులివెందుల	7,794	6,716	683	6,033
ఒంటిమిట్ట	20,467	12,780	6,513	6,267

30 ఏళ్ల తర్వాత ఓటేశాను.. అందరికీ దండాలు

- పులివెందుల బ్యాలెట్ బాక్సులో ఓ ఓటరు సందేశం

ఈనాడు- కడప, న్యూస్‌టుడే- వేంపల్లి: పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు సందర్భంగా బ్యాలెట్ బాక్స్‌లో లభించిన ఓ ఓటరు సందేశం అందరినీ ఆలోచింపజేసింది. '30 ఏళ్ల తర్వాత ఓటు వేశాను. అందరికీ దండాలు' అంటూ ఓ అజ్ఞాత వ్యక్తి తన సంతోషాన్ని చాటుకున్నారు. చాలా ఏళ్లుగా ఇక్కడ ఎన్నికలు జరుగుతున్నా.. ప్రజలను పోలింగ్‌లో పాల్గొనకుండా అడ్డుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఈసారి అందరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. వివిధ పార్టీల అభ్యర్థులు ప్రచారం చేయడం, హామీలు ఇవ్వడం, సాధ్యమైన సమస్యలు పరిష్కరించే వాతావరణం కల్పించారు. దీంతో ఓటర్లు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.





మా వివేకా సార్‌కు న్యాయం చేయండి

మరో ఓటరు 'మా వివేకా సార్‌కు న్యాయం చేయండి సార్' అంటూ ఓటుతో పాటు ఓ చీటీని బ్యాలెట్ బాక్సులో వేశారు. మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు అంశం సుప్రీంకోర్టు పరిధిలో ఉందని, త్వరలోనే న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నట్లు తెదేపా 'ఎక్స్‌'లో పోస్ట్ చేస్తూ ఈ చీటీ చిత్రాన్ని దానికి జతచేసింది.

అయితే ఏకగ్రీవం.. లేకపోతే ఏకపక్షం

- వైఎస్ కుటుంబం ఎవర్ని నిలబెడితే వాళ్లదే గెలుపు

ఈనాడు, అమరావతి: పులివెందుల జడ్పీటీసీ స్థానానికి ఎప్పుడు ఎన్నికలు జరిగినా... వైఎస్ కుటుంబం అందర్నీ భయభ్రాంతుల్ని చేసి ఏకగ్రీవం చేసుకునేది. లేకపోతే ఇతర పార్టీల్ని కనీసం ప్రచారం కూడా చేసుకోనివ్వకుండా అరాచకాలకు పాల్పడి ఏకపక్షంగా గెలిచేది. 1995 నుంచి 2021 వరకు అక్కడ ఐదు సార్లు ఎన్నికలు జరగ్గా.. వైఎస్ కుటుంబం ఏకంగా మూడు సార్లు ఏకగ్రీవం చేసుకుంది. అక్కడి ప్రజలు వైఎస్ కుటుంబంపై అభిమానంతోనో, గౌరవంతోనో పోటీకి దూరంగా ఉన్నారనుకుంటే పొరపాటే..! కేవలం వారి అరాచకాలు, బెదిరింపులు, హత్యారాజకీయాలకు భయపడి పోటీ చేసేవారు కాదు. రాష్ట్రంలో మరే జడ్పీటీసీ స్థానానికి మూడు సార్లు ఎన్నిక ఏకగ్రీవమై ఉండదు..! అక్కడ వైఎస్ కుటుంబానికి ఎదురెళ్లి నామినేషన్ వేయాలంటేనే ఎవర్నికైనా భయం... బెదురు..! ఎందుకంటే నామినేషన్ వేసినా... ప్రచారం చేయనివ్వరు. పోలింగ్ రోజున ఏజెంట్లు దొరక్కుండా చేస్తారు. ఎవరైనా ధైర్యం చేసి ఏజెంట్లుగా ఉన్నా దాడులకు దిగుతారు. అలాంటి భయంకర పరిస్థితుల్లో... తెదేపాలాంటి బలమైన క్యాడర్ ఉన్న పార్టీ కూడా నామినేషన్ వేయడానికి ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాల్సి వచ్చేది. 1995, 2006, 2021లో పులివెందుల జడ్పీటీసీ ఎన్నిక ఏకగ్రీవం కాగా, 2001, 2014ల్లో తెదేపా అభ్యర్థుల్ని పోటీకి పెట్టగలిగింది. అప్పట్లో రాష్ట్రంలో తెదేపా అధికారంలో ఉంది కాబట్టి... నామినేషన్‌లైనా వేయించగలిగింది. కానీ స్వేచ్ఛగా ప్రచారం చేయలేక, ఏజెంట్లను కూడా పెట్టలేక ఓడిపోయింది. పులివెందుల జడ్పీటీసీ స్థానానికి ఇప్పుడు జరిగిన ఉప ఎన్నికల్లో... వైఎస్ కుటుంబ ఆధిపత్యానికి గండికొట్టి, అరాచకాలను కట్టడి చేసి తెదేపా మొదటిసారి తమ అభ్యర్థిని గెలిపించుకోగలిగింది.

క్షేత్రస్థాయిలో ఇబ్బందులున్నా.. సమర్థత చాటారు

- పులివెందులలో స్వేచ్ఛగా ఎన్నికలు జరిపించిన ఉన్నతాధికారులు
- అల్లరి మూకల్ని నిలువరించటంలో పోలీసుల విజయం
- ధైర్యంగా ఓటేసిన ప్రజలు

ఈనాడు - అమరావతి: వైఎస్ కుటుంబీకుల పట్ల విపరీతమైన భయం, భక్తి, వీరవిధేయతలతో స్థానికంగా పనిచేసే క్షేత్రస్థాయి సిబ్బంది కొందరు సహాయ నిరాకరణ చేసినా సరే దాన్ని అధిగమించి పులివెందులలో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిపించటంలో పోలీసు ఉన్నతాధికారులు విజయం సాధించారు. వైఎస్ కుటుంబీకుల అరాచకాల గురించి తెలిసి.. కడప ఎంపీ అవినాష్ రెడ్డిని పట్టుకోవటానికి సైతం స్థానిక పోలీసులు ముందుకు రాని పరిస్థితిని దాటుకుని హింసాత్మక ఘటనలు లేకుండా ఎన్నికలు నిర్వహించగలిగారు. డీఐజీ, ఎస్పీ స్థాయి అధికారులు అక్కడే మకాం వేసి ముందుండి నడిపించి.. క్షేత్రస్థాయి సిబ్బందిలో ధైర్యం నింపారు. పోలీసింగ్ సమర్థంగా ఉంటే ఎంతటి అరాచక శక్తులనైనా నిలువరించొచ్చని పులివెందుల జడ్పీటీసీ ఉపఎన్నికల సందర్భంగా ఉన్నతాధికారులు నిరూపించారు.

- క్లిష్ట పరిస్థితులు, కీలక సమయాల్లో ఉన్నతాధికారులే రంగంలోకి దిగి అల్లరి మూకలు, గొడవలు సృష్టించేవారి పీచమణిచారు. పోలీసుల నిర్బంధం నుంచి తప్పించుకుని పారిపోయి జగన్ క్యాంప్ కార్యాలయంలో మకాం వేసిన ఎంపీ అవినాష్‌రెడ్డి వద్దకు స్వయంగా డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ అశోక్‌కుమార్ వచ్చి గట్టిగా హెచ్చరించటంతో.. క్షేత్రస్థాయి సిబ్బందిలోనూ ధైర్యం పెరిగింది. ఆ తర్వాత నుంచి వారు మరింత క్రియాశీలకంగా వ్యవహరించగలిగారు. దీంతో ఎక్కడా పెద్ద గొడవలు, హింసాత్మక ఘటనలేవీ చోటుచేసుకోకుండా ఆపగలిగారు.



పులివెందులలోని ఓ కేంద్రంలో ఓటు వేసేందుకు బారులు తీరిన ప్రజలు

గ్రామాల్లో తిరిగి.. ఓటర్లలో భరోసా కల్పించి..

డీఐజీ, ఎస్పీలు ఒక్కో గ్రామాన్ని నాలుగైదుసార్లు సందర్శించారు. సమస్యాత్మక గ్రామాల్లో విస్తృతంగా తిరిగారు. ఓటర్లు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవచ్చని భరోసా కల్పించారు. ఎక్కడ చిన్న గొడవ జరిగినా వెంటనే స్పందిస్తూ.. దాని తీవ్రత పెరగకుండా చూశారు. దీంతో ప్రజలు ధైర్యంగా బయటకొచ్చి ఓట్లు వేయగలిగారు.

- నామినేషన్ల ప్రక్రియ మొదలైనప్పటి నుంచే ప్రతి గ్రామంలో 10 మంది పోలీసులతో 24 గంటలూ బందోబస్తు ఏర్పాటు చేశారు. అల్లరి మూకలు పేట్రేగిపోకుండా అడ్డుకున్నారు. దౌర్జన్యాలు, దాడులన్నింటినీ ముందస్తుగా నియంత్రించగలిగారు.
- బరిలో ఉన్న అభ్యర్థులందరూ స్వేచ్ఛగా ఎన్నికల ప్రచారం చేసుకునేందుకు కావాల్సినంత భద్రత కల్పించారు. ప్రధాన పార్టీల అభ్యర్థులకు భద్రతగా సీఐ స్థాయి అధికారి నేతృత్వంలో ఓ బృందాన్ని కేటాయించారు.

నాడు కుప్పంలో లెక్కలేనన్ని అరాచకాలు!

ఈనాడు-అమరావతి, చిత్తూరు: కుప్పం పురపాలక ఎన్నికల్లో విజయం సాధించామని అప్పట్లో వైకాపా గొప్పలు చెప్పుకొంది. దశాబ్దాల నుంచి తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉన్న స్థానాన్ని బద్దలు కొట్టామని సంబరాలు చేసుకుంది. ప్రశాంతతకు మారుపేరైన కుప్పంలో.. నాడు పురపాలక, పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో గెలుపు కోసం వైకాపా నేతలు చేసిన అరాచకాలు అన్నీఇన్నీ కావు. 2021 నవంబరులో జరిగిన కుప్పం మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు కోసం అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుమారుడు, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి పట్టణంలోనే మకాం వేశారు. ప్రతిపక్షాలు పోలింగ్ ఏజెంట్లనూ నియమించుకోనివ్వలేదు. అంతచేసినా తెదేపా కోట ఎక్కడా బీటలు వారలేదు. కుప్పంలో చంద్రబాబు ప్రజాదరణను తగ్గించలేకపోయారు. గతేడాది సాధారణ ఎన్నికల్లో 48 వేల మెజార్టీతో ఆయన శాసనసభకు ఎన్నికయ్యారు. ఐదేళ్ల వైకాపా ప్రభుత్వ ఆగడాలకు కుప్పం పురపాలక ఎన్నిక ఒక మచ్చుతునక మాత్రమే! అప్పట్లో గ్రామపంచాయతీ, మండల, జిల్లా పరిషత్, మున్సిపల్ ఎన్నికల్లోనూ వైకాపా దురాగతాలకు అంతేలేదు. చాలా నియోజకవర్గాల్లో మొత్తం స్థానాలు ఏకగ్రీవమయ్యాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. నామినేషన్లు వేస్తే.. ఆస్తులు లాగేసుకుంటామని, గంజాయి కేసులు పెడతామని బెదిరించారు. అధికారుల ద్వారా కుల ధ్రువీకరణ పత్రాలు జారీ కాకుండా అడ్డుకున్నారు. ప్రశ్నించే వీల్లేకుండా అణచివేశారు. కుప్పం లాంటి ప్రాంతాల్లో తెదేపా కేడర్ బలంగా నిలబడ్డా.. వైకాపా వేధింపులకు తాళలేక చాలాచోట్ల ఆ పార్టీ శ్రేణులు వెనక్కి తగ్గాయి. రాజకీయ అరాచకాలపై కేసులు పెట్టాలని నాటి ఎన్నికల కమిషనర్ స్వయంగా మొత్తుకున్నా.. ప్రభుత్వం పట్టించుకోలేదు.

వైకాపాను వెంటాడుతున్న 11

ఈనాడు, కడప, ఏడురోడ్లు, న్యూస్‌టుడే: వైకాపాను 11 సంఖ్య వెంటాడుతూనే ఉంది. గత సాధారణ ఎన్నికల్లో ఆ పార్టీ 11 ఎమ్మెల్యే సీట్లు గెలుచుకుంది. అప్పటి నుంచి ఏదో ఒక సందర్భంలో ఆ సంఖ్య ఆ పార్టీని ఎద్దేవా చేసేలా పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. వైఎస్సార్ కడప జిల్లాలో పులివెందుల, ఒంటిమిట్ట స్థానాలకు జరిగిన జడ్పీటీసీ ఉప ఎన్నికలకు నామినేషన్లు 11 చొప్పునే దాఖలయ్యాయి. పులివెందుల స్థానంలో నోటాకు 11 ఓట్లు పడ్డాయి. ఈ ఎన్నికలపై వైకాపా అధినేత జగన్ బుధవారం తాడేపల్లిలో మీడియా సమావేశం నిర్వహించగా, ఉదయం 11 గంటలకు ప్రారంభించారు.

◆ పులివెందుల నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన వివేకా హత్య కేసు నిందితుడు సునీల్‌యాదవ్‌కు 2 ఓట్లు వచ్చాయి. అభ్యర్థితో పాటు మరొక్కరు మాత్రమే ఓటు వేసి ఉంటారని వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థి శివకల్యాణ్‌రెడ్డికి 101 ఓట్లు, వైకాపా తరఫున పలు ప్రయోజనాల కోసం స్వతంత్ర అభ్యర్థులుగా పోటీచేసిన సాంబశివారెడ్డికి సున్న, రవీంద్రారెడ్డికి 14, సురేష్‌కుమార్‌రెడ్డికి 4, వెంగల్‌రెడ్డికి 3 చొప్పున ఓట్లు పోలయ్యాయి.


సీసీ కెమెరాల ఫుటేజిని ఎస్ఈసీ బయటపెట్టాలి

వైకాపా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

ఈనాడు, అమరావతి: పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలో దొంగ ఓట్లతో జరిగిన పోలింగ్‌కు రాష్ట్ర ఎన్నికల సంఘం(ఎస్ఈసీ) బాధ్యత వహించాలి అని వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి విమర్శించారు. ఆ ఎన్నికల్లో జరిగిన అరాచకాలపై ఆధారాలతో సహా 35 విజ్ఞాపనలు రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు సమర్పించినా ఒక్కదానిపైనా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. గురువారం ఆయన తాడేపల్లిలో విలేకర్లతో మాట్లాడారు. దొంగ ఓట్లతో తెదేపా రిగ్గింగ్ చేసి గెలిచిందని విమర్శించారు. ఎస్ఈసీకి చిత్తశుద్ధి ఉంటే పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాల పోలింగ్‌కు సంబంధించిన సీసీ కెమెరాల ఫుటేజిని బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

ప్రజాతీర్పు బయటపడింది

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



ఈనాడు, అమరావతి: 'పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన తెలుగుదేశం అభ్యర్థుల విజయం ఆయా మండలాల ప్రజలకు ఎంతో సంతోషం కలిగిస్తుంది. అక్కడ విజయం సాధించిన లతారెడ్డి, ముద్దు కృష్ణారెడ్డిలకు అభినందనలు' అని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కనీసం నామినేషన్లు కూడా వేయనీయలేదు. బెదిరింపులు, దాడులకు పాల్పడ్డారు. ఇప్పుడు ప్రజాస్వామ్య యుతంగా ఎన్నికలు నిర్వహించడంతో ప్రజాతీర్పు స్పష్టంగా వెలువడింది' అని పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు: మంత్రి లోకేశ్



ఈనాడు, అమరావతి: పులివెందులలో 30 ఏళ్ల తర్వాత తొలిసారిగా ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరిగాయని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీ స్థానాల్లో విజయం సాధించిన తెదేపా అభ్యర్థులు మారెడ్డి లతారెడ్డి, కృష్ణారెడ్డిలకు ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.

పులివెందులలో గెలుపంటే జోష్ ఎక్కువ కదా!

తెదేపా విజయంపై నారా భువనేశ్వరి



భువనేశ్వరితో ఫోన్‌లో మాట్లాడుతున్న లతారెడ్డి

ఈనాడు, కడప: 'పులివెందులలో గెలుపంటే ఇంకొంచెం జోష్ ఎక్కువ కదా! అని ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి వ్యాఖ్యానించారు. పులివెందుల జడ్పీటీసీ స్థానానికి నిర్వహించిన ఉప ఎన్నికలో విజయం సాధించిన తెదేపా అభ్యర్థి లతారెడ్డికి భువనేశ్వరి గురువారం ఫోన్ చేశారు. 'మీరు సాధించిన విజయంపై మేమంతా ఆనందంగా ఉన్నాం' అని అభినందించారు. 'ధన్యవాదాలమ్మా... నా విజయానికి మీరూ కారణం.. అందరూ కలిసికట్టుగా కృషి చేశారమ్మా..' అని లతారెడ్డి బదులిచ్చారు. భువనేశ్వరి స్పందిస్తూ 'అవును. . ఈ గెలుపు అంటే ఇంకొంచెం జోష్ ఎక్కువ కదా! మీకు మరొక్కసారి శుభాభినందనలు. మనందరం ఒకే కుటుంబం' అని వ్యాఖ్యానించారు.

ఆ వీడియో పెట్టి.. అంబటి అభాసుపాలు

ఈనాడు, అమరావతి: మాజీ మంత్రి, వైకాపా గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు గురువారం మధ్యాహ్నం తన 'ఎక్స్' ఖాతాలో ఒక వీడియోను పోస్ట్ చేసి అభాసుపాలయ్యారు. 'ఈ జడ్పీటీసీ ఎన్నికల ఫలితాలు కోయ ప్రవీణ్ ఐపీఎస్‌కి అంకితం!' అనే క్యాప్షన్‌తో ఆయన వీడియోను పోస్ట్ చేశారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల పోలింగ్‌లో దొంగ ఓట్లు వేస్తున్నట్లు చూపించే ప్రయత్నం చేశారు. పోలింగ్ కేంద్రంలో ఒక వ్యక్తి బ్యాలట్ పత్రాల పుస్తకంలో టక టకా ఓటు ముద్ర వేసి, వాటిని చించి బ్యాలట్ బాక్స్‌లో వేస్తున్నట్లుగా వీడియోలో ఉంది. ఆ వీడియోలో ఉన్న బ్యాలట్ పత్రాలు, పులివెందుల, ఒంటిమిట్ట ఎన్నికల్లో ఉపయోగించిన బ్యాలట్ పత్రాలకు సరిపోవడం లేదు, వీడియోలోని బ్యాలట్ పత్రాలు వేరే రంగులో ఉన్నాయి. దీంతో అంబటి ఫేక్ వీడియోను పెట్టి అభాసుపాలయ్యారని సామాజిక మాధ్యమాల్లో ట్రోల్ చేశారు.


సీఎం సొంతూళ్లో 'సౌర'భం

- నారావారిపల్లె క్లస్టర్‌లో 1,649 ఇళ్లపై సౌరఫలకాల ఏర్పాటు
- ఒక్క నెలలోనే 2.30 లక్షల యూనిట్ల విద్యుత్తు మిగులు
- అధికారుల కృషిని మెచ్చి.. కలెక్టర్ వెంకటేశ్వర్‌కు స్కోచ్ పురస్కారం

ఈనాడు-తిరుపతి, న్యూస్‌టుడే, చంద్రగిరి: ప్రతి ఇల్లూ సౌర విద్యుత్తు ఉత్పత్తి కేంద్రంగా మారాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పం. తన స్వగ్రామం తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం నారావారిపల్లె నుంచి ఇందుకు ఆయన నాంది పలికారు. సంక్రాంతికి సొంతూరు వచ్చిన చంద్రబాబు ఈ ప్రాజెక్టుకు అంకురార్పణ చేశారు. నారావారిపల్లెను క్లస్టర్‌గా చేసి మూడు పంచాయతీల (కందులవారిపల్లె, ఎ.రంగంపేట, చిన్న రామాపురం)ను స్వయంసమృద్ధిగా చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే పైలట్ ప్రాజెక్టుగా చేపట్టి కేవలం నాలుగున్నర నెలల్లో 1,649 గృహాలపై సౌర విద్యుత్తు ఫలకాలు అమర్చి రాష్ట్రానికే ఆదర్శంగా నిలిపారు. ఉగాది నాటికే దాదాపు పనులు పూర్తి కాగా స్తంభాల మార్పు, కొన్ని ఇళ్లకు సౌరఫలకాలు పైన బిగించే పరిస్థితి లేనందున కిందే అమర్చడానికి మరికొంత సమయం పట్టింది. దీనిలో అధికార యంత్రాంగం కృషిని మెచ్చి కలెక్టర్ వెంకటేశ్వర్‌కు స్కోచ్ సంస్థ సెప్టెంబరు 20న పురస్కారం అందజేయనుంది.

రూ.20.68 కోట్ల ఖర్చు

నారావారిపల్లె క్లస్టర్ పరిధిలోని మూడు పంచాయతీల్లో 2,378 ఇళ్లున్నాయి. ఒకరి పేరు పైనే రెండు, మూడు సర్వీసులు, స్థానికంగా నివాసం లేని వ్యక్తులు, ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలు సక్రమంగా లేని నాలుగైదు ఇళ్లను మాత్రమే సౌర విద్యుత్తు ఫలకాలు అమర్చడానికి మినహాయించారు. మిగిలిన ఇళ్లలో ఒక్కో గృహంపై 2 కిలోవాట్ల సౌర ప్యానళ్లు ఏర్పాటు చేశారు. ఒక్కో యూనిట్‌కు రూ.1,21,600 ఖర్చవగా పీఎం సూర్యఘర్ పథకంలో కేంద్రం రూ.60 వేలు రాయితీ ఇచ్చింది. పైలట్ ప్రాజెక్టు కావడంతో మిగతా మొత్తాన్ని రాష్ట్రమే భరిస్తోంది. త్వరగా పనులు పూర్తి కావాలనే లక్ష్యంతో 8 కంపెనీలకు పలకాలు అమర్చే బాధ్యతను అప్పగించారు. అంతే వేగంగా స్మార్ట్‌మీటర్లూ బిగించారు. మొత్తంగా ఇందుకోసం రూ.20.68 కోట్లు ఖర్చు చేశారు.



నారావారిపల్లెలో ఇళ్లపై ఏర్పాటు చేసిన సౌర విద్యుత్తు ఫలకాలు

సరఫరా నష్టాలూ తగ్గి..

సాధారణంగా ఇళ్లకు విద్యుత్తు సరఫరా అయ్యే క్రమంలో 10 శాతం నష్టం వస్తుంది. సౌర విద్యుత్తుతో ఇది పూర్తిగా తగ్గింది. మూడు పంచాయతీల్లోని ప్రజలు వినియోగించుకున్న తర్వాత కూడా ఒక్క జూన్ నెలలోనే 2.30 లక్షల యూనిట్లు మిగిలింది. ఒక్క యూనిట్ మిగులుపై రాష్ట్ర ప్రభుత్వం రూ.2.09 ఇంటి యజమానికి చెల్లిస్తామని చెప్పింది. దీంతో ఒక్క నెలలోనే రూ.4,80,700 ఆదాయం వచ్చినట్టయింది. సౌర ఫలకాలు అమర్చడానికి లబ్ధిదారులు తమ వాటా ముందుగానే చెల్లించాల్సి ఉన్నా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తున్నందున ఈ మొత్తాన్ని మినహాయించుకుంటారు.

అనుమానాలు నివృత్తి చేశారు

– మునిరత్నం నాయుడు, నారావారిపల్లె



ముఖ్యమంత్రి చంద్రబాబు నారావారిపల్లె క్లస్టర్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. సౌర విద్యుత్తుపై మాకున్న అనుమానాలను అధికారులు నివృత్తి చేశారు. ఒక్క రూపాయి కూడా మేం చెల్లించకుండానే పరికరాలు అమర్చారు. దీంతో కాలుష్యం తగ్గుతుంది. పర్యావరణాన్ని పరిరక్షించినవారమవుతున్నాం.

సీఎం ఆకాంక్షలకు అనుగుణంగా

– వెంకటేశ్వర్, కలెక్టర్

సీఎం ఆకాంక్షలకు అనుగుణంగా పంచాయతీ, ఎస్పీడీసీఎల్ అధికారులు తక్కువ కాలంలోనే ప్రాజెక్టు పూర్తి చేసినందునే స్కోచ్ పురస్కారం దక్కింది. ఇంటి యజమానులు విద్యుత్తు బిల్లులు చెల్లించాల్సిన అవసరం తప్పింది. దీంతో మూడు పంచాయతీల్లోని ప్రజలపై కొంత భారం తగ్గింది. మిగులు విద్యుత్తును గ్రిడ్‌కు అనుసంధానించాం.

ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య ప్రాజెక్టులపై కమిటీ

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో చేపట్టే ప్రాజెక్టుల లక్ష్యాలు నెరవేర్చేందుకు వీలుగా ఇంతకుముందు ఉన్న కమిటీని పునర్ వ్యవస్థీకరించారు. ఈ మేరకు ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. ఆర్థికశాఖ కార్యదర్శి వినయ్‌చంద్, సంయుక్త కార్యదర్శి అల్లాడ గౌతమ్‌తో సహా మొత్తం ఏడుగురితో కమిటీ ఏర్పాటు చేశారు. 2025-26 నుంచి 2028-29 మధ్య ఈ ప్రాజెక్టులను గాడిన పెట్టడంతో పాటు వీటికి కావాల్సిన నిధులు వివిధ ఆర్థిక సంస్థల నుంచి రాబట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ కమిటీ దృష్టి సారిస్తుంది.

భరతమాత కీర్తి పతాక ప్రపంచమంతా ఎగరాలి

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

ఈనాడు, అమరావతి: దేశమంతా ఐక్యతా రాగం వినిపించాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. గురువారం 'ఎక్స్' వేదికగా దేశవిభజన నాటి ఘటనలు గుర్తుచేశారు. దేశంలో మతపరమైన రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. దేశ విభజన ప్రయత్నాలు సరిహద్దుకు అవతల జరుగుతుంటే.. సరిహద్దు లోపల అలాంటి ఆలోచనలు ఉన్నవారూ ఉన్నారని ఆరోపించారు. అందరం సర్వధర్మ సమభావంతో ఐక్యంగా ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు.

సినిమాల్లో అవకాశం కోసం.. చెన్నై వచ్చిన బాలికపై అత్యాచారం

నమ్మించి తీసుకొచ్చిన మలయాళ నటి అరెస్టు



నటి మీను మునీర్

చెన్నై (ప్యారిస్), న్యూస్‌టుడే: సినిమాల్లో అవకాశం ఇప్పిస్తానంటే నమ్మి చెన్నై వచ్చిన 14 ఏళ్ల బాలికపై నలుగురు వ్యక్తులు అత్యాచారానికి పాల్పడిన కేసులో మలయాళ సినీ నటి మీను మునీర్‌ను పోలీసులు అరెస్టుచేశారు. పోలీసుల కథనం.. పదేళ్ల క్రితం మీను మునీర్ సినిమాల్లో నటించేలా చేస్తానని చెప్పి తన బంధువు కుమార్తె అయిన 14 ఏళ్ల బాలికను చెన్నై తీసుకొచ్చి ఓ ప్రైవేటు హోటల్‌లో ఉంచింది. ఆ సమయంలో నలుగురు వ్యక్తులు బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. వారి నుంచి తప్పించుకున్న బాధితురాలు పదేళ్ల తర్వాత ఈ ఏడాది మార్చిలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన చెన్నై తిరుమంగళం ఆల్ ఉమెన్ పోలీసులు నటి మీను మునీర్‌ను గురువారం అరెస్టు చేసి, చెన్నైకి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

పీపీపీ విధానంలో 11 రోడ్ల విస్తరణకు అవకాశం

- 15-30 ఏళ్లపాటు గుత్తేదారుకు అప్పగించొచ్చు
- సాంకేతిక ఆర్థిక అధ్యయనంలో వెల్లడి



ఈనాడు, అమరావతి: ఆర్‌అండ్‌బీలోని రాష్ట్ర రహదారులను ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) విధానంలో విస్తరించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టి, దానిపై సాంకేతిక ఆర్థిక అధ్యయనం (టెక్నో ఎకనమిక్ స్టడీ) చేయించగా తొలుత 11 రోడ్లలో ఆ విధానం అమలు చేయవచ్చని తేలింది. ఆయా రహదారుల్లో వాహనాల రద్దీకి అనుగుణంగా ఎన్ని వరుసలుగా విస్తరించొచ్చు? అందుకు ఎంత వ్యయమవుతుంది? వయబులిటీ గ్యాప్ ఫండింగ్ కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంత వెచ్చించాల్సి ఉంటుంది? గుత్తేదారులకు ఎంత కాలం ఈ రహదారిని అప్పగించొచ్చు? వంటి అంశాలపై అధ్యయనం చేశారు. మొత్తం 11 రోడ్లను ఈ విధానంలో విస్తరించొచ్చని అందులో తేలింది. ఆయా రోడ్లను బట్టి 15 ఏళ్ల నుంచి 30 ఏళ్ల పాటు నిర్వహణ, టోల్ వసూలు సంబంధిత గుత్తేదారుకు అప్పగించాల్సి ఉంటుందని ప్రతిపాదించారు. వయబులిటీ గ్యాప్ ఫండింగ్ ఎక్కువగా చెల్లించాల్సి వస్తుండటంతో మరో ఆరు రోడ్లలో ఈ విధానం గిట్టుబాటు కాదని నివేదిక పేర్కొంది.

అవసరమైన చోట్ల బైపాస్‌లు..

- మంగళగిరి-తెనాలి-నారాకోడూరు రోడ్డు 39 కి.మీ., గుంటూరు-బాపట్ల రోడ్ 50 కి.మీ.ను నాలుగు వరుసలుగా విస్తరణకు ప్రతిపాదించారు. అయితే, ఈ రెండు రోడ్లు వేర్వేరుగా పీపీపీ విధానంలో విస్తరణ సాధ్యం కాదని, రెండింటిని కలిపి ఒకే ప్రాజెక్టుగా విస్తరణ చేపడితే ఆచరణ సాధ్యమేనని తేల్చారు. దీనికి మొత్తంగా రూ.1,529.21 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు.
- ఒంగోలు-పొదిలి మధ్య 50 కి.మీ. నాలుగు వరుసలుగా, పొదిలి-బెస్తవారిపేట మధ్య 59 కి.మీ. రెండు వరుసలుగా విస్తరించాలని ప్రతిపాదించారు. ఇందులో పొదిలి-బెస్తవారిపేట మధ్య విస్తరణకు పీపీపీ విధానంలో గిట్టుబాటు కాదని తేల్చారు. అయితే, ఒంగోలు-పొదిలి-బెస్తవారిపేట కలిపి మొత్తం 109 కి.మీ. ఒకే ప్రాజెక్టుగా విస్తరణ చేయవచ్చని పేర్కొన్నారు. ఇందుకు రూ.611 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. ఇందులో సంతనూతలపాడు వద్ద 2 కి.మీ., చీమకుర్తి వద్ద 5.4 కి.మీ. మేర బైపాస్‌లు నిర్మించాల్సి ఉంటుందని చెప్పారు.
- నరసాపురం-తాడేపల్లిగూడెం-అశ్వారావుపేట రోడ్డు 92.4 కి.మీ. నాలుగు వరుసలుగా విస్తరించాలని ప్రతిపాదించారు. ఇందులో నరసాపురం నుంచి తాడేపల్లిగూడెం వరకు 51 కి.మీ. మాత్రమే పీపీపీ విధానంలో సాధ్యమవుతుందని తేల్చారు. దీనికి రూ.419 కోట్లు అవుతుందని అంచనా వేశారు. ఈ మార్గంలో మార్టేరు వద్ద 2.3 కి.మీ., అత్తిలి వద్ద రూ.3.47 కి.మీ., పిప్పర వద్ద 3 కి.మీ., పెంటపాడు వద్ద 4.3 కి.మీ. బైపాస్‌లను ప్రతిపాదించారు.

పీపీపీ కింద విస్తరణ సాధ్యంకాదని తేలిన రోడ్లు

రోడ్డు	కి.మీ.	ఎన్ని వరుసలు	అంచనా వ్యయం
ఏలూరు-జంగారెడ్డిగూడెం	51	2	రూ.250 కోట్లు
గుంటూరు-పర్చూరు	41	2	రూ.147 కోట్లు
కళింగపట్నం-శ్రీకాకుళం-పార్వతీపురం రోడ్డు	108	2/4	రూ.587 కోట్లు
రాజంపేట-గూడూరు	94	2	రూ.230 కోట్లు
ఏలూరు-మేడిశెట్టివారిపాలెం రోడ్డు	70	2	రూ.403 కోట్లు
విజయనగరం-పాలకొండ రోడ్డు	70	4/2	రూ.642 కోట్లు

పీపీపీ విధానంలో విస్తరణ సాధ్యమయ్యే రహదారులివి..

రోడ్డు	కి.మీ.	ఎన్ని వరుసలు	అంచనా వ్యయం
మంగళగిరి-తెనాలి-నారాకోడూరు, గుంటూరు-బాపట్ల	89	4	రూ.1,529.21 కోట్లు
ఒంగోలు-పొదిలి-బెస్తవారిపేట	109	4/2	రూ.611 కోట్లు
నరసాపురం-తాడేపల్లిగూడెం	51	4	రూ.419 కోట్లు
నర్సీపట్నం-తాళ్లపాలెం	31	2	రూ.101 కోట్లు
ప్యాపిలి-బనగానపల్లి	54	2	రూ.171 కోట్లు
దామాజీపల్లి-నాయనపల్లి	60	2	రూ.338 కోట్లు
జమ్మలమడుగు-కొలిమిగుండ్ల	42	2	రూ.181 కోట్లు
సోమందేపల్లి-హిందూపురం-తూముకుంట	39	2/4	రూ.270 కోట్లు
కాకినాడ-రాజమహేంద్రవరం కెనాల్ రోడ్	60	4	రూ.680 కోట్లు
కాకినాడ-జొన్నాడ రోడ్	4	2	రూ.425 కోట్లు
చిలకపాలెం-రామభద్రపురం-రాయగడ రోడ్	131	2/4	రూ.1,172 కోట్లు



రాళ్లు తేలిన దారిలో నడిచి వెళ్తున్న వైద్య సిబ్బంది

నడిచొచ్చిన వైద్యం!



ఆశా కార్యకర్త ఇంట్లో సేవలు అందిస్తున్న వైద్యులు

రాళ్లు తేలిన దారిలో వెళ్తున్న వీరంతా పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలంలోని తోణాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన వైద్య సిబ్బంది. వీహెచ్‌సీ పరిధిలో ఉన్న డెన్నరాయి, సంపెంగిపాడు గ్రామాల్లో 104 సంచార సేవలు అందించాల్సి ఉంది. రోడ్లు అధ్వానంగా మారడంతో 4 కిలోమీటర్ల దూరంలోని రేగాపువలస వద్ద వాహనాన్ని వదిలేసి డెన్నరాయి మీదుగా సంపెంగిపాడు ఇలా నడిచి వెళ్తున్నారు. గత ప్రభుత్వ పాలనలో నిర్మించిన రహదారి కొట్టుకుపోయింది. దీంతో సిబ్బంది వైద్య పరికరాలు, ఔషధాలు పట్టుకొని నడిచి వెళ్లి ఆశా కార్యకర్త ఇంట్లో వైద్యశిబిరం నిర్వహించారు.

– న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

ఇంజినీరింగ్‌లో 78% సీట్ల భర్తీ

ఈనాడు, అమరావతి: స్థానికత అంశంపై న్యాయస్థానం ఆదేశాలు ప్రభుత్వానికి అనుకూలంగా రావడంతో ఈఏపీసెట్ ఇంజినీరింగ్ రెండో విడత ప్రవేశాల కౌన్సెలింగ్ సీట్ల కేటాయింపు గురువారం పూర్తిచేశారు. ఇంజినీరింగ్‌లో మొత్తం 77.72% సీట్లు భర్తీ అయ్యాయి. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో కలిపి 1,53,964 సీట్లు ఉండగా 1,19,666 సీట్లు నిండాయి. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో 8,112 సీట్లకు గాను 6,751 సీట్లు భర్తీ కాగా ప్రైవేటు వర్సిటీల్లో 12,126 సీట్లలో 11వేలు నిండాయి. ప్రైవేటు కళాశాలల్లో 1,33,726 సీట్లు ఉండగా 1,01,915 సీట్లు భర్తీ అయ్యాయి. అన్నింటిలో కలిపి 34,298 సీట్లు మిగిలాయి. క్రీడా కోటాకు సంబంధించి 677 సీట్లను కేటాయించలేదు. శాప్ నుంచి సర్టిఫికెట్ల పరిశీలన పూర్తికానందున దీన్ని వాయిదావేశారు. రెండోవిడత కౌన్సెలింగ్‌లో కోర్సులు, కళాశాలలను మార్చుకునేందుకు 28,735 మంది స్లైడింగ్ తీసుకున్నారు. తుది విడత కౌన్సెలింగ్‌లో 14,409 మందికి సీట్లు కేటాయించారు.

రాష్ట్ర పండువగా గౌతు లచ్చన్న జయంతి

ఈనాడు, అమరావతి : స్వాతంత్ర్య సమరయోధుడు గౌతు లచ్చన్న జయంతిని ఆగస్టు 16న రాష్ట్ర పండువగా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వెనకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏటా ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొంది.



మీ భాగస్వామి ఇలా ఉండాలి

వ్యాపారంలోనైనా, జీవితంలోనైనా భాగస్వామి ఎంపికలో చాలా జాగ్రత్తగా ఉండండి. భాగస్వామి ఎలా ఉండాలంటే-
✦ ప్రశాంతతను ఇవ్వాలే తప్ప, సమస్యల్ని కాదు. ✦ మీరు గెలిచినప్పుడు సంతోషించాలే తప్ప, అసూయపడొద్దు. ✦ ఎదిగేలా మిమ్మల్ని ప్రోత్సహించాలే తప్ప, కిందకు లాగకూడదు. ✦ బాధ్యత తీసుకోవాలే తప్ప, మిమ్మల్ని నిందించకూడదు.

– లెవిస్ హోవెస్, రచయిత

రీపోలింగ్ జరపాలని వేసిన పిటిషన్ల కొట్టివేత

- వైకాపా అభ్యర్థుల వ్యాజ్యాలపై హైకోర్టు తీర్పు

ఈనాడు, అమరావతి: పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీలకు రీపోలింగ్ నిర్వహించాలని కోరుతూ వైకాపా అభ్యర్థులు దాఖలుచేసిన వ్యాజ్యాలను హైకోర్టు కొట్టేసింది. వీటికి విచారణార్హత లేదని, ఎన్నికల ప్రక్రియపై అభ్యంతరం ఉంటే ఎన్నికల పిటిషన్ (ఈపీ) దాఖలు చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ), రాష్ట్రప్రభుత్వం, తెదేపా అభ్యర్థి, స్వతంత్ర అభ్యర్థుల తరఫు న్యాయవాదులు చేసిన వాదనలతో ఏకీభవించింది. ఈ మేరకు వ్యాజ్యాలను కొట్టేస్తూ న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ గురువారం ఉత్తర్వులిచ్చారు. ట్రైబ్యునల్‌లో ఎన్నికల పిటిషన్(ఈపీ) దాఖలు చేసుకునేందుకు పిటిషనర్లకు స్వేచ్ఛనిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉప ఎన్నికల్లో అక్రమాలు చోటుచేసుకున్నందున కేంద్రబలగాల ఆధ్వర్యంలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ నిర్వహించేలా ఎస్ఈసీని ఆదేశించాలని కోరుతూ పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలకు పోటీచేసిన వైకాపా అభ్యర్థులు తుమ్మల హేమంత్‌రెడ్డి, సుబ్బారెడ్డి ఈ వ్యాజ్యాలు వేశారు. వారి తరఫు సీనియర్ న్యాయవాదులు పి.వీరారెడ్డి, శ్రీరామ్ వాదనలు వినిపించారు. జిల్లా కలెక్టర్ ఉండగానే దొంగ ఓటర్లు ఓట్లేయడానికి వచ్చారని వాదనల్లో కోర్టుకు చెప్పగా.. వారు దొంగ ఓటర్లనే విషయం కలెక్టర్‌కు ఎలా తెలుస్తుందని న్యాయమూర్తి ప్రశ్నించారు.

నిష్పాక్షికంగా జరిగినట్లు ఆర్‌వోలు నివేదిక ఇచ్చారు: ఎస్ఈసీ

ఎస్ఈసీ తరఫు న్యాయవాది వివేక్ చంద్రశేఖర్ వాదనలు వినిపిస్తూ.. వ్యాజ్యాలకు విచారణార్హత లేదని, పిటిషనర్లకు అభ్యంతరం ఉంటే ట్రైబ్యునల్లో ఎన్నికల పిటిషన్ దాఖలు చేసుకోవాలని ధర్మాసనానికి తెలిపారు. రాష్ట్రప్రభుత్వం తరఫున ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్లు చేస్తున్న ఆరోపణలు వాస్తవమా కాదా.. అనే విషయాన్ని ఎన్నికల పిటిషన్లో తేల్చాల్సి ఉంటుందని, ఈ పిటిషన్లను కొట్టేయాలని విజ్ఞప్తి చేశారు. పులివెందుల ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి మారెడ్డి భరత్‌రెడ్డి, ఒంటిమిట్ట ఎన్నికల్లో తెదేపా అభ్యర్థి ఎం.కృష్ణారెడ్డిల తరఫున సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు వాదనలు వినిపిస్తూ ఆర్‌వో నివేదిక ఆధారంగా రీపోలింగ్‌పై నిర్ణయం తీసుకుంటారు తప్ప.. రాజకీయ పార్టీల ఫిర్యాదుల ఆధారంగా నిర్వహించరని కోర్టుకు నివేదించారు.

సచివాలయంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం

- నేటి నుంచి అమలు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర సచివాలయాన్ని సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌రహితంగా మార్చేందుకు చర్యలు చేపట్టామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ తెలిపారు. గురువారం సచివాలయ ప్రాంగణంలో జూట్‌బ్యాగ్‌ల స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. "సచివాలయంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాగ్‌ల స్థానంలో జూట్ బ్యాగ్‌ల వినియోగాన్ని పెంచాలనే లక్ష్యంతో స్టాల్ ఏర్పాటు చేశాం. వచ్చే జూన్ 5 నాటికి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా సచివాలయం నుంచే చర్యలు చేపట్టాం. ఈ నెల 15 నుంచి ఇక్కడ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులైన బాటిళ్లు, ప్లాస్టిక్ కప్పులు, ప్లేట్లు, స్టిక్కర్లు, బ్యాగ్‌ల వాడకంపై నిషేధాన్ని అమలుచేస్తున్నాం. వీటి స్థానంలో పునర్వినియోగ, పర్యావరణహిత వస్తువులను ప్రోత్సహించేలా చర్యలు చేపట్టాం. సచివాలయంలోని అన్ని బ్లాకుల్లో ఆర్వో ప్లాంట్లను ఏర్పాటుచేస్తాం. ఉద్యోగులకు స్టీల్ బాటిళ్లను ఉచితంగా అందిస్తున్నాం" అని తెలిపారు. కార్యక్రమంలో మెప్మా ఎండీ తేజ్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

పారా అథ్లెట్ల కోసం స్పోర్ట్స్ స్కాలర్‌షిప్ ప్రోగ్రాం

- 'ఎస్‌బీఐ ఫౌండేషన్'తో ఐఐటీ మద్రాస్ ఒప్పందం



ఒప్పంద కార్యక్రమంలో ఎస్‌బీఐ ఫౌండేషన్ ఎండీ సంజయ్ ప్రకాశ్, ఐఐటీఎం ప్రతినిధులు తదితరులు

చెన్నై (వడపళని), న్యూస్‌టుడే: పారా అథ్లెట్స్ స్పోర్ట్స్ స్కాలర్‌షిప్ ప్రోగ్రాం ప్రారంభించేందుకు ఐఐటీ మద్రాస్ 'ఎస్‌బీఐ ఫౌండేషన్'తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. దేశవ్యాప్తంగా 100 మంది పారా అథ్లెట్లకు సాధికారత కల్పించాలనేది ప్రధాన ఉద్దేశం. దీనికి సంబంధించి ఎస్‌బీఐ ఫౌండేషన్ ఎండీ, సీఈఓ సంజయ్ ప్రకాశ్, ఇతర ఉన్నతాధికారుల సమక్షంలో ఒప్పంద కార్యక్రమాన్ని గురువారం ముంబయిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంజయ్ ప్రకాశ్ మాట్లాడుతూ.. "దేశంలోని పారా అథ్లెట్ల అపరిమిత సామర్థ్యం, అంకితభావం, ప్రతిభ స్ఫూర్తిదాయకం. ఐఐటీ మద్రాస్‌తో కలిసి ఈ ప్రోగ్రాం ప్రారంభించడంతో వారి కలలు సాకారమవుతాయి. ఎంపికైన అథ్లెట్లకు నెలవారీ గౌరవ భృతిగా రూ.40వేలు అందుతుంది" అని ఆయన తెలిపారు. అనంతరం ఐఐటీ మద్రాస్ డీన్, ఆచార్యులు అశ్విన్ మహాలింగం మాట్లాడుతూ.. ఐఐటీ మద్రాస్, ఎస్‌బీఐ ఫౌండేషన్ మధ్య జరిగిన ఒప్పందం ద్వారా పారా అథ్లెట్లు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో సత్తా చాటేందుకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. దివ్యాంగ క్రీడాకారుల సామర్థ్యాన్ని పెంపొందించడానికి అవకాశం దక్కుతుందన్నారు. దీనికి ఐఐటీ మద్రాస్‌లోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ హ్యూమన్ పెర్ఫార్మెన్స్ ఆక్రోఫేస్ విభాగ ఆచార్యులు మోహన శంకర్ శివప్రకాశం సాంకేతిక సాయాన్ని అందిస్తారని వెల్లడించారు.

అనుచిత వ్యాఖ్యలు చేయకుండా అడ్డుకోండి

- కొమ్మినేనికి సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నిర్దేశం

ఈనాడు, దిల్లీ: టీవీలో చర్చలు నిర్వహించేటప్పుడు అందులో పాల్గొంటున్నవారు ఎవరైనా ఇతరులకు పరువునష్టం కల్గించేలా అనుచిత వ్యాఖ్యలు చేస్తుంటే రిమోట్‌తో వారి ప్రసారాలు నిలిపేయాలని సాక్షి టీవీ యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావుకు సుప్రీంకోర్టు ధర్మాసనం నిర్దేశించింది. అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యల కేసులో అరెస్టయిన తనకు జూన్ 13న సుప్రీంకోర్టు జారీచేసిన మధ్యంతర బెయిల్‌ను పూర్తిస్థాయి బెయిల్‌గా ఖరారు చేయాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం విచారణ సందర్భంగా జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యానించింది. ఆయన బెయిల్‌ను తామేమీ వ్యతిరేకించడంలేదని రాష్ట్రప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ చెప్పడంతో ధర్మాసనం ఆ స్టేట్‌మెంట్‌ను పరిగణనలోకి తీసుకొని మధ్యంతర బెయిల్‌ను పూర్తిస్థాయి బెయిలుగా ఖరారు చేస్తున్నట్లు స్పష్టంచేసింది. 'ఇకమీదట పిటిషనర్ యాంకర్‌గా నిర్వహించే చర్చల్లో ఇలాంటి పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేయరాదు. తన సమక్షంలో ఇతరులు ఇలాంటి ప్రకటనలు చేయడానికి అనుమతించరాదు' అని సుప్రీంకోర్టు జూన్ 13న జారీచేసిన ఉత్తర్వులను సవరించాలని కొమ్మినేని తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. తాను కార్యక్రమాల నిర్వాహకుడినేనని, అతిథి ఎవరైనా అలాంటి వ్యాఖ్యలు చేస్తే వారిని అడ్డుకోలేమని పిటిషనర్ పేర్కొన్నారు. అందుకు జస్టిస్ కేవీ విశ్వనాథన్ స్పందిస్తూ 'మీరు వారి వ్యాఖ్యలను మ్యూట్ చేయండి. మీరు అతిథులను అప్రమత్తం చేయండి. మీ చేతిలో రిమోట్ పెట్టుకోండి' అని సూచించారు. జస్టిస్ బీవీ నాగరత్న స్పందిస్తూ ఎట్టి పరిస్థితుల్లోనూ పరువునష్టం కలిగించే వ్యాఖ్యలు చేయకూడదని కొమ్మినేని న్యాయవాదికి నిర్దేశించారు.

మోదీతో టచ్‌లో లేనని జగన్ ప్రమాణం చేయగలరా?

- ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబుతో రాహుల్‌గాంధీ హాట్‌లైన్‌లో టచ్‌లో లేరని తాము హామీ ఇస్తున్నామని.. ప్రధాని మోదీతో తాను టచ్‌లో లేనని జగన్ బైబిల్‌పై ప్రమాణం చేయగలరా? అంటూ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల సవాల్ విసిరారు. మీలా.. జనాన్ని టైర్లతో తొక్కించడం రాహుల్‌కు తెలియదని మండిపడ్డారు. వైకాపా నేతలు తప్పుడు పనులు చేసి అరెస్టైతే.. వారిని పరామర్శించడానికి ఎందుకు వెళ్లట్లేదని జగన్‌ను ప్రశ్నించారు. ఏపీసీసీ పిలుపు మేరకు 'ఓట్ల దొంగ.. గద్దె దిగు' పేరుతో విజయవాడలో గురువారం రాత్రి నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో ఆమె పాల్గొని ప్రసంగించారు. 'హాట్‌లైన్ అంటూ జగన్ మాట్లాడడం విడ్డూరం. జగన్‌లా రాహుల్ బలప్రదర్శన యాత్రలు చేయడం లేదు. దేశప్రజల హక్కుల కోసం పోరాడుతున్నారు. మోదీతో పొత్తు పెట్టుకుని రాష్ట్రాన్ని జగన్ తాకట్టు పెట్టారు. కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌ఛార్జి మాణికం ఠాగూర్ గురించి జగన్ చులకనగా మాట్లాడి.. తనకు సంస్కారం లేదని నిరూపించుకున్నారు. భారత ఎన్నికల కమిషన్ మోదీ చెప్పుచేతల్లో ఉంది. ప్రజలకు రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును ప్రసాదించే బాధ్యతను ఎన్నికల కమిషన్ మరచింది. ఓట్ల అవకతవకలపై ఉన్నతస్థాయి విచారణ చేయాలి' అని షర్మిల డిమాండ్ చేశారు.

జగన్ వ్యాఖ్యలు అవివేకం: తులసిరెడ్డి

అజ్ఞానం, అవివేకంతో జగన్.. రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి మండిపడ్డారు. భాజపా చేతిలో జగన్ కీలుబొమ్మగా మారారని గురువారం ఓ ప్రకటనలో దుయ్యబట్టారు.

జేఎన్‌టీయూఏ స్కిట్‌లో స్పాట్ అడ్మిషన్లకు అవకాశం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ ప్రవేశాలకు సంబంధించి శ్రీకాళహస్తిలో జేఎన్‌టీయూఏ నూతనంగా ప్రారంభించిన స్కిట్ ఇంజినీరింగ్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్ల ద్వారా సీట్లు పొందవచ్చని ప్రిన్సిపల్ దేవేంద్రరెడ్డి తెలిపారు. జేఎన్‌టీయూఏ సొంత కళాశాలగా ఈ ఏడాది నుంచి ప్రభుత్వం దీన్ని నిర్వహిస్తోందని గురువారం చెప్పారు. సీఎస్ఈ, సీఎస్ఈ ఏఐ, ఎంఎల్, సీఎస్ఈ డీఎస్, ఈసీఈ, ఈఈఈ కోర్సుల్లో ఒక్కో విభాగానికి 66 సీట్ల చొప్పున భర్తీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. వెబ్ ఆప్షన్లకు ఆలస్యంగా అనుమతులు రావడంతో ప్రస్తుతం సీఎస్ఈలో 33, సీఎస్ఈ ఏఐ, ఎంఎల్‌లో 18, సీఎస్ఈ డీఎస్‌లో 8, ఈసీఈలో 7, ఈఈఈలో 2 సీట్లు భర్తీ అయినట్లు వివరించారు. ఇప్పుడు ఇక్కడి కళాశాలలో చేరాలనుకున్న విద్యార్థులు స్పాట్ అడ్మిషన్ల ద్వారా సీట్లు పొందేలా ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు తెలిపారు.


దేశ సమగ్రత కోసం అందరూ ఒకే తాటిపై నిలవాలి: పవన్‌కల్యాణ్

ఈనాడు, అమరావతి: మహనీయుల త్యాగాల పునాదులపై నిర్మితమైన స్వతంత్ర ప్రజాస్వామ్య దేశంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవం నిర్వహించుకుంటున్న ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 'దేశ సమగ్రతకు, సార్వభౌమత్వానికి ఎట్టి పరిస్థితుల్లోనూ భంగం కలగకుండా అందరూ ఒకే తాటిపై ఉండటం మన బాధ్యత. దేశ ఐక్యత, శాంతి సౌభాగ్యాల సాధనలో అందరూ భాగస్వాములు కావాలి. నుదుట సిందూరం చూసి కాల్చి చంపేసే ఉగ్రమూకలను తుదముట్టించి, వారిని పెంచి పోషిస్తున్న ముష్కరులను అన్ని విధాలా కట్టడి చేసే శక్తి సామర్థ్యాలు మనకు ఉన్నాయి. ప్రధాని మోదీ దృఢ నాయకత్వంలో రక్షణ పరంగానే కాదు ఆర్థికంగానూ మనం పటిష్ఠ స్థితిలో ఉన్నాం' అని చెప్పారు.

అభివృద్ధికి అటూ ఇటూ!

78 ఏళ్ల స్వతంత్ర భారతంలో సానుకూలతతోపాటు సవాళ్లు

- మౌలిక రంగ రూపాంతరీకరణలో ఇంకా వెనుకబాటే
- పడిపోతున్న ప్రాధాన్య రంగాల వాటా
- అయినా వ్యవసాయ రంగంలోనే ఉపాధి అధికం



భారత్ పురోగమిస్తోంది.. ప్రపంచంలోనే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలపైనా ఒకటిగా జోరు సంపాదించుకుంది. అనేక రంగాల్లో ప్రపంచ దేశాలతో పోటీపడుతోంది. ఈ నేపథ్యంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేళ 'దేశమే ముందు' అనే థీమ్‌తో సంబరాలకు సిద్ధమైంది. అయితే ఈ అభివృద్ధి అప్రతిహతంగా సాగుతోందా.. అడ్డంకులున్నాయా.. అనేది ఆసక్తికరం.

యుద్ధాలు, వాణిజ్య వివాదాలు, ఆర్థిక ప్రాధమ్యాల్లో మార్పుల మధ్య భారత ఆర్థిక వ్యవస్థ ప్రయాణం.. ఘనంగా ముందుకు సాగుతూనే అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. సానుకూల కోణంలో చూస్తే ఈ ఏడాదిలో నాలుగో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా దేశం ఎదిగింది. ప్రపంచం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నా.. మన దేశం ముందుకు సాగుతుండటం సానుకూల పరిణామం.

1980-90ల మధ్య ఒడుదొడుకులను ఎదుర్కొన్నా..

దేశంలో 1980-90ల మధ్య ఆర్థిక వ్యవస్థ అనేక ఒడిదొడుకులను ఎదుర్కొంది. అయినా పురోగమిస్తూనే ఉంది. మధ్యలో కొంతకాలంపాటు ప్రపంచ ర్యాంకుల్లో పడిపోయినా మళ్లీ గాడినపడింది. దీంతో 2025 నాటికి నాలుగో ర్యాంకుకు చేరుకుంది.

సంవత్సరం	జీడీపీ (ట్రిలియన్ డాలర్లలో)	ర్యాంకు
1960	0.04	9
1970	0.06	9
1980	0.19	13
1990	0.32	14
2000	0.47	13
2010	1.68	9
2020	2.67	6
2021	3.17	5
2022	3.35	5
2023	3.64	5
2024	3.91	5
2025	4.19	4

ఇంకా వ్యవసాయంపైనే..

ఆధునిక భారత ఆర్థిక వృద్ధికి ఎంతో అవసరమైన మౌలిక రంగ రూపాంతరీకరణ వేగంగా సాగడం లేదు. గ్రాస్ వాల్యూను జోడించడంలో (జీవీఏ) ప్రాథమిక రంగం వాటా పడిపోతోంది. అదే సమయంలో తూర్పు ఆసియా, ఆగ్నేయాసియాలో వృద్ధి చెందుతున్న పారిశ్రామిక రంగ వాటా మన దేశంలో స్తంభించిపోయింది. జీవీఏలో ప్రస్తుతం సేవారంగం వాటా 54 శాతానికి చేరింది. కానీ అది ఉద్యోగ కల్పనలో ఆ స్థాయిలో రాణించలేకపోతోంది. ఇప్పటికీ వ్యవసాయ రంగమే 44 శాతం మందికి ఉపాధి కల్పిస్తోంది.

ఉపాధిలో ఆయా రంగాల వాటా (శాతాల్లో)

సంవత్సరం	వ్యవసాయం	పారిశ్రామికం	సేవారంగం
1991	51	15	22
2001	59	17	24
2011	49	24	27
2021	44	24	31
2022	43	26	31
2023	44	25	31

అధికంగా ఆదాయ అంతరాలు

దేశంలో ఆదాయ అంతరాలు భారీగా ఉన్నాయి. టాప్ 1లో ఉన్న సంపన్న కుటుంబాలు దేశ ఆదాయంలో 22.6శాతం వాటా కలిగి ఉన్నాయి. 1990 నుంచి సంపన్నుల వాటా 10శాతం పెరిగింది. అదే సమయంలో అట్టడుగున్న ఉన్న 50శాతం మంది ఆదాయాల వాటా పడిపోతోంది. సబ్సిడీలు, సంక్షేమ పథకాలతో వినియోగ అంతరం తగ్గినా ఆదాయాల వాటాలో పెరుగుదల లేదు.

ఆదాయాల వాటా ఇలా..

ఏడాది	టాప్ 1	అట్టడుగున్న ఉన్న 50% మంది
1952	11.8	20.7
1962	12.6	21.7
1972	11.0	23.0
1982	6.1	23.6
1992	10.0	21.9
2002	17.5	19.7
2012	21.3	15.1
2022	22.6	15.0

జనాభా పెరుగుతున్నా..

జనాభాలో మనం చైనాను దాటేశాం. 145 కోట్లకుపైగా జనాభాతో ప్రపంచంలోనే నంబర్ 1గా కొనసాగుతున్నాం. జనాభా వృద్ధిలో తగ్గుదల నమోదైనా సంఖ్యాపరంగా పెరుగుతూనే ఉన్నాం.

జనాభా ఇలా.. (కోట్లలో)

సంవత్సరం	భారత్	చైనా
1965	49	72
1975	61	92
1985	77	106
1995	96	122
2005	115	131
2015	133	140
2025	146	142

- భారత్‌లో జనాభా వృద్ధి రేటు 1965లో 2.3 ఉండగా అది.. 2025 నాటికి 0.90కి పడిపోయింది.
- చైనాలో జనాభా వృద్ధి రేటు 1965లో 2.4 ఉండగా అది 2025 నాటికి 0.1కి పడిపోయింది.

తలసరి ఆదాయం అంతంతే..

జీడీపీలో అనూహ్య వృద్ధి కొనసాగినా.. జనాభా పెరుగుదల కారణంగా తలసరి ఆదాయంలో వృద్ధి అంతంత మాత్రంగానే ఉంది. బంగ్లాదేశ్‌లాంటి అత్యంత వెనుకబడిన దేశం దాదాపుగా మనతో సమానంగా తలసరి ఆదాయాన్ని సాధించింది. ఇండోనేసియా, వియత్నాంలు మనకంటే చాలా ముందున్నాయి. ద.కొరియా తలసరి ఆదాయం మనకంటే 10 రెట్లకుపైగా ఉంది.



తలసరి ఆదాయం ఇలా.. (రూ.లలో)

సంవత్సరం	1964	1974	1984	1994	2004	2014	2024
భారత్	9,945	14,110	23,885	29,495	53,040	1,31,835	2,29,160
పాకిస్థాన్	8,670	11,220	27,795	34,000	65,535	1,07,610	1,26,140
బంగ్లాదేశ్	7,820	14,025	16,405	23,800	38,675	92,990	2,20,405
ఇండోనేసియా	4,505	17,000	44,115	76,415	95,710	2,92,485	4,18,625
శ్రీలంక	10,370	22,780	33,235	57,630	87,380	3,37,535	3,83,775
వియత్నాం	--	--	20,230	19,465	48,025	2,16,410	4,00,945
ద.కొరియా	10,455	47,855	2,05,105	8,82,725	14,02,160	24,86,420	28,15,285

- ఈనాడు ప్రత్యేక విభాగం

శ్రీవారి సేవలో మాజీ సీజేఐ జస్టిస్ ఎన్.వి.రమణ



శ్రీవారి ఆలయం ఎదుట మాజీ సీజేఐ జస్టిస్ ఎన్.వి.రమణ, శివమాల దంపతులు, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లలిత కన్నెగంటి, తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరి తదితరులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవేంకటేశ్వర స్వామివారిని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణ, శివమాల దంపతులు గురువారం దర్శించుకున్నారు. రాత్రి శ్రీవారి నైవేద్య విరామ సమయంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లలిత కన్నెగంటితో కలిసి శ్రీవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం అర్చకులు న్యాయమూర్తులకు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరి వారి వెంట ఉన్నారు.

పడకలు 52.. రోగులు 152!



కిటకిటలాడుతున్న పిల్లల వార్డు

పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు ప్రాంతీయ ఆసుపత్రి జ్వరపీడితులతో కిటకిటలాడుతోంది. ఆసుపత్రిలో సరిపడ పడకలు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం 52 మంచాలు ఉండగా గురువారం 152 మంది రోగులు వచ్చారు. దీంతో ఒక్కో బెడ్‌పై ముగ్గురు, నలుగురికి వైద్యం అందించారు. మహిళల వార్డులో 12 మంచాలపై 53 మందికి, పిల్లల వార్డులో 15 పడకలపై 47 మందికి వైద్యం చేశారు. కొందరికైతే కూర్చోబెట్టే సెలైన్లు ఎక్కించారు. ఒకేసారి పెద్దఎత్తున రోగులు రావడంతో పడకల సమస్య వచ్చింది.. అయినా అందరికీ వైద్యం అందించామని వైద్యాధికారిణి మీనాక్షి తెలిపారు.

- న్యూస్‌టుడే, సాలూరు

యంత్రాల తయారీలో ప్రపంచంతో పోటీ పడదాం

- అప్మెల్‌కు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచన



విజయవాడ సమీపంలోని అప్మెల్‌ను పరిశీలిస్తున్న భట్టి విక్రమార్క

ఈనాడు, హైదరాబాద్, కొండపల్లి, న్యూస్‌టుడే : సింగరేణి అనుబంధ సంస్థ ఆంధ్రప్రదేశ్ భారీ యంత్ర, ఇంజినీరింగ్ లిమిటెడ్ (ఏపీహెచ్‌ఎంఈఎల్-అప్మెల్) నూతన యంత్రాల తయారీలో ప్రపంచంతో పోటీ పడాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. ఈ సంస్థ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. గురువారం విజయవాడ సమీపంలో ఇబ్రహీంపట్నంలో ఉన్న ఈ సంస్థను సింగరేణి సీఎండీ బలరాంతో కలిసి భట్టి సందర్శించి పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన తొలుత కార్మికులతో, తదుపరి మీడియాతో మాట్లాడారు. "ప్రపంచవ్యాప్తంగా కొత్త పరిశ్రమలకు అవసరమైన విడిభాగాల తయారీ చేస్తున్న, పాత యంత్రాలకు మరమ్మతులు చేస్తున్న ఇంజినీరింగ్ సంస్థలకు అప్మెల్ చక్కటి వనరుగా మారాలి. ముఖ్యంగా సింగరేణి సంస్థకు అవసరమైన కొత్త యంత్రాలు తయారీ, పాత యంత్రాల మరమ్మతుల వరకే పరిమితం కాకుండా రాష్ట్రంలోనే కాదు... దేశానికి అవసరమైన ఆర్డర్లు తీసుకోవాలి. థర్మల్ విద్యుత్కేంద్రాలకు అవసరమైన యంత్రాల తయారీతోపాటు వాటికి మరమ్మతు చేసే బీహెచ్ఈఎల్ మాదిరిగా దీన్ని అభివృద్ధి చేయాలనే ఆలోచనలో తెలంగాణ ప్రభుత్వం ఉంది. అందులో భాగంగా సంస్థను మరింత ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు త్వరలో ఒక కన్సల్టెన్సీని నియమిస్తాం. వారిచ్చే నివేదిక ఆధారంగా ఎలా ముందుకెళ్లాలో నిర్ణయిస్తాం. ఇందులోని అధికారులు, కార్మికులు నిబద్ధత, తపనతో పనిచేస్తే ప్రపంచంతో పోటీపడగలరు. సిబ్బంది తప్పకుండా భద్రతా చర్యలు పాటించాలి" అని డిప్యూటీ సీఎం సూచించారు. ఈ సందర్భంగా భట్టిని మైలవరం ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ సత్కరించారు.



సీఎం చంద్రబాబుకు అంబేడ్కర్ చిత్రపటాన్ని అందిస్తున్న బాలకోటయ్య, కుటుంబసభ్యులు

ముఖ్యమంత్రిని కలిసిన బాలకోటయ్య

ఈనాడు, అమరావతి: అమరావతి బహుజన ఐకాస అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య..భార్య నీరజ, కుమారుడు గౌతమ్‌లతో కలిసి గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కలిశారు. రాజధాని అమరావతి ఉద్యమం, వైకాపా పాలనలో దాష్టీకాలకు వ్యతిరేకంగా దళితుల కోసం చేసిన పిడికెడు ఆత్మగౌరవ పోరాటంలోనూ ఆయన కీలక పాత్ర పోషించారు. బాలకోటయ్య సేవలను గుర్తించి కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సామాజిక సంక్షేమ మండలి ఛైర్మన్‌గా నియమించింది. ఈ సందర్భంగా సీఎంను కలిసిన ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బహుజన ఐకాస కార్యదర్శి వజ్రాల రవిశంకర్ వారితో ఉన్నారు.

ప్రధాన ఓడరేవుల న్యాయ నిర్ణయాధికార మండలి సభ్యుడిగా చిర్రావూరి



ఈనాడు, దిల్లీ: కేంద్ర పోర్టులు, నౌకలు, జలరవాణా శాఖ తొలిసారి ప్రధాన ఓడరేవుల న్యాయ నిర్ణయాధికార మండలి (మేజర్ పోర్ట్స్ అడ్జుడికేటరీ బోర్డు)ని ఏర్పాటుచేసింది. కేరళ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆశిష్ జితేంద్ర దేశాయ్ దీనికి ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారు. సభ్యులుగా మాజీ ఐఏఎస్ అధికారులు చిర్రావూరి విశ్వనాథ్, సంజీవ్ రంజన్‌లు నియమితులయ్యారు. విశ్వనాథ్ 1981 బ్యాచ్ ఏపీ కేడర్ ఐఏఎస్ అధికారి. ఈయన స్వస్థలం విజయనగరం. తితిదే జేఈఓగా, చిత్తూరు జిల్లా కలెక్టర్‌గా, నీటిపారుదల శాఖ కార్యదర్శిగా, దిల్లీలో ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా సేవలందించారు. తర్వాత కేంద్రంలోనూ వివిధ హోదాల్లో పనిచేశారు. ప్రధాన ఓడరేవుల న్యాయ నిర్ణయాధికార మండలి ముంబయి కేంద్రంగా పనిచేస్తుంది. ఓడరేవుల వివాదాలు, క్లెయిమ్‌లను పరిష్కరిస్తుంది.



అలాంటి విజయాలను ఎక్కువ ఆస్వాదిస్తాం!

అత్యుత్తమమైనవేవీ జీవితంలో సులభంగా దొరకవు. వాటిని చాలా కష్టపడి దక్కించుకోవాల్సి ఉంటుంది. ఎంతో చెమటోడ్చి, ఎన్నో అవాంతరాలను అధిగమించి, ఎట్టకేలకు గెలుపు తీరాలకు చేరుకోగలిగితే.. ఆ క్షణంలో జీవితపు అసలు మజా ఏంటో తెలుస్తుంది. అలాంటి విజయాలనే ఎక్కువగా ఆస్వాదించగలుగుతాం.

- అనుష్కాసోహం బభ్వాల్, వ్యాపారవేత్త

ఊరంతా.. రక్త సంబంధీకులే!



అనంతపురం జిల్లా గుత్తి మండలంలోని బ్రాహ్మణపల్లి పంచాయతీలోని పూలకుంటలో వాల్మీకి సామాజికవర్గానికి చెందిన రక్త సంబంధీకులే జీవనం సాగిస్తున్నారు. 70 ఏళ్ల క్రితం యాడికి మండలంలోని నగరూరుకు చెందిన ఓ కుటుంబం గుత్తి మండలానికి వలసొచ్చింది. గుత్తి నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొండ ప్రాంతంలో నివాసాన్ని ఏర్పరుచుకుంది. సమీపంలోనే నీటికుంట ఉండటంతో జీవనోపాధిలో భాగంగా పూలసాగుకు శ్రీకారం చుట్టారు. కాలక్రమంలో ఆ కుటుంబ సంతానం పెరిగింది. వారికి వివాహాలు కావడంతో ఇప్పటికి 100 కుటుంబాలతో 500 మందికి పైగా జనాభా ఉన్నారు. అప్పట్లో కుంటవద్ద పూలసాగు చేపట్టడంతో ఆ గ్రామానికి 'పూలకుంట' అనే పేరొచ్చింది. ఇప్పటికీ గ్రామ రెవెన్యూ దస్త్రాల్లో ఆ పేరే కొనసాగుతోంది.

- న్యూస్‌టుడే, గుత్తి గ్రామీణం

ప్రజాస్వామ్యం గురించి జగన్ మాట్లాడటమా?

- ఆయన ప్రభుత్వంలో నామినేషన్లనైనా వేయనిచ్చారా?
- శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు ధ్వజం



రాష్ట్ర శాసన వ్యవస్థ భవనంలో అత్యాధునిక ముద్రణా యంత్రాలను ప్రారంభిస్తున్న సభాపతి అయ్యన్నపాత్రుడు

ఈనాడు, అమరావతి: 'ప్రజాస్వామ్యం గురించి జగన్ మాట్లాడితే వినడానికి అసహ్యంగా ఉంది. ప్రజాస్వామ్య విలువలేంటో ఆయనకు తెలుసా?' అని శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు నిలదీశారు. 'జగన్ ప్రభుత్వంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్ని అరాచకాలు చేశారు? నామినేషన్లు వేయడానికి వచ్చినవారిని తరిమితరిమి కొట్టలేదా? పులివెందులలో ఇప్పుడు జడ్పీటీసీ ఎన్నికకు 11 నామినేషన్లు పడ్డాయి. ఇదీ ప్రజాస్వామ్యమంటే. రాష్ట్రచరిత్రలో పులివెందులలో ఇలా ఎప్పుడైనా నామినేషన్లు పడ్డాయా?' అని ప్రశ్నించారు. అసెంబ్లీ ముద్రణాలయంలో ఏర్పాటుచేసిన హైస్పీడ్ ముద్రణా యంత్రాలను గురువారం ఆయన అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్‌తో కలిసి ప్రారంభించారు. తర్వాత తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు.

చంద్రబాబుపై ఆ పిచ్చి మాటలేంటి?

'హరే కృష్ణా, హరే రామా అనుకో, వచ్చే ఎన్నికలకు నీవుండవు అని ముఖ్యమంత్రి చంద్రబాబు గురించి జగన్ అనడమేంటి? టీవీల్లో ఆ మాటలు చూసి బాధనిపించింది. ఓడిపోతే పిచ్చి పిచ్చిగా మాట్లాడతారా? మనం అధికారంలో ఉన్నప్పుడు మంచి పనులు చేయాలని ఆలోచించాలే తప్ప, ఇంకెవరూ అధికారంలోకి రాకూడదని ఆలోచించడం ప్రజాస్వామ్య పద్ధతి కాదు' అని వ్యాఖ్యానించారు.

శాసనసభ సమావేశాలకు హాజరుకండి

'వైకాపా సభ్యులరా మీకు విజ్ఞప్తి చేస్తున్నా వచ్చే నెలలో జరిగే అసెంబ్లీ సమావేశాలకు రండయ్యా. ప్రజలు వారి సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడమని మిమ్మల్ని ఎన్నుకున్నారు. అయినా మీరు సభకు రాకపోవడమనేది ప్రజాస్వామ్య పద్ధతా?' అని సభాపతి ప్రశ్నించారు.

ఆరోగ్యశ్రీలో పెట్ స్కాన్ సేవలకు కృషి

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు నోరి దత్తాత్రేయుడు



పెట్ స్కాన్ వద్ద నోరి దత్తాత్రేయుడు. చిత్రంలో వైద్యుల బృందం

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: ఆరోగ్యశ్రీ పథకంలో పెట్ సీటీ స్కాన్‌ను ఉచితంగా చేసే విధంగా కృషి చేస్తానని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు నోరి దత్తాత్రేయుడు తెలిపారు. గుంటూరు సర్వజనాసుపత్రిలోని నాట్కో క్యాన్సర్ విభాగంలో కొత్తగా అమర్చుతున్న పెట్ సీటీ స్కాన్‌ను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆసుపత్రిలో చేరిన రోగుల్లో ఎవరికైనా పెట్ సీటీ స్కాన్ అవసరమని వైద్యులు సూచిస్తే.. ఖరీదైన ఈ పరీక్షను ఉచితంగా చేసేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. ఇందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు త్వరగా వచ్చేవిధంగా చూస్తానని చెప్పారు. శరీరంలో క్యాన్సర్ కణం ఎక్కడున్నా గుర్తించే పెట్ సీటీ స్కాన్ పరికరాన్ని రూ.18 కోట్ల వ్యయంతో ప్రభుత్వం కొనుగోలు చేసి జీజీహెచ్‌కు అందజేసిందని, దాన్ని బిగించే పనులు తుదిదశకు వచ్చాయని వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రభుత్వాసుపత్రుల్లో ఈ పరికరాన్ని తొలిసారి గుంటూరులో అందుబాటులోకి తెచ్చారని వివరించారు.

ఈపీఎఫ్ వ్యక్తిగత వివరాల్లో... తప్పుల సవరణకు అవకాశం

మరింత సులభంగా జాయింట్ డిక్లరేషన్

ఈనాడు, హైదరాబాద్: ఈపీఎఫ్‌లో వ్యక్తిగత వివరాల్లో మార్పులు, ఆధార్ అనుసంధానానికి జాయింట్ డిక్లరేషన్‌ను ఈపీఎఫ్‌వో మరింత సులభం చేసింది. ఆధార్‌లోని పేరు, పుట్టిన తేదీ వివరాలు యూనివర్సల్ ఎకౌంట్ నంబరు (యూఏఎన్)లోని వివరాలతో సరిపోలితే యజమాని నేరుగా కేవైసీ ఆధారంగా అనుసంధానం చేయవచ్చని తెలిపింది. యూఏఎన్, ఆధార్ అనుసంధానానికి అదనంగా ఈపీఎఫ్‌వో ఆమోదం అవసరం లేదని పేర్కొంది. సవరణకు వచ్చే దరఖాస్తులను సంబంధిత ఏపీఎఫ్‌సీ అధికారి పరిశీలించి ఆమోదించాలని కేంద్ర కార్యాలయం సూచించింది. మరిన్ని వివరాలు www.eenadu.net లో..

నీట్ యూజీ తాత్కాలిక ప్రాధాన్య జాబితా విడుదల

విజయవాడ (ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం), న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య, దంత కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్/ బీడీఎస్ కోర్సుల ప్రవేశానికి విజయవాడలోని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం తాత్కాలిక ప్రాధాన్య జాబితాను గురువారం రాత్రి విడుదల చేసింది. ప్రవేశాలకు దాదాపు 14వేల పైచిలుకు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో విశ్వవిద్యాలయానికి రాగా, ఇందులో అర్హత లేని అభ్యర్థుల జాబితా, రుసుము చెల్లించి, దరఖాస్తులు సమర్పించనివారి జాబితా, దరఖాస్తుల పరిశీలన పెండింగ్‌లో ఉన్న అభ్యర్థుల జాబితాలను విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఈ తాత్కాలిక ప్రాధాన్యక్రమంలో అభ్యంతరాలుంటే అభ్యర్థి లాగిన్ ఐడీ ద్వారా తెలియజేయాలని రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి తెలిపారు.

పీజీ డెంటల్ (ఎండీఎస్) సీట్ల కేటాయింపు..

రాష్ట్రంలోని దంత వైద్య కళాశాలల్లో పీజీ డెంటల్ (ఎండీఎస్) కోర్సుల ప్రవేశానికి ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నిర్వహించిన మూడో విడత కౌన్సెలింగ్ (మాప్‌అప్) సీట్ల కేటాయింపులు వివరాలను గురువారం వెల్లడించారు. కన్వీనర్ కోటా కౌన్సెలింగ్‌కు 198 సీట్లను అందుబాటులో ఉంచగా 183 కేటాయించామని, యాజమాన్య కోటాలో 232 సీట్లను అందుబాటులో ఉంచగా 136 సీట్ల కేటాయించినట్లు విశ్వవిద్యాలయ వర్గాలు పేర్కొన్నాయి. సీట్లు పొందిన అభ్యర్థులు ఆయా కళాశాలల్లో ఈ నెల 20న మధ్యాహ్నం 3 గంటల్లోగా చేరాల్సి ఉంటుంది.

దంపతుల మధ్య 'వార్' గొడవ

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

చందలూరు(రుద్రవరం), న్యూస్‌టుడే: వద్దని చెబుతున్నా వినకుండా భర్త సినిమాకు వెళ్లడంతో వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నంద్యాల జిల్లాలో చోటుచేసుకుంది. రుద్రవరం మండలం చందలూరుకు చెందిన ఆంజనేయులు, ప్రసన్న(28) దంపతులు. వార్-2 సినిమాకు వెళతానని భర్త.. వెళ్లవద్దని భార్య బుధవారం రాత్రి గొడవపడ్డారు. గొడవ తర్వాత ఆంజనేయులు సినిమాకు వెళ్లిపోవడంతో మనస్తాపానికి గురైన ప్రసన్న ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. గురువారం తెల్లవారుజామున భర్త ఇంటికి రాగా ఈ దృశ్యాన్ని చూసి నిర్ఘాంతపోయారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రియుడితో కలిసి భర్త హత్య



రాజు, మౌనిక దంపతులు



ఉదయ్‌కుమార్



మల్లికార్జున్

పాతపట్నం, న్యూస్‌టుడే: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడన్న కారణంగా ఓ మహిళ తన ప్రియుడితో కలిసి భర్తను చంపేసిన ఉదంతమిది. శ్రీకాకుళం జిల్లా పాతపట్నంలో జరిగిన ఈ దారుణంపై టెక్కలి డీఎస్పీ డి.లక్ష్మణరావు కథనం.. పాతపట్నంలోని మొండిగొల్లవీధికి చెందిన నల్లి రాజు(27)కు ఎనిమిదేళ్ల కిందట మౌనికతో వివాహమైంది. వీరికి ఇద్దరు అబ్బాయిలు. ఇటీవల మౌనికకు స్థానికుడు గుండు ఉదయ్‌కుమార్‌తో వివాహేతర సంబంధం ఏర్పడింది. దీనిపై భర్తతోపాటు కుటుంబసభ్యులు ఆమెను పలుమార్లు మందలించారు. దీంతో మౌనిక ప్రియుడితో కలిసి భర్తను హతమార్చి, తర్వాత ఉదయ్‌కుమార్ తన భార్యకు విడాకులిచ్చి ఇద్దరూ కలిసి జీవించాలని నిశ్చయించుకున్నారు. రాజును రాత్రివేళ బయటకు రప్పించేందుకు ఉదయ్ అమ్మాయిలా వాట్సప్‌లో సందేశాలు పంపించాడు. రాజు తిరస్కరించడంతో, ఇంట్లోనే హత్యకు పథకం వేశారు.

వీధిదీపాలు ఆర్పేసి.. బైకులు మార్చేసి

మౌనిక ఈ నెల 5న తన భర్తకు నాలుగు నిద్రమాత్రలు కలిపిన అన్నం పెట్టింది. ఆరోజు అతని ప్రవర్తనను గమనించి, మర్నాడు ఆరు మాత్రలు కలిపిన భోజనం పెట్టింది. భర్త మత్తులోకి జారుకున్నాక అర్ధరాత్రి ప్రియుడికి ఫోన్ చేసింది. ఉదయ్‌కుమార్ స్థానికుడు చౌదరి మల్లికార్జున్‌తో కలిసి బైక్‌పై వస్తూ, ఆ దారిలో వీధిదీపాలు ఆపేశారు. ఇంట్లోకి వచ్చాక ముగ్గురూ కలిసి గాఢనిద్రలో ఉన్న రాజు ముఖానికి తలగడను నొక్కిపట్టి చంపేశారు. తర్వాత రాజు ద్విచక్ర వాహనాన్ని స్థానిక ఎస్సీ కాలనీ దిగువన పెట్టారు. ఉదయ్, మల్లికార్జున్‌లు తాము వచ్చిన బైక్‌పై రాజు మృతదేహాన్ని తీసుకొచ్చి, ముందుగా బండి పెట్టిన ప్రాంతంలో పడేసి, వెళ్లిపోయారు. తన భర్త రాత్రివేళ ఇంటినుంచి బయటకు వెళ్లి, తిరిగి రాలేదంటూ మౌనిక అతని కుటుంబసభ్యులకు ఫోన్‌లో సమాచారమిచ్చింది. 7న ఉదయం స్థానికులు మృతదేహాన్ని గుర్తించారు. అతని శరీరంపై గాయాలు లేకపోవడంతో పాటు మౌనిక ఫిర్యాదు మేరకు ఎస్సై బి.లావణ్య అనుమానాస్పద మృతిగా కేసు పెట్టారు. సీసీ కెమెరాలు పరిశీలించగా రాత్రిపూట ఉదయ్‌కుమార్, మల్లికార్జున్ సంచరించినట్లు గుర్తించారు. పోలీసుల ప్రశ్నలకు మౌనిక పొంతన లేని సమాధానాలిచ్చింది. దీంతో లోతుగా విచారించగా, తామే హత్యచేసినట్లు ముగ్గురూ అంగీకరించారని డీఎస్పీ తెలిపారు.



పొలంలో ట్రాక్టరు వెనుక తిరుగుతున్న కొంగలు

కొంగ బావా.. నీకు ఆకలెక్కువ!

చెట్టు మీద పక్షులుంటే.. కాస్త అదిలించినా, చప్పుడు చేసినా తుర్రుమని ఎగిరిపోతాయి. ఈ చిత్రంలో కనిపిస్తున్న కొంగలు మాత్రం.. ట్రాక్టర్ మోతను, బెదిరింపులను లెక్కచేయక ఆహార వేటలో మునిగిపోయాయి. సాలుసాలుకూ తిరుగుతూ కీటకాలను గుటుక్కుమనిపించాయి. పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలంలోని పదమాయవలస సమీపంలో రైతు ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతుండగా. . నాగలి సాలులో కనిపించే కీటకాలు, చిన్న పురుగులను తినేందుకు కొంగలు గుంపులుగా చేరాయి. వాటి కోసమే దున్నుతున్నట్లు ట్రాక్టర్‌నే అనుసరించాయి. పొలాల్లో ట్రాక్టర్ చప్పుడు వినపడితే చాలు ఎక్కడున్నా రివ్వున వచ్చేస్తున్నాయని రైతు చెప్పారు.

- న్యూస్‌టుడే, బలిజిపేట గ్రామీణం

బహుళ అంతస్తులను మించిన నిర్లక్ష్యం

- డీపీఎంఎస్ పోర్టల్‌లో సాంకేతిక సమస్యలతో బిల్డర్ల అవస్థలు
- నెలలు గడుస్తున్నా పరిశీలన దశ దాటని అనుమతుల దరఖాస్తులు
- ప్రభుత్వ 'స్పీడ్ ఆఫ్ బిజినెస్' ఆశయానికి తూట్లు

గుంటూరుకు చెందిన బిల్డర్ ఒకరు తాడేపల్లిలో 12 అంతస్తుల భవన నిర్మాణానికి అనుమతుల కోసం ఆరు నెలల క్రితం దరఖాస్తు చేసినా ఇప్పటికీ అనుమతులు రాలేదు. డెవలప్‌మెంట్ పర్మిషన్ మేనేజ్‌మెంట్ సిస్టం(డీపీఎంఎస్) పోర్టల్‌లో స్క్రూటినీ సందర్భంలో సాంకేతిక సమస్యలతో ప్రతిసారీ దరఖాస్తు తిరస్కరణకు గురవుతోంది. ఇప్పటికి ఐదుసార్లు ఆయన దరఖాస్తు చేసినా అదే పరిస్థితి. సమస్యను పరిష్కరించాల్సిన పోర్టల్ నిర్వాహకులు పట్టించుకోని కారణంగా అనుమతుల్లో జాప్యంతో అనేకమంది బిల్డర్లు అవస్థలు పడుతున్నారు.

ఈనాడు, అమరావతి: స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా భవన నిర్మాణ అనుమతులను సులభతరం చేస్తూ చట్టంలో ప్రభుత్వం ఒకవైపున పలు సవరణలు చేస్తోంటే.. డీపీఎంఎస్ పోర్టల్‌లో సాంకేతిక సమస్యలు బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు చేపట్టే బిల్డర్లకు చుక్కలు చూపిస్తున్నాయి. నిర్మాణ అనుమతుల కోసం నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. సాంకేతికంగా ఎదురవుతున్న సమస్యలు పరిష్కరించాల్సిన సంబంధిత ప్రైవేటు సంస్థ నిర్వాహకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. వారిపట్ల కఠినంగా వ్యవహరించాల్సిన అధికారులు ఇబ్బందులన్నీ త్వరలోనే తొలగిపోతాయని ఉచిత సలహాలు ఇస్తున్నారు.

★ భవన నిర్మాణాలకు అనుమతుల్లో డీపీఎంఎస్ పోర్టల్ ఎంతో కీలకం. లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్ల ద్వారా పోర్టల్‌లో అప్‌లోడ్ చేసిన దరఖాస్తులపై ఆన్‌లైన్‌లో స్క్రూటినీ జరుగుతుంది. దరఖాస్తులో వివరాలన్నీ సమగ్రంగా ఉంటే ఫీజు వివరాలు ఆన్‌లైన్‌లోనే జనరేట్ అవుతాయి. ఫీజు మొత్తం చెల్లించాక భవన నిర్మాణానికి అనుమతులిస్తూ ఎండార్స్‌మెంట్ దరఖాస్తుదారుకు వస్తుంది. మరో కాపీ సంబంధిత పుర, నగరపాలక సంస్థకు వెళుతుంది.

★ పోర్టల్‌లో సాంకేతిక సమస్యలతో ప్రత్యేకించి బహుళ అంతస్తుల భవన నిర్మాణాలకు అనుమతుల్లో తీవ్రమైన జాప్యం చోటుచేసుకుంటోంది. రాష్ట్ర వ్యాప్తంగా వందల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అన్ని దస్తావేజులు, పత్రాలతో దరఖాస్తులు అప్‌లోడ్ చేసినా ఏదో ఒక కొర్రీ (అభ్యంతరం) వస్తోంది. సరిదిద్ది మరోసారి దరఖాస్తు అప్‌లోడ్ చేస్తే ఇంకో అంశానికి సంబంధించి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఇలా బిల్డర్లు ఒక నిర్మాణానికి నాలుగైదుసార్లు దరఖాస్తు చేస్తున్నా సమస్యకు పరిష్కారం లభించడం లేదు. పోర్టల్‌లోని సాంకేతిక సమస్యలే ఈ పరిస్థితి కారణమని తెలిసినా ఎవరూ పట్టించుకోవడం లేదు.



వాళ్ల మాటల్ని పట్టించుకోకండి

మీ గురించి ఇతరులు ఎప్పుడూ ఏదో ఒకటి మాట్లాడుకుంటూనే ఉంటారు. మీరు మౌనంగా ఉంటే.. దాక్కుంటున్నాడంటారు. మాట్లాడితే.. అతి చేస్తున్నాడంటారు. పెద్ద లక్ష్యాలు విధించుకుంటే.. వాస్తవిక దృక్పథం లేదంటారు. జాగ్రత్తగా ఉంటే.. ధైర్యం లేదంటారు. గెలిస్తే.. అదృష్టవంతుడంటారు. ఓడితే.. చేతగానివాడంటారు. కాబట్టి- ఇతరుల అభిప్రాయాలను, మాటలను పట్టించుకోకండి. గొప్ప లక్ష్యం విధించుకొని, దాన్ని అందుకునేందుకు మీ శాయశక్తులా కృషిచేస్తూ వెళ్లండి.

– జయ్ శెట్టి, పాడ్‌కాస్టర్

నేటి నుంచి ఒంగోలు పుస్తక మహోత్సవం



పుస్తక మహోత్సవం గోడ ప్రతులను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఈనాడు, హైదరాబాద్: ప్రకాశం జిల్లా ఒంగోలు నగరంలోని పీవీఆర్ బాలుర పాఠశాల ఆవరణలో ఈనెల 15 నుంచి 24వ తేదీ వరకు 'ఒంగోలు మూడో పుస్తక మహోత్సవం' జరగనుందని నిర్వాహకులు తెలిపారు. విజయవాడ బుక్ ఫెస్ట్ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ ఆధ్వర్యంలో దీన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పీవీఆర్ గ్రౌండ్ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమెస్కో ప్రచురణల ప్రతినిధి విజయకుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం చిన్నారులు పుస్తక పఠనానికి దూరమై, సెల్ ఫోన్లు, టీవీలకు బానిసలుగా మారి సృజనాత్మకతను కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పుస్తకాలకు చేరువ చేసి, మంచి సమాజానికి పునాదివేయాలని అన్నారు. పిల్లల్లో పఠనాసక్తిని పెంచేందుకే ఈ పుస్తక మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్ జనరల్ మేనేజర్ మనోహర్ నాయుడు మాట్లాడుతూ పుస్తక మహోత్సవాన్ని మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తదితరులు ప్రారంభిస్తారని తెలిపారు. పుస్తక మహోత్సవం ప్రతి రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కొనసాగుతుందని చెప్పారు. ప్రజాశక్తి బుక్ హౌస్ జనరల్ మేనేజర్ లక్ష్మయ్య మాట్లాడుతూ ప్రతిరోజూ సాహితీ సభలు, పుస్తక పరిచయాలు, సైన్స్ ఆవిష్కరణలు, వివిధ రకాల పోటీలు ఉంటాయని తెలిపారు. జన విజ్ఞాన వేదిక నాయకులు సీఏ ప్రసాద్, సాహితీవేత్త పొన్నూరి శ్రీనివాసులు, జన విజ్ఞాన వేదిక నాయకుడు జయప్రకాష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి సివిల్స్ మెయిన్ పరీక్షలు

ఈనాడు, హైదరాబాద్: దేశవ్యాప్తంగా సివిల్ సర్వీసెస్-2025 ప్రధాన పరీక్షలు ఈ నెల 22 నుంచి ప్రారంభంకానున్నాయి. 22, 23, 24, 30, 31 తేదీల్లో పరీక్షలు జరుగుతాయి. తెలంగాణలో హైదరాబాద్, ఏపీలో విజయవాడలో మాత్రమే పరీక్ష కేంద్రాలున్నాయి. మొత్తం 979 పోస్టుల భర్తీ లక్ష్యంతో మే 25న నిర్వహించిన ప్రాథమిక పరీక్షకు దేశవ్యాప్తంగా సుమారు 5 లక్షల మంది హాజరయ్యారు. అందులో తెలుగు రాష్ట్రాల నుంచి 42,804 మంది ఉన్నారు.

కొత్త న్యాయ కళాశాలలకు అనుమతుల నిషేధం

ఈనాడు, అమరావతి: కొత్త న్యాయవిద్య కళాశాలలకు అనుమతులను మూడేళ్లపాటు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) ప్రకటించింది. తన అనుమతి లేకుండా కొత్త సెక్షన్లు, కోర్సులు, బ్యాచ్‌లను ఇవ్వొద్దని విశ్వవిద్యాలయాలు, ఆయా విద్యాసంస్థలకు సూచించింది. కానీ, హైకోర్టు ఆదేశాలతో ఇటీవల ఏపీ ఉన్నత విద్యామండలి కొత్త న్యాయవిద్య కళాశాలలకు అనుమతులిచ్చేందుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు దీనిపై స్పష్టతనివ్వాలని కోరుతూ బీసీఐకి ఉన్నత విద్యామండలి లేఖ రాసింది. కొత్త కళాశాలల ఏర్పాటుకు దాదాపు 50 దరఖాస్తులు వచ్చాయి.

EENADU Vol: 52, Issue: 6 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఈనాడు

విజయవాడ 15-8-2025 శుక్రవారం సిటీ సంపుటి 52 . సంచిక 6

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16+14 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



ఈనాడు బిజినెస్

అమర రాజా లాభం రూ.164.8 కోట్లు

దిల్లీ: అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికంలో రూ.164.8 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. కిందటేడాది ఇదే సమయంలోని రూ.249.12 కోట్లతో పోలిస్తే ఇది 33 శాతం తక్కువ. మొత్తం వ్యయాలు రూ.2,957.93 కోట్ల నుంచి రూ.3,190.66 కోట్లకు చేరుకోవడం ఇందుకు నేపథ్యం. కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం రూ.3,263.05 కోట్ల నుంచి రూ.3,401.08 కోట్లకు పెరగడం విశేషం. 'ప్రస్తుత అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, ప్రపంచ మందగమనం మధ్య కూడా ఆదాయం, లాభాల్లో త్రైమాసికం వారీగా రాణించగలిగాం. లెడ్ యాసిడ్ వ్యాపారం బలమైన ఫలితాలను అందించింది. మా గిగా ఫ్యాక్టరీల నిర్మాణం అంచనాలకు తగ్గట్టుగా కొనసాగుతోంద'ని కంపెనీ సీఎండీ జయదేవ్ గల్లా పేర్కొన్నారు.

కాగ్నిజెంట్‌లో వేతనాల పెంపు



దిల్లీ: ఐటీ సేవల కంపెనీ కాగ్నిజెంట్‌లో అర్హులైన 80 శాతం మంది ఉద్యోగులకు 2025 నవంబరు 1 నుంచి వేతనాల పెంపు ఉండనుంది. రెండో త్రైమాసిక ఫలితాల వెల్లడి సమయంలోనే ప్రతిభ ఆధారిత వేతన పెంపు గురించి కంపెనీ ప్రస్తావించింది. సీనియర్ అసోసియేట్‌తో పాటు ఆ స్థాయి వరకు ఉన్న ఉద్యోగులందరికీ ఈ వేతన పెంపు అమల్లోకి వస్తుందని కాగ్నిజెంట్ ప్రతినిధి వెల్లడించారు. వ్యక్తిగత ప్రతిభ, రేటింగ్, పని చేస్తున్న దేశం ఆధారంగా వేతన పెంపులో వ్యత్యాసం ఉంటుందని తెలిపారు. మన దేశంలో మంచి ప్రతిభ చూపిన వారికి 6-9 శాతం మధ్య వేతన పెంపు ఉండబోతుందని తెలుస్తోంది. ఈ ఏడాది ప్రారంభంలో ఎక్కువ శాతం మంది అసోసియేట్లకు మూడేళ్లలోనే అత్యధిక బోనస్‌లను కంపెనీ చెల్లించిన సంగతి తెలిసిందే.

యూపీఐలో 'కలెక్ట్ రిక్వెస్ట్' నిలిపివేత

అక్టోబరు 1 నుంచి ఈ సేవలు బంద్



దిల్లీ: యూపీఐలో అందుబాటులో ఉన్న పీ2పీ(పీర్-టు-పీర్) 'కలెక్ట్ రిక్వెస్ట్' సేవలను అక్టోబరు 1 నుంచి నిలిపివేయాలని బ్యాంకులు, పేమెంట్ యాప్‌లను నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ఆదేశించింది. ఈ మేరకు ఒక సర్క్యులర్ జారీ చేసింది. బ్యాంకులు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లు, యూపీఐ యాప్‌లు ఇందుకు అనుగుణంగా తమ వ్యవస్థల్లో మార్పులు చేసుకోవాలని సూచించింది. ఆర్థిక మోసాలను కట్టడి చేసేందుకు ఈ చర్య దోహదం చేస్తుందని తెలిపింది. ఎన్‌పీసీఐ ఆదేశాల నేపథ్యంలో ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం వంటి యాప్స్ కలెక్ట్ రిక్వెస్ట్ సేవలను అందించకూడదు. కలెక్ట్ లావాదేవీలను ఏ పరిస్థితుల్లోనూ ప్రాసెస్ చేయరాదు.

✦ సాధారణంగా నగదును స్వీకరించేందుకు యూపీఐ పిన్‌ను నమోదు చేయాల్సిన అవసరం ఉండదు. కానీ డబ్బులు పంపించమన్న నెపంతో కొందరు కేటుగాళ్లు యూపీఐ పిన్ ఎంటర్ చేయించి నగదు కొట్టేస్తున్న ఉదంతాలు ఎన్‌పీసీఐ దృష్టికి వచ్చాయి. దీంతో 2019లో లావాదేవీల గరిష్ఠ పరిమితిని రూ.2,000కు పరిమితం చేసింది. అయినప్పటికీ ఈ తరహా మోసాలు కొనసాగుతుండటంతో 'కలెక్ట్ రిక్వెస్ట్' సేవలను ఎన్‌పీసీఐ నిలిపివేయాలని నిర్ణయించింది.

అప్పుల కుప్ప అమెరికా

అమెరికా దేశ రుణభారం రికార్డు స్థాయిలో 37 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. కొవిడ్ మునుపటి అంచనాల కంటే ముందుగానే ఆ దేశ రుణాలు ఈ స్థాయికి చేరుకోవడం గమనార్హం. అమెరికా రుణాలు ఈ స్థాయికి 2030 తర్వాత చేరుకుంటాయని 2020 జనవరిలో కాంగ్రెస్ బడ్జెట్ కార్యాలయం అంచనా వేసింది. కానీ కొవిడ్-19 మహమ్మారితో అమెరికా ఆర్థిక వ్యవస్థ కుదేలైంది. ఆర్థిక వ్యవస్థను స్థిరపరిచేందుకు ట్రంప్, బైడెన్ ప్రభుత్వాలు భారీగా రుణాలు తీసుకోవడంతో అంచనాల కంటే వేగంగా అప్పులు పెరిగాయి.

- 37 లక్షల కోట్ల డాలర్లకు రుణభారం
- జీడీపీలో 122 శాతానికి సమానమిది
- ప్రతీ 3 నెలలకు లక్ష కోట్ల భారం



రుణాల ప్రభావం ఏంటంటే..?

ప్రపంచంలోనే అత్యధిక రుణభారం అమెరికా మీద ఉంది. ఇందులో పావు వంతు మిగతా దేశాలది. దీంతో ఆ దేశ దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వంపై ఆందోళనలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. అమెరికా ప్రభుత్వం తన రుణదాతలకు చెల్లించాల్సిన మొత్తం సొమ్ము ప్రస్తుతం 37 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. ఇది అమెరికా జీడీపీలో 122 శాతానికి సమానం. ప్రతి మూడు నెలలకు రుణభారం దాదాపు లక్షల కోట్ల డాలర్లు పెరుగుతోంది. 2020లో కొవిడ్ సమయంలో అత్యధికంగా రుణాలు, జీడీపీ నిష్పత్తి 133 శాతానికి చేరింది. ప్రపంచంలోనే ఈ నిష్పత్తి అధికంగా ఉన్న మొదటి 10 దేశాల్లో అమెరికా కూడా ఉంది.

- అమెరికా ఆర్థిక వ్యవస్థ పరిమాణం 30.3 లక్షల కోట్ల డాలర్లు కాగా.. ఆ దేశ రుణ భారం అంతకంటే ఎక్కువగా దాదాపు 37 లక్షల కోట్ల డాలర్లకు చేరింది.
- ప్రభుత్వం పన్ను వసూళ్ల కంటే వ్యయాలు అధికంగా చేస్తే లోటు ఏర్పడుతుంది. ఈ లోటును పూడ్చడానికి రుణాలపై ఆధారపడాల్సి వస్తుంది. ప్రస్తుతం ప్రభుత్వం రుణాల పరిమితిని అమెరికా కాంగ్రెస్ నిర్దేశిస్తోంది. పరిమితిని చేరుకున్న తర్వాత, కాంగ్రెస్ దాన్ని పెంచకపోతే ప్రభుత్వం రుణాలు తీసుకోవడం కుదరదు.

క్లింటన్ 'మిగులు'.. ట్రంప్ 'లోటు'

ట్రంప్ మొదటి హయాంలో, ముఖ్యంగా 2020 కొవిడ్ సమయంలో ప్రభుత్వ వ్యయాలు భారీగా పెరిగాయి. ఉద్యోగ కోతల కారణంగా పన్ను ఆదాయాలు గణనీయంగా తగ్గాయి. ఆ సంవత్సరంలో లోటు మొత్తం జీడీపీలో దాదాపు 15 శాతానికి చేరింది. అధ్యక్షుడిగా బిల్ క్లింటన్ ఉన్న సమయంలో దేశం మిగులు సాధించింది. ఆ సమయంలో డాట్ కామ్ విప్లవం వంటి అనుకూలమైన ఆర్థిక పరిస్థితులతో పన్నులు పెరిగి ఆదాయం అధికమైంది.

- మొత్తం 37 లక్షల కోట్ల డాలర్ల రుణాల్లో.. 27 లక్షల కోట్ల డాలర్లు దేశీయంగా తీసుకున్నవే. మొత్తం రుణాల్లో అమెరికా ప్రైవేట్ పెట్టుబడిదార్లు, సంస్థల వాటా 42 శాతంగా; ప్రభుత్వ సంస్థలు, ట్రస్టుల వాటా 20 శాతంగా; ఫెడరల్ రిజర్వ్ వాటా 13 శాతంగా ఉంది. విదేశీ పెట్టుబడిదార్ల వాటా 25 శాతంగా ఉంది.

అత్యధిక రుణాలు కొన్న దేశాలివే..

సురక్షితమైన, స్థిరమైన పెట్టుబడిని అందిస్తాయనే నమ్మకంతో అమెరికా రుణాలను పలు దేశాలు కొనుగోలు చేస్తాయి. విదేశీ మారకపు నిల్వలను నిర్వహించడంతో పాటు వడ్డీ ఆదాయాన్ని ఇవి అందిస్తాయి. విదేశీ పెట్టుబడిదారుల చేతిలో 9.05 లక్షల కోట్ల డాలర్ల రుణాలు ఉన్నాయి. అత్యధికంగా జపాన్ చేతిలో 1.10 లక్షల కోట్ల డాలర్లు ఉన్నాయి. భారత్ కూడా 239.9 బి. డాలర్ల రుణాలను కొనుగోలు చేయడం విశేషం.



18 ఏళ్ల తర్వాత భారత రుణ రేటింగ్ పెరిగింది

'బీబీబీ'కు సవరించిన ఎస్ అండ్ పీ



దిల్లీ: సుమారు 18 ఏళ్ల తర్వాత ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ మన దేశ సార్వభౌమ క్రెడిట్ రేటింగ్‌ను 'బీబీబీ'కు పెంచింది. బలమైన ఆర్థిక వృద్ధి ఉండటంతో భవిష్యత్ అంచనాను స్థిరత్వానికి సవరించింది. ప్రపంచంలో ఉత్తమ ప్రదర్శన కనబరుస్తున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ కూడా ఒకటని తెలిపింది. గత 5-6 ఏళ్ల నుంచి ప్రభుత్వ వ్యయాల నాణ్యత పెరిగిందని పేర్కొంది. అమెరికా టారిఫ్‌ల ప్రభావం భారత ఆర్థిక వ్యవస్థపై ఎక్కువగా ఉండకపోవచ్చని అభిప్రాయపడింది.

50% సుంకాలు విధించినా ఏం కాదు: అమెరికాకు మన దేశ ఎగుమతులపై 50 శాతం సుంకాలు విధించినా వృద్ధి నెమ్మదించక పోవచ్చని అంచనా వేసింది. వాణిజ్యంపైనే భారత్ తక్కువగా ఆధారపడిందని, సుమారు 60 శాతం ఆర్థిక వృద్ధి దేశీయ వినియోగం నుంచే లభిస్తుందని వివరించింది. రేటింగ్ సవరణపై ఆర్థిక మంత్రిత్వ శాఖ సంతోషం వ్యక్తం చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో మన దేశ ఆర్థిక వ్యవస్థ చురుగ్గా ముందుకు సాగుతోందని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేసింది.

అగ్నివీరులకు ఎస్‌బీఐ ప్రత్యేక వ్యక్తిగత రుణ పథకం

దిల్లీ: 'అగ్నిపథ్' కింద ఎంపికైన అగ్నివీరులకు 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) ప్రత్యేక వ్యక్తిగత రుణ పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు గురువారం వెల్లడించింది. ఈ రుణ పథకం కింద ఎస్‌బీఐలో వేతన ఖాతా ఉన్న అగ్నివీరులు రూ.4 లక్షల వరకు రుణాలు పొందే వీలుంది. ఈ రుణాలకు ఎలాంటి తనఖా అవసరం లేదు. అలాగే ఈ రుణాల మంజూరుకు ప్రాసెసింగ్ రుసుము కూడా తొలగించినట్లు బ్యాంక్ పేర్కొంది. అగ్నివీర్ పథకంలో వారి పదవీ కాలం ప్రకారం తిరిగి చెల్లింపులు చేసుకోవచ్చని బ్యాంక్ వివరించింది. అలాగే 2025 సెప్టెంబరు 30 వరకు రక్షణ సిబ్బందికి అతి తక్కువగా 10.5 శాతం వడ్డీ రేటుకే రుణాలు అందిస్తున్నట్లు ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి వెల్లడించారు.

బీఎస్‌ఎన్‌ఎల్‌కు మరో రూ.47,000 కోట్లు

మూలధన వ్యయాలకు కేంద్రం సాయం

దిల్లీ: దేశంలో బీఎస్‌ఎన్‌ఎల్ నెట్‌వర్క్‌ను మరింత విస్తరించేందుకు ప్రభుత్వం రూ.47,000 కోట్ల మూలధన వ్యయ ప్రణాళికతో సిద్ధంగా ఉంది. ఆమేరకు టెలికాం విభాగం(డాట్) 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. 4జీ మొబైల్ సేవలను లక్ష టవర్ల ఏర్పాటు నిమిత్తం గతేడాది బీఎస్‌ఎన్‌ఎల్ రూ.25,000 కోట్లు ఖర్చుపెట్టింది. తాజాగా రూ.47,000 కోట్ల ప్రణాళిక మా వద్ద ఉందని కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా పేర్కొన్నట్లు డాట్ తెలిపింది. బీఎస్‌ఎన్‌ఎల్ తన వినియోగదారుల సగటు ఆదాయం(ఆర్పు)ను పెంచుకోవాలని మంత్రి కోరారు. జూన్ త్రైమాసికంలో బీఎస్‌ఎన్‌ఎల్ ఆర్పు రూ.40-175(సర్కిల్‌ను బట్టి) మధ్య ఉండగా.. రిలయన్స్ జియో ఆర్పు రూ.208, ఎయిర్‌టెల్ ఆర్పు రూ.250 వద్ద ఉంది.

కోడి గుడ్డు

15న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయల్లో)

హైదరాబాద్	485
వరంగల్	487
విజయవాడ	520
గోదావరి	510
విశాఖపట్నం	515
చిత్తూరు	548

రెండేళ్ల కనిష్ఠానికి టోకు ద్రవ్యోల్బణం

దిల్లీ: ఆహార వస్తువులు, ఇంధన ధరలు తగ్గడంతో ఈ ఏడాది జులై టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం రెండేళ్ల కనిష్ఠమైన -0.58 శాతానికి చేరింది. గత ఏడాది జులైలో 2.10 శాతంగా ఉన్న టోకు ద్రవ్యోల్బణం.. ఈ ఏడాది జూన్‌లో -0.13 శాతంగా నమోదైంది. అయితే ప్రాతిపదిక ప్రభావం(బేస్ ఎఫెక్ట్) తగ్గడం, సీజన్ పరంగా ధరల పెరుగుదల ఉండటంతో ఆగస్టులో డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం మళ్లీ సానుకూలంగా నమోదుకావొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం..

✦ జులైలో ఆహార వస్తువుల విభాగంలో ప్రతి ద్రవ్యోల్బణ (మైనస్) స్థితి కొనసాగింది. జూన్‌లో ఆహార వస్తువుల ద్రవ్యోల్బణం -3.75% కాగా, జులైలో -6.29 శాతానికి చేరింది.



కూరగాయల ద్రవ్యోల్బణం -22.65% నుంచి -28.96 శాతానికి పెరిగింది.

✦ ఇంధనం, విద్యుత్ ద్రవ్యోల్బణ రేటు -2.43 శాతంగా నమోదైంది. జూన్‌లో ఇది -2.65 శాతంగా ఉంది.

✦ తయారీ ఉత్పత్తుల ద్రవ్యోల్బణం 1.97% నుంచి 2.05 శాతానికి పెరిగింది.

✦ ఆహార, ఇంధన ధరలు తగ్గడంతో జులైలో టోకు ద్రవ్యోల్బణం మరింత తగ్గిందని బార్‌క్లేస్ వెల్లడించింది.

ఆర్‌సీ ప్లాస్టో నుంచి ట్యాంక్ స్టాండ్

హైదరాబాద్: వాటర్ స్టోరేజీ సొల్యూషన్స్ అందించే ఆర్‌సీ ప్లాస్టో ట్యాంక్స్ అండ్ పైప్స్, మార్కెట్‌లోకి సరికొత్త ప్లాస్టో ట్యాంక్ స్టాండ్‌ను తీసుకొచ్చింది. వాటర్ ట్యాంకుల నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఈ స్టాండ్‌లను డిజైన్ చేసినట్లు కంపెనీ తెలిపింది. సంప్రదాయ సిమెంట్ స్టాండ్స్‌తో ట్యాంక్ పగిలిపోవడం, నీటి లీకేజీతో పాటు ట్యాంక్ చుట్టూ చెత్త పేరుకుపోతుందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని 100 శాతం ఫుడ్ గ్రేడ్ ప్లాస్టిక్‌తో ప్లాస్టో ట్యాంక్ స్టాండ్‌ను డిజైన్ చేసినట్లు తెలిపింది. ఏడు అంగుళాల ఎత్తుతో కూడిన ఈ స్టాండ్‌ను పదేళ్ల వారెంటీతో కంపెనీ అందిస్తోంది. దేశవ్యాప్తంగా ఉన్న ప్లాస్టో డీలర్ల వద్ద కొత్త ట్యాంక్ స్టాండ్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపింది.

వొడాఫోన్ ఐడియా నష్టాలు రూ.6,608 కోట్లు

దిల్లీ: జూన్ త్రైమాసికంలో వొడాఫోన్ ఐడియా ఏకీకృత నికర నష్టాలు మరింత పెరిగి రూ.6608 కోట్లకు చేరాయి. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో నష్టాలు రూ.6426.7 కోట్లుగా ఉన్నాయి. కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం మాత్రం రూ.10,508.3 కోట్ల నుంచి రూ.11,022.5 కోట్లకు చేరుకుంది. ఇందుకు వినియోగదారు సగటు ఆదాయం(ఆర్పు) రూ.154 నుంచి రూ.177కు చేరడం సహకరించింది. జూన్ 30, 2025 నాటికి బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు రూ.1944.5 కోట్లుగా ఉన్నాయి. మరోవైపు, ప్రస్తుత సీఈఓ అభిజిత్ కిశోర్‌ను సీఈఓగా నియమించడానికి కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది.

అశోక్ లేలాండ్ ఆదాయం రూ.11,708.54 కోట్లు

దిల్లీ: జూన్ 30, 2025తో ముగిసిన త్రైమాసికంలో అశోక్ లేలాండ్ ఏకీకృత నికర లాభం రూ.657.72 కోట్లుగా నమోదైంది. కిందటేడాది ఇదే సమయంలోని రూ.550.65 కోట్లతో పోలిస్తే ఇది 19.44 శాతం పెరిగినట్లయింది. కార్యకలాపాల ద్వారా వచ్చిన ఏకీకృత ఆదాయం మాత్రం రూ.10,696.8 కోట్ల నుంచి రూ.11,708.54 కోట్లకు చేరుకుంది.

8 నెలల గరిష్ఠానికి వాణిజ్య లోటు



దిల్లీ: వరుసగా రెండు నెలల పాటు క్షీణత చవిచూసిన దేశ ఎగుమతులు, జులైలో మళ్లీ పుంజుకున్నాయి. గత నెలలో ఎగుమతులు 7.29 శాతం వృద్ధితో 37.24 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. దిగుమతులు కూడా 8.6 శాతం పెరిగి 64.59 బిలియన్ డాలర్లకు చేరాయి. ఫలితంగా వాణిజ్య లోటు 8 నెలల గరిష్ఠమైన 27.35 బిలియన్ డాలర్లకు చేరింది. గతేడాది నవంబరులో 31.77 బి.డాలర్ల లోటు తర్వాత ఇదే అత్యధికం.

✦ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) ఏప్రిల్-జులై నెలల్లో ఎగుమతులు 149.2 బిలియన్ డాలర్లకు, దిగుమతులు 125.52 బి.డాలర్లకు పెరిగాయి. 2024-25 ఇదే సమయంతో పోలిస్తే ఎగుమతులు 3.07%, దిగుమతులు 5.36% చొప్పున పెరిగాయి. వాణిజ్య లోటు 94.81 బిలియన్ డాలర్లుగా నమోదైంది.

✦ అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులు ఉన్నప్పటికీ.. భారత వస్తు, సేవల ఎగుమతులు మెరుగైన వృద్ధి సాధించాయని వాణిజ్య కార్యదర్శి సునీల్ బర్త్వాల్ పేర్కొన్నారు. ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్, రత్నాభరణాలు, ఔషధ, రసాయనాల రంగాలు ఇందుకు దన్నుగా నిలిచాయని తెలిపారు. అంతర్జాతీయ ఎగుమతుల వృద్ధి కంటే మన ఎగుమతుల వృద్ధి అధికంగా ఉందన్నారు.

✦ జులైలో ఇంజినీరింగ్ (13.75% వృద్ధితో 10.42 బి.డాలర్లు), ఎలక్ట్రానిక్స్ (34% పెరిగి 3.76 బి.డాలర్లు), రత్నాభరణాలు (29% పెరిగి 2.4 బి.డాలర్లు), ఔషధ (14% అధికమై 2.7 బి.డాలర్లు), రసాయనాలు (7.19% వృద్ధితో 2.46 బి.డాలర్లు) రంగాలు రాణించాయి.

✦ పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు 25% తగ్గి 4.34 బి.డాలర్లకు చేరాయి. ముడిచమురు, పసిడి దిగుమతులు వరుసగా 7.46%, 13.83% పెరిగి 15.57 బి.డాలర్లు, 3.93 బి.డాలర్లుగా ఉన్నాయి.

✦ సేవలరంగ ఎగుమతులు 2024 జులైలో 30.60 బి.డా. కాగా, గత నెలలో 31.03 బి.డా. అయ్యాయని భావిస్తున్నారు. ఇదే సమయంలో సేవల రంగ దిగుమతులు కూడా 15.40 బి.డా.కు చేరొచ్చని అంచనా.

✦ జులైలో అమెరికాకు మన దేశం నుంచి ఎగుమతులు 19.94% పెరిగి 8.01 బి.డాలర్లకు చేరగా, దిగుమతులు 13.78% పెరిగి 4.55 బి.డాలర్లుగా నమోదయ్యాయి. చైనాకు ఎగుమతులు 27.39% పెరిగి 1.34 బి.డాలర్లకు, దిగుమతులు 19.97% పెరిగి 5.75 బి.డాలర్లకు చేరాయి.

జులైలో స్వల్పంగా తగ్గిన కార్ల విక్రయాలు: సియామ్

దిల్లీ: జులైలో కంపెనీల నుంచి డీలర్లకు సరఫరా అయిన ప్రయాణికుల వాహనాలు (పీవీలు- కార్లు, ఎస్‌యూవీలు/ఎంపీవీలు, వ్యాన్లు) స్వల్పంగా తగ్గి 3,40,772గా నమోదైనట్లు దేశీయ వాహన తయారీదార్ల సమాఖ్య (సియామ్) వెల్లడించింది. గతేడాది జులైలో ప్రయాణికుల వాహన విక్రయాలు 3,41,510గా ఉన్నాయి. ద్విచక్ర వాహన సరఫరాలు 14,41,694 నుంచి 9% పెరిగి 15,67,267కు చేరాయి. స్కూటర్ల విక్రయాలు 5,53,642 నుంచి 16 శాతం వృద్ధితో 6,43,169గా నమోదయ్యాయి. మోటార్‌సైకిల్ సరఫరాలు 5 శాతం పెరిగి 8,90,107కు చేరాయి. మోపెడ్‌లు 9 శాతం తగ్గి 33,991కు పరిమితమయ్యాయి. త్రిచక్రవాహన సరఫరాలు 59,073 నుంచి 17.5% వృద్ధితో 69,403గా ఉన్నాయి. 'జులైలో అన్ని వాహన విభాగాలు స్థిరంగా రాణించాయి. ప్రయాణికుల వాహన విభాగంలో సెంటిమెంట్ మాత్రం స్తబ్దుగానే కొనసాగింద'ని సియామ్ డైరెక్టర్ జనరల్ రాజేశ్ మేనన్ తెలిపారు.

బీఎమ్‌డబ్ల్యూ ధరల్లో 3% వరకు పెంపు

దిల్లీ: జర్మనీకి చెందిన విలాసవంత కార్ల తయారీ సంస్థ బీఎమ్‌డబ్ల్యూ తన అన్ని వాహనాల ధరలను సెప్టెంబరు 1 నుంచి పెంచనున్నట్లు తెలిపింది. విదేశీ మారక హెచ్చుతగ్గులు, అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలో మార్పుల వల్ల ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం విద్యుత్ వాహనాలు సహా విలాసవంత కార్లు, ఎస్‌యూవీలను రూ.46.9 లక్షల నుంచి రూ.2.6 కోట్ల శ్రేణిలో ఈ కంపెనీ భారత్‌లో విక్రయిస్తోంది.

ఇన్ఫోసిస్ చేతికి వర్సెంట్‌లో 75 శాతం వాటా!

ఆస్ట్రేలియా టెలికాం సంస్థ టెల్‌స్ట్రాకు అనుబంధ సంస్థ అయిన వర్సెంట్ గ్రూపులో 75 శాతం వాటాను కొనుగోలు చేసే యోచనలో ఇన్ఫోసిస్ ఉంది. ఇందుకోసం 233.25 మిలియన్ ఆస్ట్రేలియా డాలర్లను (సుమారు రూ.1,336 కోట్లు) వెచ్చించనుంది. ఆస్ట్రేలియాలోని సంస్థలకు కృత్రిమ మేధ ఆధారిత క్లౌడ్, డిజిటల్ సొల్యూషన్లను అందించేందుకు ఒక సంయుక్త సంస్థను ఏర్పాటు చేయాలన్న ఇన్ఫోసిస్, టెల్‌స్ట్రాల వ్యూహంలో భాగంగానే ఈ కొనుగోలు లావాదేవీ చోటుచేసుకోనుంది. ఈ కొనుగోలు అనంతరం వర్సెంట్‌లో యాజమాన్య నియంత్రణ ఇన్ఫీ చేతిలోకి రానుండగా.. టెల్‌స్ట్రా 25 శాతం వాటా కలిగి ఉంటుంది.

✦ 2025 ఏప్రిల్- జూన్ కాలానికి సింగపూర్‌లో జీఎస్‌టీ చెల్లింపులకు సంబంధించి 97,035 సింగపూర్ డాలర్ల (సుమారు రూ.66 లక్షలు) జరిమానాను ఇన్ఫోసిస్‌పై ఆ దేశ పన్నుల అధికారులు విధించారు.

నెమ్మదించిన బ్రిటన్ వృద్ధి



ఈ ఏడాది రెండో త్రైమాసికంలో బ్రిటన్ ఆర్థిక వ్యవస్థ నెమ్మదించింది. కంపెనీలపై అధిక పన్నులు, అంతర్జాతీయంగా టారిఫ్ అనిశ్చితులు ఇందుకు కారణమయ్యాయి. జనవరి- మార్చితో పోలిస్తే ఏప్రిల్- జూన్‌లో బ్రిటన్ వృద్ధి 0.3 శాతం మేర పెరిగింది. అలాగే విశ్లేషకులు అంచనా వేసిన 0.1 శాతం పెరుగుదల కంటే ఇది ఎక్కువ. ముఖ్యంగా జూన్‌లో ఆర్థిక వ్యవస్థ బలమైన పనితీరు కనబర్చడం వల్లే అంచనాలకు మించి వృద్ధి రేటు నమోదైందని చెబుతున్నారు.

రాణించిన ఐఓసీ

దిల్లీ: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐఓసీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) మొదటి త్రైమాసికంలో రూ.5,688.60 కోట్ల నికర లాభాన్ని నమోదుచేసింది. అంత క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాల లాభం రూ.2,643.18 కోట్లతో పోలిస్తే ఇది రెట్టింపునకు పైగా ఎక్కువ. అంతర్జాతీయంగా ముడి చమురు ధరల్లో తగ్గుదల ఉన్నప్పటికీ.. దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలను మార్పు చేయకపోవడం వల్ల లాభంలో వృద్ధి నమోదైంది. ఒక బ్యారెల్ ముడి చమురును శుద్ధి చేసి, పెట్రోల్, డీజిల్‌గా మార్చడం ద్వారా 2.15 డాలర్లను సంస్థ ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఇది 6.39 డాలర్లుగా ఉంది.

✦ **రష్యా చమురు దిగుమతులు ఆగలేదు:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ హెచ్చరికల తర్వాత రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ ఆపలేదని ఐఓసీ ఛైర్మన్ ఏఎస్ సాహ్నీ వెల్లడించారు. ఆర్థిక పరిస్థితుల ఆధారంగానే కొనుగోళ్లను కొనసాగిస్తున్నట్లు స్పష్టం చేశారు. అమెరికా టారిఫ్‌ల నేపథ్యంలో దిగుమతులను తగ్గించుకోవడం లేదా పెంచుకోవడంపై ఎటువంటి ఆదేశాలు రాలేదన్నారు.

ఏప్రిల్ - జూన్ త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2025-26	2024-25	2025-26	2024-25
పతంజలి ఫుడ్స్	180.35	262.72	8912.69	7202.35
కేఫ్ కాఫీడే	(11.00)	(17.00)	263.00	248.00
ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా	202.40	139.90	2163.50	1971.60
బీజీఆర్ ఎనర్జీ సిస్టమ్స్	(263.02)	(117.64)	112.86	182.83
ఐనాక్స్ విండ్	97.34	41.59	862.56	654.64
ఐనాక్స్ గ్రీన్ ఎనర్జీ	22.39	4.15	97.78	54.72
రీన్యూ	513.10	39.40	4118.20	2490.30
అనుపమ్ రసాయన్	48.45	12.21	490.73	260.26
హిందుస్థాన్ కాపర్	134.28	113.40	526.65	500.44
గల్ఫ్ ఆయిల్	96.66	88.02	996.36	885.07
గ్లెన్‌మార్క్ ఫార్మా	46.97	340.24	3264.44	3244.19

మదుపర్ల అప్రమత్తతతో స్తబ్దుగా



అమెరికా-రష్యా చర్చల నేపథ్యం

ఎఫ్‌ఐఐ అమ్మకాలు: రూ.1926.76 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు: రూ.3895.68 కోట్లు

సెన్సెక్స్ ▲ 58 — 80598
నిఫ్టీ ▲ 12 — 24631

సమీక్ష

అమెరికా, రష్యా చర్చలకు ముందు మదుపర్లు అప్రమత్తతతో వ్యవహరించడంతో మన స్టాక్ మార్కెట్ స్వల్ప లాభాలతో ముగిసింది. అమెరికా ద్రవ్యోల్బణం స్థిరంగా నమోదుకావడంతో ఐటీ, ఔషధ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారక విలువ 12 పైసలు తగ్గి 87.59 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడి చమురు 0.02% నష్టంతో 65.62 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బీఎస్‌ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ రూ.61,000 కోట్లు తగ్గి రూ.444.78 లక్షల కోట్లు (5.08 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది.

లాభాలతో ప్రారంభమై..: సెన్సెక్స్ ఉదయం క్రితం రోజు ముగింపు (80,539.91)తో పోలిస్తే 85.37 పాయింట్ల లాభంతో 80,625.28 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ఆ తర్వాత ఒడుదొడుకుల్లో కొనసాగుతూ... 80,489.86 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని, 80,751.18 వద్ద గరిష్ఠాన్ని నమోదుచేసుకుంది. చివరకు 57.75 పాయింట్ల లాభంతో 80,597.66 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 11.95 పాయింట్లు పెరిగి 24,631.30 పాయింట్ల వద్ద స్థిరపడింది.

సగం అటు.. సగం ఇటు..: సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో సగం కంపెనీల షేర్లు లాభాలతో ముగియగా.. మిగతావి నష్టపోయాయి. అత్యధికంగా ఎటెర్నల్ 1.94% లాభపడింది. అలాగే ఇన్ఫోసిస్ 1.50%, ఏషియన్ పెయింట్స్ 1.16%, మారుతీ 0.70%, టైటాన్ 0.65%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.61% పెరిగాయి. మరోవైపు టాటా స్టీల్ 3.03%, టెక్ మహీంద్రా 1.53%, అదానీ పోర్ట్స్ 1.45%, బీఈఎల్ 1.02%, అల్ట్రాటెక్ 0.80% నష్టపోయాయి.

✦ **ఆల్‌టైమ్ ప్లాస్టిక్స్ లిమిటెడ్** షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లాభారంభం చేశాయి. బీఎస్‌ఈలో ఇష్యూ ధరతో (రూ.275) పోలిస్తే 14.29 శాతం అధికంగా రూ.314.30 వద్ద షేర్లు నమోదయ్యాయి. ఆ తర్వాత 17.14% పెరిగి రూ.322.15 వద్ద గరిష్ఠాన్ని చేరింది. లాభాల స్వీకరణ చోటుచేసుకోవడంతో చివరకు 3 శాతమే లాభంతో రూ.283.25 వద్ద ముగిసింది.

✦ **జేఎస్‌డబ్ల్యూ సిమెంట్** షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదైన రోజే నష్టాలతో ముగిశాయి. ఇష్యూ ధర అయిన రూ.147తో పోలిస్తే 4% అధికంగా రూ.153 వద్ద షేరు నమోదైంది. ఆ తర్వాత ఆ లాభాలన్నింటినీ కోల్పోయి.. చివరకు 0.65 శాతం నష్టంతో రూ.146.05 వద్ద ముగిసింది.

✦ ఏప్రిల్- జూన్ త్రైమాసికానికి నికర లాభంలో 65 శాతం వృద్ధిని ప్రకటించడంతో **ముత్తూట్ ఫైనాన్స్** షేరు బీఎస్‌ఈలో 11.48% పెరిగి 52 వారాల గరిష్ఠమైన రూ.2,799 వద్ద ముగిసింది.

✦ **రెగాల్ రిసోర్సెస్** తొలి పబ్లిక్ ఆఫర్‌కు చివరి రోజు ముగిసే నాటికి 159.88 రెట్ల స్పందన లభించింది. చిన్న మదుపర్ల విభాగంలో కేవలం 57.75 రెట్ల స్పందనే లభించడం గమనార్హం.

✦ **మంగళ్ ఎలక్ట్రికల్ ఇండస్ట్రీస్** తొలి పబ్లిక్ ఆఫర్‌కు ఇష్యూ ధరగా రూ.533- 561ను నిర్ణయించారు. ఈ ఇష్యూ ఆగస్టు 20న ప్రారంభమై 22న ముగియనుంది.

✦ క్రిప్టో కరెన్సీలపై దేశవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించేందుకు రూ.10 కోట్ల పెట్టుబడిని క్రిప్టో ఎక్స్ఛేంజీ ప్లాట్‌ఫామ్ అయిన **కాయిన్ డీసీఎక్స్** వెచ్చిస్తోంది.

✦ వచ్చే వారంలో భారత్‌తో పాటు అమెరికా, కెనడాల్లో 'గూగుల్ ఫ్లైట్స్'లో ఏఐ ఆధారిత కొత్త సెర్చ్ టూల్ 'ఫ్లైట్ డీల్స్'ను తీసుకొస్తున్నట్లు **గూగుల్** వెల్లడించింది. ఫ్లెక్సిబుల్ ట్రావెలర్ల కోసం రూపొందించిన ఈ టూల్ వారి తదుపరి ప్రయాణంలో డబ్బును పొదుపు చేసుకొనేందుకు దోహదం చేస్తుందని తెలిపింది.

✦ **మహీంద్రా అండ్ మహీంద్రా** (ఎం అండ్ ఎం) గురువారం బీఈ 6 బ్యాట్‌మన్ ఎడిషన్‌ను విడుదల చేసింది. ఇది విద్యుత్ స్పోర్ట్స్ వినియోగ వాహనం (ఎస్‌యూవీ). ఈ లిమిటెడ్ ఎడిషన్‌లో కేవలం 300 కార్లను మాత్రమే విక్రయించనుంది. వీటి ధర రూ.27.79 లక్షలు. ఈ నెల 23 నుంచి బుకింగ్స్ చేసుకోవచ్చు. డెలివరీలు సెప్టెంబరు 20 నుంచి ప్రారంభించనుంది.

నేడు మార్కెట్లకు సెలవు

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నేడు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ (బీఎస్‌ఈ), నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్‌ఎస్‌ఈ) లు పనిచేయవు. కమొడిటీ, కరెన్సీ మార్కెట్లకు కూడా సెలవే.


ఈనాడు

విజయవాడ 15-8-2025 శుక్రవారం సిటీ సంపుటి 52 . సంచిక 6
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 16+14 www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



ఈనాడు సినిమా

‘కింగ్’ వచ్చేది 2027లో?


షారుక్ ఖాన్


‘పఠాన్’, ‘జవాన్’, ‘డంకీ’ చిత్రాలతో వరుసగా హ్యాట్రిక్ విజయాలందుకొని మరోసారి తనెంటో నిరూపించుకున్నారు బాలీవుడ్ అగ్రకథానాయకుడు షారుక్ ఖాన్. ఈ సినిమాలు విడుదలై రెండేళ్లు కావొస్తున్నా.. ఇంకా తన రాబోయే ప్రాజెక్టుల గురించి ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. షారుక్, తన కుమార్తె సుహానా ఖాన్‌తో కలిసి ‘కింగ్’ సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. సుజోయ్ ఘోశ్ దర్శకుడు. వచ్చే ఏడాదిలో రానున్న ఈ సినిమాను కొన్ని కారణాలతో 2027లో విడుదల చేయాలనుకుంటున్నట్లు చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.

వారెవ్వా..! తలైవా

స్టైల్... పంచ్...
- ఇవి రజనీ కోసమే పుట్టాయేమో!

క్రేజ్... ఇమేజ్...
- ఈ మాటలకు అచ్చమైన నిర్వచనంగా రజనీ కటౌట్‌ని చూపిస్తే చాలేమో!

హీరోయిజం... మేనరిజం...
వీటి పేటెంట్ రజనీ సొంతమా అనే సందేహం కలగకమానదు.
‘నాన్నా...’ అంటూ ఆయన ఓ చిన్న డైలాగ్ చెబితే చాలు థియేటర్‌కి పూనకాలు వచ్చే స్థాయి. రెండు వైపులా అలా చొక్కా విసిరినా... కళ్ల జోడు సవరించుకున్నా అదొక స్టైలే.



● రజనీకాంత్ సినీ ప్రయాణానికి 50 వసంతాలు

ఓ చిన్న సైగతో సన్నివేశాన్ని తనవైపు తిప్పుకుంటాడు. పేజీలకొద్దీ మాటలకి కూడా సాధ్యం కాని భావోద్వేగాల్ని తన శైలి ఓ చిన్న నవ్వుతోనే పండిస్తాడు. అదే రజనీ ప్రత్యేకం. ఆ పేరే ఓ మంత్రం. ఆయన తెరపై కనిపిస్తే చాలు... అదొక ఇంద్రజాలం! ప్రేక్షకుడు కళ్లు తిప్పుకోలేని సమ్మోహనం! అందుకే తరాలు మారుతున్నా తరగని అభిమానం ఆయన సొంతమవుతూ ఉంది. జయాపజయాలతో సంబంధం లేకుండా దూసుకెళుతున్న అసలు సిసలు సూపర్‌స్టార్ రజనీకాంత్. ఆయన వెండితెర వెలుగులకు నేటితో యాభయ్యేళ్లు. రజనీ తొలి చిత్రం ‘అపూర్వ రాగంగళ్’ 1975 ఆగస్టు 15న ప్రేక్షకుల ముందుకొచ్చింది. వయసు పెరుగుతోంది. కొత్తతరం దూసుకొస్తోంది. కానీ రజనీకాంత్ క్రేజ్ మాత్రం అంతకంతకూ పెరుగుతోంది. ఇప్పటికీ ఆయన దారి రహదారే. రజనీ సినిమా వస్తోందంటే చాలు మిగతా సినిమాలు పక్కకు తప్పుకుంటూ ఉంటాయి. ఆయనతో సినిమాలు చేసేందుకు యువ దర్శకులు ఇప్పటికీ పోటీ పడుతుంటారు. రజనీ సినిమా విడుదల అంటే ఆ హంగామా తెలుగు, తమిళంకే పరిమితం కాదు, జపాన్‌లోనూ ఆయన కటౌట్‌కి పుష్పాభిషేకాలు జరుగుతుంటాయి. అదీ రజనీ క్రేజ్ అంటే. ఆసియా ఖండంలోనే అత్యధిక పారితోషికం తీసుకొంటున్న కథానాయకుల్లో రజనీ ఒకరు. రజనీ తమిళంలోనే కాకుండా... తెలుగు, కన్నడ, హిందీ భాషల్లోనూ సినిమాలు చేశారు. తన తొలి హిందీ చిత్రం అమితాబ్ బచ్చన్‌తో కలిసి చేశారు. విలనిజం అంటే ఆయనకి ఎంతో ఇష్టం. తొలి నాళ్లల్లో విలన్‌గానూ తెరపై ప్రభావం చూపించారు. ‘దళపతి’, ‘బాషా’, ‘ముత్తు’, ‘అరుణాచలం’, ‘నరసింహా’, ‘చంద్రముఖి’, ‘శివాజీ’, ‘రోబో’, ‘జైలర్’... ఇలా ఎన్నెన్నో విజయాలు. ఆయన సినిమాలు తమిళంలో తెరకెక్కినా సరే... తెలుగులోనూ అనువాదాలుగా ప్రేక్షకుల ముందుకొచ్చి సంచలన విజయాల్ని సొంతం చేసుకున్నాయి. గురువారం తన 171వ చిత్రం ‘కూలీ’తో ప్రేక్షకుల ముందుకొచ్చారు రజనీకాంత్. ఆయనకు ప్రేక్షకుల్లో ఉన్న తిరుగులేని క్రేజ్‌కి మరోసారి అద్దం పట్టిందీ చిత్రం. కథానాయకుడిగా యాభయ్యేళ్ల మైలురాయిని చేరుకున్న సందర్భంగా భాషతో సంబంధం లేకుండా సినీ ప్రముఖులు ఆయనకి అభినందనలు తెలిపారు. ‘యాభయ్యేళ్లు... ఒక సింహాసనం, ఒక వ్యక్తి...’ అంటూ సంగీత దర్శకుడు అనిరుధ్.. రజనీ గురించి ట్వీట్ చేశారు. ఆ మాట అక్షరాలా నిజం. రజనీ క్రేజ్‌కి ఆకాశమే హద్దు... కానీ ఆయన వ్యక్తిగా ఒకటో అంతస్తుపై ఉన్నట్టు కూడా అనిపించరు. ఆయన కాళ్లు ఎప్పుడూ నేలపైనే ఉంటాయి. ఓ తెల్లటి చొక్కా ధరించి చెరగని చిరునవ్వుతో ఎయిర్‌పోర్ట్‌లోనో లేదంటే వీధుల్లోనో నిరాడంబరంగా కెమెరాల కంట పడుతుంటారు. అప్పుడప్పుడూ సన్నిహితులతో కలిసి సరదాగా స్కూటర్‌పై చక్కర్లు కొడుతూ కనిపిస్తారు, బడ్డీ కొట్టు దగ్గర నిలుచుని రుచులు ఆస్వాదిస్తారు. కుదిరినప్పుడు హిమాలయాలకీ వెళ్లొస్తుంటారు. అసాధారణ స్థాయికి ఎదిగినా.. అత్యంత సాధారణంగా మెలిగే ఆయన వ్యక్తిత్వమే ఆయన్ని మరింత మందికి చేరువ చేస్తోంది.

అదే రజనీ మ్యాజిక్

ఆయన ఆరడుగుల ఆజానుబాహుడేమీ కాదు... తెరపై ఆరు పలకల దేహంతోనూ కనిపించరు. కానీ ఆయన తెరపై కనిపిస్తే చూసేందుకు ప్రేక్షకులు ఎగబడుతుంటారు. కారణం... ఆయన నటనలోని మ్యాజిక్. ఆయన స్టైల్‌లో ఉన్న ప్రత్యేకత. రజనీ అసలు పేరు శివాజీరావు గైక్వాడ్. 1950 డిసెంబరు 12వ తేదీన కర్ణాటకలో జన్మించారు. పాఠశాల రోజుల్లోనే నాటకాలపై మక్కువ పెంచుకున్నారు. చదువు పూర్తయ్యాక, బస్సు కండక్టర్‌గా ఆయన జీవితాన్ని మొదలు పెట్టారు. ఇప్పుడు థియేటర్‌లో ఆయన స్టైల్‌ని చూసి ముచ్చట పడుతున్నాం కానీ...అప్పట్లో బస్‌లో ఆయన స్టైల్‌గా టికెట్లు కొడుతుంటే ప్రయాణికులు కళ్లప్పగించి చూసేవారట. ఆయన మాట తీరు... నడక కూడా ప్రత్యేకంగా ఉండేవట. అది చూసే రజనీ స్నేహితుడు సినిమా రంగంలోకి వెళ్లేలా ప్రోత్సహించారు. అదే ఆయన జీవితాన్ని మలుపు తిప్పింది. చెన్నైలో అడుగుపెట్టిన రజనీకి సినిమా కష్టాలు చాలానే ఎదురయ్యాయి. అన్నిటినీ తట్టుకుని ప్రయత్నాలు చేశారు. కె.బాలచందర్ దృష్టిలో పడి తొలి అవకాశాన్ని అందుకున్నారు. తమిళ పరిశ్రమలోని హీరోల శైలి, వాళ్ల ప్రత్యేకతకి భిన్నంగా ప్రయాణం చేయాలనుకున్నారు. అందుకు తగ్గట్టే ఆయన ప్రయాణం సాగింది. అదే ఆయన్ని తిరుగులేని స్టార్‌ని చేసింది. తొలి సినిమాలోనే తన స్నేహితుడు కమల్‌హాసన్‌తో కలిసి నటించారు. ఆ తర్వాత రజనీ, కమల్ ఇద్దరూ తమిళ చిత్రసీమకి రెండు కళ్లలా మారిపోయారు. ఒకరు నటనకి కేరాఫ్ అయితే... మరొకరు స్టైల్‌కి పర్యాయపదంలా నిలిచారు.


బృందా ప్రసాద్, అనిల్ రావిపూడి, అల్లు అరవింద్, వేదిక, మంచు లక్ష్మి, ప్రశాంత్ వర్మ

చిత్ర పరిశ్రమలో ఎవరి కుంపటి వారిదే

- అల్లు అరవింద్


“తెలుగు సినిమాలకు ఇటీవల ఏడు జాతీయ పురస్కారాలొచ్చాయి. ఈ సందర్భంగా చిత్ర పరిశ్రమ ఓ పండుగలా వేడుకను ఏర్పాటు చేసి విజేతల్ని సత్కరించాల్సింది. కానీ, ఇక్కడ ఎవరి కుంపటి వారిదే. సైమా ఆ బాధ్యతను తీసుకుని ఈ వేదికపై సత్కరించడం అభినందనీయం” అన్నారు నిర్మాత అల్లు అరవింద్. సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్ (సైమా 2025) వేడుక సెప్టెంబరు 5, 6 తేదీల్లో దుబాయ్‌లో నిర్వహించనున్న నేపథ్యంలో గురువారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అల్లు అరవింద్, అనిల్ రావిపూడి, ప్రశాంత్ వర్మ, సాహు గారపాటి, సాయి రాజేశ్, సందీప్ కిషన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ పురస్కారాలు గెలుచుకున్న తెలుగు సినీ తారల్ని సైమా ప్రత్యేకంగా సత్కరించింది. అనంతరం దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ.. “నా తొలి చిత్రం ‘పటాస్’కు గానూ చిరంజీవి నుంచి సైమా అవార్డు తీసుకోవడాన్ని నేనెప్పటికీ మర్చిపోలేను. గతేడాది ‘భగవంత్ కేసరి’కి సైమా అందుకుంటున్నప్పుడు.. విష్ణు ‘మీరు జాతీయ అవార్డు కూడా అందుకుంటారు. ఈ చిత్రానికి ఆ సామర్థ్యం ఉంది’ అన్నారు. ఆయన ఊహ నిజమైంది. విభిన్న చిత్రసీమలకు చెందిన ప్రతిభను ఓ వేదికపై తీసుకొచ్చేదే సైమా” అన్నారు. “జాతీయ అవార్డు గెలుచుకున్నాక మేము అందుకున్న తొలి సత్కారం సైమాదే” అన్నారు దర్శకుడు ప్రశాంత్ వర్మ. “13వ ఏడాది సైమా అవార్డుల వేడుకను నిర్వహించుకోనుండటం చాలా ఆనందంగా ఉంది. సంక్రాంతి, దీపావళిలా మా సినిమా తారలకు సైమా అనేది ఒక పెద్ద పండగ” అన్నారు నటి మంచు లక్ష్మి. ఈ కార్యక్రమంలో సైమా అవార్డ్స్ నిర్వాహకులు విష్ణువర్ధన్ ఇందూరి, బృందా ప్రసాద్‌తో పాటు నటీనటులు వేదిక, ఫరియా అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

సస్పెన్స్ థ్రిల్లర్.. ‘మిస్టీరియస్’


రోహిత్, రియా

రోహిత్ సాహ్ని, రియా కపూర్, మేఘనా రాయ్ ప్రధాన పాత్రల్లో మహి కోమటిరెడ్డి తెరకెక్కించిన చిత్రం ‘మిస్టీరియస్’. జై వల్లందాస్ నిర్మించారు. ఈ సినిమా త్వరలో థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్రంలోని “అడుగు అడుగునా” అంటూ సాగే గీతాన్ని హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసు వారి నిబద్ధతను అద్భుతంగా రాసి, ఆ పాటకు స్వరాలందించినందుకు సంగీత దర్శకుడు ఎంఎల్ రాజాని అభినందించారు. ఈ సస్పెన్స్ థ్రిల్లర్‌ను ఓ కొత్త ఒరవడిలో రూపొందించిన దర్శక నిర్మాతలకు శుభాకాంక్షలు తెలిపారు.

ఇప్పటికీ మనం బానిసలమేనా?



పరేశ్ రావల్

పరేశ్ రావల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం ‘ది తాజ్ స్టోరీ’. తుషార్ అమ్రిశ్ గోయెల్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను పంచుకుంటూ.. ఇన్‌స్టా వేదికగా విడుదల తేదీని ప్రకటించింది చిత్రబృందం. “స్వాతంత్ర్యం వచ్చిన 79 సంవత్సరాల తర్వాత కూడా.. మనం ఇప్పటికీ ఉగ్రవాదానికి బానిసలుగా బతుకుతున్నామా? అక్టోబరు 31 ‘ది తాజ్ స్టోరీ’ రాబోతుంది సిద్ధంగా ఉండండి” అనే వ్యాఖ్యల్ని జోడించింది. తాజ్‌మహల్‌ను నిర్మించింది నిజంగా షాజహానా? లేకపోతే దాని వెనుక ఏదైనా తెలియని రహస్యం ఉందా? అనే కథాంశం ఆధారంగా దీన్ని తెరకెక్కిస్తున్నారు. జాకీర్ హుస్సేన్, అమృత ఖాన్విల్కర్, స్నేహ వాఘ్, నమిత్ దాస్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. సీఏ సురేశ్ ఝా నిర్మిస్తున్నారు.

ప్రస్తుత పార్లమెంటు శీతాకాల సమావేశాలు వాడీవేడిగా సాగుతున్నాయి. ఎన్నికల సంఘంపై తీవ్ర ఆరోపణలు చేస్తున్న విపక్షాలపై సభలో విరుచుకుపడుతూ ప్రధాని మోదీ ఒక్కసారిగా ‘షోలే’ డైలాగులు అందుకొన్నారు. ఈ చిత్రంలో వీరూ(ధర్మేంద్ర)కు పెళ్లిసంబంధం మాట్లాడేందుకు మౌసీ (పెద్దమ్మ పాత్రధారి లీలామిశ్ర) వద్దకు వెళ్లే జయ్ (అమితాబ్ బచ్చన్) మిత్రుడి దుర్గుణాల గురించి చెప్పకనే చెప్పే మాటలు థియేటర్లలో నవ్వులు పూయించాయి. ఆ మాటలను గుర్తుచేస్తూ ప్రధాని పదే పదే ‘అరే మౌసీ..’ అంటూ విపక్షాల బలహీనతలను ఒకటొకటిగా ఎండగట్టారు. టెక్ మహీంద్ర మాజీ సీఈవో చందర్ ప్రకాశ్ గుర్నానీ భారతీయ ఐటీ కంపెనీల్లో లేఆఫ్‌లు, తలల లెక్కింపుల గురించి తాజాగా మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ‘కితనే ఆద్మీ థే’ (వాళ్లు ఎంతమంది ఉన్నారు) అంటూ ‘షోలే’ చిత్ర విలన్ గబ్బర్‌సింగ్ తన అనుచరుడు కాలియాను అడిగే పాపులర్ డైలాగును ఆయన సరదాగా గుర్తు చేశారు.

వన్నె తగ్గని షోలే

● భారతీయ సినీ చరిత్రలో అజరామర చిత్రం ● విడుదలై నేటికి యాభై ఏళ్లు



దేశ ప్రధాని, టెక్ దిగ్గజాలే కాదు.. భారతదేశ సినీచరిత్రలో మరపురాని చిత్రంగా నిలిచిపోయిన ‘షోలే’ (1975) యాభై ఏళ్లు పూర్తిచేసుకొంటున్న నేపథ్యంలో గత కొన్నిరోజులుగా దేశ విదేశాల్లో, మీడియాలో అంతటా ఇదే చర్చ. దేశ విభజన సమయంలో గోపాల్‌దాస్ పరమానంద్ సిప్పీ (జి.పి.సిప్పీ) కుటుంబం సర్వం వదులుకొని కరాచీ నుంచి బొంబాయికి చేరింది. బతుకుతెరువు కోసం ఎన్నో వ్యాపారాలు చేసిన ఈయన చివరకు సినీ నిర్మాణంలోకి ప్రవేశించారు. బి-గ్రేడ్ నిర్మాతగా చిన్నాచితక చిత్రాలు తీస్తున్న దశలో కుమారుడు రమేశ్ సిప్పీ దర్శకత్వంలో ధర్మేంద్ర, సంజీవ్‌కుమార్, హేమామాలినిలతో తీసిన ‘సీతా ఔర్ గీతా’ (1972) ఘనవిజయం సాధించి పేరు, డబ్బు తెచ్చింది. ఓ భారీ చిత్రం తీయాలన్న సంకల్పంతో ‘షోలే’ నిర్మాణం తలపెట్టి దర్శకత్వ బాధ్యతలను రమేశ్ సిప్పీకే అప్పగించారు. జంట రచయితలు సలీం - జావేద్ అల్లిన ఈ చిత్రకథలో ఒక్కో పాత్రను పెంచుకొంటూ వెళ్లడంతో మల్టీస్టారర్‌గా మారి ఏకంగా రూ.3 కోట్లు ఖర్చుపెట్టాల్సి వచ్చింది. ఆ రోజుల్లో ఇది చాలా పెద్ద బడ్జెట్. మొదట హీరోలిద్దరినీ యువ సైనికులుగా చూపాలని అనుకొన్నారు. అలాగైతే కొన్ని పరిమితులు ఏర్పడి చేతులు కట్టేస్తాయని ఆ పాత్రలను దొంగలుగా మార్చారు. జావేద్ అక్తర్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో షోలే గురించి మాట్లాడుతూ.. “ఈ సినిమాను ఎప్పటికీ తిరగరాయను. ఇందులో నేటికీ ఒక్క సన్నివేశం కూడా మార్చాల్సిన అవసరం లేదు” అన్నారు. బెంగళూరు సమీపంలో కొండరాళ్లతో నిండిన రామ్‌నగర గ్రామాన్ని ఈ సినిమా కోసం రామ్‌గఢ్‌గా మార్చారు. బందిపోటు దొంగ అయిన విలన్‌గా 33 ఏళ్ల అమ్జాద్‌ఖాన్‌ను పరిచయం చేశారు. హిట్లర్‌ను గుర్తుచేసే జైలర్ అస్రానీ పాత్ర పొట్ట చెక్కలయ్యేలా నవ్విస్తుంది. గబ్బర్‌సింగ్‌పై పగతో రగిలిపోయే రిటైర్డ్ పోలీసు అధికారి ఠాకుర్‌గా సంజీవ్‌కుమార్, గుర్రపుబండి నడిపే వాగుడుకాయ బసంతిగా హేమామాలిని ఆకట్టుకొంటారు. రైలు సన్నివేశంతో మొదలై, రైలుతోనే ముగిసే షోలే స్క్రీన్‌ప్లే పరంగానూ గొప్పగా ఉంటుంది.

చప్పగా మొదలై.. వసూళ్ల చరిత్ర


బలోనీ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ‘షోలే’ ప్రదర్శన

హాలీవుడ్ స్థాయిలో ఉత్తమ సాంకేతిక విలువలతో పకడ్బందీగా తీసిన ఈ చిత్రం చాలా గొప్ప చిత్రాల్లా మొదట్లో ఫెయిల్యూర్ టాక్‌ను తెచ్చుకొంది. రానురాను థియేటర్లు కిక్కిరిసి నెలల తరబడి హౌస్‌ఫుల్‌గా నడిచాయి. ముంబయి మరాఠా మందిర్ థియేటరులో వరుసగా అయిదేళ్లు ప్రదర్శించారు. కలకత్తాలోని రాక్సీ సినిమా థియేటరులో 192 వారాలు నడిచిన అశోక్‌కుమార్ చిత్రం ‘కిస్మత్’ (1943) రికార్డును ‘షోలే’ అధిగమించింది. వంద థియేటర్లలో రజతోత్సవం చేసుకోవడం మరో రికార్డు. ఆర్డీ బర్మన్ పాటలు, సినిమా డైలాగుల క్యాసెట్లు, ఎల్పీ రికార్డులు హాట్‌కేకుల్లా అమ్ముడుపోయాయి. ఒక్క భారత్‌లోనే కాదు.. ఇరాన్, సోవియట్ యూనియన్ లాంటి పలు దేశాల్లో ఈ సినిమా కనకవర్షం కురిపించింది. 2014లో ఇరాన్‌లో రీరిలీజ్ కాగా, టెహ్రాన్‌లో అయిదు నెలలకు పైగా నడిచింది. ఏ నోట విన్నా ‘యే దోస్తీ హమ్ నహీ తోడేంగే’ లాంటి ఈ సినిమా పాటలు, ‘అరె ఓ సాంబా’ అనే గబ్బర్‌సింగ్ డైలాగులే.

విలువలకు.. వినోదానికి పెద్దపీట

దొంగతనాలు వదిలేసి కొంత సాగుభూమి కొనుక్కొని రామ్‌గఢ్ గ్రామంలోనే ఉండిపోదామన్న మిత్రుడు జయ్‌తో ‘మనం వ్యవసాయం చేయగలమా!’ అని సందేహం వ్యక్తం చేస్తాడు వీరూ. అప్పుడు “మనం ఎంచుకొన్న చెడుమార్గం తుపాకీ కాల్చడం నేర్పింది.. మంచి అరక దున్నడం నేర్పుతుంది” అని జయ్ బదులిస్తాడు. విలువలకు, వినోదానికి పెద్దపీట వేసింది కాబట్టే, ‘షోలే’ ఈరోజుకూ అజరామర చిత్రంగా నిలిచిపోయింది. ఈ సినిమా చిత్రీకరణ దశలోనే అమితాబ్, జయభాదురిల వివాహం జరిగింది. ఆ తర్వాత ధర్మేంద్ర, హేమామాలినిల జంట కూడా పెళ్లాడటం విశేషం. ఈ ఏడాది జూన్ నెలలో ఇటలీలోని బలోనీ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఆరుబయట హాలులో కిక్కిరిసిన ప్రేక్షకుల మధ్య ‘షోలే’ను ప్రదర్శించారు. సెప్టెంబరు 6న ‘టొరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్’ (టిఫ్)లోనూ ఈ చిత్ర ప్రదర్శన జరగనుంది.

– జి.ఎస్.జమీర్ హుసేన్

దేశ రక్షణ కోసం యుద్ధభూమిలో అడుగుపెట్టడానికి, ప్రాణాలను లెక్కచేయకుండా ప్రత్యర్థులతో వీరోచితంగా పోరాడడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు మన దేశ సైనికులు. భారత్‌పై చేయి వేస్తే.. ఆ దెబ్బ ఎలా ఉంటుందో ఇటీవలే ‘ఆపరేషన్ సిందూర్’తో పాకిస్థాన్‌కు రుచి చూపించారు. ఇలా మన జవాన్ల వీరత్వాన్ని చూపిస్తూ, దేశభక్తిని తట్టిలేపుతూ ఇప్పటికే ఎన్నో చిత్రాలు రూపొంది ప్రేక్షకుల్ని అలరించాయి. అయినప్పటికీ ఈ సినిమాల పట్ల సినీప్రేమికులు ఆసక్తి చూపిస్తూనే ఉంటారు. దేశ గొప్పతనాన్ని, ఔన్నత్యాన్ని చాటిచెబుతూ తెరకెక్కిన ఈ సినిమాల్లో హిట్ శాతం కూడా ఎక్కువే. ఇప్పుడిలా స్వాతంత్ర్య సమరయోధుల గాథలతో మదిలో స్ఫూర్తి నింపడానికి సిద్ధమయ్యారు కొందరు బాలీవుడ్ సినీతారలు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం వేళ త్వరలో రాబోతున్న ఆ దేశభక్తి చిత్రాల విశేషాలివీ.

తెరపై దేశభక్తి.. మదిలో స్ఫూర్తిశక్తి


సల్మాన్ ఖాన్

సముద్ర మట్టానికి 15వేల అడుగుల ఎత్తు.. శత్రువులపై ఒక్క బుల్లెట్‌ను కూడా పేల్చని మన సైనికులు.. అయినా విజయం భారతదేశానిదే. ఇదంతా 2020లో తూర్పు లద్దాఖ్ సరిహద్దుల్లోని గాల్వాన్ లోయలో భారత్, చైనా జవాన్ల మధ్య జరిగిన సంఘర్షణల గురించే. ఇప్పుడీ కథ ఆధారంగా ‘బాటిల్ ఆఫ్ గాల్వాన్’ సినిమా రాబోతుంది. హిందీ యాక్షన్ హీరో సల్మాన్ ఖాన్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. “కొన్ని యుద్ధాల్లో గెలవడానికి బుల్లెట్లు అవసరం లేదు” అంటూ ఇటీవలే ఈ సినిమాను ప్రకటించారు. అపూర్వ లఖియా తెరకెక్కిస్తున్నారు. ఇందులో ఆర్మీ అధికారిగా కనిపించనున్నారు సల్మాన్. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది.

దేశం కోసం ఆల్ఫా అమ్మాయిలు


అలియా భట్


ప్రతీక్ గాంధీ

‘ఆల్ఫా’తో దేశం కోసం పోరాటం చేసే గూఢచారిగా ప్రేక్షకుల్ని అలరించడానికి చకచకా సిద్ధమవుతోంది అలియా భట్. ఆమె, శార్వరీ వాఘ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రమిది. శివ్ రావేల్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ యశ్‌రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న మొదటి మహిళా గూఢచారి చిత్రమిది. ఇందులో దేశం కోసం పోరాటం చేసే గూఢచారులుగా కనిపించనున్నారు అలియా, శార్వరీ. ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్‌లో హృతిక్ రోషన్.. అలియా గురువు పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోన్న ఈ సినిమాలో అనిల్ కపూర్, బాబీ దేవోల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. దీంతో పాటు భారత స్వాతంత్ర్య పోరాట కాలం నాటి పరిస్థితులను కళ్లకు కట్టినట్లు చూపించడానికి ‘గాంధీ’ సిరీస్ రాబోతుంది. హన్సల్ మెహతా దర్శకత్వం వహించిన ఈ వెబ్‌సిరీస్‌లో ప్రతీక్ గాంధీ టైటిల్ పాత్ర పోషించారు. మహాత్ముడికి గొప్ప నివాళిగా దీన్ని తీర్చిదిద్దుతున్నారు. ఇటీవలే ఈ సిరీస్‌ను ఈ ఏడాది టొరంటో చిత్రోత్సవాల్లో ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు.

చైనాపై దాడికి మేము సిద్ధం


ఫర్హాన్ అక్తర్

హిందీ దర్శకుడు, నటుడు ఫర్హాన్ అక్తర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం ‘120 బహాదుర్’. 1962లో జరిగిన ఇండో-చైనా యుద్ధంలో ముఖ్యమైనదిగా గుర్తింపు పొందిన రెజాంగ్ లా యుద్ధానికి నాయకత్వం వహించిన మేజర్ షైతాన్ సింగ్ భాటి జీవితం ఆధారంగా దీన్ని రూపొందిస్తున్నారు. రజనీశ్ ఘాయ్ దర్శకత్వం వహిస్తున్నారు. రాశీ ఖన్నా కీలక పాత్ర పోషిస్తుంది. మన సైనికుల ధైర్యం, వీరత్వం చూపించే ఈ కథలో మేజర్ షైతాన్ సింగ్ పాత్రలో కనిపించనున్నారు ఫర్హాన్. “మేము చైనీయులపై దాడి చేయడానికి సిద్ధమవుతున్నాం” అంటూ ఇటీవలే విడుదలైన ఈ సినిమా టీజర్ సినీప్రియుల్ని అలరించింది. నవంబరు 21న విడుదల కానుందీ చిత్రం.


దేశ సైనికుల త్యాగాలే కథాంశం


సన్నీ దేవోల్

“27 ఏళ్ల క్రితం ఇచ్చిన మాటను నెరవేర్చడానికి తిరిగి వస్తున్నాను” అంటూ మరోసారి మేజర్ కుల్దీప్ సింగ్‌గా యుద్ధభూమిలోకి అడుగుపెట్టడానికి సన్నద్ధమవుతున్నాడు బాలీవుడ్ సీనియర్ కథానాయకుడు సన్నీ దేవోల్. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం ‘బార్డర్ 2’. అనురాగ్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. 1971లో జరిగిన భారత్-పాకిస్థాన్ యుద్ధ నేపథ్యంలో దీన్ని తీర్చిదిద్దుతున్నారు. వరుణ్ ధావన్, దిల్జీత్ దోసాంజ్, అహన్ శెట్టి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. 1977లో హిట్ వార్ డ్రామాగా నిలిచిన ‘బార్డర్’కు సీక్వెల్ ఇది. మన దేశ సైనికుల త్యాగాలను ప్రధాన కథాంశంగా చూపించనున్న ఈ సినిమా వచ్చే ఏడాది జనవరి 23న విడుదల కానుంది. భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్, జేపీ దత్తా, నిధి దత్తా నిర్మిస్తున్నారు.



ఈనాడు




విజయవాడ 15-8-2025 శుక్రవారం సిటీ సంపుటి 52 . సంచిక 6

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16+14 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

మహిళలకు ఆర్థిక భరోసా



నేడు స్త్రీశక్తి పథకం ఆరంభం

కూటమి ప్రభుత్వ మరో కీలక సూపర్‌సిక్స్ హామీ అమలు

- కుటుంబానికి నెలకు రూ.4వేలు మిగులు
- మహిళలకు ఉచితబస్సు ప్రయాణంతో కలిగే ప్రయోజనమిది
- ఐదు రకాల బస్సుల్లో రాష్ట్రంలో ఎక్కడికైనా రాకపోకలు
- నిత్యం 26.95 లక్షల మంది వినియోగించుకుంటారని అంచనా
- ప్రభుత్వంపై ఏటా రూ.1,942 కోట్ల భారం

ఈనాడు – అమరావతి

విద్య, వైద్యం, ఉద్యోగం, వ్యాపారం, ఆలయ దర్శనం.. ఇలా ఏ పనిమీద అయినా మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఇకపై ఉచితంగా ప్రయాణించవచ్చు. ఐదు రకాల బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించే స్త్రీశక్తి పథకం శుక్రవారం నుంచి అమలుకానుంది. కూటమి ప్రభుత్వం ఎన్నికల వేళ ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీల్లో.. మహిళలకు ఉచిత బస్ ప్రయాణ హామీ ఒకటి. దీనిని ప్రభుత్వం ఏదో మొక్కుబడిగా జిల్లాల పరిధిలో అమలు చేయకుండా.. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణించేలా అవకాశం కల్పిస్తోంది. వాస్తవానికి జిల్లా స్థాయిలో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తామని ఎన్నికల సమయంలో ప్రకటించారు. దీంతో కొత్త జిల్లా లేదా ఉమ్మడి జిల్లా పరిధిలో వర్తించేలా ఈ పథకం ఉంటుందని అంతా భావించారు. కానీ సీఎం చంద్రబాబు మాత్రం రాష్ట్రంలో ఎక్కడికైనా ప్రయాణించేలా పథకం అమలుకు నిర్ణయం తీసుకున్నారు.

కుటుంబాలకు ఆసరా..

స్త్రీశక్తి పథకం.. పేద, దిగువ మధ్యతరగతి, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థికంగా మేలు చేయనుంది. నిత్యం ఉద్యోగాలు, ఉపాధి నిమిత్తం బస్సుల్లో రాకపోకలు జరిపే మహిళలకు ఇకపై ఛార్జీల భారం ఉండదు. ఇంటర్మీడియట్ నుంచి ఉన్నత విద్య వరకు చదువుకునే విద్యార్థినులు బస్ పాస్‌లు కొనాల్సిన అవసరం లేకుండానే బస్సుల్లో రాకపోకలు సాగించవచ్చు. మహిళా రైతులు, వ్యాపారులు, కూలీ చేసుకునేవారు.. తమ గ్రామాల నుంచి దగ్గరలోని పట్టణాలకు ఉచితంగా ప్రయాణించడం ద్వారా ఛార్జీల రూపంలో ఖర్చు మిగులుతుంది. తిరుపతి, అన్నవరం, శ్రీశైలం, సింహాచలం, ద్వారకాతిరుమల, శ్రీకాళహస్తి, విజయవాడ కనకదుర్గమ్మ వంటి ప్రధాన ఆలయాలకు వెళ్లాలనుకున్నా బస్‌ఛార్జీల భారం కారణంగా వెళ్లలేనివారే అధికం. ఇకపై ఇటువంటి కుటుంబాల్లో మహిళలకు బస్‌ఛార్జీల భారం లేకపోవడంతో.. తక్కువ ఖర్చుతో ఆలయాలకు వెళ్లి వచ్చేందుకు అవకాశం ఏర్పడుతోంది. మొత్తంగా స్త్రీశక్తి పథకం ద్వారా ఒక్కో కుటుంబానికి నెలకు సగటున రూ.4 వేల వరకు ఆర్థికంగా మేలు (మిగతా 2లో)

మహిళలతో కలిసి ప్రయాణించనున్న సీఎం

సీఎం చంద్రబాబు శుక్రవారం స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 2-3 గంటల మధ్య గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లి గుహల వద్ద ఉచిత బస్సు ప్రయాణాన్ని సీఎం ప్రారంభించి, అక్కడి నుంచి మహిళలతో కలిసి బస్సులో ప్రయాణిస్తారు. చంద్రబాబుతో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా ప్రయాణిస్తారు. ఆ బస్సు కనకదుర్గమ్మ వారధి మీదుగా విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్టాండ్‌కు చేరుకుంటుంది. అనంతరం సిటీబస్ టెర్మినల్ వద్ద జరిగే కార్యక్రమంలో వారు పాల్గొంటారు.



చిత్రంలో వరుసగా కనిపిస్తున్న ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ బస్సుల్లో నేటి నుంచి మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఉచితంగా ప్రయాణించేందుకు కూటమి ప్రభుత్వం అన్నీ సిద్ధం చేసింది. కండక్టర్‌కు తగిన గుర్తింపుకార్డు చూపిస్తే చాలు.. ఉచితంగా ప్రయాణించొచ్చు.






చెన్నుపాటి భద్రయ్య | గోపు రాజీవ్‌కుమార్ | ఆకే రవికృష్ణ | డా.ఎం.వరప్రసాద్

ఎస్పీ భద్రయ్య, డీఎస్పీ రాజీవ్‌లకు రాష్ట్రపతి పోలీసు సేవా పతకాలు

- విజిలెన్స్ డీఎస్పీ రాజీవ్‌కుమార్‌కు కూడా..
- ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణకు పోలీసు సేవా పతకం
- రాష్ట్రానికి చెందిన 22 మంది పోలీసులకు గుర్తింపు

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి భద్రతా విభాగంలో బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఎస్పీ చెన్నుపాటి భద్రయ్య, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ గోపు రాజీవ్‌కుమార్‌లకు రాష్ట్రపతి పోలీసు సేవా పతకం (ప్రెసిడెంట్ పోలీసు మెడల్) వరించింది. మొత్తం 20 మంది పోలీసు అధికారులు, సిబ్బందికి పోలీసు పతకాలు (మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీసెస్) లభించాయి. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రానికి చెందిన 22 మంది పోలీసు అధికారులకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ గురువారం ఈ పతకాలు ప్రకటించింది.

మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్‌కు..

■ ఆకే రవికృష్ణ - ఐజీ, ఈగల్ ■ వల్లూరి శ్రీనివాసరావు, డీఎస్పీ, ■ తోట వీర వెంకట ప్రతాప్‌కుమార్, డీఎస్పీ, ■ దెందుకూరి కోదండశ్రీ రామరాజు - అసిస్టెంట్ కమాండెంట్, ■ మామిడి గోవిందరావు - ఇన్‌స్పెక్టర్ (డీజీపీ పేషీ), (మిగతా 2లో)

ఆదాయ వృద్ధిపై మరింత దృష్టి పెట్టండి

- ఆదాయార్జన శాఖల సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- భూముల విలువ పెంచుకుంటూ పోవడం సరికాదని సూచన
- మద్యం రాబడికన్నా.. ప్రజల ఆరోగ్యం ముఖ్యమన్న సీఎం



ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో భూముల విలువలు పెంచుకుంటూ పోవడం సరికాదని.. మార్కెట్ విలువలు, ఆస్తుల సమాచారం కోసం డేటా ఎనలిటిక్స్ వినియోగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. మద్యం ఆదాయం కన్నా.. ప్రజల ఆరోగ్యమే ముఖ్యమని స్పష్టం చేశారు. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో గురువారం ఆయన ఆదాయార్జన శాఖల ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'రాష్ట్ర ఆదాయార్జనలో మరింత శ్రద్ధ వహించాలి. కేంద్ర నిధులు, పన్నుల వాటాపై దృష్టి సారించాలి. ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్ ఇన్ఫర్మేషన్ సిస్టంతో పక్కాగా పర్యవేక్షించాలి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కిందటి ఏడాది కన్నా 8% అధిక వృద్ధి ఉంటుందని చెబుతున్నారు. సొంత ఆదాయ వనరులు పెంచుకునేందుకు మరింత కృషిచేయాలి' అని ఆదేశించారు. రాష్ట్రంలో చేపట్టే కాంట్రాక్టు పనులకు వినియోగించే వాహనాలకు పెట్రోలు, డీజిల్‌లను ఇక్కడే కొనుగోలు చేసేలా చూడాలి. ఇతర రాష్ట్రాల్లో కాంట్రాక్టు సంస్థలు పెట్రోలియం ఉత్పత్తులు కొనుగోలు చేయడం వల్ల రాష్ట్రం ఆదాయాన్ని కోల్పోతోంది. దీన్ని అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలి' అని సూచించారు.

ప్రభుత్వ ఆదాయంలో లీకేజీలను అరికట్టాలి

'పన్ను ఎగవేతలను గుర్తించేందుకు, ప్రభుత్వ ఆదాయంలో లీకేజీలను అరికట్టేందుకు ఏఐ వినియోగించాలి. భూముల వివరాలను, వాటి సరిహద్దులను జీఐఎస్‌తో మ్యాపింగ్ చేయాలి. వాహనాల పన్ను చెల్లింపులు సక్రమంగా ఉండేలా (మిగతా 2లో)



ఇంటర్‌తోపాటు నాలుగేళ్లు చదివితేనే స్థానికత

సీజే నేతృత్వంలోని హైకోర్టు ధర్మాసనం కీలక తీర్పు

ఈనాడు, అమరావతి: ఏపీలోని ఒక స్థానిక ప్రాంతం (ఏయూ లేదా ఎస్వీయూ పరిధి)లో ఇంటర్‌తో పాటు నాలుగేళ్ల విద్యను అభ్యసించిన విద్యార్థి మాత్రమే ఆ ప్రాంత స్థానిక అభ్యర్థి అవుతారని హైకోర్టు స్పష్టం చేసింది. స్థానికతను రాష్ట్రపతి ఉత్తర్వుల్లో స్పష్టంగా నిర్వచించారని తెలిపింది. ఇంటర్మీడియట్‌ను ఏపీకి వెలుపల చదివిన తమను వైద్య విద్య ప్రవేశాల్లో ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక అభ్యర్థులు (లోకల్)గా పరిగణించేలా ప్రభుత్వం, డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయాన్ని ఆదేశించాలని కోరుతూ పలువురు అభ్యర్థులు దాఖలు చేసిన వ్యాజ్యాలను కొట్టేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ ఆర్.రఘునందన్‌రావులతో కూడిన ధర్మాసనం బుధవారం ఇచ్చిన (మిగతా 2లో)



అరుదైన భేటీపై ఉత్కంఠ

- నేడు ట్రంప్, పుతిన్ సమావేశం
- అమెరికాలోని అలాస్కా వేదిక
- యుద్ధ విరమణపై ఆశలు
- 'పాత మిత్రుల' ఏడో భేటీ

వాషింగ్టన్: ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న అరుదైన సమావేశానికి రంగం సిద్ధమైంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. రష్యా అధినేత పుతిన్‌ల మధ్య శుక్రవారం అలాస్కాలో కీలక భేటీ జరగనుంది. ఉక్రెయిన్, రష్యాల మధ్య యుద్ధానికి విరామం లభిస్తుందని ప్రపంచమంతా ఆశగా చూస్తున్న ఈ సమావేశంలో ఏం జరుగుతుందనే ఉత్కంఠ నెలకొంది. యుద్ధం పరంగా ఉక్రెయిన్‌కు, పుతిన్‌తో సంబంధాల పరంగా అమెరికాకు ఈ సమావేశం నిర్ణయాత్మకం కానుంది.

తొలి విడతలో 6సార్లు..

ట్రంప్ తొలి విడత అధ్యక్షుడిగా పని చేసినప్పుడు పుతిన్‌తో 6సార్లు భేటీ అయ్యారు. 2021లో ట్రంప్ దిగిపోయాకా పుతిన్‌తో స్నేహపూర్వక సంబంధాలనే కొనసాగించారు. 2022లో ఉక్రెయిన్‌పై పుతిన్ యుద్ధం ప్రారంభించినప్పుడు ట్రంప్ సానుకూలంగా మాట్లాడారు. శాంతిదూతలా పుతిన్ ఉక్రెయిన్‌కు వెళ్లారని ప్రశంసించారు. తాను అధ్యక్షుడిగా ఉంటే ఉక్రెయిన్‌పై రష్యా దాడి చేసేది కాదని తరచూ ట్రంప్ చెబుతూ ఉంటారు. ఉక్రెయిన్‌కు అమెరికా మద్దతివ్వడాన్ని 2024లో తన ఎన్నికల ప్రచారంలోనూ ట్రంప్ విమర్శించారు. తాను అధికారం చేపట్టిన 24 గంటల్లోనే యుద్ధాన్ని ఆపిస్తానని ప్రకటించారు. అధికారం చేపట్టాక ఆ విషయాన్ని పట్టించుకోలేదు. అప్పట్లో తాను సరదాగా అలా అన్నానని వివరణ ఇచ్చారు.

ఎప్పటి నుంచో పుతిన్ ప్రయత్నాలు

ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆయనతో భేటీకి పుతిన్ ప్రయత్నిస్తున్నారు. అమెరికా-రష్యా సంయుక్త ప్రాజెక్టుల ద్వారా ఉక్రెయిన్‌కు చెక్ పెట్టాలని భావించారు. దీంతోపాటు అనేక అంశాల్లో సహకారానికి ప్రయత్నించారు. ఫిబ్రవరిలో జెలెన్‌స్కీతో ట్రంప్ భేటీ తర్వాత పరిణామాలు పుతిన్‌కు (మిగతా 2లో)

ఇద్దరూ ఇద్దరే

ట్రంప్, పుతిన్‌లిద్దరూ మొండిఘటాలే. తమ మాటే నెగ్గాలని భావించే రకం. సుదీర్ఘకాలంగా పుతిన్‌తో తనకు సత్సంబంధాలున్నాయని ట్రంప్ చెబుతూ ఉంటారు. ఉక్రెయిన్‌పై దాడి విషయంలోనూ విభిన్నంగా స్పందించేవారు. అయితే ఇటీవలి కాలంలో పుతిన్ ధోరణిపై ఆయన అసంతృప్తిగా ఉన్నారు. అవసరమైతే మరిన్ని ఆంక్షలను విధిస్తానని హెచ్చరించారు. యుద్ధాన్ని ముగించేందుకు పుతిన్ అంగీకరించకపోతే తీవ్ర పరిణామాలుంటాయని స్పష్టం చేశారు.

ఇక పుతిన్‌కు.. ట్రంప్‌తో సంబంధాలను పురుద్ధరించుకోవడానికి అలాస్కా సమావేశం ఒక అవకాశం. ట్రంప్ అధికారంలోని రావడంతో అమెరికాతో సంబంధాలను పునరుద్ధరించుకోవాలని ఆయన చూస్తున్నారు. దీంతోపాటు ఉక్రెయిన్ ధోరణిని ఎండగట్టడానికి ఈ సమావేశాన్ని ఓ అవకాశంగా భావిస్తున్నారు.

వరద నీటిని భూగర్భంలో బంధిద్దాం

- రాష్ట్రంలో వర్షాలకు జలమయమవుతున్న నగరాలు
- నదులు, సముద్రంలోకి వృథాగా వరద నీరు
- కోయంబత్తూరులో 'ఎకో బ్లాక్ టెక్నాలజీ'తో నిల్వ చేసి చూపించిన అధికారులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసినప్పుడల్లా నగరాలు, పట్టణాల్లో వరద నీరు వృథాగా నదులు, సముద్రంలో కలిసిపోవడమేనా? నీటిని ఒడిసిపట్టి నిల్వ చేసుకుని వాడుకోలేమా? ఈ కోణంలో ఆలోచించి కోయంబత్తూరు నగరపాలక సంస్థ చేసిన ప్రయోగం సత్ఫలితాలనిస్తోంది. ఇక్కడి అధికారులు ఎకో బ్లాక్ టెక్నాలజీని ఉపయోగించి వరద నీటికి అడ్డుకట్ట వేసి భూగర్భంలోని ట్యాంకుల్లో నిల్వ చేస్తున్నారు. తొలుత 2022లో పట్టణంలోని రేస్ కోర్స్ రోడ్డులో రూ.1.40 కోట్లతో ట్యాంకు నిర్మాణం చేపట్టారు. నిల్వ చేసిన నీటిని ఇప్పుడు ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు.

ఎకో బ్లాక్ సాంకేతికత అంటే..

■ 'ఎకో బ్లాక్ టెక్నాలజీ'లో పునర్వినియోగ ప్లాస్టిక్‌తో చేసిన స్మార్ట్ డ్రెయిన్ మాడ్యూల్స్ కీలకంగా ఉంటాయి.

■ వరద నీరు నిలిచిపోయే ప్రాంతంలో భూమిలో గుంత తవ్వి మాడ్యూల్స్‌ను ఒకదానికొకటి అనుసంధానిస్తూ ట్యాంకులా నిర్మిస్తారు

■ తర్వాత కాంక్రీట్‌తో కప్పేసి పైకి ఓ మ్యాన్‌హోల్‌లా కనిపించే ఇన్‌లెట్‌ను మాత్రమే వదులుతారు. వరద నీటిని త్వరగా లోపలకు పంపేందుకు ప్రత్యేక పరికరాలు భూమి కిందే ఉంటాయి.

■ వరద వచ్చినప్పుడు ఇన్‌లెట్‌ను తెరిస్తే ట్యాంకులోకి వరద నీరు మొత్తం వెళిపోతుంది


■ నీటిలో మట్టి, చెత్త, ఇతర వ్యర్థాలను నియంత్రించి శుద్ధి చేసేలా నాలుగు వరుసల్లో ఫిల్టర్లు ఉంటాయి. ట్యాంకులు 50 ఏళ్లకుపైగా పని చేస్తాయి. అలా వదిలేస్తే ఆ వరద జలాలు భూగర్భంలోకి ఇంకిపోతాయి. లేదంటే ప్రత్యేక ఏర్పాట్ల ద్వారా ఆ నీటిని తీసుకుని తాగునీటికి మినహా మిగిలిన అవసరాలకు వాడుకోవచ్చు. ఈ కట్టడంపై నుంచి వాహనాలు వెళ్లినా ప్రమాదం ఉండదు. ప్లాస్టిక్‌తోనే తయారుచేసినా సుమారు 60 టన్నుల బరువును ఈ మాడ్యూల్స్ తట్టుకుంటాయి

రాష్ట్రంలో 25 పుర, నగరపాలికల్లో..


రాష్ట్రంలోని 123 పుర, నగరపాలక సంస్థల్లో కనీసం 25 చోట్ల ఎకో బ్లాక్ నిర్మాణాల అవసరం ఉంది. ప్రత్యేకించి విజయవాడలో వరద నీరు కృష్ణా నదిలోకి, నెల్లూరులో పెన్నా, కర్నూలులో తుంగభద్ర, రాజమహేంద్రవరంలో గోదావరి నదుల్లోకి, విశాఖలో సముద్రంలోకి వెళుతోంది. ఇలా ఏటా వర్షాకాలంలో కొన్ని లక్షల క్యూసెక్కుల నీరు వృథా అవుతోంది. ఇదే నగరాల్లో వేసవిలో మళ్లీ తాగునీటికి కటకటలే. వరద నీరు ఎక్కువగా పారే ప్రాంతాలను గుర్తించి ఎకో బ్లాక్ టెక్నాలజీని ఉపయోగిస్తే వృథాగా పోయే జలాలను ఒడిసి పట్టవచ్చు. తద్వారా వేసవిలో తాగునీటికి మినహా మిగిలిన అవసరాలకు కొరత ఉండదు.



స్మార్ట్ డ్రెయిన్ మాడ్యూల్



లేయర్లుగా మాడ్యూల్‌ను బిగిస్తారిలా



భూగర్భంలో మాడ్యూల్స్‌ను అనుసంధానించాక ఏర్పాటయ్యే ట్యాంకు

ఆ 65 లక్షల మంది ఓటర్ల వివరాలు వెల్లడించండి

- తొలగింపు కారణాలూ జాబితాల్లో చేర్చండి
- సాఫ్ట్‌కాపీల రూపంలోనూ సమాచారాన్ని ఇవ్వాలి
- ఓటరు కార్డు నంబరుతో అన్వేషిస్తే వెబ్‌సైట్‌లోనూ తెలియాలి
- ఆధార్ కార్డునూ గుర్తింపు పత్రంగా అనుమతించండి
- బిహార్ ఎస్ఐఆర్ వివాదంపై ఈసీకి సుప్రీంకోర్టు ఆదేశం



దిల్లీ

బిహార్‌లో ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) వివాదంపై సర్వోన్నత న్యాయస్థానం గురువారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ముసాయిదా ఓటరు జాబితా నుంచి తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల వివరాలను ఈ నెల 19వ తేదీ కల్లా వెల్లడించాలని, వారి తొలగింపునకు కారణాలను కూడా జత చేయాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ధర్మాసనం ఈసీకి సూచించింది. పారదర్శకతను పాటించడం ద్వారా ప్రజల విశ్వాసం పొందాలని తెలిపింది. మరణించిన వారెవరు, వలసపోయిన వారెవరు, ఇతర నియోజకవర్గాలకు నివాసాన్ని మార్చిన వారెవరు అనే వివరాలూ ఆ జాబితాల్లో చేర్చాలని ధర్మాసనం ఆదేశించింది. వాటిని పంచాయతీ భవనాలు, జిల్లా స్థాయి రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేసింది. జిల్లాల వారీగా, బూత్ స్థాయిలో ఆ సమాచారం తెలుసుకోవడానికి వీలుగా ఉండాలని, జిల్లా ఎన్నికల అధికారి వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఓటరు కార్డు నంబరుతో అన్వేషించగానే సదరు వ్యక్తి వివరాలు సులభంగా లభ్యం కావాలని తెలిపింది. సాఫ్ట్‌కాపీల రూపంలోనూ ఆ జాబితాలను ఇవ్వాలని స్పష్టం చేసింది. పత్రికలు, టెలివిజన్ వార్తా ఛానళ్లు, రేడియో ద్వారా ఈ విషయాన్ని ప్రజలకు చేరవేయాలని పేర్కొంది. అర్హులైన వ్యక్తులు ఓటును కోల్పోయినట్లయితే ఆధార్ కార్డును వెంట తీసుకొని వెళ్లి ఎన్నికల అధికారిని కలిసి ఓటర్ల జాబితాలో చేర్చాలని అభ్యర్థించవచ్చని ధర్మాసనం తెలిపింది. ఓటరు గుర్తింపునకు ఆమోదనీయ పత్రాలుగా ఆధార్, ఓటరు కార్డులనూ పరిగణనలోకి తీసుకోవాలని ఈసీకి స్పష్టం చేసింది. ఈ ఆదేశాల అమలుపై నివేదికను సమర్పించాలని ఈసీకి (మిగతా 2లో)



18న శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల నవంబరు కోటా విడుదల

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల నవంబరు కోటాను ఈ నెల 18న ఉదయం 10 గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. వీటి లక్కీడిప్ రిజిస్ట్రేషన్ కోసం ఇదే నెల 20న ఉదయం పది గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా టికెట్లు 21న ఉదయం పదింటికి, వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను మధ్యాహ్నం మూడింటికి అందుబాటులో ఉంచనున్నారు. 23న ఉదయం (మిగతా 2లో)



సొమ్మసిల్లిన అంజలిని ఆసుపత్రికి తరలిస్తున్న పోలీసులు

జగన్ అనంత పర్యటనలో వైకాపా శ్రేణుల వీరంగం

ట్రాఫిక్‌కూ తీవ్ర అంతరాయం

వివాహ వేడుకలో తోపులాట.. మహిళకు అస్వస్థత

ఈనాడు- అనంతపురం, న్యూస్‌టుడే- రాణీనగర్ (అనంతపురం): సమయం, సందర్భం లేకుండా మాజీ సీఎం జగన్ పర్యటనల్లో వైకాపా నాయకులు, కార్యకర్తలు వీరంగం సృష్టిస్తున్నారు. గురువారం అనంతపురం పర్యటనలోనూ అదే తీరు కొనసాగింది. జాతీయరహదారిపైకి చేరి 'సీఎం సీఎం.. రప్పా రప్పా' అంటూ నినాదాలు చేస్తూ నానా యాగీ చేశారు. జగన్ కాన్వాయ్ ముందు పరుగులు తీస్తూ, ఈలలు, కేకలతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగించడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి కుమారుడు ప్రణయ్‌రెడ్డి వివాహానికి హాజరయ్యేందుకు జగన్ అనంతపురానికి వచ్చారు. ఇందుకోసం హైదరాబాద్- బెంగళూరు జాతీయరహదారి పక్కన హెలిప్యాడ్ ఏర్పాటుచేశారు. ఉదయం 10 గంటల నుంచే



మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి కుమారుడు, కోడలిని ఆశీర్వదిస్తున్న జగన్

వైకాపా కార్యకర్తలు జాతీయరహదారిపైకి వచ్చి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారు. దీంతో కక్కలపల్లి, కాటిగాని కాలువ, బుక్కచెర్ల, జి.కొత్తపల్లి, గంగులకుంట తదితర గ్రామాల నుంచి అనంతపురం వచ్చే వాహనదారులు ఇబ్బందిపడ్డారు. 11.56 గంటలకు జగన్ హెలికాప్టర్‌లో దిగారు. దీంతో ఆయన్ను చూసేందుకు కార్యకర్తలు జాతీయ రహదారిపై వెళ్తున్న టమాటా లారీలను ఆపి ఎక్కారు.

ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్స్

వైకాపా శ్రేణుల హంగామాతో 40 నిమిషాల పాటు రాకపోకలు స్తంభించాయి. అందులో రోగిని తరలిస్తున్న ఓ అంబులెన్స్ 15 నిమిషాలు చిక్కుకుపోయింది. జగన్‌తో పాటు కార్యకర్తలు వివాహ వేదిక మీదకు ఒక్కసారిగా చొచ్చుకురావడంతో పలువురు మహిళలు కిందపడ్డారు. ఊపిరాడక భయంతో బయటకు పరుగులు తీశారు. ఈ క్రమంలో మడకశిరకు చెందిన అంజలి తీవ్ర అస్వస్థతకు లోనై సొమ్మసిల్లి పడిపోయారు. పోలీసులు ఆమెను అంబులెన్సులో ఆసుపత్రికి తరలించారు.



వైకాపా శ్రేణుల వీరంగంతో నిలిచిపోయిన ట్రాఫిక్.. అందులో చిక్కుకుపోయిన అంబులెన్స్

కార్యకర్తలపై జగన్ భద్రతా సిబ్బంది దాడి

వివాహ వేదిక వద్ద జగన్ భద్రతను పర్యవేక్షిస్తున్న ప్రైవేటు సిబ్బంది, వైకాపా కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. జగన్ వద్దకు వెళ్లేందుకు అవకాశం ఇవ్వకపోవడంతో ప్రైవేటు సిబ్బంది.. వైకాపా శ్రేణులపై పిడిగుద్దులతో విరుచుకుపడ్డారు. ఈ క్రమంలో కొందరు కార్యకర్తలకు గాయాలయ్యాయి.



ఎస్పీ భద్రయ్య, డీఎస్పీ రాజీవ్‌లకు రాష్ట్రపతి పోలీసు సేవా పతకాలు

(మొదటి పేజీ తరువాయి)

■ గండెం రామకృష్ణ - ఇన్‌స్పెక్టర్, ■ బొడ్డు శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్, ■ కరిమికొండ సీతారామ్ - ఎస్సై, ■ పెదిరెడ్డి చంద్రశేఖర్ - ఏఎస్సై, ■ విస్సరాపు నాగమల్లేశ్వరరావు - ఏఎస్సై, ■ బుర్ర వెంకట రామశర్మ, ఏఎస్సై, ■ ఉస్మాన్ గని ఖాన్ నయాజ్- ఏఎస్సై, ■ కరవ గోపాల్ - ఎస్సై, ■ కొత్తకోట కోటేశ్- ఎస్సై, ■ దొమ్మేటి నాగేశ్వరరావు - ఏఎస్సై, పామర్తి సీతారామాంజనేయులు - ఏఎస్సై, ■ కొప్పిశెట్టి నాగబాబు- ఏఎస్సై, ■ గుబ్బల గోపాలకృష్ణ - హెడ్ కానిస్టేబుల్, ■ సురేష్‌కుమార్ మురుగేశన్ - హెడ్ కానిస్టేబుల్, ■ గద్దదాసు, హెడ్ కానిస్టేబుల్.

జైళ్లశాఖ డీఐజీ వరప్రసాద్‌కు సేవా పతకం

ఏపీ జైళ్లశాఖ గుంటూరు రేంజ్ డీఐజీ డా. మామిళ్లపల్లి వరప్రసాద్‌ను ప్రతిభావంతమైన సేవల పతకం (మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్) వరించింది. ఈయన జైళ్లలో ఖైదీలు ధరించే దుస్తులు వారిలో ఏమరకల సమస్యలను దారితీస్తున్నాయని గుర్తించి, వాటి తయారీలో వినియోగించే వస్త్రాన్ని మార్చడంలో కీలకపాత్ర పోషించారు. ఖైదీల మరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించారు. కేంద్ర కారాగారాల్లో వ్యసన విముక్తి కేంద్రాల ఏర్పాటు, సీసీఆర్ నిఘాలో జైళ్లలో మౌలిక వసతుల కల్పనకు వరప్రసాద్ కీలకంగా పనిచేశారు. మొత్తం 18 పెట్రోల్ బంకులు ఏర్పాటుచేసి జైళ్లశాఖకు ఆదాయాన్ని పెంచారు. జైళ్ల శిక్షణ మాడ్యూల్ తయారీలో ప్రధానపాత్ర పోషించారు.

■ జైళ్లశాఖ చీఫ్ హెడ్‌వార్డర్ కరణం రవికుమార్, హెడ్ వార్డర్ తలారి వీరవెంకట సత్యనారాయణలకు ప్రతిభావంతమైన సేవల పతకం (మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్) లభించింది.

ఆర్పీఎఫ్ నుంచి రాజగోపాల్‌రెడ్డి



చినగంజాం, న్యూస్‌టుడే: రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌లో రేణిగుంట సెట్ డివిజన్ అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్‌గా పనిచేస్తున్న కుక్కల రాజగోపాల్‌రెడ్డి ప్రెసిడెంట్ పోలీస్ మెడల్‌కు ఎంపికయ్యారు. ఈయన స్వస్థలం బాపట్ల జిల్లా చినగంజాం మండలం మున్నంవారిపాలెం.

మధుసూదనరావుకు ప్రెసిడెంట్ మెడల్



గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: గుంటూరు రైల్వే డివిజన్‌లో డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్‌గా పని చేస్తున్న గొల్లమూడి మధుసూదనరావు ప్రెసిడెంట్ పోలీస్ మెడల్‌కు ఎంపికయ్యారు. 1989లో రైల్వే రక్షక దళంలో ఎస్సైగా విధుల్లో చేరిన ఈయన ద.మ.రైల్వేలో వివిధ హోదాల్లో పనిచేశారు.

అరుదైన భేటీపై ఉత్కంఠ

(మొదటి పేజీ తరువాయి)

అనుకూలంగా మారినట్లే కనిపించాయి. మార్చి నెలాఖరులోనూ పుతిన్‌పై ట్రంప్ నమ్మకాన్ని కనబరిచారు. కాల్పుల విరమణపై మాటకు కట్టుబడి ఉంటారని చెప్పారు. కానీ నెల తిరిగేసరికి రష్యా దాడులు పెరగడంతో ట్రంప్ వైఖరిలో మార్పు వచ్చింది. పుతిన్ వైఖరిపట్ల ఆయనలో అసహనం క్రమంగా పెరుగుతూ వచ్చింది. మే నెలకు వచ్చేసరికి అది మరింత పెరిగి పుతిన్ పిచ్చోడిలా వ్యవహరిస్తున్నారని ఆరోపించే స్థాయికి వెళ్లిపోయింది. ఈ నెల మొదట్లో రష్యా తీరానికి సమీపంలో రెండు అణు సబ్‌మెరైన్లను మోహరించాలని ట్రంప్ ఆదేశించారు. రష్యా మాజీ అధ్యక్షుడు దిమిత్రి మెద్వెదెవ్ రెచ్చగొట్టే వ్యాఖ్యల నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టారు.

పుతిన్‌తో భేటీ ఖరారైన తర్వాత ట్రంప్.. తన వ్యాఖ్యల గాఢతను మరింత పెంచారు. పుతిన్‌తో జరిగే సమావేశం వివాదాన్ని పరిష్కరించేదిగానే కాకుండా భావోద్వేగ సమావేశంగానూ నిలవనుందని వ్యాఖ్యానించారు. మరోవైపు యుద్ధాన్ని ఆపకపోతే తీవ్ర పరిణామాలుంటాయనీ హెచ్చరించారు.

ఆ 65 లక్షల మంది ఓటర్ల వివరాలు వెల్లడించండి

(మొదటి పేజీ తరువాయి)

సూచిస్తూ తదుపరి విచారణను ఈ నెల 22వ తేదీకి ధర్మాసనం వాయిదా వేసింది. రాజకీయ పార్టీల మధ్య నెలకొన్న తీవ్ర పోరులో ఎన్నికల సంఘం చిక్కుకుందని ఆ సంస్థ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేదీ పేర్కొన్నారు. గెలిస్తే ఈవీఎంలు మంచివని, ఓడిపోతే చెడ్డవని ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు.

పార్టీలకు ఆ జాబితాలు ఇచ్చాం:ఈసీ

ఓటరు జాబితాల నుంచి తొలగించిన వ్యక్తుల వివరాలను, అందుకు గల కారణాలను రాజకీయ పార్టీలకు జులై 20వ తేదీనే అందజేసినట్లు ఈసీ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. జిల్లా స్థాయిలో ఈ వివరాలను పంచుకునేందుకు సిద్ధమని వెల్లడించింది. మరణించినందున 22.34 లక్షల మందిని, ఇతర ప్రాంతాలకు తరలిపోయినందున 36.28 లక్షల మందిని, ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాల్లో ఓటర్లుగా నమోదైనందున 7.01 లక్షల మందిని ఈ నెల 1న ప్రచురించిన ముసాయిదా ఓటరు జాబితా నుంచి తొలగించినట్లు సుప్రీంకోర్టుకు ఇది వరకే ఈసీ తెలిపింది.

ఇది ప్రజాస్వామ్య విజయం: కాంగ్రెస్, ఆర్జేడీ

తొలగించిన ఓటర్ల వివరాల జాబితాలను వెల్లడించడంతోపాటు సాఫ్ట్‌కాపీల రూపంలోనూ అందించాలని ఈసీని సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించడంపై కాంగ్రెస్, ఆర్జేడీ పార్టీలు హర్షం వ్యక్తం చేశాయి. ప్రజాస్వామ్య విజయంగా అభివర్ణించాయి. కోర్టు నిర్ణయం రాజ్యాంగ పరిరక్షణపై ఆశలను సజీవంగా ఉంచిందని, ఓట్ల చోరులను గట్టిగా హెచ్చరించిందని ఆ పార్టీ నేత కె.సి.వేణుగోపాల్ పేర్కొన్నారు.

ఎస్ఐఆర్‌ను అడ్డుకునే యత్నాలకు ఎదురుదెబ్బ: భాజపా

బిహార్‌లో ఎస్ఐఆర్‌ను అడ్డుకోవాలన్న కాంగ్రెస్ పార్టీ కుటిల యత్నాలకు సుప్రీంకోర్టు నిర్ణయంతో ఎదురుదెబ్బ తగిలిందని భాజపా అధ్యక్షుడు జె.పి.నడ్డా పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతలను ఇది తీవ్రనిరాశకు గురిచేసి ఉంటుందన్నారు.

ఆదాయ వృద్ధిపై మరింత దృష్టి పెట్టండి

(మొదటి పేజీ తరువాయి)

ఆర్టీజీఎస్, సీసీ కెమెరాలను వాడాలి. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరిగేలా.. ప్రస్తుతం ఇస్తున్న రాయితీలను కొనసాగించాలి. పాత వాహనాలను తుక్కుగా మార్చే విధానాన్ని కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా అమలు చేయాలి. డ్రోన్, శాటిలైట్ టెక్నాలజీతో గనుల తవ్వకాలను గుర్తించి, డేటా అనలటిక్స్‌తో ఆదాయాన్ని పర్యవేక్షించాలి' అని సీఎం దిశానిర్దేశం చేశారు. 'ఆర్టీజీఎస్ వివరాలతో మున్సిపల్ కార్పొరేషన్లలో ఆటో మ్యుటేషన్ చేయాలి. మున్సిపల్ రికార్డుల్లో తప్పులను సవరించి జియో ట్యాగింగ్ చేయాలి. ఆధార్, మొబైల్, విద్యుత్తు డేటాను అనుసంధానించి పన్నుల వసూళ్ల ప్రక్రియను పటిష్ఠంగా నిర్వహించాలి. అటవీ శాఖ వద్ద ఉన్న ఎర్రచందనంతో రూ.1,500 కోట్ల ఆదాయం వచ్చే ఆస్కారం ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఎర్రచందనం విక్రయాలపై దృష్టి సారించాలి. వెదురు ఉత్పత్తి ద్వారా ఆదాయం ఆర్జించే మార్గాలు చూడాలి' అని ఆదేశించారు. స్వామిత్వ సర్వే ద్వారా గ్రామ కంఠాల గుర్తింపు ప్రక్రియ 2026 ఫిబ్రవరికి పూర్తవుతుందని అధికారులు సీఎంకు తెలియజేశారు. ఈ సమావేశంలో ఉన్నతాధికారులు పీయూష్‌కుమార్, ముకేశ్ కుమార్ మీనా, జయలక్ష్మి, ఎ.బాబు, రోనాల్డ్ రోస్ తదితరులు పాల్గొన్నారు.



సీబీఐ ఏఎస్పీ పెద్దిరాజుకు రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం

ఈనాడు, దిల్లీ, పాలకోడేరు-న్యూస్‌టుడే: సీబీఐలో అదనపు పోలీస్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ వాసి బండి పెద్దిరాజు రాష్ట్రపతి విశిష్ట సేవాపతకానికి ఎంపికయ్యారు. పోలీసు, కేంద్ర సాయుధ బలగాలు, భద్రతా సంస్థల్లో ఉత్తమ సేవలందించిన వారికి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కేంద్ర హోంశాఖ ఏటా వీటిని ప్రకటిస్తోంది. పెద్దిరాజు స్వస్థలం పశ్చిమగోదావరి జిల్లా శృంగవృక్షం పంచాయతీలోని బంటుమిల్లి గ్రామం. 1993లో సీబీఐలో కానిస్టేబుల్‌గా చేరి ఏఎస్పీ స్థాయికి ఎదిగారు. ఈయన ప్రస్తుతం దిల్లీ సీబీఐ ప్రధాన కార్యాలయం సైబర్‌క్రైమ్ ఇన్వెస్టిగేషన్ విభాగంలో సేవలందిస్తున్నారు. అనేక కీలకమైన కేసుల దర్యాప్తులో భాగస్వామిగా ఉన్నారు. మూడు దశాబ్దాల ఉద్యోగ జీవితంలో 150కి పైగా రివార్డులను సొంతం చేసుకున్నారు. 2008లో ఇండియా ఉత్తమ దర్యాప్తు అధికారిగా బంగారు పతకం, 2017లో ఇండియన్ పోలీసు పతకం, 2014, 2018లలో అత్యుత్తమ దర్యాప్తు అధికారి అవార్డులు, 2019లో డేటా సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పురస్కారం, ఇండియా సైబర్ కాప్ ఆఫ్ ది ఇయర్ అవార్డులు అందుకున్నారు. తన స్వగ్రామం బంటుమిల్లిలో విద్యాట్రస్ట్ ఏర్పాటుచేసి స్థానికులకు సేవలందిస్తున్నారు.

బండి పెద్దిరాజు దర్యాప్తు చేసిన కేసులు..

నీట్ యూజీ-2024 ప్రశ్నపత్రం లీకేజీ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులపై సోషల్ మీడియా పోస్టులు, మాజీ మంత్రి పరిటాల రవి హత్య, సైబర్ నేరాలు.

ఇంటర్‌తోపాటు నాలుగేళ్లు చదివితేనే స్థానికత

(మొదటి పేజీ తరువాయి)

ఈ తీర్పు గురువారం అందుబాటులోకి వచ్చింది.

ఏడేళ్లయినా చదివి ఉండాలి..

'రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం.. అర్హత పరీక్ష (ఇంటర్మీడియట్)తో పాటు నాలుగు సంవత్సరాలు ఏ విద్యార్థి అయినా ఏపీలోని ఒక ప్రాంతంలో విద్యను అభ్యసిస్తే ఆ ప్రాంత స్థానిక అభ్యర్థిగా పరిగణిస్తారు.

■ ఒకవేళ ఏ విద్యాసంస్థలో చదవకపోయినా అర్హత పరీక్షకు ముందు వరుసగా నాలుగు సంవత్సరాలు రాష్ట్రంలోని ఓ ప్రాంతంలో నివాసం ఉంటే ఆ వ్యక్తి స్థానికుడే అవుతారు.

■ లేదా ఏపీలోని ఒక ప్రాంతం (ఏయూ లేదా ఎస్వీయూపరిధి)లో వరుసగా నాలుగేళ్లు చదవనప్పటికీ.. అర్హత పరీక్ష రాసే నాటికి ముందు ఏడేళ్లు ఆ ప్రాంతంలోనే చదివి ఉంటే ఆ విద్యార్థి సమర్పించే రికార్డుల ఆధారంగా స్థానిక అభ్యర్థిగా పరిగణిస్తారు'అని తీర్పులో హైకోర్టు స్పష్టం చేసింది.

18న శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల నవంబరు కోటా విడుదల

(మొదటి పేజీ తరువాయి)

పదింటికి అంగప్రదక్షిణం టోకెన్ల కోటా, 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు బ్రేక్ దర్శనం టికెట్ల కోటా.. మధ్యాహ్నం మూడింటికి వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శన టోకెన్ల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు. 25న ఉదయం పదింటికి రూ.300 టికెట్ల కోటా, మధ్యాహ్నం మూడింటికి అద్దె గదుల బుకింగ్ కోటా ఉంటుంది. భక్తులు https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్‌లో మాత్రమే ఆయా టికెట్లను బుక్ చేసుకోవాలని అధికారులు సూచించారు.



విశాఖలో బస్సుకు స్త్రీ శక్తి పథకం స్టిక్కర్ అంటిస్తున్న ఉద్యోగి

మహిళలకు ఆర్థిక భరోసా

(మొదటి పేజీ తరువాయి)

కలుగుతుంది.

టికెట్‌పై ఛార్జీ ఉన్నా.. డబ్బు తీసుకోరు..

ఐదు రకాల బస్సుల్లో శుక్రవారం సాయంత్రం నుంచి స్త్రీశక్తి పథకం అమల్లోకి వస్తుంది. అప్పటి నుంచి మహిళలకు జీరో ఫేర్ టికెట్లు జారీచేస్తారు. మహిళలకు ఇచ్చే టికెట్లపై స్త్రీశక్తి పథకం అని ఉంటుంది. ఎక్కడి నుంచి ఎక్కడికి ప్రయాణిస్తున్నారు.. ప్రయాణ ఛార్జీ ఎంతో ఉంటుంది. ఆ సొమ్మును ప్రభుత్వం రాయితీగా ఇస్తుందని.. ప్రయాణికురాలు చెల్లించాల్సింది సున్నా (0) అని ఉంటుంది.

ఏయే బస్సుల్లో ఉచిత ప్రయాణం: పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్

సంస్థలో మొత్తం బస్సులు: 11,499

ఉచిత ప్రయాణ సదుపాయం ఉండేవి: 8,458 (74%)

ఐదు రకాల బస్సుల్లో ప్రస్తుతం ఎంత మంది మహిళలు ప్రయాణిస్తున్నారు: రోజూ 16.11 లక్షలు

స్త్రీశక్తి పథకం అమలుతో పెరిగే మహిళా ప్రయాణికులు: నిత్యం మరో 10.84 లక్షలు

పథకం వ్యయమెంత: నెలకు రూ.161.83 కోట్ల చొప్పున, ఏడాదికి రూ.1,942 కోట్లు

■ ఇప్పటి వరకు 66.84 లక్షల మంది మహిళలు ఏటా బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. స్త్రీశక్తి పథకం ద్వారా 87.62 లక్షల మంది ప్రయోజనం పొందుతారని ఆర్టీసీ అంచనా వేసింది.

■ ప్రస్తుతం ఐదు రకాల బస్సుల్లో కలిపి గత ఏడాది 124.77 కోట్ల మంది ప్రయాణించారు. కొత్త పథకం అమలయ్యాక ఈ సంఖ్య 164.31 కోట్లకు చేరుతుంది.

■ ప్రస్తుతం ఏడాదికి ప్రయాణిస్తున్న మహిళలు 49.91 కోట్ల మంది. ఇకపై వీరి సంఖ్య ఏటా 88.90 కోట్లకు పెరుగుతుంది.

■ పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సుల్లో ప్రతి మహిళా సగటున వారానికి ఒకసారి ప్రయాణిస్తారని అంచనా.

■ విజయవాడ, విశాఖపట్నం నగరాల్లోని మహిళలు సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్‌ల్లో సగటున వారానికి నాలుగు సార్లు ప్రయాణించే అవకాశాలు ఉన్నట్లు లెక్కలు వేశారు.

■ విజయవాడ శివారు ఇబ్రహీంపట్నంలో నివసించే గృహిణి.. విజయవాడ బెంజ్ సర్కిల్ సమీపంలోని ఓ షోరూమ్‌లో పనిచేస్తున్నారు. నిత్యం ఆర్టీసీ సిటీబస్‌లో వచ్చి వెళ్లేందుకు రూట్‌పాస్ వినియోగిస్తున్నారు. దీనికి ప్రతినెలా రూ.1,140 ఖర్చుచేస్తున్నారు. ఇకపై బస్‌పాస్ తీసుకోవాల్సిన అవసరంలేనందున ఆమెకు నెలకు రూ.1,140 ఆదా అయినట్లే.

■ అనకాపల్లి జిల్లా దేవరాపల్లికి చెందిన ఓ మహిళా రైతు.. నెలలో 20 రోజులు కూరగాయలు తీసుకొని విశాఖపట్నానికి వెళ్లి విక్రయించి వస్తుంటారు. కూరగాయలు అమ్మితే నిత్యం మిగిలే రూ.300-400లో.. బస్‌ఛార్జి కింద రూ.120 చొప్పున వెచ్చిస్తున్నారు. ఇకనుంచి ఆమె బస్ టికెట్ తీసుకోవాల్సిన అవసరం లేదు. నెలకు రూ.2,400 మిగిలినట్లే.

■ నందికొట్కూరుకు చెందిన అక్క, చెల్లి కర్నూలులో చదువుతున్నారు. వీరు స్టూడెంట్ బస్‌పాస్ కింద నెలకు రూ.700 చొప్పున రూ.1,400 వెచ్చించాల్సి వస్తోంది. ఇకపై వీరు ఉచితంగానే ప్రయాణించి చదువుకోవచ్చు.

■ తల్లిదండ్రులు, ఇద్దరు కుమార్తెలు, కుమారుడితో ఉన్న ఓ కుటుంబం విజయవాడ నుంచి తిరుపతి వెళ్లి శ్రీవారిని దర్శించుకోవాలని చాలాకాలంగా అనుకుంటోంది. ఎక్స్‌ప్రెస్ బస్సులో ఐదుగురూ తిరుపతి వెళ్లి వచ్చేందుకు రూ.6,080 అవుతాయి. ఇకపై ఇటువంటి కుటుంబాలకు ఛార్జీల భారం తగ్గుతుంది. వీరికి టికెట్ ఖర్చు రూ.3,648 మిగులుతుంది.

ఉచిత బస్సులకు 'స్త్రీశక్తి' స్టిక్కర్లు

● గందరగోళానికి చెక్ పెడుతున్న అధికారులు

ఈనాడు, అమరావతి: మహిళలకు ఉచిత ప్రయాణ పథకం ఏయే బస్సుల్లో అమలవుతుందనేది స్పష్టంగా తెలిసేలా.. ఆయా బస్సులపై ఆర్టీసీ అధికారులు స్టిక్కర్లు అతికిస్తున్నారు. తద్వారా మహిళా ప్రయాణికులు గందరగోళానికి గురవకుండా చూస్తున్నారు. ఆకుపచ్చ రంగు ఉండే పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సులను సులువుగా గుర్తుపట్టొచ్చు. అయితే ఎక్స్‌ప్రెస్, నాన్‌స్టాప్, ఇంటర్‌స్టేట్ ఎక్స్‌ప్రెస్‌లు చూడటానికి ఒకేలా ఉంటాయి. వీటిలో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనే మహిళల ఉచిత ప్రయాణానికి అవకాశం ఉంది. నాన్‌స్టాప్, ఇంటర్‌స్టేట్ బస్సుల్లో టికెట్ తీసుకోవాలి. ఈ మూడు బస్సులూ ఒకేలా ఉండటంతో మహిళలు గందరగోళానికి గురవుతారు. దీనికి చెక్‌పెట్టేలా ఉచితప్రయాణం ఉన్న బస్సులపై స్త్రీశక్తి పథకం వర్తిస్తుందనేలా కొన్ని చోట్ల స్టిక్కర్లు అతికించారు.

పాస్‌ల గడువు వరకు టికెట్లు ఉండవు: స్త్రీశక్తి పథకంలో భాగంగా ఐదు రకాల బస్సుల్లో మహిళలకు జీరో ఫేర్ టికెట్లు జారీ చేస్తారు. అయితే ఇప్పటికే విద్యార్థినులు స్టూడెంట్ పాస్‌లు, మహిళా ఉద్యోగులు వంటి వారు నెలవారీ, సీజనల్ పాస్‌లు తీసుకొని ఉంటారు. ఇటువంటివారి పాస్‌ల గడువు ఉన్నంతవరకు వీరికి జీరోఫేర్ టికెట్ల జారీ ఉండదు. పాస్‌ల గడువు ముగిశాక బస్సుల్లో జీరోఫేర్ టికెట్లు ఇస్తారు.

డబుల్ డ్యూటీ చెల్లింపులు పెంపు: మహిళలకు ఉచిత ప్రయాణ పథకం అమలు నేపథ్యంలో.. డ్రైవర్లు, కండక్టర్లకు ఇచ్చే డబుల్ డ్యూటీ చెల్లింపులను పెంచారు. ప్రస్తుతం ఆర్టీసీ రెగ్యులర్ డ్రైవర్లకు డబుల్ డ్యూటీ చేస్తే.. రూ.800, కండక్టర్లకు రూ.700 చెల్లిస్తున్నారు. ఇక నుంచి డ్రైవర్లకు రూ.1,000, కండక్టర్లకు రూ.900 ఇస్తారు. అలాగే ఆన్‌కాల్ డ్రైవర్లకు ప్రస్తుతం రోజుకు డ్యూటీకి రూ.800 ఉండగా, ఈ మొత్తాన్ని రూ.1,000కి పెంచారు.

ఎండీ సమీక్ష: శుక్రవారం నుంచి స్త్రీశక్తి పథకం అమలు నేపథ్యంలో.. దీనిపై ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు గురువారం అధికారులతో సమీక్ష జరిపారు. మహిళా ప్రయాణికులతో..సంస్థ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. సీఎం ఈ పథకాన్ని ప్రారంభించాక జీరోఫేర్ టికెట్ల జారీ మొదలవుతుందన్నారు.

ఇంటికి వచ్చేందుకు పెదారెడ్డికి భద్రత కల్పించండి

పోలీసులకు హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: వైకాపా మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఈ నెల 18న తాడిపత్రిలోని తన ఇంటికి వచ్చేందుకు భద్రత కల్పించాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. సోమవారం ఉదయం 10-11 గంటల మధ్యలో ఇంటికెళ్లాలని పెద్దారెడ్డికి స్పష్టం చేసింది. అనుచరులను రెచ్చగొట్టొద్దని, కాన్వాయ్‌లో ఐదు వాహనాలే ఉండాలని పెద్దారెడ్డికి తేల్చిచెప్పింది. ఆయన ఇంటివద్ద ఏ సమయంలోనైనా 50-60 మందికి మించి ఉండకూడదంది. పెద్దారెడ్డితో పాటు ఆయన రాజకీయ ప్రత్యర్థితో సమస్య ఏర్పడితే ఎదుర్కొనేందుకు అదనపు పోలీసు బలగాలను మోహరించాలని ఆదేశించింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ గురువారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. తన ఇంటికి వెళ్లేందుకు తగిన భద్రత కల్పించాలని హైకోర్టు ఆదేశించినా పోలీసులు పట్టించుకోవడం లేదని పెద్దారెడ్డి వేసిన కోర్టుధిక్కరణ వ్యాజ్యంపై గురువారం హైకోర్టు విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ గత ఏడాది ఎన్నికల ఫలితాల వెల్లడైనప్పటి నుంచి తాడిపత్రిలోని ఇంటికి పిటిషనర్ వెళ్లలేకపోతున్నారన్నారు. పోలీసుల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పెద్దారెడ్డి రాజకీయ ప్రత్యర్థి సైతం అదే వీధిలో నివాసం ఉంటున్నారన్నారు. పెద్దిరెడ్డి వాట్సప్ గ్రూపుల్లో మెసేజ్‌లు పంపి మందిని ఆహ్వానిస్తూ.. శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తున్నారని చెప్పారు. సాధారణ పరిస్థితులు ఏర్పడ్డాక భద్రత కల్పిస్తామన్నారు.

రామగుండం నుంచి వెంటనే యూరియా సరఫరా చేయండి

కేంద్రమంత్రికి అచ్చెన్నాయుడి వినతి

ఈనాడు, అమరావతి: తెలంగాణలోని రామగుండం ఎరువుల కర్మాగారం నుంచి ఏపీకి కేటాయించిన యూరియా వెంటనే అందేలా చూడాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాల వ్యవసాయ శాఖ మంత్రులతో శివరాజ్‌సింగ్ చౌహాన్ గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. "బాపట్ల, గుంటూరు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో భారీ వర్షాల నేపథ్యంలో పంటలను కాపాడుకునేందుకు యూరియా బూస్టర్ డోస్‌గా ఇవ్వాల్సి ఉంది. విదేశాల నుంచి కాకినాడ, గంగవరం పోర్టులకు వచ్చే యూరియాలో కూడా కొంత పరిమాణాన్ని ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించాలి" అని కోరారు. అలాగే ఆగస్టు 23, 24 తేదీల్లో జరిగే జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ సమావేశాలపైనా ఇందులో చర్చించారు. సమావేశంలో వ్యవసాయ శాఖ ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, డైరెక్టర్ ఢిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.

దర్శన్, పవిత్రగౌడ మళ్లీ అరెస్టు

● వారి బెయిల్ రద్దు చేసిన సుప్రీంకోర్టు





బెంగళూరు(మారతహళ్లి), న్యూస్‌టుడే: కన్నడ నటుడు దర్శన్, నటి పవిత్రగౌడ మళ్లీ అరెస్టయ్యారు. చిత్రదుర్గకు చెందిన యువకుడు రేణుకాస్వామి (33) హత్య కేసులో దర్శన్, పవిత్రాగౌడతో సహా ఏడుగురు నిందితులకు కర్ణాటక హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను సుప్రీంకోర్టు గురువారం రద్దు చేసింది. వెంటనే కర్ణాటక పోలీసులు.. బెంగళూరులో పవిత్రను, దర్శన్‌ను అరెస్టు చేశారు. వెన్నునొప్పికి అత్యవసరంగా శస్త్ర చికిత్స చేయించుకోవాలని బెయిలుపై బయటకు వచ్చిన దర్శన్ 'డెవిల్' సినిమా చిత్రీకరణలో పాల్గొనడంతో పాటు విదేశాలకు వెళ్లడం, దేశంలోని వివిధ ఆలయాలను వరుసగా సందర్శిస్తుండటంపై సుప్రీంకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఆయన బెయిల్ కోసం ప్రస్తావించిన అంశమేంటి? చేస్తున్నదేంటి? అని ప్రశ్నిస్తూ.. పవిత్ర గౌడ (ఏ1), దర్శన్ (ఏ2), జగదీశ్ ఎలియాస్ జగ్గ (ఏ6), అనుకుమార్ (ఏ7), ప్రదోష్ (ఏ14), నాగరాజ్ (ఏ11), లక్ష్మణ్ (ఏ12)ల బెయిల్‌ను జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం రద్దు చేసింది. బెయిల్ రద్దు సమయంలో నిర్ణీత గడువులోగా లొంగిపోవాలనే వెసులుబాటును కోర్టు వీరికి కల్పించలేదు. దాంతో వెంటనే పోలీసులు రంగప్రవేశం చేసి నిందితులను అరెస్టు చేశారు.

నీటి నిర్వహణలో విజయం సాధించాం

● జలాశయాలన్నీ నింపాం.. చెరువులూ నింపాలి

● అందుకు సాగునీటి సంఘాలు బాధ్యత తీసుకోవాలి

● ముఖ్యమంత్రి చంద్రబాబు సూచన

ఈనాడు, అమరావతి: 'నీటి వనరులను పూర్తిస్థాయిలో సంరక్షిస్తేనే భూగర్భజలాలు పెరుగుతాయి. సమర్థ నీటి నిర్వహణతో రాష్ట్రంలోని బ్యారేజీలు, రిజర్వాయర్లలో 82.29% నీటిని నింపాం. ఎగువ నుంచి వస్తున్న వరదతో పాటు రాష్ట్రంలో వర్షపు నీటిని సమర్థంగా జలాశయాలకు మళ్లించడంలో విజయం సాధించాం' అని సీఎం చంద్రబాబు అన్నారు. సచివాలయం నుంచి గురువారం ఆయన నీటి వినియోగదారుల సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీల అధ్యక్షులు, ఇతర సభ్యులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. 'హంద్రీనీవా ద్వారా రాయలసీమలోని ప్రాజెక్టులు నింపాం. ఇకపై వెలిగొండ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, గాలేరు నగరి సుజల స్రవంతిపై దృష్టి సారిస్తాం. రిజర్వాయర్లను ఎలా నింపామో గ్రామాల్లోని చెరువులనూ అలాగే నింపాలి. సాగునీటి కాల్వలను, పంట కాల్వలను సంరక్షించుకోవాలి. వీటి పర్యవేక్షణ కార్యక్రమాల్లో సాగునీటి సంఘాలు భాగస్వామ్యం కావాలి. రైతుల భాగస్వామ్యం కోసమే సాగునీటి సంఘాలను ఏర్పాటు చేశాం. కొన్ని ప్రాంతాల్లో వరదలు ఉన్నా, మరికొన్ని ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి. రాష్ట్రంలోని 38 వేల చిన్ననీటి వనరుల చెరువుల్లో కూడా నీళ్లు నింపాలి' అని చంద్రబాబు పేర్కొన్నారు.

జిల్లాల వారీగా రేటింగ్ ఇస్తాం: 'చెరువులు, కాల్వలు, చెక్ డ్యాంల పరిస్థితిని సాగునీటి సంఘాలు పరిశీలించాలి. ఆ పరీవాహకం బాధ్యతలూ వాటికే అప్పగిస్తాం. నీటి వనరుల సంరక్షణ విషయంలో ఏమైనా చర్యలు తీసుకోవాల్సి వస్తే ఆ సంఘాలు అధికారులతో సమన్వయం చేసుకోవాలి. ఏమైనా మరమ్మతులు అవసరమైతే వచ్చే 15 రోజుల్లో పూర్తి చేయాలి. వైకాపా ప్రభుత్వంలో కనీసం షట్టర్లు, గేట్ల నిర్వహణ కూడా సరిగా చేయలేదు. షట్టర్ల రిపేర్లు అన్న మాటే ఉండకూడదు. నీటి నిర్వహణపై జిల్లాల వారీగా రేటింగ్ ఇస్తాం. జలవనరులశాఖలో ఇంజినీరింగ్ వ్యవస్థను పునర్వ్యవస్థీకరిస్తాం. భూగర్భాన్ని జలాశయంగా మార్చుకోవాలి. రాష్ట్రంలో 19 లక్షల బోర్‌వెల్స్ ఉంటే వాటి కోసం రూ.8,250 కోట్లు ఖర్చు చేయాల్సి వస్తోంది. భూగర్భజలాలు పెంచుకుని సమర్థంగా వినియోగించుకుంటే అందులో 50% ఖర్చు తగ్గిపోతుంది' అని సీఎం అన్నారు. సమావేశంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఇంజినీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి, ఆయా జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.





ఈనాడు అమరావతి ఎన్టీఆర్



శోభాయమానం.. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్

మది నిండా మువ్వన్నెలు

స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్రస్థాయి పంద్రాగస్టు వేడుకకు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియాన్ని సకల హంగులతో తీర్చిదిద్దారు. ప్రగతిని చాటేలా శకటాలను ముస్తాబు చేస్తున్నారు. విజయవాడ నగరంలోని ప్రభుత్వ కార్యాలయాలు త్రివర్ణ శోభితమయ్యాయి. మూడు రంగుల విద్యుత్తు కాంతులతో వెలుగులీనుతున్నాయి. -ఈనాడు, అమరావతి

గ్యాలరీలు.. శకటాలు సిద్ధం







స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. టెర్మినల్ భవనాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. బయట వైపు త్రివర్ణ రూపం ప్రతిబింబించేలా విద్యుత్తు కాంతులు అద్దారు.

-గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే

క్షణక్షణం.. ఉగ్రరూపం

- రెండో ప్రమాద హెచ్చరికకు చేరువై..
- కాసింత నెమ్మదించిన కృష్ణమ్మ ప్రవాహం



అనిగండ్లపాడు వద్ద కూచివాగు పొంగి మునిగిన కల్వర్టు



గొల్లపూడి: సూరాయిపాలెం వద్ద పొలాల్లో నిలిచిన నీరు



పెనుగంచిప్రోలు: గుమ్మడిదుర్రు వద్ద ముంపులో పొలాలు

ఈనాడు, అమరావతి: ఎగువ నుంచి తరుముకొస్తున్న వరద ప్రభావానికి కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చింది. బుధవారం అర్ధరాత్రి వరకు 3,97,250 క్యూసెక్కుల నీరు కడలికి విడుదల చేస్తుండగా గురువారం తెల్లవారుజాము నుంచి వరద ఉద్ధృతి అంతకంతకూ పెరిగింది. ఈ ప్రభావంతో.. వాగులు, వంకలు విజృంభించి ప్రవహించాయి. వర్షం నుంచి కొంత ఉపశమనం ఉన్నా వరద ప్రభావం కలవరపెడుతోంది.

విశ్వరూపం చూపి క్రమంగా శాంతించి... బ్యారేజీ దగ్గర వరద ప్రభావం మంగళవారం అర్ధరాత్రి 12 గంటలకు లక్ష క్యూసెక్కులు దాటింది. అక్కడ నుంచి అమాంతం పెరిగింది. కేవలం రెండు రోజుల్లోనే బ్యారేజీ 70 గేట్లు ఎత్తి 5.65 లక్షల క్యూసెక్కుల నీటిని కడలికి వదిలే స్థాయికి చేరుకుంది. గురువారం మధ్యాహ్నం ఒంటి గంటకు గరిష్ఠంగా 5,65,807 క్యూసెక్కులు రాగా.. దిగువకు 5,65,201 క్యూసెక్కులు వదిలారు. బుధవారం రెండు లక్షల క్యూసెక్కులు, గురువారం దాదాపు 3 లక్షల క్యూసెక్కుల చొప్పున పెరిగి భయాందోళనకు గురిచేసింది. గురువారం రాత్రి 10 గంటలకు బ్యారేజీకి చేరుతున్న వరద 4,96,338 క్యూసెక్కులకు తగ్గింది. స్థానికంగా, ఎగువన వర్షాలు తగ్గుతున్న నేపథ్యంతో శుక్రవారానికి వరద మరింత తగ్గే వీలుంది. వరద తీవ్రత 5.67 లక్షల క్యూసెక్కులకు చేరితే రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేయాల్సి ఉండేది. దరిదాపు వరకు వెళ్లి తగ్గడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

ప్రకాశం బ్యారేజీ దగ్గర వరద ఉద్ధృతి..

వారం... సమయం	ఇన్‌ఫ్లో	ఔట్‌ఫ్లో
మంగళ రాత్రి 12	1,10,520	1,08,680
బుధ ఉదయం 9	2,54,135	2,49,000
" మధ్యాహ్నం12	3,19,133	3,15,000
గురు ఉదయం 3.30	4,01,100	4,01,100
" ఉదయం 9	5,07,604	5,06,604
" మధ్యాహ్నం 1	5,65,807	5,65,201
" రాత్రి 7	5,39,473	5,38,867
" రాత్రి 10	4,96,338	4,93,822



వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ పరిశీలన

జి.కొండూరు, న్యూస్‌టుడే : వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ వద్ద నీటి ప్రవాహన్ని కలెక్టర్ లక్ష్మీశ గురువారం పర్యవేక్షించారు. ఎంత ప్రవాహం ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో అవుతుందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. బుడమేరు వరదపై వదంతులు నమ్మవద్దని ఆయన తెలిపారు. బుడమేరు పరివాహక ప్రాంతంలో అధికారులు అప్రమత్తంగా ఉండి ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్



నందిగామ గ్రామీణం: గోళ్లమూడి వద్ద 7 వేల కోళ్లు మృతి చెందాయి. రూ.15 లక్షల నష్టం వాటిల్లిందని యజమాని రత్నబాబు ఆవేదన వ్యక్తం చేశారు.

ఏరుల ఉద్ధృతి.... ★ జగ్గయ్యపేటలో వైఎస్సార్ కాలనీ, ఆర్టీసీ కాలనీ, భవానీపురం, దుర్గాపురం, రైల్వేట్రాక్ దగ్గర రోడ్లు కోతకు గురయ్యాయి. ★ రెడ్డిగూడెం మండలం కట్టువాగు పొంగి చిననందిగామ ఆర్అండ్‌బీ రహదారిపై రాకపోకలు నిలిచాయి. ★ నందిగామ మండలం కూడలి పల్లంపల్లి మధ్య వరద తాకిడికి రాకపోకలు నిలిచాయి. ★ రుద్రవరం, సోమవరం మధ్య కల్వర్టు కొట్టుకుపోయి రాకపోకలు స్తంభించాయి. ★ గంపలగూడెం మండలం వినగడప వంతెనపై వరద తీవ్రతతో రాకపోకలు ఆగిపోగా.. పోలీసు బందోబస్తు పెట్టారు. ★ పెనుగంచిప్రోలు మండలంలో అనిగండ్లపాడు, గుమ్మడిదుర్రుల మధ్య అనేకచోట్ల రహదారి కొట్టుకుపోయింది. ఇటీవల నిర్మించిన వంతెన కుంగి రాకపోకలు ఆగిపోయాయి. ★ మాగల్లు వద్ద కూచివాగు పొంగి వందల ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. ★ జగ్గయ్యపేట పరిధిలో గండివాగు, నడివాగు, పొంగి 2 వేల ఎకరాలు నీట మునిగాయి.



నగరంలోని చిట్టినగర్ పెద్ది రాజువీధిలో రిటైనింగ్ గోడ కింద ఇళ్లపైకి జారింది.

మున్నేరులో మృతదేహం

★ పెనుగంచిప్రోలు మునేరు వద్ద రేపల్లె వాకావారిపాలెంకు చెందిన శ్రీనివాసరావు(58) మృతదేహాన్ని స్థానికులు గుర్తించి... పోలీసులకు సమాచారం ఇచ్చారు. పెనుగంచిప్రోలు మండలం శనగపాడు వద్ద వాగువాటే ప్రయత్నంలో నీటి ప్రవాహంలో ఇద్దరు చిక్కుకోగా.. గ్రామస్థులు బయటకు తెచ్చారు. ★ కంచికచర్ల బస్టాండ్‌లోకి భారీగా నీరు చేరి చెరువును తలపించింది.



పునరావాస కేంద్రాల్లో ఆరోగ్య శిబిరాలు

విజయవాడ నగరపాలక సంస్థ: వరద, వర్షాల నేపథ్యంలో నగరంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ఆరోగ్య శిబిరాలు ఉండేలా చూడాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగరంలోని ప్రకాశం బ్యారేజ్, హౌసింగ్ బోర్డు కాలనీ, అజిత్‌సింగ్‌నగర్, పాతబస్తీ, లోబ్రిడ్జి ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించారు. పునరావాస కేంద్రాలను పరిశీలించారు. పునరావాస కేంద్రాల్లోని వారి వివరాలు నమోదు చేయాలని అన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలని, మరుగుదొడ్లు, విద్యుత్తు సౌకర్యం కల్పించాలని, ఫ్యాన్లు అమర్చాలని తెలిపారు. న్యూ రాజరాజేశ్వరిపేట పాఠశాలలోని పునరావాస కేంద్రంలో బాధితులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించి సూచనలు చేశారు. పునరావాస కేంద్రాల్లో గురువారం సాయంత్రం వరకు 660 మంది ఆశ్రయం పొందుతున్నట్లు కమిషనర్ వెల్లడించారు.

ప్రగతి రథంపై... స్త్రీ శక్తి!

★ మగువల ఉచిత బస్సు ప్రయాణం ఆరంభం నేడే
★ ఉమ్మడి కృష్ణాలో రోజుకు 1.54 లక్షల మందికి లబ్ధి



పథకం ప్రారంభానికి అధికారుల ఏర్పాట్లు

ఈనాడు, అమరావతి: సూపర్-6 హామీల అమలులో కూటమి సర్కారు మరో అడుగేసింది. ఆర్టీసీ ప్రగతి రథంలో మగువల ప్రయాణానికి రంగం సిద్ధమైంది. ఉమ్మడి జిల్లాలో మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ పథకం అమలు నేపథ్యంలో ఒక్క రోజులో ఉమ్మడి జిల్లాలో పెద్ద సంఖ్యలో మహిళలకు లబ్ధి చేకూరనుంది. అధికారులు ఇప్పటికే బస్టాండ్లలో మౌలిక సదుపాయాలు, బస్సుల మరమ్మతులు, సర్వీసుల పెంపు వంటి ఏర్పాట్లు చేశారు. శుక్రవారం విజయవాడలో సీఎం చంద్రబాబు పథకాన్ని ప్రారంభిస్తున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లా మహిళలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

అంశం	ఎన్టీఆర్	కృష్ణా
ఉన్న డిపోలు	08	05
మొత్తం బస్సులు	800	416
రోజులో ప్రయాణికులు	1,50,000	80,200
మహిళా ప్రయాణికులు	70,000	38,000
రోజుకు దూరం(కి.మీ.ల్లో)	2,74,000	1,40,000

ఉమ్మడి జిల్లాలో మొత్తం 13 బస్సు డిపోలున్నాయి. 1,216 బస్సులు తిరుగుతున్నాయి. ఒక్క రోజుకు సగటున 2,30,200 మంది ప్రయాణిస్తున్నారు. వీరిలో 1.08 లక్షల మంది మహిళలు ఉన్నారు. నెలకు 32.4 లక్షల మంది మహిళలు ప్రయాణం చేస్తారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన స్త్రీశక్తి పథకం ద్వారా వీరందరికీ లబ్ధి చేకూరనుంది. ఇదంతా సాధారణ రోజుల్లో ప్రయాణం చేసేవారి లెక్క. ప్రస్తుతం మహిళలు ఎక్కువగా ఆటోలు, ర్యాపిడోలు, రైలు, ఇతర వాహనాల్లోనూ ప్రయాణం చేస్తున్నారు. ఉచిత ప్రయాణం.. పథకం మొదలైతే ఆయా వాహనాల్లో ప్రయాణించేవారు సైతం ఆర్థిక భారం తగ్గించుకునేలా ఉచిత బస్సులెక్కుతారు. దీంతో మహిళా ప్రయాణికుల సంఖ్య 1.54 లక్షలకు చేరుతుందని అంచనా. పురుషులు 76 వేలకు పరిమితం కానున్నారు. ఇప్పటి వరకు మొత్తం ప్రయాణికుల్లో ప్రస్తుతం పురుషులు 60 శాతం, మహిళలు 40 శాతం ఉండేవారు. ఇక నుంచి మహిళలు 67 శాతానికి పెరగనున్నారు. దీంతో ఇచ్చిన హామీలు అమలు చేస్తున్న కూటమి సర్కారుపై మహిళలు ప్రశంసలు కురిపిస్తున్నారు.

సర్వం సిద్ధం... ఉచిత బస్సు ప్రయాణానికి ఆర్టీసీ అధికారులు సర్వం సిద్ధం చేశారు. చినిగిన సీట్లు.. పగిలిన కిటికీలు కనిపించకుండా మరమ్మతులు చేసి రంగులు వేశారు. బస్సుల సామర్థ్యం సరి చూసి సమస్యలు పరిష్కరించారు. ఉమ్మడి జిల్లాలో ఇంజిన్ బాగుండి... గుల్లయిన 126 బస్సుల బాడీలు మార్చారు. మహిళల తాకిడి ఎక్కువగా ఉండే విజయవాడలో జక్కంపూడి కాలనీ వంటి చోట్ల ఉమ్మడి జిల్లాలో దాదాపు 10 ప్రాంతాల్లో నాలుగు ట్రిప్పుల వరకు పెంచుతున్నారు. అన్ని బస్టాండ్లలో తాగునీరు, విద్యుత్తు, సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చారు. మరమ్మతులకు గురైన ట్యాంకులు, విద్యుత్తు బల్బులను మార్చారు. ప్రయాణికులు వేచి ఉండేందుకు 235 కుర్చీలు, 215 బెంచీలు కొత్తవి వేశారు. దోమలు, ఉక్కపోత లేకుండా 180 కొత్త ఫ్యాన్లు అమర్చారు.

పులివెందులలో ప్రజాస్వామ్యం గెలిచింది: ఎంపీ

పటమట, న్యూస్‌టుడే: పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగాయని, అక్కడ ప్రజాస్వామ్యం గెలిచిందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ గురువారం తెలిపారు. అక్కడ తెదేపా ఘన విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ఒక రోజు ముందే పులివెందులకు స్వేచ్ఛ లభించిందని పేర్కొన్నారు. అక్కడి ప్రజలు ఇచ్చిన తీర్పుతో జగన్‌తో పాటు వైకాపా నేతలకు వణుకు మొదలైందని అన్నారు.



బుడమేరు కాలువకు ముప్పు లేదు


బుడమేరును పరిశీలిస్తున్న ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే ఉమామహేశ్వరరావు

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : విజయవాడలో భారీ వర్షాలు కురుస్తున్నా.. బుడమేరు కాలువకు ఎలాంటి ముప్పు లేదని, ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుందని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తెలిపారు. గురువారం 58వ డివిజన్ ఇందిరానాయక్ నగర్, భరతమాత గుడి రోడ్డు లోని బుడమేరు కాలువను వారిద్దరూ పరిశీలించారు. అనంతరం కేశినేని శివనాథ్ విలేకర్లతో మాట్లాడారు. వచ్చే వర్షాకాలానికి ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప వర్షంలో బయటకు రాకుండా సహకరించాలని కోరారు. వరదల నివారణకు దీర్ఘకాలిక ప్రణాళికలు అమలు చేస్తున్నామన్నారు. నీటి నిల్వ సామర్థ్యం పెంపు, కాలువల లోతు పెంచడం, నీటి ప్రవాహం మళ్లించడం వంటి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే ఉమా మాట్లాడుతూ.. గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల బుడమేరు ఆధునికీకరణ జరగక నగరం ముంపునకు గురై.. నష్టం వాటిల్లిందని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం రూ.3,000 కోట్లతో ఆధునికీకరణ పనులు చేపట్టి 3,00,000 క్యూసెక్కుల నీటిని మళ్లించే సామర్థ్యం కల్పించిందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్, ఎంపీ కేశినేని శివనాథ్‌లు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. గత సంవత్సర పరిస్థితులు పునరావృతం కాకుండా రిటైనింగ్ వాల్స్ నిర్మించామని పేర్కొన్నారు. ప్రస్తుతం కృష్ణా నది నుంచి 3,80,000 క్యూసెక్కుల నీటిని కిందకు వదులుతున్నా.. బుడమేరు నియంత్రణలో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగవంశ సంక్షేమ, అభివృద్ధి సంస్థ ఛైర్మన్ ఎరుబోతు రమణారావు, మాజీ కార్పొరేటర్లు పిరియా జగదాంబ, ఎరుబోతు శ్రావణి రామారావు, అమర్‌నాథ్‌గౌడ్, మల్లంపాటి రవికుమార్, ఎరుబోతు రామారావు, ఆలా తారక రామారావు, సుల్తానా, ఎస్.కె.జాన్‌వలి, బంగారు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వరద ఉద్ధృతి తగ్గాలని పూజలు


హారతి ఇస్తున్న ఈవో శీనానాయక్ దంపతులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: కృష్ణా నదికి వరద ఉద్ధృతి తగ్గాలని కోరుతూ దుర్గగుడి వైదిక కమిటీ పర్యవేక్షణలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమ, పసుపు, గాజులు, పూలు, పట్టు వస్త్రాలను వేదమంత్రాల మధ్య కృష్ణవేణి మాతకు ఈవో శీనానాయక్ దంపతులు సమర్పించారు. కృష్ణమ్మకు హారతి ఇచ్చారు. దేవస్థాన స్థానాచార్య శివప్రసాదశర్మ, వైదిక కమిటీ సభ్యులు శ్రీధర్‌శర్మ పాల్గొన్నారు.

‘ప్రజల తీర్పు.. జగన్‌కు చెంపపెట్టు’


మాట్లాడుతున్న దేవినేని ఉమామహేశ్వరరావు

గొల్లపూడి, న్యూస్‌టుడే : ప్రజాస్వామ్య పద్ధతిలో పులివెందుల, ఒంటిమిట్ట ప్రజలు ఇచ్చిన తీర్పు జగన్‌కు చెంపపెట్టు అని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం గొల్లపూడిలోని కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కడపలో నాలుగు దశాబ్దాల తర్వాత ప్రజాస్వామ్యం గెలిచిందని, రిగ్గింగ్, దౌర్జన్యాలు, అరాచకాలకు ప్రజలు చరమగీతం పాడారని చెప్పారు. జగన్ పాలనలో నామినేషన్లు కూడా వేయనివ్వకుండా అరాచకాలకు పాల్పడ్డారని ఆరోపించారు. జగన్ చేసిన పాపాలే ఆయనకు శాపాలయ్యాయని, వైనాట్ కుప్పం అన్నారని, నేడు పులివెందుల ప్రజలు తీర్పుతో ఏం సమాధానం చెబుతారన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో జనాలకు పలు సంక్షేమ పథకాలు అందించామని, సుపరిపాలనకు స్పష్టమైన తీర్పు ఇచ్చారని తెలిపారు. శాసన సభకు జగన్ వస్తే తాడేపల్లి ప్యాలెస్ నుంచి మాట్లాడే ప్రతి మాటకు సమాధానం చెప్పడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. జగన్ నడుం వంచి కొబ్బరికాయ కూడా కొట్టలేరని, అలాంటి వ్యక్తి చంద్రబాబు వయసు గురించి మాట్లాడటం సిగ్గు చేటన్నారు.

న్యాయస్థానాల ఆవరణలో ఈ-సేవా కేంద్రాలు



ప్రారంభోత్సవంలో న్యాయాధికారులు సత్యానంద్, సునీల్, భూపాల్‌రెడ్డి తదితరులు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : న్యాయవాదులు, కక్షిదారుల సౌలభ్యం కోసం విజయవాడ న్యాయస్థానాల ఆవరణలో మూడు ఈ-సేవా కేంద్రాలు ప్రారంభించారు. న్యాయశాఖ ఆదేశాల మేరకు తొలి కేంద్రాన్ని రెండో అదనపు జిల్లా జడ్జి ఎ.సత్యానంద్ బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.కె.బాషా ఇతర న్యాయమూర్తులతో కలిసి గురువారం ప్రారంభించారు. రెండో ఈసేవా కేంద్రాన్ని 12వ అదనపు జిల్లా జడ్జి ఎస్.సునీల్, మూడో కేంద్రాన్ని కమర్షియల్ కోర్టు జడ్జి భూపాల్‌రెడ్డి ప్రారంభించారు. వీటి ద్వారా దావాలు కానీ, దావాకు సంబంధించిన దస్తావేజులు కానీ ఫైల్ చేసేందుకు ఉపయోగపడతాయి. న్యాయవాదులకు, కక్షిదారులకు పనులు సులువుగా.. తక్కువ ఖర్చుతో పూర్తవుతాయి. కేసులకు సంబంధించిన వివరాలను కక్షిదారులు ఇక్కడ అడిగి తెలుసుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు వి.భవానీ, ఎ.అనిత, శేషయ్య, తిరుమల వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, అబ్రహాం, టి.అంజని ఎస్.ఎస్.రామ ఆదిత్య రిషిక, పి.తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే క్యాన్సర్ నివారణ సాధ్యమే

పటమట, న్యూస్‌టుడే: ప్రాథమిక స్థాయిలోనే క్యాన్సర్ లక్షణాలను గుర్తించి చికిత్స తీసుకుంటే 98 శాతం నయం అవుతుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ప్రఖ్యాత క్యాన్సర్ వైద్య నిపుణుడు నోరి దత్తాత్రేయుడు అన్నారు. గురువారం పటమటలోని మారిస్ స్టెల్లా కళాశాలలో క్యాన్సర్‌పై అవగాహన కలిగించడానికి ఏర్పాటు చేసిన ‘పింక్ రిబ్బన్ క్యాన్సర్ క్రూసేడర్స్’ క్లబ్‌ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్టెల్లా కళాశాల నుంచి ప్రారంభమైన క్లబ్... ప్రపంచ వ్యాప్తంగా విస్తరిస్తుందని తెలిపారు. ప్రస్తుతం 30 - 35 ఏళ్ల వయసు వారిలోనూ క్యాన్సర్ లక్షణాలు కనిపించడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. వంశపారంపర్య లక్షణాలు, రోజుల తరబడి తగ్గని వ్యాధులను గుర్తించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పొగాకు ఉత్పత్తుల ద్వారా తల, మెడ క్యాన్సర్లు ఎక్కువగా వస్తున్నాయని చెప్పారు. స్టేట్ నోడల్ ఆఫీసర్ శ్యామల మాట్లాడుతూ... విద్యార్థులు సామాజిక మాధ్యమాల ద్వారా క్యాన్సర్ గురించి ప్రచారం చేయాలని కోరారు. వైద్యులు సి.ఆర్.పటేల్, సురేష్, డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ రాజ్‌కిరణ్, స్టెల్లా కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ ఆర్గనైజర్ భారత జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణుడు నోరి దత్తాత్రేయుడు, స్టేట్ నోడల్ ఆఫీసర్ శ్యామల తదితరులు


బతుకు.. జీవుడా.. కృష్ణా నదికి వరద ఉద్ధృతి గంట గంటకూ పెరుగుతుండడంతో నది సమీపంలోని నివాసాలు మునిగిపోయే ప్రమాదం ఉండడంతో స్థానికంగా ఉన్న పశువుల కాపరులు ముందస్తు జాగ్రత్తగా కృష్ణలంక వద్ద రిటైనింగ్ వాల్‌పై గేదెలను కట్టేశారిలా.. - ఈనాడు, అమరావతి

బుడమేరు నుంచి 2వేల క్యూసెక్కులు..

జి.కొండూరు, న్యూస్‌టుడే : వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ వద్ద 3 అడుగుల ఎత్తులో వరద ప్రవాహం కొనసాగుతోంది. బుధవారం రాత్రి నుంచి వర్షం లేకపోవడంతో బుడమేరుకు వరద ముప్పు తప్పిందని నీటి పారుదల శాఖ అధికారులు గురువారం తెలిపారు. బుడమేరు హెడ్ రెగ్యులేటర్ గేట్లు 11 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం కలదని, దాదాపు 2,000 క్యూసెక్కుల వరద నీరు బుడమేరు డైవర్షన్ ఛానెల్ ద్వారా ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం దగ్గర కృష్ణానదిలో కలుస్తున్నట్లు చెప్పారు.

జాతీయ వాలీబాల్ మహిళా విజేత ‘ఐసీఎఫ్’


అతిథుల నుంచి విన్నర్ ట్రోఫీ అందుకున్న ఐసీఎఫ్ జట్టు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో సిద్ధార్థ అకాడమీ గోల్డెన్ జూబ్లీ సందర్భంగా నిర్వహించిన జాతీయ స్థాయి ఆహ్వాన వాలీబాల్ పోటీ మహిళా విభాగంలో ఐసీఎఫ్ (చెన్నై) జట్టు విజేతగా నిలిచింది. కానూరులోని సిద్ధార్థ అకాడమీ డీమ్డ్ యూనివర్సిటీ ఇండోర్ స్టేడియంలో గురువారం రాత్రి జరిగిన మహిళల ఫైనల్ మ్యాచ్‌లో ఐసీఎఫ్(చెన్నై) జట్టు, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (పుణె) జట్టుపై గెలుపొందింది. పురుషుల సెమీఫైనల్‌లో శాయ్ (త్రివేండ్రం) జట్టు... బిషప్ మోర్ కళాశాల (కేరళ) జట్టుపై, ఎస్ఆర్ఎం వర్సిటీ (చెన్నై) జట్టు.. లయోలా కళాశాల (చెన్నై) జట్టుపై గెలిచి ఫైనల్‌లో ప్రవేశించాయి. పురుషుల ఫైనల్ మ్యాచ్ శాయ్, ఎస్ఆర్ఎం వర్సిటీ జట్ల మధ్య కొనసాగుతోంది. పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మహిళా విభాగం విజేతలకు బహుమతులు అందజేశారు. వర్సిటీ ఉపకులపతి ఆచార్య పీవీ రావు, సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు మలినేని రాజయ్య, కోశాధికారి సూరెడ్డి వెంకటేశ్వర్లు, శాప్ మాజీ ఛైర్మన్ పోలినేని అంకమ్మచౌదరి, పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపల్ మేకా రమేష్ పాల్గొన్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

సచివాలయాల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : వరద ముంపు నుంచి ప్రజలను అప్రమత్తం చేసేందుకు ముందస్తుగా మండలంలోని ప్రతి గ్రామ సచివాలయంలో కంట్రోల్ రూము ఏర్పాటు చేసినట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో సీహెచ్.ప్రసాద్ తెలిపారు.

నీరు నిల్వ లేకుండా చర్యలు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : రంగాపురం బాలికల గురుకుల పాఠశాల ఆవరణలో నీరు నిల్వ లేకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు గురువారం జేసీబీతో కాల్వ తీయించి నీరు బయటకు పంపేందుకు చర్యలు చేపట్టారు. సర్పంచి సునీల, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి రామారావు, పాఠశాల ప్రిన్సిపల్ తబిత పర్యవేక్షించారు.

బుడమేరు వరదపై అపోహలు వద్దు


బుడమేరు వరదను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : బుడమేరు వరదపై ఎలాంటి అపోహలు వద్దని పరిస్థితి అదుపులోనే ఉందని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ఆయన కొండపల్లి శాంతినగర్ వద్ద వంతెనపై నుంచి బుడమేరు ప్రవాహాన్ని గురువారం పరిశీలించి మాట్లాడారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎప్పటికప్పుడు బుడమేరు వరద పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు చెప్పారు. వరద పరిస్థితిని అంచనా వేసి తనకు నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఫెర్రీ, పవిత్ర సంగమం ఘాట్లలో కృష్ణా నది వరద ఉద్ధృతిని పరిశీలించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందనకు వందనం

◆ తిరువూరు పట్టణ పరిధిలోని 7వ వార్డులో డ్రెయిన్‌లో పిచ్చిమొక్కలు, వ్యర్థాలు ఉన్నాయని స్థానికుడు సీహెచ్.ప్రభాకరరావు సమస్యను 'ఈనాడు' మేమున్నాం..మీకు తోడుగా ద్వారా అధికారులకు తెలిపారు. దీనిపై అధికారులు స్పందించి మున్సిపాలిటీ కార్మికులతో కాలువలను శుభ్రం చేయించారు. **- న్యూస్‌టుడే, తిరువూరు టౌన్**

◆ రెడ్డిగూడెం పంచాయతీ పరిధి కొత్త రెడ్డిగూడెంలోని తారు రోడ్డుపై కొందరు వ్యర్థాలు వేస్తున్నారని గ్రామస్థులు 'మేమున్నాం..మీకు తోడుగా' ద్వారా సమస్యను పంచాయతీ కార్యదర్శి ఎస్.రామారావుకు తెలిపారు. ఆయన స్పందించి సిబ్బందితో వాటిని తీయించారు. **- న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

వర్షం..అంతా జలమయం


రంగాపురం చెరువు నిండి బయటకు వస్తున్న నీరు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు రెడ్డిగూడెం మండలంలోని వాగుల్లో వరద నీటి ప్రవాహం పెరిగింది. చిన నందిగామ- పుట్రేల రహదారి ఓబులాపురంలోని నాగసానిపాటి చెరువు కట్టువాగు చప్టాపై నుంచి వచ్చే వరద ఉద్ధృతి పెరగడంతో రాకపోకలు నిలిచాయి. మరో వైపు కట్టువాగు పొంగడంతో ఆ నీరు కూడా వరి పొలాల్లో చేరుతుంది.

గొల్లపూడి, న్యూస్‌టుడే : పంట కాలువలు పూడ్చేయడం, డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో వర్షపు నీరు కదిలే పరిస్థితి లేకుండా పోయింది. గొల్లపూడి సూరాయిపాలెం వద్ద పశ్చిమ బైపాస్ నిర్మాణం కారణంగా అనేక చోట్ల కల్వర్టులనే మూసేశారు. ఈ క్రమంలో డ్రెయినేజీ వ్యవస్థ దెబ్బతినడంతో పొలాలు ముంపునకు గురయ్యాయి. రాయనపాడు, పైడూరుపాడులోని పొలాలు సైతం ముంపులోనే ఉన్నాయి.

గంపలగూడెం, న్యూస్‌టుడే : కట్లేరులో వరద నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. దీంతో మల్లింపు రోడ్డుపై బుధవారం అర్ధరాత్రి నుంచి రాకపోకలను అధికారులు ఆపేశారు. ఎస్సై శ్రీను ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే : హెచ్.ముత్యాలంపాడు వద్ద బుడమేరు లోలెవల్ వంతెనపై వరద నీరు ప్రవహిస్తునే ఉంది. దీంతో స్థానిక పోలీసులు బారికేడ్లు అడ్డంగా పెట్టి రాకపోకలు నిలిపేశారు.

గంపలగూడెం, తిరువూరు, ఎ.కొండూరు, న్యూస్‌టుడే : రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లోని వాగులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. ఈ క్రమంలో పలు గ్రామాల మధ్య వాగులపై రాకపోకలను అధికారులు ఆపేశారు. కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాల మేరకు మూడు మండలాల్లోని రెవెన్యూ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు.


గొల్లపూడి : అపార్టుమెంట్ సెల్లార్‌లో ఇలా..


కట్లేరు వంతెన వద్ద పరిస్థితి


వెదుళ్ల వాగు కల్వర్టు వద్ద రెవెన్యూ, పోలీస్ అధికారులు

త్రీడీ ప్రింటింగ్‌పై శిక్షణ

మైలవరం, న్యూస్‌టుడే : స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగం, ఇనిస్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో బేసిక్స్ ఆఫ్ త్రీడీ ప్రింటింగ్‌పై గురువారం ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.

సహాయక చర్యలు ముమ్మరం


నాయకులతో మాట్లాడుతున్న మైలవరం ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : వరద బాధితులకు సహాయక చర్యలు ముమ్మరం చేసినట్లు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ తెలిపారు. ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్‌లో వరద బాధితుల కోసం ఏర్పాటు చేసిన పునరావస కేంద్రాన్ని ఆయన గురువారం పరిశీలించి మాట్లాడారు. వరద తగ్గుముఖం పట్టే వరకు కేంద్రానికి తరలించిన వారికి తాగు నీరు, భోజనం, వైద్య సదుపాయాలు కల్పించనున్నట్లు చెప్పారు. అనంతరం డీఎంహెచ్‌వో సుహాసిని కూడా కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


అధికారులకు సూచనలు ఇస్తున్న ఆర్డీవో మాధురి

విస్సన్నపేట, న్యూస్‌టుడే : వరదల వల్ల ప్రజలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో మాధురి అధికారులకు సూచించారు. విస్సన్నపేట మండలంలోని ముంపు, లోతట్టు ప్రాంతాలను ఆమె గురువారం పరిశీలించారు. తహసీల్దార్ లక్ష్మీ కల్యాణి, ఇన్‌ఛార్జి ఎంపీడీవో సీహెచ్.ప్రసాద్, పంచాయతీ ఈవో హరికృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మద్దులపర్వలో చప్టాపై ప్రవహిస్తున్న వరద నీటిని తిరువూరు ఆర్డీవో మాధురి పరిశీలించారు. తహసీల్దార్ జె.సుశీలాదేవి, ఆర్ఐ జి.పుల్లయ్య, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

ముగిసిన శివాలయ శిఖర ప్రతిష్ఠ మహోత్సవాలు


పూజా క్రతువులో ఎమ్మెల్యే శ్రీనివాసరావు, దాత సుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : మండల పరిధి పుట్రేలలోని శ్రీఉమాదేవి సమేత ఆకేశ్వర స్వామి ఆలయంలో రెండు రోజులుగా జరుగుతున్న శిఖర పునః ప్రతిష్ఠ మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి అతిథిగా ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. దాత గోటేటి సుబ్రహ్మణ్యేశ్వరరావు, తిరువూరు ఏఎంసీ మాజీ ఛైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణ రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వర రెడ్డిఅధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పట్టణంలో సైకిల్‌పై పర్యటన

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : తిరువూరు పట్టణ పరిధిలోని ప్రధాన రహదారులను, 10, 11వ వార్డులను స్థానిక ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు గురువారం సైకిల్‌పై పర్యటించి పరిశీలించారు. ఇందులో భాగంగా స్థానికులను కలిసి సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : రేపూడిలో నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి గురువారం క్షీరాభిషేకం చేశారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నెరవేర్చిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

హాజరు మస్టర్లు దిద్దినట్లు గుర్తించాం


గ్రామ సభలో ప్రసంగిస్తున్న డీఆర్పీ రమేష్

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : రంగాపురం పంచాయతీలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో కూలీల హాజరుకు సంబంధించిన మస్టర్లు 40 శాతం దిద్దినట్లు గుర్తించినట్లు డీఆర్పీ ఎన్.రమేష్ తెలిపారు. గురువారం రంగాపురం గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. సామాజిక తనిఖీ బృందం గుర్తించిన విషయాలను ఆయన వివరించారు. సర్పంచి పి.సునీల, పంచాయితీ ఇన్‌ఛార్జి కార్యదర్శి ఎస్.రామారావు, ఎస్ఆర్పీ బి.తులసీ నాయక్, ఏపీవో భాస్కర్, టీఏ శ్రీనివాసరావు, వీఎస్ఏలులు పాల్గొన్నారు.

తెదేపా విజయంపై హర్షం


మైలవరంలో కేకు కోస్తున్న తెదేపా నాయకులు

మైలవరం, న్యూస్‌టుడే : కడప జిల్లా పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాల్లో తెదేపా అభ్యర్థులు ఘన విజయం సాధించడంపై ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక బోసు బొమ్మ కూడలిలో గురువారం సంబరాలు నిర్వహించారు. కేకు కోసి పంచి పెట్టారు. నాయకులు లితీష్, రాధాకృష్ణ, బాలకృష్ణ, కరీం, ప్రసాద్, వెంకట నారాయణ పాల్గొన్నారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : కడప జిల్లా పులివెందుల, ఒంటిమిట్టలో జడ్పీటీసీ ఎన్నికల్లో తెదేపా విజయం సాధించడంపై స్థానిక ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

మాజీ ఎమ్మెల్యేకి మాతృ వియోగం

జి.కొండూరు, న్యూస్‌టుడే : మైలవరం మాజీ ఎమ్మెల్యే జేష్ఠ రమేష్‌బాబు మాతృమూర్తి విమలాదేవి(92) బుధవారం రాత్రి ఆయన స్వగృహం కుంటముక్కలలో మృతి చెందారు. ఆమె మనువడు ఆస్ట్రేలియా నుంచి రావాల్సి ఉండటంతో శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ కేశినేని శ్రీనివాసరావు(నాని) జేష్ఠ రమేష్‌బాబును గురువారం ఆయన స్వగృహంలో పరామర్శించారు.

ఉత్సాహంగా స్వాగతోత్సవం


సంప్రదాయ వస్త్రధారణతో బాలికల ప్రదర్శన

తిరువూరు, న్యూస్‌టుడే : పట్టణంలోని శ్రీనిధి జూనియర్ కళాశాలలో గురువారం ప్రథమ ఇంటర్ విద్యార్థులకు స్వాగతోత్సవం(ఫ్రెషర్స్‌డే)ను నిర్వహించారు. ఇందులో బాలికలు సంప్రదాయ వస్త్రధారణతో అలరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఆలిండియా బ్యాడ్మింటన్‌లో పసిడి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: కోల్‌కతాలో ఈ నెల 9 నుంచి 14వ తేదీ వరకు జరిగిన ఆలిండియా సబ్ జూనియర్ (అండర్-13) బ్యాడ్మింటన్ ర్యాంకింగ్ టోర్నీలో జిల్లాకు చెందిన కావ్య శ్రీరామ్ పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది.

త్రిసభ్య కమిటీకి అభినందనలు

జి.కొండూరు, న్యూస్‌టుడే : వెల్లటూరు సొసైటీలో గురువారం బాధ్యతలు చేపట్టిన త్రిసభ్య కమిటీని గ్రామస్థులు అభినందించారు. సొసైటీ అధ్యక్షుడు చింతపల్లి సుధాకర్, సభ్యులు గుడిపూడి శ్రీనివాసరావు, జక్కుల మణిలను సన్మానించారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్లు ధనేకుల సాంబశివరావు, మాదు ఆంజనేయులు, సర్పంచి వేల్పూరి సుజానమ్మ, కార్యదర్శి ఎం.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : రుద్రవరం పీఏసీఎస్ అధ్యక్షుడిగా ఎం.సాంబశివరావు సభ్యులుగా పి.సత్యానారాయణ, ఎం.రామారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు వీరిని మాజీ సర్పంచి జమలయ్య, పీఏసీఎస్ కార్యదర్శి పి.మార్కండేయ తదితరులు అభినందించారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే : చినకొమిర సొసైటీలో ఎ.శేషగిరిరావు, పి.సత్యం, కె.కిరణ్, కనుమూరు సొసైటీలో టి.అప్పిరెడ్డి, జి.గంగరాజు, పి.రమణయ్య, పెనుగొలను సొసైటీలో ఎన్.మురళి, కె.పుల్లారావు, ఎస్.ఇలయ్య బాధ్యతలు తీసుకున్నారు. తెదేపా నాయకులు త్రిసభ్య కమిటీల సభ్యులను అభినందించారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా

కొండపల్లి, న్యూస్‌టుడే : దేశంలోని ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురుతుండాలని భాజపా నాయకులు అన్నారు. గురువారం కొండపల్లిలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు రఘునాథ రెడ్డి, మధురి, యుగంధర్, భవానీ, నాగమణి పాల్గొన్నారు.


మైలవరం డిగ్రీ కళాశాలలో పతాకాలను ప్రదర్శిస్తూ..


కొండపల్లి : జెండాలను ఇంటింటికి అందిస్తూ..

మైలవరం, న్యూస్‌టుడే : హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ పతాకాలను ప్రదర్శించారు. ప్రిన్సిపల్ ఇల్లా రవి, ఉప ప్రిన్సిపల్ పి.రంగారావు ఆధ్వర్యంలో ఎన్‌సీసీ విద్యార్థులు త్రివర్ణ పతాకాలతో నినాదాలు చేశారు.

జాతిపిత, వివేకానంద విగ్రహాల ఆవిష్కరణ


విగ్రహాల వద్ద దాత, నాయకులు, ప్రజాప్రతినిధులు

గంపలగూడెం, న్యూస్‌టుడే : అనుములంకలోని ప్రాథమిక పాఠశాలలో గట్టుచెరువుకు చెందిన గుర్రం శేషగిరిరావు(శేషయ్య) వితరణతో నిర్మించిన జాతిపిత మహాత్మా గాంధీ, స్వామి వివేకానంద విగ్రహాలను తెదేపా నాయకులు గురువారం ఆవిష్కరించారు. దాత శేషయ్య, తెదేపా మండల అధ్యక్షుడు ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల పర్వం.. ట్రాఫిక్‌కు అంతరాయం


డ్రెయిన్‌పైకి చొచ్చుకొచ్చిన దుకాణం

విస్సన్నపేట- నూజివీడు జాతీయ రహదారికి ఇరు వైపులా మండల కేంద్రం విస్సన్నపేటలో ఆక్రమణలు పెరగడంతో నిత్యం ట్రాఫిక్‌కి అంతరాయం కలుగుతోంది. దీంతో పలు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. చివరికి డ్రెయిన్‌పైకి, రోడ్ల అంచుల వరకు పలు దుకాణాలు వెలుస్తున్నాయి. గాంధీ బొమ్మ కూడలి నుంచి మసీదు సెంటర్ వరకు పలు చోట్ల ఆక్రమణలు వల్ల దుకాణాల వద్దకు వచ్చే కొనుగోలు దారులు వాహనాలు నిలిపే స్థలం లేక రహదారిపై పార్కింగ్ చేయడంతో ప్రమాదాల తీవ్రత రోజురోజుకు పెరుగుతోందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ సమస్యను ఇన్‌ఛార్జి ఎంపీడీవో ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. పంచాయతీ, ఆర్అండ్‌బీ అధికారులను సమన్వయం చేసుకొని క్షేత్ర స్థాయిలో పర్యటించి ఆక్రమణలను గుర్తించి తొలగిస్తామని చెప్పారు. **- న్యూస్‌టుడే, విస్సన్నపేట**

సమాచార హక్కు చట్టంపై అవగాహన

జి.కొండూరు, న్యూస్‌టుడే : రాష్ట్ర సహకార సంఘం ఆదేశాల మేరకు గురువారం జి.కొండూరు, కవులూరులోని సొసైటీ ఆవరణలో రైతులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. దీని ద్వారా అందించే సేవలను అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం రైతులు, సహకార సంఘం సిబ్బందితో కలిసి ఆయా గ్రామాల్లో ప్రదర్శన చేపట్టారు.

గొల్లపూడి, న్యూస్‌టుడే : కొత్తూరు తాడేపల్లిలోని పీఏసీఎస్ వద్ద సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్లకార్డులతో ప్రదర్శన చేపట్టారు.

ఆర్థిక స్వేచ్ఛను సాధిద్దాం

డబ్బు సంపాదించడం కోసం అందరమూ కష్టపడతాం. అంత మాత్రాన ఆర్థిక స్వేచ్ఛ వచ్చినట్లేనా? మనం అనుకున్న లక్ష్యాలను సాధించే శక్తి రావాలి. మనకు నచ్చిన జీవన శైలి, భవిష్యత్తుపై ఏమాత్రం ఆందోళన లేని పరిస్థితులు, ఆర్థికపరమైన అనుకోని సంఘటనలనూ సమర్థంగా ఎదుర్కొనే ధైర్యం.. అప్పుడే అసలైన ఆర్థిక స్వేచ్ఛ. దీనికోసం నిరంతరం తెలుసుకుంటూనే ఉండాలి.



వేగవంతమైన జీవితంలో ప్రతి ఒక్కరూ ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరుకోవాలనే లక్ష్యాన్ని విధించుకుంటున్నారు. ఆదాయానికి పరిమితి ఉంటుంది. దీనికి లోబడే ఖర్చులూ ఉండాలి. అదే సమయంలో ఖర్చులకు ముందే కొంత పొదుపు చేయాలి. పెట్టిన పెట్టుబడులు మన కోసం కష్టపడుతూ రెండో ఆదాయాన్ని ఆర్జించడం ప్రారంభించాలి. ఇదే మనల్ని సంపన్నులను చేస్తుంది. డబ్బు గురించి మన ఆలోచనలు మార్చుకున్నప్పుడే ఇది సాధ్యం అవుతుంది.

స్వల్పకాలిక ఆలోచనలు వద్దు..

'ధనవంతులు కావాలనే కోరిక ఉంటేనే చాలదు. వారిలా ఆలోచించడమూ నేర్చుకోవాలి' అని ఆర్థిక నిపుణుల సూచన. మనలో చాలామంది తక్షణ అవసరాలు, ఆదాయం పెరగగానే జీవన శైలిలో మార్పులు, విలాసవంతమైన వస్తువులు కొనడం లాంటి వాటికే ప్రాధాన్యం ఇస్తుంటాం. కానీ, నెలకు రూ.20 వేల చొప్పున, 20 ఏళ్లపాటు మదుపు చేస్తే.. సగటు వార్షిక రాబడి 11 శాతం అంచనాతో రూ.1.74 కోట్లు చేతిలో ఉంటాయనే సంగతి గమనించం. పెట్టుబడిని ఏటా 10 శాతం చొప్పున పెంచుకుంటూ వెళ్తే.. ఈ మొత్తం రూ.3.57 కోట్లు అవుతుంది. ఆవేశపూరిత ఖర్చులు, ప్రణాళిక లేకపోవడంతో చాలామంది స్థిరంగా పెట్టుబడులు పెట్టరు. ఫలితంగా ఆర్థిక స్వేచ్ఛ దూరమవుతోంది.

వేతనంపైనే ఆధారపడితే

ఇటీవలి నివేదికల ప్రకారం.. మన దేశంలో చాలామంది పొదుపు, పెట్టుబడులకు దూరం అవుతున్నారు. దీనికి ప్రధాన కారణం జీవన శైలి ద్రవ్యోల్బణమే. ఖర్చులకే ప్రాధాన్యం ఇస్తుండటం. వేతనం నుంచి వేతనం వరకూ అనే ధోరణి ఎక్కువగా కనిపిస్తోంది. ఆర్థిక స్వేచ్ఛకు ఇది పెద్ద అడ్డంకి. డబ్బు ఉంది కదా ఖర్చు చేసేద్దాం. అంటే.. 30-35 ఏళ్లు దాటిన తర్వాత నుంచి ఆర్థిక ఒత్తిడి ప్రారంభమవుతుంది. ఇది మిగతా లక్ష్యాలపై ప్రభావం చూపిస్తుంది. కనీసం ఆరు నుంచి ఏడాది వరకు ఖర్చులకు సరిపడే అత్యవసర నిధి మనకు ఎంతో ఆర్థిక భరోసానిస్తుంది.

30-30-40

చాలామంది తమ ఆదాయంలో 10 శాతానికి మించి పొదుపు చేయడం లేదు. ఇది పెద్ద పొరపాటు. వచ్చిన ఆదాయంలో 30 శాతం అవసరాలు, 30 శాతం రుణాలు, ఇతర బిల్లులు, 40 శాతం వరకూ పొదుపు, పెట్టుబడులకు కేటాయించేలా ఆర్థిక ప్రణాళికలు ఉండాలి. 40 శాతం పొదుపు ఇబ్బందిగా ఉంటే.. కనీసం 20-25 శాతంతో ప్రారంభించి, క్రమంగా పెంచుకోవాలి. ఇష్టాల కోసం ఖర్చులు ఆకర్షిస్తూనే ఉంటాయి. క్రమశిక్షణ దీర్ఘకాలంలో మంచి ఫలితాలనిస్తుంది.

ఆలోచన మారాలి

డబ్బు గురించి రాజీ పడుతూ జీవించాలని ఎవరూ చెప్పరు. వచ్చిన మొత్తాన్ని సమర్థంగా వినియోగించడమే ఆర్థిక స్వేచ్ఛ. భావోద్వేగ, సామాజిక మాధ్యమాల బారిన పడొద్దు. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలను నిర్దేశించుకోండి. వాటిని సాధించేందుకు అవసరమైన పెట్టుబడి మార్గాలను అన్వేషించండి. మ్యూచువల్ ఫండ్లు, స్థిరాస్తులు, బంగారం, బాండ్లు ఇలా వైవిధ్యమైన పథకాల్లో మదపు చేసేందుకు ప్రయత్నించండి. చిన్న మొత్తంతోనైనా మదుపు ప్రయాణం ప్రారంభించాలి. అదే దీర్ఘకాలంలో ఆర్థిక స్వేచ్ఛ అనే గమ్యాన్ని చేరుస్తుంది.

siri@eenadu.net

మహిళలకు టర్మ్ పాలసీ

శుభ్ శక్తి

అన్ని రంగాల్లోనూ తమ శక్తిని చాటుతున్న భారతీయ మహిళల కోసం ప్రత్యేకంగా శుభ్ శక్తి పేరుతో టర్మ్ ఇన్సూరెన్స్ ప్లాన్‌ను టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ ఆవిష్కరించింది. మహిళల జీవితంలోని ప్రతి దశలోనూ ఆర్థిక అవసరాలకు తగ్గట్లుగా, సమగ్ర రక్షణ కల్పించే విధంగా దీన్ని తీసుకొచ్చింది. తమ కుటుంబానికి ఆర్థిక రక్షణ కల్పించేందుకు ఇది తోడ్పడుతుంది. సాధారణ టర్మ్ పాలసీ తరహాలోనే పనిచేసినప్పటికీ, మహిళల కోసం కొన్ని ప్రత్యేక వెసులుబాట్లు ఉన్నాయి. బిడ్డ పుట్టిన తర్వాత 12 నెలల పాటు ప్రీమియం హాలిడే వర్తిస్తుంది. పాలసీ వ్యవధిలో రెండుసార్లు దీన్ని అందిస్తారు. పురుషులతో పోలిస్తే మహిళలకు 15 శాతం ప్రీమియం తక్కువగా ఉంటుంది. పాలసీ కొనసాగినన్ని రోజులూ ఇది వర్తిస్తుంది. ఒంటరి తల్లులకు ప్రీమియంలో 15 శాతం రాయితీనిస్తుంది. మహిళలకు ప్రత్యేకమైన వ్యాధులకూ వర్తించేలా దీన్ని తీసుకొచ్చారు. ఏడాదికోసారి వైద్య పరీక్షల్లాంటివీ ఉంటాయి. ప్రమాదవశాత్తూ జీవిత భాగస్వామి మరణిస్తే.. అప్పటి నుంచి తదుపరి ప్రీమియాలు చెల్లించాల్సిన అవసరం లేకుండా ప్రీమియం వెయివర్ వెసులుబాటు ఉంది.

వైవిధ్యంగా పెట్టుబడులు

ఈక్విటీలు, బంగారం, డెట్ పథకాల్లో మదుపు చేయాలని భావించే వారిని లక్ష్యంగా చేసుకొని, ఎడిల్‌వైజ్ మ్యూచువల్ ఫండ్ సరికొత్త ఫండ్‌ను తీసుకొచ్చింది. **ఎడిల్‌వైజ్ మల్టీ అసెట్ ఓమ్ని ఫండ్ ఆఫ్ ఫండ్** అనే ఈ పథకం ఎన్‌ఎఫ్‌ఓ ఈ నెల 26 వరకూ అందుబాటులో ఉంటుంది. కనీస పెట్టుబడి రూ.100. ఈక్విటీ, డెట్, గోల్డ్, సిల్వర్ ఈటీఎఫ్‌లలో వైవిధ్యంగా మదుపు చేయడం ద్వారా పెట్టుబడిదారులకు బహుళ పెట్టుబడి అవకాశాలను కల్పిస్తుంది. మార్కెట్ పరిస్థితులను బట్టి, ఆయా విభాగాల్లో పెట్టుబడి నిష్పత్తిని మారుస్తూ ఉంటుంది. ఈ విధానం వల్ల ఒకే విభాగంపై ఆధారపడకుండా చూసుకుంటుంది. నష్టభయం భరించగలిగి, 5-7 ఏళ్లపాటు కొనసాగే దీర్ఘకాలిక మదుపరులకు ఇది అనుకూలం. మల్టీ అసెట్ వ్యూహంతో ఒకే ఫండ్‌లో వివిధ విభాగాల్లో మదుపు చేయాలనుకునే వారూ పరిశీలించవచ్చు.


అధిక రాబడి ఆర్జించేలా

డీఎస్‌పీ మ్యూచువల్ ఫండ్ ఒక వినూత్న పథకాన్ని తీసుకొచ్చింది. **డీఎస్‌పీ నిఫ్టీ 500 ఫ్లెక్సీక్యాప్ క్వాలిటీ 30 ఇండెక్స్ ఫండ్** పేరుతో వచ్చిన ఈ పథకం ఎన్‌ఎఫ్‌ఓ ఈ నెల 22 వరకూ అందుబాటులో ఉంటుంది. కనీస పెట్టుబడి రూ.100. నిఫ్టీ 500 ఫ్లెక్సీ క్యాప్ క్వాలిటీ 30 ఇండెక్స్‌ను ప్రామాణికంగా తీసుకుంటుంది. అధిక రిటర్న్ ఆన్ ఈక్విటీ (ఆర్ఓఈ), తక్కువ అప్పులు, స్థిరమైన ఆదాయ వృద్ధి వంటి నాణ్యతా ప్రమాణాల ఆధారంగా కంపెనీలను ఎంపిక చేస్తుంది. మార్కెట్ పరిస్థితులను బట్టి, లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ స్టాక్‌లలో పెట్టుబడి నిష్పత్తిని మార్చుకుంటూ వెళ్తుంది. తొలిసారిగా ఫ్లెక్సీక్యాప్, క్వాలిటీ రెండింటినీ కలిపిన వ్యూహంతో వచ్చింది. దీర్ఘకాలిక లక్ష్యాలు, నష్టభయం భరించగలిగే వారికి అనుకూలం.

ప్రత్యేక వ్యూహంతో

నష్టభయాన్ని పరిమితం చేస్తూ, అనేక రకాల వ్యూహాలతో పనిచేస్తున్న ఈటీఎఫ్‌లలో మదుపు చేసే వ్యూహంతో మిరే అసెట్ మ్యూచువల్ ఫండ్ ఒక కొత్త పథకాన్ని తీసుకొచ్చింది. **మిరే అసెట్ మల్టీ ఫ్యాక్టర్ పాసివ్ ఫండ్ ఆఫ్ ఫండ్** అనే ఈ పథకం ఎన్‌ఎఫ్‌ఓ ఈ నెల 25 వరకూ కొనసాగుతుంది. కనీస పెట్టుబడి రూ.5,000. వాల్యూ, గ్రోత్, క్వాలిటీ, మొమెంటమ్‌లాంటి వాటి ఆధారంగా పనిచేసే ఈటీఎఫ్‌లను ఎంచుకొని, వాటిలో మదుపు చేస్తుంది.

మీ బండికి బీమా ఉందా?



మోటారు వాహనాల వినియోగం గణనీయంగా పెరిగింది. ప్రమాదాలూ అదే స్థాయిలో నమోదవుతున్నాయి. ఈ సందర్భాల్లో బండి దెబ్బతినడం, వాహనాదారుడికి గాయాలు కావడం, కొన్నిసార్లు మరణాలూ సంభవిస్తుంటాయి. ప్రయాణంలో జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి. దీంతోపాటు అనుకోని ప్రమాదంలో ఆర్థిక భారం లేకుండా ఉండేందుకు మోటార్ వాహన బీమా కూడా ఉండాలి.

భారతీయ మోటారు వాహన చట్టం ప్రకారం రోడ్డుపై తిరిగే ప్రతి వాహనానికి కనీసం థర్డ్ పార్టీ బీమా తప్పనిసరి. ఇది లేకుండా వాహనాన్ని బహిరంగ ప్రదేశాల్లో ఉపయోగించడం నేరం. లైసెన్సు, వాహన రిజిస్ట్రేషన్, బీమా, ఇతర అవసరమైన పత్రాలు లేకుండా వాహనం తీయకూడదు.

✦ వాహనం ద్వారా మూడో పక్షానికి (థర్డ్ పార్టీ.. వాహనం, వాహనాన్ని నడిపే వ్యక్తి కాకుండా ఇతరులు) ఏదైనా నష్టం వాటిల్లినప్పుడు పరిహారం ఇచ్చేది థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్. దీన్ని లయబిలిటీ ఓన్లీ పాలసీగానూ పిలుస్తారు.

✦ విస్తృత బీమా ప్రయోజనాన్ని కల్పించేది సమగ్ర ద్విచక్ర వాహన బీమా. ప్రమాదం, దొంగతనం, వరదలు, అగ్నిప్రమాదం, ప్రకృతి వైపరీత్యాలు, తదితర వాటి వల్ల నష్టానికి పరిహారం ఇవ్వడంతోపాటు, థర్డ్ పార్టీకి వాటిల్లిన నష్టాన్నీ ఇది భర్తీ చేస్తుంది. సమగ్ర బీమా పాలసీకి కొన్ని అనుబంధ పాలసీలనూ జోడించుకునే అవకాశం ఉంది. వీటిని రైడర్లుగా పిలుస్తారు.

రోడ్డుపై వాహనం తిరగాలంటే కచ్చితంగా బీమా ఉండాల్సిందే. కానీ, ఇటీవలి నివేదికల ప్రకారం చూస్తే.. అధిక శాతం వాహనాలకు ముఖ్యంగా ద్విచక్ర వాహనాలకు బీమా పాలసీ ఉండటమే లేదు. బీమా లేకుండా రోడ్డు పైకి వచ్చే వాహనాలకు జరిమానా విధించాలని ప్రభుత్వాలు ఆలోచిస్తున్నాయి. ఇప్పటికే ఇది అమలవుతున్నా, కాస్త కఠినంగా వ్యవహరించాలని అనుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో మీ బండికి బీమా ఉందా లేదా ఒకసారి పరిశీలించండి.

సున్నా తరుగుదల: ద్విచక్ర వాహన బీమా పాలసీలో ముఖ్యమైన రైడర్లలో ఇదొకటి. ప్రమాదంలో దెబ్బతిన్న భాగాల విలువకు సమానమైన మొత్తాన్ని అందుకుంటారు. ఈ యాడ్-ఆన్ లేకపోతే ప్రతి భాగంపై తరుగుదల లెక్కించి, ఆ మేరకే బీమా సంస్థ చెల్లిస్తుంది. మిగతా మొత్తాన్ని చేతి నుంచి భరించాల్సి వస్తుంది.

ఇంజిన్‌కు రక్షణ: ఇంజిన్ అంతర్గత భాగాలు దెబ్బతిన్నప్పుడు ఇది ఉపయోగపడుతుంది. వరదల్లో వాహనం చిక్కుకున్నప్పుడు ఇంజిన్ పాడయ్యే అవకాశం ఉంటుంది. ఇలాంటప్పుడు ఈ అనుబంధ పాలసీ ఉపయోగపడుతుంది. టైర్లకు నష్టం వాటిల్లినప్పుడు టైర్ ప్రొటెక్టర్ పాలసీ సైతం అందుబాటులో ఉంటుంది.

వాహనం ఆగితే సాయం: ప్రమాదం లేదా వాహనం చెడిపోవడంలాంటి సందర్భాల్లో వాహనం రోడ్డుపైనే ఆగిపోతుంది. ఇలాంటప్పుడు సాయం చేసేందుకు రోడ్ సైడ్ అసిస్టెన్స్ రైడర్ ఉపయోగపడుతుంది.

నట్లు, బోల్టులకూ: వాహనం పాడైన సందర్భంలో నట్లు, బోల్టులు, ఇంజిన్ ఆయిల్ లాంటి వాటికోసం చేసిన ఖర్చులనూ తిరిగి పొందేందుకు కన్జూమబుల్ యాడ్-ఆన్ పాలసీ తీసుకోవచ్చు.

మనం ఎంత సురక్షితంగా వాహనాన్ని నడిపినా.. అనుకోకుండా ప్రమాదాల బారిన పడే సందర్భాలుంటాయి. ఇలాంటి వాటికి ఆర్థికంగా సన్నద్ధం కావడం ముఖ్యం. అదే సమయంలో చట్టపరమైన బాధ్యతనూ నెరవేర్చడంలోనూ బీమా పాలసీ తోడ్పడుతుంది. కాబట్టి, మీ వాహనానికి ఎప్పుడూ సమగ్ర వాహన బీమా పాలసీ ఉండేలా చూసుకోండి. రోడ్డు మీద ధీమాగా ఉండండి.

ఐటీఆర్ గడువుకు ముందే

గత ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేసేందుకు సెప్టెంబరు 15 వరకూ గడువు ఉంది. కొత్త పన్ను విధానంతోపాటు, రిటర్నుల పత్రాల్లో పలు మార్పులు చేసిన నేపథ్యంలో జులై 31 నుంచి ఈ గడువును పొడిగించిన విషయం తెలిసిందే. ఇప్పటికీ మీరు ఐటీఆర్ దాఖలు చేయకపోతే వీలైనంత త్వరగా ఆ ప్రక్రియ పూర్తి చేయండి. చివరి నిమిషంలో తప్పులు నివారించేందుకు సకాలంలో దాఖలు చేయడం ముఖ్యం. గడువు దాటితే రూ.5లక్షల లోపు ఆదాయం ఉన్న వారికి రూ.1,000, అంతకన్నా అధిక ఆదాయం ఉన్న వారికి రూ.5,000 వరకూ జరిమానా ఉంటుంది. పైగా తప్పనిసరిగా కొత్త పన్ను విధానంలోనే రిటర్నులు దాఖలు చేయాల్సి ఉంటుంది.

త్రివర్ణ శోభ



విద్యుత్తు కాంతుల్లో ఆర్‌అండ్‌బీ భవనం



ఇందిరాగాంధీ స్టేడియంలో వేడుకలకు సిద్ధం చేస్తూ..

రాష్ట్ర స్థాయి స్వాతంత్ర్య వేడుకలకు విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం ముస్తాబైంది. మైదానం మొత్తాన్ని త్రివర్ణ పతాకాలతో ముస్తాబు చేశారు. వేడుకలకు హాజరయ్యే ప్రముఖుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గురువారం రాత్రి నగరంలోని ప్రధాన రోడ్లు, ప్రభుత్వ కార్యాలయాలను మువ్వన్నెల రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. - ఈనాడు, అమరావతి



ఎంజీ రోడ్డులో అంబేడ్కర్ స్మృతివనం వద్ద త్రివర్ణ కాంతులు



ఉచిత బస్సు శకటం..

ప్రతిభకు ప్రోత్సాహం.. ప్రయోగాలకు ఆహ్వానం

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే



ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక రంగాల వైపు ఆకర్షితులయ్యేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పరిశోధనలు, ఆవిష్కరణల వైపు అడుగులు వేసేలా ప్రోత్సహిస్తోంది. అందులో భాగంగా జాతీయ విద్య, పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్టీ) ప్రయాస్ (ప్రమోషన్ ఆఫ్ రీసెర్చ్ ఆటిట్యూడ్ అమాంగ్ యంగ్ అండ్ యాస్పిరింగ్ స్టూడెంట్స్) పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రస్తుత (2025-26) విద్యా సంవత్సరానికి విద్యార్థుల నుంచి పరిశోధన ప్రాజెక్టుల ప్రతిపాదనలకు ఆహ్వానం పలికింది.

పథకం ముఖ్యమైన తేదీలు

దరఖాస్తుకు గడువు	ఆగస్టు 17
స్క్రీనింగ్ సమయం:	సెప్టెంబరు 15
జ్యూరీ ఎంపిక :	సెప్టెంబరు 30
ఫలితాల ప్రకటన:	అక్టోబరు 15

అర్హులు ఎవరంటే.. తొమ్మిదో తరగతి నుంచి 11వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ప్రయాస్ పథకానికి అర్హులు అన్ని పాఠశాలల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక విద్యాలయం నుంచి ఒకరు లేదా ఇద్దరికి మాత్రమే అవకాశం ఉంటుంది. ఆ పాఠశాలలో భౌతిక, రసాయన, జీవ శాస్త్రం లేదంటే గణితం బోధించే ఓ ఉపాధ్యాయుడు, ఏదైనా ఉన్నత విద్యా సంస్థ, పరిశోధన సంస్థ నిపుణుడితో కలిసి పరిశోధన ప్రాజెక్టు రూపకల్పన చేయాల్సి ఉంటుంది. ఒక పాఠశాల నుంచి ఒక దరఖాస్తు మాత్రమే అనుమతిస్తారు.

ఏడాది లోపు పూర్తి చేయాల్సిందే.. ప్రాజెక్టు తయారు చేయాలనుకున్న విద్యార్థులు స్థానిక సమస్యలపై అవగాహన కలిగి ఉండాలి. ఆ సమస్యకు గల కారణాలను శాస్త్రీయంగా పరిశీలించాలి. శాస్త్రీయ విజ్ఞానంతోనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. ప్రాజెక్టు పూర్తి చేయడానికి సంవత్సరం గడువు ఇస్తారు. విద్యార్థులు పంపిన ప్రతిపాదనల్లో పరిశోధన ఎంపికైతే.. దానికి రూ.50 వేలు మంజూరు చేస్తారు. అందులో విద్యార్థులకు రూ.10 వేలు, పాఠశాల ఉపాధ్యాయుడు, నిపుణుడికి రూ.20 వేలు చొప్పున అందజేస్తారు. https //ncert.nic.in వెబ్‌సైట్‌లో ప్రయాస్ పథకం పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు.

దసరా ఏర్పాట్లను వేగవంతం చేయాలి



చర్చిస్తున్న రామచంద్రమోహన్, శీనానాయక్, కోటేశ్వరరావు తదితరులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: దసరా ఏర్పాట్లను వేగవంతం చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ అన్నారు. దుర్గగుడి అధికారులు కనకదుర్గానగర్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను ఈవో శీనానాయక్, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి కమిషనర్ గురువారం పరిశీలించారు. ప్రసాదాల పోటు, ఎలివేటెడ్ క్యూలైన్లు, అన్నదాన భవన నిర్మాణ పనులను ఉత్సవాలకు ఆటంకం లేకుండా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. దుర్గగుడి ఘాట్ రోడ్డు, కనకదుర్గానగర్ మార్గాలకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు పూర్తి చేసి రోడ్డు వేయాలని ఆదేశించారు. ఈఈలు కోటేశ్వరరావు, రాంబాబు, డీఈలు అశోక్, రవీంద్ర పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపు నేడు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఇతర వీఐపీలు రాక సందర్భంగా నగరంలోని ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబు తెలిపారు. శుక్రవారం (నేడు) ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ మళ్లింపులు ఉంటాయని వెల్లడించారు. పోలీసుల సూచనలు పాటించి సహకరించాలని సీపీ ప్రజలను కోరారు.

ప్రధాన రహదారుల్లో... ★ పాత పోలీస్ కంట్రోల్‌రూం వైపు నుంచి బెంజిసర్కిల్ వైపునకు వెళ్లే అన్ని వాహనాలను... ఆర్టీసీవై కూడలి నుంచి కారల్‌మార్క్స్ రోడ్డు, చుట్టుగుంట, గుణదల, రామవరప్పాడు మీదుగా మళ్లిస్తారు. ★ బెంజిసర్కిల్ నుంచి మహాత్మాగాంధీ రోడ్డులోకి వచ్చే వాహనాలను ఫకీర్‌గూడెం, స్క్యూబ్రిడ్జి, కృష్ణలంక జాతీయ రహదారి మీదుగా బస్టేషన్ వైపు మళ్లిస్తారు. ★ రెడ్ సర్కిల్ నుంచి ఆర్టీఏ కూడలి వరకు.. శిఖామణి కూడలి నుంచి వెటర్నరీ కూడలి వరకు.. ఏ విధమైన వాహనాలను అనుమతించరు. ★ బెంజిసర్కిల్ నుంచి డీసీపీ బంగ్లా కూడలి వరకు ఉదయం 7 నుంచి సాయంత్రం 5 వరకు ఆహ్వానితులను మాత్రమే అనుమతిస్తారు.

ఆర్టీసీ బస్సులు ఇలా... ★ మహాత్మాగాంధీ రోడ్డులోకి ఎలాంటి ఆర్టీసీ బస్సులు అనుమతించరు. ★ మహాత్మాగాంధీ రోడ్డు, రూట్ నంబరు-5లోకి వెళ్లే ఆర్టీసీ సిటీ బస్సులను కారల్‌మార్క్స్ రోడ్డు మీదుగా రామవరప్పాడు రింగ్ వరకు వెళ్లి, అక్కడి నుంచి బెంజిసర్కిల్ వైపు వెళ్లాలి.

పాస్‌లున్న ఆహ్వానితులకు సూచనలు: ★ ఏఏ పాస్ ఉన్న వారు ఫుడ్ కోర్ట్‌లోని గేట్ నంబరు-3 ద్వారా ప్రవేశించి నిర్దేశిత స్థలంలో నిలుపుకోవాలి. ★ ఏ1, ఏ2 పాస్‌లున్న వారు మీసేవ సమీపంలోని గేట్ నంబరు-4 ద్వారా లోనికి ప్రవేశించి హ్యాండ్ బాల్ స్థలంలో వాహనాలు నిలుపుకోవాలి. ★ బీ1, బీ2, పురస్కార గ్రహీతలు, వారి కుటుంబ సభ్యులు గేట్ నంబరు-2 ద్వారా లోనికి ప్రవేశించి ఫుట్‌బాల్ గ్రౌండ్ లేదా సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ గ్రౌండ్‌లో వాహనాలు పార్క్ చేసుకోవాలి. ★ స్కూలు విద్యార్థులు, ఇతర ఆహ్వానితులు వాటర్ ట్యాంక్ రోడ్డులోని గేట్ నంబరు- 6, 7 ద్వారా లోనికి ప్రవేశించాలి. ★ మీడియా ప్రతినిధులను గేట్- 2 ద్వారా లోనికి అనుమతిస్తారు. వీరు తప్పనిసరిగా ఫొటో అక్రిడిటేషన్ కార్డులు లేదా గుర్తింపు కార్డులు కలిగి ఉండాలి. ★ పాస్‌లు ఉన్న ఆహ్వానితులు ఉదయం 8 గంటల లోపు స్టేడియం వద్దకు చేరుకోవాలి.

★ **ఆటోలపై ఆంక్షలు:** బస్టేషన్‌లో 'స్త్రీ శక్తి' పథకం ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు వస్తున్న సందర్భంగా పాత బస్టాండ్ పరిసరాల్లో ఆటోలపై ఆంక్షలు విధిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 వరకు మహాత్మాగాంధీ రోడ్డు, కారల్‌మార్క్స్ రోడ్డుల నుంచి పాత పోలీస్ కంట్రోల్‌రూం వైపు ఆటోలను అనుమతించరు.

ఈడీ పేరుతో బెదిరింపు కేసులో ఇద్దరి అరెస్ట్

నిందితుల నుంచి రూ.40.70 లక్షలు, కారు స్వాధీనం

మేడికొండూరు, న్యూస్‌టుడే: కారులో పోలీసులు వేషంలో వచ్చి. ఈడీ అధికారులమని బెదిరించి రూ.70 లక్షలు నగదు, 2 కిలోలు ముడి బంగారం (నకిలీ) ఎత్తుకెళ్లడంతో సంచలనంగా మారిన కేసులో పోలీసులు ఎట్టకేలకు ఇద్దర్ని పోలీసులు అరెస్టు చేశారు. మేడికొండూరు పోలీస్ స్టేషన్లో గురువారం తుళ్లూరు సబ్ డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్రకు చెందిన మాణి జగదీష్ కొన్నాళ్లుగా ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం గుంటుపల్లి ప్రాంతంలో నివాసం ఉంటూ బంగారం, వెండి వస్తువులు నాణ్యత పరిశీలించే దుకాణం ప్రారంభించాడు. ప్రస్తుతం రాజమహేంద్రవరంలో ఉంటున్న మహారాష్ట్రకు చెందిన రంజిత్ మారుతీ పెట్ మాటలు నమ్మి కేజీ రూ.58 లక్షలు చొప్పున 2 కిలోలు ముడి బంగారం కొనేందుకు బేరం కుదుర్చుకుని.. తొలుత రూ.70 లక్షలు ఇస్తామని ఒప్పందం అయ్యాడు. ఈ క్రమంలో పల్నాడు జిల్లా సత్తెనపల్లి నుంచి రంజిత్, జగదీశ్, మరో వ్యక్తి కలిసి కారులో విజయవాడ వస్తుండగా మేడికొండూరు శివారు వారి కారును పోలీస్ వేషంలో ఉన్న కొంతమంది వ్యక్తులు ఆపి.. జగదీష్‌ను చంపుతామని బెదిరించి, అతడ్ని చేతులతో చితకబాది రూ.70 లక్షలు నగదు, నాసిరకం బంగారం(నకిలీ), సెల్‌ఫోన్ బలవంతంగా లాక్కొని రెండు కారుల్లో పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఈ నెల 5వ తేదీ కేసు నమోదు చేసిన పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి ముమ్మర దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న 11 మంది మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రానికి చెందిన వారని, అంతా ఒక ముఠాగా ఏర్పడి పథకం ప్రకారం మోసానికి పాల్పడినట్లు గుర్తించారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల అద్దంకి నార్కెట్‌పల్లి ప్రధాన రోడ్డు వద్ద గురువారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఈ కేసుకు సంబంధించిన ఏ1 అనుకుష్ రామచంద్ర కదం, ఏ3 మహాదేవ్ ధనాజీ సాలంకేలను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.40.70 లక్షలు, ఒక తెల్ల కారు, సుమారు రూ.6 లక్షలు విలువైన బంగారం, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన 9 మంది పరారీలో ఉన్నారని, త్వరలో పట్టుకుంటామని డీఎస్పీ చెప్పారు. కేసులో ప్రతిభ కనబరిచిన సీఐలు నాగూర్‌మీరాసాహెబ్ (మేడికొండూరు), ఎస్ఐలు వీ.కోటేశ్వరావు(సీసీఎస్ గుంటూరు), వీ.సుబ్బారావు(మేడికొండూరు), వై.సత్యనారాయణ(తాడికొండ), మేడికొండూరు కానిస్టేబుల్ ఎస్‌కె. బాజిషా హెడ్, జాన్‌సైదాను ఉన్నతాధికారులు అభినందించారన్నారు.

స్వాతంత్ర్య పోరాటంలో రైల్వే కీలక పాత్ర

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య పోరాటంలో భారతీయ రైల్వే కీలక పాత్ర పోషించిందని డీఆర్ఎం మోహిత్ సొనాకియా తెలిపారు.



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న డీఆర్ఎం మోహిత సొనాకియా

ఈ ఉద్యమంలో అశువులుబాసిన మహనీయుల చిత్రాలతో విజయవాడ రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసి ఎగ్జిబిషన్ గ్యాలరీని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆ సమయంలో సాధారణ రవాణా మార్గంగా రైల్వేలు నిలిచాయని గుర్తుచేశారు. మన పూర్వీకులు అనుభవించి బాధను ప్రయాణికులకు అవగాహన కల్పించేందుకు డిజిటల్ మ్యూజియంను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దీనిని ప్రతి ఒక్కరు తిలకించాలని కోరారు. మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని పనిచేయాలని రైల్వే ఉద్యోగులకు సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అన్ని రైల్వే కార్యాలయాలు, ఇళ్లపై జాతీయ జెండాలను ఎగురవేయాలని ఉద్యోగులకు సూచించారు. ఏడీఆర్ఎం కొండా శ్రీనివాసరావు, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

స్త్రీశక్తి పథకంతో మహిళలకు ప్రయోజనం



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్, సీపీ రాజశేఖర్‌బాబు కొనకళ్ల నారాయణరావు, నాగుల్‌మీరా

విజయవాడ బస్టేషన్, న్యూస్‌టుడే: పండిట్ నెహ్రూ బస్టేషన్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకాన్ని సిటీ బస్‌పోర్ట్ నుంచి శుక్రవారం లాంఛనంగా ప్రారంభించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను, సభా ప్రాంగణాన్ని ఎంపీ కేశినేని శివనాథ్, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ రావు, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, సీపీ రాజశేఖర్‌బాబు, రాష్ట్ర నూర్‌బాషా, దూదేకుల సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ నాగుల్‌మీరా, మాజీ ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణరాజు గురువారం పరిశీలించారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటూ సీఎం చంద్రబాబు శుక్రవారం నుంచి మహిళలకు స్త్రీశక్తి పథకం అమలు చేయనున్నారని తెలిపారు. ఉచిత బస్సు సౌకర్యం మహిళలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. సూపర్-6 హామీలను సీఎం ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ వస్తున్నారన్నారు. ఫ్రీ బస్ స్కీంతో కర్ణాటకలో 23 శాతం మహిళా సాధికారిత పెరిగిందన్నారు. ఏపీలో అంతకు మించి మహిళలకు ఉపాధి పెరుగుతుందన్నారు. స్త్రీశక్తి పథకంపై వైసీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలను ఖండించారు. మరో సందర్భంలో కలెక్టర్ లక్ష్మీశ ఇతర అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు.



శాంతి సమయంలో మనం ఎంత ఎక్కువగా చెమటను చిందిస్తే... యుద్ధ సమయంలో అంత తక్కువగా రక్తాన్ని చిందిస్తాం.

- విజయలక్ష్మీ పండిట్



1893లో భారత దేశాన్ని నా నివాసంగా మార్చుకున్న నాటి నుంచి... నా జీవితాన్ని ఈ దేశ స్వేచ్ఛను తిరిగి తీసుకురావడానికి అంకితం చేశా.

- అనిబిసెంట్



దేశభక్తినీ త్యాగ నిరతినీ ఆ దేశ మాతృ మూర్తుల్లో నింపగలగడంలోనే ఒక దేశ గొప్పతనం ఉంటుంది.

- సరోజినీ నాయుడు

వసుంధర

vasundhara@eenadu.in

ఉయ్యాల నుంచే దేశభక్తి


- కర్నల్ సోఫియా ఖురేషి



వీరుల కుటుంబం కర్నల్ సోఫియా ఖురేషిది. గుజరాత్‌కు చెందిన ఈమె పూర్వీకులు ఝాన్సీ లక్ష్మీబాయితో కలిసి యుద్ధం చేశారు. తాతయ్య, తండ్రులు సైన్యంలో పనిచేసిన వారే. దీంతో ‘చిన్నతనం నుంచీ జోలపాటలు ఎరుగను. దేశంకోసం పోరాడిన వారి ధైర్యసాహసాలు, వాళ్ల దేశభక్తినే కథలుగా విన్నా. అందుకే ఆర్మీ యూనిఫామ్ ధరించాలని కలలుగన్నా’ అంటారు సోఫియా. కానీ అప్పటికి ఆర్మీలోకి అమ్మాయిలకు ప్రవేశం లేదు. దీంతో రక్షణ రంగానికి సాయపడొచ్చని డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ)లో చేరారు. పరిస్థితులు మారి, ఆర్మీలో అమ్మాయిలకి అవకాశమిచ్చాక తన కలల సర్వీసులోకి అడుగుపెట్టారు. 26ఏళ్లుగా సేవలందిస్తున్నారు. ప్రస్తుతం భారత ఆర్మీకి కీలక కంబాట్ విభాగమైన కార్ప్స్ ఆఫ్ సిగ్నల్స్‌ని నడిపిస్తున్న ఈమె తిరుగుబాట్లు, తీవ్రవాదులకు వ్యతిరేకంగా బృందాలను నడిపించారు. ఐరాస ‘పీస్ మిషన్’లో భాగంగా కాంగోలో విధులు నిర్వర్తిస్తున్నప్పుడు.. తప్పిపోయిన ఆరేళ్లమ్మాయిని తల్లిదండ్రుల దగ్గరికి చేర్చారు. వాళ్లు కృతజ్ఞతతో తరవాత ఆ చిన్నారి పేరును ‘సోఫియా’గా మార్చారట. దాన్ని తన కెరియర్‌లో మర్చిపోలేని సంఘటనగా చెబుతారామె. తరవాత ‘ఆపరేషన్ సిందూర్’కి బ్రీఫింగ్ ఇవ్వడాన్నీ మర్చిపోలేనంటారు. 2016లో పుణె వేదికగా భారత్ ‘ఎక్సర్‌సైజ్ 18’ పేరుతో మల్టీనేషనల్ మిలిటరీ ఎక్సర్‌సైజ్‌కి ఆతిథ్యమిచ్చింది. దానిలో 18 దేశాలు పాల్గొన్నాయి... భారత ఆర్మీలో మాత్రమే బృందానికి నాయకురాలున్నారు. అలా నిలిచిన ఏకైక మహిళగా చరిత్ర సృష్టించారు సోఫియా. వివిధ దేశాలూ పాల్గొనే ప్రపంచంలోనే అతిపెద్ద ఫీల్డ్ ట్రైనింగ్ ఎక్సర్‌సైజ్‌లలోనూ బృందాలకు నాయకత్వం వహించిన అతికొద్దిమంది ఆఫీసర్లలో కర్నల్ సోఫియా ఒకరు. ‘కలలు కనండి. వాటిని నిజం చేసుకోవడానికి అంతే ధైర్యంగా ప్రయత్నించండి... మన దేశ భవిత మీ చేతుల్లోనే ఉంది’ అంటూ యువతకు పిలుపునిస్తున్నారు సోఫియా.

జెండా రెపరెపలాడేలా...

స్వాతంత్ర్య దినోత్సవం రోజున జెండావందనం చేస్తేనే మనలో దేశభక్తి భావం ఉప్పొంగుతుంది. జాతీయ జెండాకు ఉన్న గొప్పతనం అది. ఈ జెండా దేశమంతా వ్యాపింపచేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్యక్రమం ‘హర్ ఘర్ తిరంగా’. దేశమంతా ఈ రోజున మూడు రంగుల జెండాను ఎగురవేసేలా చేసి ఐక్యతను పెంచాలన్నది లక్ష్యం. అయితే, ఇందులో కీలకమైన జెండా తయారీ బాధ్యతను మహిళలకే అప్పగించారు అధికారులు. ఇందులో భాగంగా... ప్రయాగరాజ్‌లోని 2600మందికి పైగా స్వయం సహాయక సంఘాల్లోని గ్రామీణ మహిళలు 3.5 లక్షల జాతీయ జెండాలు తయారుచేయగా, జౌన్‌పూర్‌లోని ఎస్‌హెచ్‌జీ మహిళలు 7లక్షల జెండాలను సిద్ధం చేశారు. వారితోపాటు లఖీంపూర్, నోయిడా... వంటి అనేక ప్రాంతాల ఎస్‌హెచ్‌జీలూ జాతీయ జెండా తయారీలో భాగం అయ్యాయి. కాటన్ లేదా పాలీయెస్టర్ ఫ్యాబ్రిక్‌తో, మూడు రకాల పరిమాణాల్లో వీటిని తయారుచేశారు. గ్రామీణప్రాంతాల్లోని మహిళలకు ఉపాధిని సృష్టించటమేకాదు, రూరల్ కమ్యూనిటీలను బలపరిచేందుకూ ఇది తోడ్పడుతుందని ‘ఆత్మనిర్భర్’ లక్ష్యంలో ఇదీ భాగమని చెబుతున్నారు అధికారులు.



ఆమె సమర్పించిన జెండా!



1947, ఆగస్టు 15... సాధించిన స్వాతంత్ర్యానికి గుర్తుగా ఇంకా తొలి జెండా ఎగరలేదు. కానీ అప్పటి రాజ్యసభలో ఒక మహిళ మాత్రం ‘భారత మహిళల తరఫున జెండాను అందించడం గర్వంగా భావిస్తున్నా. ఈ జెండా నీడన అందరూ ఆహారం, సంపద, అభివృద్ధి దిశగా సాగాలని కోరుకుంటున్నా’ అంటూ తొలిజెండాను అసెంబ్లీలో సమర్పించారు. ఆమే హంసా జీవరాజ్ మెహతా. పుట్టింది గుజరాత్‌లోని బరోడా (ప్రస్తుతం వడోదర). ఇంగ్లండ్‌లో సోషియాలజీ, జర్నలిజం చదివారు. గాంధీజీ మాటలకు ప్రేరణ పొంది, భారత్‌కి తిరిగొచ్చాక స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. బాలికల విద్య, హక్కులు ముఖ్యంగా లింగ సమానత్వం కోసం పోరాడారు. జైలుకీ వెళ్లారు. అప్పటి రాజ్యసభలోని 15మంది మహిళల్లో హంసా మెహతా ఒకరు. జెండా రూపొందించిన బృందంలో ఏకైక మహిళ. మొదట్లో త్రివర్ణాల మధ్య రాట్నం ఉండేది. దాన్ని వ్యతిరేకించి అశోక చక్రాన్ని సిఫారసు చేసిందీ ఈమెనే. రాజ్యాంగాన్ని రాసే క్రమంలో బీఆర్ అంబేడ్కర్‌కి సాయపడ్డారు. ఐరాస హ్యూమన్ రైట్స్ కౌన్సిల్‌లోనూ పనిచేశారు. పద్మభూషణ్‌నీ అందుకున్నారు.

యూనిఫామ్‌పై మనసు పడి

- కెప్టెన్ ఒజస్వితా శ్రీ



నచ్చిన పాటలకు నృత్యం చేయడం, దూరాలు పరుగెత్తడం, సైక్లింగ్ ట్రిప్‌లు, స్కూబా డైవింగ్... మామూలు అమ్మాయిలకు ఉండే వ్యాపకాలే ఇవి. ఒకప్పుడు కెప్టెన్ ఒజస్విత కూడా ఇలాగే ఉండేవారు. అలాంటి తను ఆర్మీలోకి అడుగుపెట్టడానికి యూనిఫామే కారణం అంటారామె. తనది పట్నా. నాన్న ప్రభుత్వోద్యోగి, అమ్మ గృహిణి. ఆర్మీ నేపథ్యమేమీ లేదు. కానీ ఎన్‌సీసీ క్యాడెట్. కాలేజీలో ఎన్‌సీసీ యూనియన్‌కి లీడర్‌గానూ వ్యవహరించారు. ఇవే ఆమెను ఆర్మీవైపు వెళ్లేలా చేశాయి. పొలిటికల్ సైన్స్‌లో డిగ్రీ పూర్తయ్యాక 2019లో కార్ప్స్ ఆఫ్ ఆర్మీ ఎయిర్ డిఫెన్స్‌లో చేరారు. కశ్మీర్‌లో క్విక్ రియాక్షన్ టీమ్ (క్యూఆర్‌టీ) ఆఫీసర్‌గా సేవలందించాక కఠినమైన పారా ప్రొబేషన్ ట్రైనింగ్‌లో పాల్గొన్నారు. ప్రతిష్ఠాత్మక అవార్డునూ అందుకున్నారు. ప్రస్తుతం ప్యారాచూట్ ఎయిర్ డిఫెన్స్ యూనిట్‌లో పనిచేస్తున్నారు. దాడుల సమయంలో శత్రు దేశాల డ్రోన్లు, హెలికాప్టర్లు, ఫైటర్ ఏర్‌క్రాఫ్ట్స్ వంటి ఏరియల్ ప్రమాదాలను పసిగట్టి, వాటి నుంచి ప్రజలకు, ఆస్తులకు రక్షణ కల్పించడం ఆమె విధులు. ‘కంబాట్ దుస్తుల్లో 100కి.మీ. ఎండ్యూరెన్స్ రన్, లద్దాఖ్‌లో 15వేల అడుగుల ఎత్తులో 96 గంటల పహారా... అదీ కఠినమైన వాతావరణ పరిస్థితుల్లో! కానీ దేశ రక్షణముందు ఇవన్నీ చిన్నవిగా కనిపిస్తాయి. ఏర్‌క్రాఫ్ట్ ద్వారం వద్ద నిలబడి పదివేల అడుగుల ఎత్తునుంచి దూకడానికీ చాలా ధైర్యం కావాలి. ప్యారాచూట్ దళంలోని అతితక్కువ మంది మహిళల్లో ఒకరిని. చాలావరకూ బృందాల్లో ఏకైక మహిళను. తోటివారితో సమానంగా సాగాలన్న కసితో ముందడుగు వేసేదాన్ని. తోటి సభ్యులు తమ కూతుళ్లను నాలా తయారు చేయాలనుందని చెప్పడం నా సామర్థ్యానికీ, అంకితభావానికీ నిదర్శనంగా భావిస్తా’నని కెప్టెన్ ఒజస్విత... ‘మీరు తీసుకునే నిర్ణయాలకు బాధ్యత వహించండి. ఎంత మంది నిందిస్తున్నా పట్టించుకోవద్దు. మధ్యలో ఆపొద్దు. మీరు నమ్మిన మార్గంలో గెలిచి, అవతలి వాళ్లను తప్పని నిరూపించండి’ అని సలహానిస్తారు.

జయ జయ జయ జయహే

దేశం మనదే తేజం మనదే... ఎగురుతున్న జెండా మనదే... అని నేడు మనమంతా స్వేచ్ఛగా పాడుకుంటున్నామంటే... దీని వెనక మహిళల పాత్రా ఎక్కువే. తండ్రి, భర్త, కొడుకుల్ని ఉద్యమంలోకి పంపించడమే కాదు, ‘మేము సైతం’ అన్నారు. పోరాటాలు చేసి, లాఠీ దెబ్బలూ తిన్నారు, జైలుశిక్షలూ అనుభవించారు. స్వాతంత్ర్యంతో పాటు స్త్రీ విద్య, హక్కుల కోసమూ నినదించారు. నాటి చారిత్రక మహిళల స్ఫూర్తినీ, ఆశయాల్నీ నేటి మహిళలూ అందిపుచ్చుకున్నారు. రణభూమిలోకీ అడుగుపెడుతున్నారు. శత్రుదేశాలమీద నిప్పులు కురిపిస్తున్నారు. అత్యాధునిక యుద్ధ విమానాల్నీ, నౌకాదళాన్నీ నడిపిస్తున్నారు. నేటికీ సమాజంలో పాతుకుపోయిన వివక్షల్ని రూపుమాపేందుకూ అణచివేతలకు నిరసనగానూ తమ గళాన్ని వినిపిస్తున్నారు. అలాంటి ఎందరో ధీరవనితల్లో కొందరు...

సాహసాల ప్రేరణ!


- కమాండర్ ప్రేరణ దేవస్థలి



చిన్నప్పుడు విమానాలు, హెలికాప్టర్ల విన్యాసాలు చూసి... ఆ రంగంపైన ఇష్టం పెంచుకున్నారు ప్రేరణ. ఎప్పటికైనా యుద్ధ విమానాలు నడపాలన్నది ఆమె కోరిక. ప్రేరణ స్వస్థలం ముంబయి. అక్కడే సెయింట్ జేవియర్స్ కాలేజీ నుంచి సైకాలజీలో పీజీ చేశారామె. ఆపై తన లక్ష్యాన్ని నెరవేర్చుకునేందుకు ఎంతో శ్రమించి 2009లో భారత నౌకాదళంలోకి అడుగుపెట్టారామె. మనస్తత్వ శాస్త్రం చదివిన నేపథ్యం... మనుషుల ప్రవర్తనను సులువుగా అర్థం చేసుకునే తత్వం, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం, సంక్షోభ సమయంలో చాకచక్యంగా వ్యవహరించే నేర్పు ఆమె నావికాదళంలో తనదైన ముద్ర వేయడానికి సహకరించాయి. అతిపెద్ద సముద్ర విమానాల్లో ఒకటైన టుపోలెవ్ టీయూ-142లో మొదటి మహిళా అబ్జర్వర్‌గా పనిచేశారు. తర్వాత పి-8ఐ సముద్ర గస్తీ విమానంలో నావల్ ఎయిర్ అబ్జర్వర్‌గా పనిచేశారు. ఆపై ఐఎన్ఎస్ చెన్నైలోనూ, కోల్‌కతా- క్లాస్ డిస్ట్రాయర్ ఐఎన్ఎస్ చెన్నై(డి65)లో మొదటి లెఫ్టినెంట్‌గా పనిచేశారు. 2023 డిసెంబరులో భారత యుద్ధ నౌక ఐఎన్ఎస్ త్రింకట్‌కు కమాండింగ్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. ఆ ఘనత సాధించిన తొలి మహిళగా చరిత్ర సృష్టించారు. అన్న ఇషాన్ దేవస్థలి కూడా నావికాదళ అధికారే. ఐఎన్ఎస్ త్రింకట్ కమాండింగ్ ఆఫీసర్‌గా ప్రేరణ, ఐఎన్ఎస్ విభూతి కమాండింగ్ ఆఫీసర్‌గా ఇషాన్... ఒకేసారి నియమితులవ్వడం మరో విశేషం. సాహసాలు చేయడం ఆమెకు వెన్నతో పెట్టిన విద్య. ఆమె ప్రతిభ ప్రతి ఒక్కరికీ ప్రేరణ కలిగించేదే. కెరియర్ ఆరంభంలోనే మన వ్యాపారనౌకపై సోమాలియా సముద్ర దొంగలు చేసిన దాడిని తిప్పికొట్టారు. ఆమె కుటుంబంలో అన్నతో పాటు భర్త కూడా నేవీ అధికారే.

న్యాయం కోసం

అన్యాయం, అసమానత్వం, వివక్ష... స్వతంత్ర భారత్‌లో ఇంకా దర్శనమిస్తున్నాయి. ‘న్యాయం... రాజ్యాంగంలో, సాంఘికంగా వేర్వేరుగా ఉండటమే దీనికి కారణం’ అంటారు న్యాయవాది కిరుబా మునుసామి. ‘లీగల్ ఇనిషియేటివ్ ఫర్ ఈక్వాలిటీ’ సంస్థ ద్వారా అణగారిన వర్గాలకు న్యాయం అందించేందుకు కృషి చేస్తున్నారీ యువ న్యాయవాది.



‘అమ్మకు నేను మూడో అమ్మాయిని. అబ్బాయి పుడితే తన కష్టాలు తీరుతాయనుకునేది. ఆ విధంగా చూస్తే మహిళగా నా పోరాటం తల్లి గర్భంలో ఉండగానే మొదలైందని చెప్పాలి’... అంటారు 37 ఏళ్ల కిరుబ. ఈమె పుట్టింది తమిళనాడులోని సేలంలో. అక్కడే ఓ మురికివాడలో పెరిగారు. మెరుగైన చదువుల కోసం వీరి కుటుంబం నగరంలోని మరో ప్రాంతానికి మారింది. కిరుబ నేపథ్యం తెలుసుకున్నాక ఆమెను తమలో కలవనిచ్చేవారు కాదు మిగిలినవాళ్లు. ఈ వివక్ష పోవాలంటే న్యాయ పోరాటమే మార్గమని భావించారు కిరుబ. న్యాయ విద్యలో మాస్టర్స్‌తోపాటు, బ్రిటన్ వెళ్లి పీహెచ్‌డీనీ పూర్తిచేశారు. స్వతంత్ర న్యాయవాదిగా మారి తమిళనాడు హైకోర్టులో, సుప్రీంకోర్టులో అణగారిన వర్గాలూ, మహిళల హక్కుల కోసం పనిచేస్తున్నారు. ఒత్తిళ్లు, ప్రాణ హాని ఉండే పరువు హత్యల కేసుల్నీ వాదిస్తున్నారు. న్యాయం కోసం తన దగ్గరకు వచ్చేవాళ్లలో కొందరికి కేసు నమోదుకు అవసరమయ్యే ఖర్చులకీ, కోర్టు ఫీజులకీ డబ్బు ఉండదు. అలాంటప్పుడు క్రౌడ్ ఫండింగ్ చేసి మరీ సాయపడతారు. అనేక పరువు హత్యల కేసుల్లో దోషులకు శిక్ష పడేలా చేశారు కిరుబ. దేశీయంగానే కాకుండా ఐరాస, అంతర్జాతీయ న్యాయస్థానం వంటి వేదికలపైనా కుల వివక్ష, మానవ హక్కుల గురించి ధైర్యంగా గళమెత్తిన కిరుబను ‘మహిళా అంబేద్కర్’గా కొనియాడేవాళ్లెందరో!

ఆర్మీ అధికారిణి కావాలని..!

- ఫ్లయింగ్ ఆఫీసర్ తనుష్కా సింగ్



భూమిపై ఉన్న టార్గెట్లను ధ్వంసం చేయడానికి... యుద్ధభూమిలోకి దూసుకువెళ్లి మిషన్ పూర్తి చేయడానికి... రహస్యంగా శత్రు దేశాల సమాచారాన్ని సేకరించడానికి ఉపయోగిస్తున్న ఫైటర్ జెట్లలో జాగ్వార్ స్క్వాడ్రన్ ఒకటి. 1979లో వాయుసేనలో భాగమైన ఈ జెట్... యుద్ధ వాతావరణం నెలకొన్నపుడు ఇప్పటికీ ప్రథమ ఎంపికే. అయితే అప్పట్నుంచి దీన్ని నడిపినవారిలో పురుషులే ఎక్కువ. అలాంటి వ్యూహాత్మకమైన, కచ్చితమైన వైమానిక దాడులకు పేరొందిన జాగ్వార్‌ను నడిపే అవకాశాన్ని దక్కించుకున్నారు తనుష్కా సింగ్. అంతేకాదు, వాయుసేనలో ఈ బాధ్యతల్ని తీసుకున్న మొదటి మహిళ కూడా ఈమే. తనుష్క పుట్టింది ఉత్తర్‌ప్రదేశ్. పెరిగింది, చదువుకున్నది అంతా మంగళూరులోనే. ఈమె తండ్రి మాజీ లెఫ్టినెంట్ కల్నల్ అజయ్ ప్రతాప్ సింగ్. తాత ఆర్మీ మాజీ కెప్టెన్ దేవేంద్ర బహదూర్ సింగ్. మిలిటరీ నేపథ్యం వల్లే తనుష్క కూడా ఆర్మీ అధికారిణి కావాలని కలలు కన్నారు. అందుకు అనుగుణంగానే ప్రణాళికల్నీ తయారు చేసుకున్నారు. మణిపాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌లో బీటెక్ పూర్తిచేసి, ఆర్మీలో చేరడానికి సన్నాహాలు చేసుకుంటున్న సమయంలో... వాయుసేనలో మహిళలకు అవకాశాలు ఉన్నట్లు తెలుసుకున్నారు తనుష్క. తండ్రి సలహాతో ప్రయత్నించి, శిక్షణకు ఎంపికయ్యారు. షార్ట్ సర్వీస్ కమిషన్‌లో ఉత్తీర్ణురాలై... దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో 18 నెలలు శిక్షణ తీసుకున్నారు. తర్వాత హాక్ ఎమ్‌కే 132 ఎయిర్‌క్రాఫ్ట్ నడపడంలో స్పెషలైజేషన్ చేసి... జాగ్వార్‌కు ఫైటర్ పైలెట్ అయ్యే అవకాశాన్ని దక్కించుకున్నారు.

రఫేల్ రాణి!

- ఫ్లైట్ లెఫ్టినెంట్ శివాంగి సింగ్



మహిళల త్యాగం, సహకారం ప్రస్తావించకుండా స్వాతంత్ర్యోద్యమ పోరాట చరిత్ర అసంపూర్ణం. అలాగే స్త్రీ శక్తి లేని ఆపరేషన్ సిందూర్‌నీ ఊహించలేం. అందులో కీలకపాత్ర పోషించిన వాళ్లలో ఫ్లైట్ లెఫ్టినెంట్ శివాంగి సింగ్ ఒకరు. ఈమె రఫేల్ స్క్వాడ్రన్‌లో తొలి, ఏకైక మహిళా ఫైటర్ పైలట్. గగనతలంలో నేకాదు, నేలమీదా ఎలక్ట్రానిక్, న్యూక్లియర్ దాడులు చేయగల రఫేల్ నడపడానికి ధైర్యం, తెగువ మాత్రమే కాదు, మరెన్నో నైపుణ్యాలూ కావాలి. అవన్నీ సొంతం చేసుకున్న శివాంగిది ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసి. ఏడెనిమిదేళ్ల వయసులో న్యూదిల్లీలోని ఎయిర్‌ఫోర్స్ మ్యూజియం సందర్శనకు వెళ్లినప్పుడు తొలిసారిగా విమానాన్ని తాకి, పైలట్ కావాలని నిర్ణయించుకున్నారట. అందుకోసం చిన్ననాటి నుంచీ ఎంతో కష్టపడ్డారీమె. కాలేజీలో ఎన్‌సీసీ ఎయిర్‌వింగ్ సభ్యురాలు. బనారస్ హిందూ యూనివర్సిటీలో డిగ్రీ చేశాక హైదరాబాద్‌లోని ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అకాడమీలో చేరారు. మొదట మిగ్-21 బైసన్ మీద కఠిన శిక్షణ తీసుకున్నాక, 2020లో రఫేల్ శిక్షణకు ఎంపికయ్యారీమె. ఫ్రాన్స్‌లో జరిగిన ఐఏఎఫ్ విన్యాసాల్లోనూ పాల్గొన్నారు. ‘నాకు ప్రేరణ మా అమ్మ. ఆమె నేను చదువుకే పరిమితం కావాలనుకోలేదు. దేశరక్షణ దిశగా ప్రోత్సహించింది. మొదటిసారి మిగ్-21 బైసన్ ఫైటర్ జెట్ మీద శిక్షణ తీసుకున్నప్పుడే అర్థమైంది. యుద్ధ విమానాల్ని నియంత్రించడానికి బహుముఖ నైపుణ్యాలు కావాలని. ఆ తరవాత మరెంతో కఠినమైన శిక్షణ తీసుకుని, ఫ్రెంచ్ ఇన్‌స్ట్రక్టర్ల ఆధ్వర్యంలో రఫేల్ సిమ్యులేటర్‌లోని కాక్‌పిట్‌లో కూర్చున్నా. అప్పుడు నాలో భయాందోళనలేమీ లేవు. స్వేచ్ఛగా అనిపించింది. అయితే నేను ఇక్కడితోనే ఆగిపోవాలి అనుకోవడం లేదు. మనదేశం త్వరలోనే మానవ సహిత అంతరిక్ష యాత్రకు ప్రణాళిక రచిస్తోంది. వ్యోమగామిగా నేనూ అందులో ఉండాలి. ధైర్యసాహసాలు అవసరమైన ఈ రంగంలో ఓ మహిళ విజయవంతమైతే, మరికొందరు మహిళలు ముందుకొస్తారు’ అంటారీ రఫేల్ రాణి. భారత రక్షణ దళాల్లో మహిళల్ని ఫ్రంట్‌లైన్ పోరాటంలోకి వచ్చేలా చేయడంలో శివాంగి మైలురాయిగా నిలిచిపోతారు.

సివంగి... శివాంగి!

- లెఫ్టినెంట్ శివాంగి సింగ్



భారత నౌకాదళంలో తొలి మహిళా పైలట్ శివాంగినే. ఆమెది బిహార్‌లోని ఫతేహాబాద్. చిన్నప్పుడు ఓ రాజకీయ సమావేశానికి నాయకుడొకరు హెలికాప్టర్‌ని ఉపయోగించడం చూసి ఆశ్చర్యపోయారట. అప్పటి నుంచి తాను పైలట్ కావాలనే లక్ష్యాన్ని ఏర్పరచుకున్నారామె. శివాంగి ముత్తాత బాలికల విద్య కోసం భూమిని విరాళంగా ఇచ్చారట. అందులో నిర్మించిన బాలికల పాఠశాలలోనే ఆమె తండ్రి హరిభూషణ్ సింగ్ ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్నారు. తల్లి ప్రియాంక గృహిణి. శివాంగి మెకానికల్ ఇంజినీరింగ్, ఆపై ఎంటెక్ పూర్తి చేశారు. తర్వాత షార్ట్‌సర్వీస్ కమిషన్ పైలట్ ఎంట్రీ స్కీమ్ కింద భారత నావికాదళంలో చేరారు. మొదటి ఆరునెలలు ఇండియన్ నావల్ అకాడమీలో ఓరియంటేషన్ కోర్సు, తర్వాత ఆరునెలలు ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో పిలాటస్ పీసీ 7 ఎంకే 2 విమానంలోనూ శిక్షణ పొందారు. తక్కువ సమయంలోనే ఇండియన్ నావల్ ఎయిర్ స్క్వాడ్రన్ 550లో డోర్నియర్ విమానాన్ని నడపడం నేర్చుకున్నారామె. అంతేకాదు, భారత నావికాదళంలోని మొదటి ముగ్గురు మహిళా పైలట్ల బ్యాచ్‌లో శివాంగి ఒకరు. శిక్షణ పూర్తి చేసుకుని మారిటైమ్ రికానిసెన్స్(ఎంఆర్) విమానంలో ఆపరేషన్ పైలట్‌గా కూడా పనిచేశారు. అంతేకాదు, ఎన్ఏఈ పోర్‌బందర్‌లోని ఐఎన్ఏఎస్ 314 నుంచి భారత నావికాదళ తొలి విమెన్ క్రూ మిషన్‌లో ఆమె ఒకరు.

దేశమే నా ఇల్లు... ప్రజలే నా పిల్లలు!

‘ఏమోయ్ బ్రిటిష్ అధికారీ... నేనంటే ఏమనుకున్నావు. గంగాభాగీరథీ సమానురాలిని. తలచుకుంటే నిన్నూ, నీ డప్పుల్నీ, నీ పోలీస్ దళాన్నీ గంగలో ముంచెత్తగలను. అహింసా వ్రతాన్ని తీసుకున్నాను. అందుకే అంత పని చేయడం లేదు...’ తన ఉపన్యాసాన్ని ప్రజలకు వినపడకుండా చేయాలనుకున్న బ్రిటిష్ అధికారులపై నిప్పులు చెరుగుతూ దువ్వూరి సుబ్బమ్మ చెప్పిన మాటలివి. ఆమె వాగ్ధాటికి అదిరిపోయి అక్కణ్నుంచి వెళ్లిపోయారా పోలీసులు. ఇదొక్క సందర్భమే కాదు... ఆమె ప్రసంగం ఉందంటే చాలు... దాన్ని ఆపాలని చుట్టూ చేరి డప్పులు కొట్టేవారు పోలీసులు. విసిగిపోయి, అలసిపోయి వాళ్లే వెనుదిరిగేవారు తప్ప.. . ఆమె ఉపన్యాసం మాత్రం ఆపేవారు కాదు.



ఇలా చెప్పుకొంటూ పోవాలే కానీ... సంపూర్ణ స్వరాజ్యం కోసం సుబ్బమ్మ చేసిన పోరాట ఘట్టాలన్నీ ఎన్నటికీ మరవలేని చరిత్రే. ‘మా కొద్దీ తెల్లదొరతనం’ అంటూ పద్యం ఎత్తుకుంటే... బ్రిటిష్ వాళ్ల గుండెల్లో రైళ్లు పరుగెత్తాల్సిందే. ఈమె 1880లో రాజమహేంద్రవరంలోని ద్రాక్షారామంలో జన్మించారు. పదేళ్లకే వివాహమైంది. పదకొండేళ్లకే భర్త మరణించారు. అయినా ఆమె కుంగిపోలేదు. ‘దేశమే నా ఇల్లు, ప్రజలందరూ నా పిల్లలు. వాళ్లని కష్టపెడుతున్న తెల్లవాళ్లు నా శత్రువులు’ అంటూ స్వాతంత్ర్య సాధనకు నడుంబిగించారు. రెండుసార్లు జైలుకూ వెళ్లారు. తన సేవలతో ‘దేశబాంధవి’ అన్న బిరుదుని పొందారు. ఈమె మరణానంతరం రాజమహేంద్రవరంలోని స్వాతంత్ర్య సమరయోధుల పార్కులో సుబ్బమ్మ విగ్రహాన్ని కట్టించారు.

ఇంట్లో... ముువ్వన్నెల కళ!



ఎంతోమంది ప్రాణాల త్యాగం... మరెన్నో పోరాటాల ఫలితం... ఈ స్వాతంత్ర్యం! ఆ పోరాటయోధుల్ని, వాళ్ల త్యాగఫలాన్ని గుర్తుచేసుకుంటూ వాడవాడలా జెండాలను ఎగురవేసి స్వాతంత్ర్య దినోత్సవాన్ని నిర్వహించుకుంటాం. మరి ఇంటి సంగతేంటి? స్వాతంత్ర్య సమరయోధులను గుర్తుచేసుకునేలా, వారిచ్చిన స్వేచ్ఛాఫలానికి కృతజ్ఞతగా ఇంటినీ మువ్వన్నెలతో తీర్చిదిద్దేద్దామా? ఇవన్నీ అందుకు సాయపడే ఆలోచనలే.





సోఫాలో దిండు గలేబులను కాషాయం, ధవళం, ఆకుపచ్చ రంగులతో తీర్చిదిద్దొచ్చు. కర్టెన్లుగా అమర్చొచ్చు. పోనీ పిల్లలకే త్రివర్ణాల కాగితాలను ఇవ్వండి. భిన్న ఆకృతుల్లో కత్తిరించమనండి. ఆ రంగుల బెలూన్లు ఊదమని చెప్పి... గోడలకు అక్కడక్కడా అంటించండి. అన్నట్టూ ఈరోజు శ్రావణ శుక్రవారం కూడా. పూజలు మామూలే. వ్రతాన్ని చేసుకునేవారూ బోలెడు మందే. జెండా రంగుల్లో పూలు, ఆకులను ముచ్చటగా గుచ్చి గుమ్మానికీ, గోడలకీ తోరణాలుగా కట్టండి. ముగ్గుల్ని మూడు రంగుల్లో తీర్చిదిద్దినా చూడముచ్చటగా ఉంటుంది. మనసు పెట్టి ఆలోచించాలే కానీ బోలెడు మార్గాలు. మనలో దేశభక్తిని ఉప్పొంగేలా చేస్తాయి. పిల్లలనీ భాగస్వాములను చేస్తే వాళ్లకీ దేశంపై గౌరవభావం ఏర్పడుతుంది. సంప్రదాయమూ తెలుస్తుంది. మరి ఈసారి ఇంటి అలంకరణలో త్రివర్ణాలను ప్రయత్నిద్దామా?

తెలుగునాట గాంధీజీ గొంతుకై!



ఏళ్లపాటు సాగిన స్వాతంత్ర్య సంగ్రామంలో... బ్రిటిష్ వలసవాదానికి వ్యతిరేకంగా పోరాడిన మహిళలెందరో! వారిలో తెలుగింటి ఆడపడుచు దుర్గాబాయి దేశ్‌ముఖ్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. రాజమహేంద్రవరం ఆమె స్వస్థలం. స్వాతంత్ర్యోద్యమ కార్యక్రమాల్లో భాగంగా ఓ సారి గాంధీజీ తెలుగు రాష్ట్రానికి వచ్చారట. ఆయనకు స్వాతంత్ర్య సంగ్రామ నిధిని అందించాలనుకున్నారు స్థానికులు. వారితోపాటు పదేళ్ల దుర్గాబాయి కూడా జోలెపట్టి సేకరించి ఇచ్చారట. అప్పుడు మహాత్ముడు... పాపా నీ విరాళమేది? అని అడగ్గా వెంటనే తన చేతికున్న బంగారు గాజుల్ని తీసిచ్చారట ఆమె. మరోసారి... టికెట్ లేకుండా కాకినాడ కాంగ్రెస్ సభలకు హాజరైన నెహ్రూని సైతం అడ్డుకున్న ధీశాలి దుర్గాబాయి. పన్నెండేళ్ల వయసులో తాను హిందీ నేర్చుకోవడమే కాదు... ఆంగ్లవిద్యకు వ్యతిరేకంగా బాలికలకోసం ప్రత్యేకంగా హిందీ పాఠశాలనూ స్థాపించారు. తర్వాత కాలంలో తెలుగునాట గాంధీజీ ప్రసంగాలకు తెలుగు అనువాదకురాలిగా పనిచేశారు. ఆపై ఉప్పు సత్యాగ్రహంలో అరెస్టయ్యి జైలుకి కూడా వెళ్లారు. ఆడవారు ఉన్నత విద్య అభ్యసించాలనీ, వారిని స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయించాలనే ఆలోచనతో చెన్నై, హైదరాబాద్‌లలో ఆంధ్రమహిళా సభలను స్థాపించారు. ఆంధ్ర మహిళా పత్రిక ఏర్పాటు చేశారు. తాను స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొంటూనే బనారస్ విశ్వవిద్యాలయం నుంచి మెట్రిక్యులేషన్, ఆంధ్రయూనివర్సిటీ నుంచి ఎంఏ చేశారు. ఆపై ఎల్ఎల్‌బీ చదివి మద్రాస్ హైకోర్టులో సాధన చేశారు. గొప్ప క్రిమినల్ లాయర్‌గానూ పేరు గాంచారు. భారత రాజ్యాంగ నిర్మాణ సభలో సభ్యురాలిగానూ, 1952 ప్లానింగ్ కమిషన్ సభ్యురాలిగానూ పనిచేశారు.

భరత మాతకు ప్రాణం ప్రజల మదిలో స్థానం

దేశాన్ని తల్లిలా భావించి, పూజించే సంస్కృతి మనది. ఈ భావనే భారతమాతకు రూపునిచ్చింది. భరతమాతగా ఆరాధించేలా చేసింది. ప్రపంచంలో చాలా దేశాలను ఆయా దేశస్థులు పితృభూమిగా భావిస్తే భారతీయులు మాతృభూమిగా కీర్తిస్తారు. 'వందేమాతరం' గేయ రచయిత బంకించంద్ర ఛటర్జీ దేశాన్ని దుర్గా, సరస్వతి, లక్ష్మీ స్వరూపాలుగా ఆరాధించారు. దేశంపై పరాయిపాలకుల అకృత్యాల్ని కన్నతల్లిపై జరుగుతున్న దాడులంటూ స్వాతంత్య్ర సమరయోధులు ఇచ్చిన పిలుపు యావత్తు దేశాన్ని కదిలించింది. 'కన్నతల్లి' భావన పల్లెలనూ కదనరంగంలోకి దూకేలా చేసింది. ఇదే సందర్భంలో చాలా మంది చిత్రకారులు తమ సృజనతో భారతమాతకు ప్రాణం పోశారు. ఆయా కాలమాన పరిస్థితులకు అద్దంపట్టేలా అమ్మను ప్రజల మదిలో నిలిపారు.

స్వదేశీ ఉద్యమానికి ప్రేరణ



బెంగాల్‌కు చెందిన చిత్రకారుడు అబనింద్రనాథ్ ఠాగూర్ 1904లో చిత్రీకరించిన భరతమాత ప్రముఖమైంది. నాటి స్వదేశీ ఉద్యమం, జాతీయ ఐక్యత, సాంస్కృతిక వారసత్వం, ఆధ్యాత్మికత విలువల్ని ప్రతిబింబించేలా.. భారతమాత చేతుల్లో చేనేత వస్త్రం, తులసి మాల, వేదాలు, వరి కంకులు చిత్రించారు.




సింహవాహినిగా..

ముంబయిలో ప్రముఖ చిత్రకారుడు రవివర్మ పెట్టిన ప్రింటింగ్ ప్రెస్ 1935లో భరతమాత చిత్రాన్ని విడుదల చేసింది. త్రివర్ణ పతాకం, పద్మం, గద, పుస్తకాలను చేతిలో పట్టుకొని సింహవాహినిగా చిత్రీకరించారు.

బ్రిటిష్ దోపిడీ కళ్లకుకట్టేలా..



అమృత షెర్గిల్ అనే చిత్రకారిణి 1935లో వేసిన 'మదర్ ఇండియా' తైలవర్ణ చిత్రం ఇది. బ్రిటిష్ వారి దోపిడీ, కరవు కాటకాలతో గ్రామీణ మహిళ స్థితిని అందులో హృద్యంగా చిత్రించారు. ఒక చేతిలో బాలుడు, మరో పక్కన బాలికతో వీక్షకుల కళ్లలోకి నేరుగా చూస్తున్నట్టు ఉంటుందీ చిత్రం.



సువిశాల భారతావని

రూప్‌కిషోర్ కపూర్ చిత్రించిన భారతమాత చిత్రాన్ని 1931లో లిథోగ్రాఫ్ విధానంలో ముద్రించారు. ఇందులో 'బ్రిటిష్ ఇండియా' మొత్తం కనిపిస్తుంది. రైతులు, ఓడల్లో వర్తకం, రైల్వే లైన్లు, ఎత్తైన భవనాలు, దేవాలయాలతో దేశం అలరారుతున్నట్లు ఉంటుంది.



గణతంత్ర భారతానికి గుర్తుగా....

శోభాసింగ్ అనే చిత్రకారిణి 1950లో వేసిన భారతమాత మూడు రంగుల చీర కట్టుకొని ఉంటుంది. వలస పాలకుల్ని హెచ్చరిస్తున్నట్టు.. కోపంతో రగిలిపోతున్న సింహాన్ని నియంత్రిస్తూ త్రిశూలధారిగా కనిపిస్తుంది. గణతంత్ర భారతానికి గుర్తుగా అశోక స్తంభాన్ని ఇందులో చూడొచ్చు.

జాతినేతలను ఆదరిస్తున్నట్టు..



గాంధీజీని ఒళ్లో కూర్చోబెట్టుకున్నట్టు, ప్రవాసంలో ఉండి స్వాతంత్య్రం కోసం పోరాడుతున్న చంద్రబోస్‌కు జాతీయ పతాకాన్ని ఇచ్చి ఆశీర్వదిస్తున్నట్టు ఇలా రకరకాల రూపాల్లో చిత్రకారులు భరతమాత రూపాన్ని తీర్చిదిద్దారు.

–ఈనాడు, అమరావతి

మా తుర్యే ధనసిరి సలాం..




వీర్ అమర్ జవాన్ జ్యోతి

అమర్ జవాన్ జ్యోతిని చూడాలంటే దిల్లీ వెళ్లాలి. వీర్ అమర్ జవాన్ జ్యోతిని చూడాలంటే సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలంలోని ధనసిరికి రావాలి. పంద్రాగస్టు వేడుకల్లో భాగంగా శుక్రవారం ఈ అమర జ్యోతి స్థూపాన్ని ఆవిష్కరిస్తున్నారు.

ఇక్కడ ఎందుకు ఏర్పాటు చేశారు.. ఆ గ్రామం విశేషాలు తెలుసుకుందాం...

ధనసిరి... తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని గ్రామం. ప్రాణాలను తృణప్రాయంగా ఎంచి భరత మాత సేవలో తరిస్తున్న యోధులు ఇక్కడ ఇంటింటికీ ఒకరిద్దరు చొప్పున కనిస్తారు. ప్రస్తుతం ఇక్కడి యువత 50 మందికి పైగా సైన్యంలో సిపాయి నుంచి సుబేదార్ వరకు వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తుండగా, మరో యాభై మంది వరకు సైన్యంలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. 50 మంది పోలీసు ఉద్యోగాల్లోనూ ఉండడం విశేషం. సెలవు దినాల్లో గ్రామానికి వచ్చిన మిలిటరీ అధికారులు, శిక్షకులు, సైనికులు... స్థానిక యువతకు నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తుండటంతో గ్రామం నుంచి అత్యధిక మంది సైన్యం, పోలీసు శాఖల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలోనే.. గ్రామంలో 'వీర్ అమర్ జవాన్ జ్యోతి' పేరిట ప్రస్తుతం స్థూపాన్ని ఏర్పాటు చేశారు.

ఒక గ్రామం నుంచి ఇంతమంది సైన్యంలో చేరడానికి.. ఈ ఊరికే చెందిన విశ్రాంత సైనికాధికారులు చంద్రశెట్టి, నాగిశెట్టి సోదరులు మార్గదర్శనంగా నిలిచారని స్థానికులు గుర్తు చేసుకుంటారు. వీరిద్దరూ ఏటా యువతకు ప్రత్యేక శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసేవారని వివరించారు. అలానే సైన్యంలో శిక్షకులుగా పనిచేసిన శివాజీ, అశోక్, చంద్రపాల్‌లు సైతం స్థానిక యువతకు ఆర్మీలో ఉద్యోగం పొందేలా మెలకువలు నేర్పేవారని... ఆర్మీలో పనిచేసే గ్రామస్థులందరూ యువతకు మార్గదర్శకులుగా నిలుస్తున్నారని చెబుతున్నారు. – న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్



సైన్యంలో సేవలు అందిస్తున్న ధనసిరి జవాన్లు



అరుణాచల్ ప్రదేశ్‌లోని తవాంగ్ జిల్లా చునా వద్ద గ్రామస్థులు, విద్యార్థులతో కలిసి భారత సైనికులు, ఇండో - టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) సిబ్బంది తిరంగా ర్యాలీ

మార్నింగ్ సాంగ్ ఆఫ్ ఇండియా



ఎప్పుడు విన్నా రోమాలు నిక్కబొడుచుకునే గీతం.. మన జాతీయ గీతం జనగణమన. ఆ పాటను విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ ఆంగ్లంలోకి అనువదించి, మొదట ఆలపించింది మన రాష్ట్రంలోని అన్నమయ్య జిల్లా మదనపల్లెలోనే. దక్షిణ భారత పర్యటనకు వచ్చిన ఠాగూర్ 1919 ఫిబ్రవరి 25న మదనపల్లెకు వచ్చారు. ఆ తర్వాతి రోజున ఇక్కడి వాతావరణానికి మెచ్చి సింగ్‌సాంగ్‌షన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా తాను బెంగాలీ భాషలో రాసిన జనగణమన గీతాన్ని సొంత బాణీతో పాడి వినిపించారు. సంగీతంలో పట్టభద్రురాలైన అప్పటి బీటీ కళాశాల ప్రిన్సిపల్ జేమ్స్ హెచ్.కజిన్స్ భార్య మార్గరెట్ కజిన్స్ జనగణమనకు పియానోపై రాగాన్ని కూర్చారు. ఈ రాగంలో ఆ పాట బాగా నచ్చడంతో ఠాగూర్ వెంటనే జనగణమనను బెంగాలీ భాష నుంచి ఆంగ్లంలోకి తర్జుమా చేసి మార్నింగ్ సాంగ్ ఆఫ్ ఇండియాగా నామకరణం చేశారు. ఈ గీతాన్ని భారత ప్రభుత్వం అధికారికంగా 1950 జనవరి 24న జాతీయ గీతంగా ప్రకటించింది. –న్యూస్‌టుడే, మదనపల్లె పట్టణం

మన పిడుగుల అడుగులు ఎటు?

బడిబాగానే ఉందా... క్లాస్‌రూంలు బాగున్నాయా.. మార్కులెలా వస్తున్నాయ్... పిల్లల గురించి ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్న మనం... వారి స్నేహితులెవరో చూస్తున్నామా? ఎక్కడెక్కడికి వెళుతున్నాడో వాకబు చేస్తున్నామా? వారి ఆలోచనలు ఎటు పోతున్నాయో ఆలోచిస్తున్నామా? బడిలో ఎలా ప్రవర్తిస్తున్నారో ఆరా తీస్తున్నామా?...

- గంజాయి తీసుకుంటూ పట్టుబడుతున్న విద్యార్థుల్లో చాలామంది తామేం నేరం చేయలేదని వాదిస్తున్నారు. ఒక్కసారి రుచి చూస్తే తప్పెలా అవుతుందని ఎదురు ప్రశ్న వేస్తున్నారు – ఓ పోలీసు ఉన్నతాధికారి.
- సైకిల్ దొంగతనం చేశారని నలుగురు యువకులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. విషయం తెలిసిన తండ్రి పోలీసుల ఎదుట చేతులు కట్టుకోవాల్సి వచ్చింది. –కుమారుడు కోరినవన్నీ ఇస్తున్నా తప్పు చేశాడంటూ ఆ తండ్రి కన్నీరు పెట్టుకున్నారు.
- డబ్బు కోసం చదువే ఎందుకు సార్!.. రీల్స్ చేసి ఇన్‌ఫ్లుయెన్సర్‌గా పేరు తెచ్చుకొని కూడా సంపాదించవచ్చు. –ఓ విద్యార్థి తరగతి గదిలో ఉపాధ్యాయుడితో అన్న మాటలివి.

ఇవన్నీ పిల్లల అపసవ్య ధోరణికి నిదర్శనాలు. పని ఒత్తిడిలో పెద్దలు.. ర్యాంకుల పోరులో గురువులు చూసీచూడనట్టు వదిలేయడంతో మేమేం చేసినా ఎవరూ ఏమనరనే అతి విశ్వాసంతో వారు తప్పటడుగులు వేస్తున్నారు. మరోవైపు పిల్లలు ఏమి చేసినా సమర్థిస్తున్న తల్లిదండ్రుల ధోరణి పిల్లలపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. అతి గారాబంతో ఈతరం తల్లిదండ్రులు ఎక్కువమంది బిడ్డలను కనీసం మందలించట్లేదు. కోరిందల్లా వెంటనే ఇచ్చి వారిలో ఓర్పు, సహనాలను పెరగనీయట్లేదు. దీంతో వారు విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్నారు. బడిఈడులోనే గాడితప్పుతున్నారు.

బాల్యంలోనే బీజాలు...



1 పోలీసులకు పట్టుబడే నిందితుల్లో ఎక్కువ మంది బాల్యంలోనే తప్పటడుగులు వేసినట్టు దర్యాప్తులో గుర్తిస్తున్నారు. చిన్న వయసులో వారి మనసుపై పడిన ముద్రల ప్రభావంతో దారి తప్పినట్టు అంచనా వేస్తున్నారు.



2 ఇటీవల డ్రగ్స్ కేసులో పట్టుబడిన విద్యార్థుల్లో 50 మంది ఒకే విద్యాసంస్థలో చదివినట్టు గుర్తించారు. అక్కడ ఏర్పడిన స్నేహాలతో మత్తు పదార్థాలకు అలవాటుపడ్డారు. 25 ఏళ్లకే అంతర్రాష్ట్ర ముఠాలతో సంబంధాలు పెట్టుకున్నారు.



3 ఏపీ, తెలంగాణల్లో ప్రతి నెలా డ్రగ్స్, సైబర్‌క్రైమ్, ఈవ్‌టీజింగ్ కేసుల్లో 19-25 సంవత్సరాల మధ్య వయస్కులే అధికం. వీరికి కౌన్సెలింగ్ నిర్వహించినప్పుడు తప్పయిందంటూ అంగీకరిస్తున్నారు. మారేందుకు అవకాశం ఇవ్వమంటూ ప్రాధేయపడుతున్నారు.



4 పాఠశాల వయసులోనే పిల్లలను సరైన మార్గంలో మళ్లించినట్టయితే కన్నవారికి పోలీస్‌స్టేషన్ గుమ్మం తొక్కాల్సిన అవసరం లేదంటూ టీజీన్యాబ్ ఇన్‌స్పెక్టర్ తన అనుభవాన్ని పంచుకున్నారు.

ఓ అమ్మా.. నాన్నా...

సామాజిక విషయాలు, చట్టాలపై బాల్యంలోనే కనీస అవగాహన రావాలి. పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలి. తల్లిదండ్రులు పిల్లల కోసం సమయాన్ని కేటాయించాలి. ఏ సమస్య అయినా తమతో పంచుకొనే స్వేచ్ఛ ఇవ్వాలి. మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలపై బాల్యంలోనే అవగాహన కల్పించేందుకు ప్రదర్శనలు, సదస్సులు ఏర్పాటు చేసి విద్యార్థులను భాగస్వామ్యం చేస్తున్నాం.

– సీవీ ఆనంద్, హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్

తప్పటడుగులు..

- తమకు నచ్చని గురువులు, విద్యార్థినుల ఫొటోలు మార్ఫింగ్ చేస్తున్నారు.
- సామాజిక మాధ్యమాల్లో పరిచయమైన వారితో వ్యక్తిగత విషయాలు పంచుకుంటున్నారు.



- ఈ-సిగరెట్లు, గంజాయి చాక్లెట్లను బడి వయసులోనే రుచి చూస్తున్నారు.



- వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌ల్లోని ఖాతాల్లో నచ్చిన అంశాలు ఫార్వార్డ్ చేస్తున్నారు.
- రీల్స్ మోజులో ప్రమాదకర ఫీట్లతో ప్రాణాల మీదకి తెచ్చుకుంటున్నారు.
- డ్రైవింగ్ లైసెన్స్ లేకుండానే ఖరీదైన బండ్లను నడుపుతున్నారు.
- రద్దీ ప్రాంతాలు, బస్టాపుల్లో చేరి మహిళలను వేధిస్తున్నారు.
- చిన్నారుల అశ్లీల వీడియోలను డౌన్‌లోడ్ చేసి మిత్రులకు పంపుతున్నారు.




- గేమింగ్, బెట్టింగ్ యాప్‌లలో డబ్బు సంపాదించాలని మోసపోతున్నారు.

ప్రాథమిక పాఠశాలలోనే నైతిక అంశాలను కథలు, పాటల ద్వారా పరిచయం చేయాలి. తల్లిదండ్రులు, గురువులు, పెద్దలను, స్త్రీలను ఎలా గౌరవించాలో చెప్పాలి. ఆడ పిల్లలను వేధించినా, ఆటపట్టించినా తలెత్తే పరిణామాలను వివరించాలి

- డాక్టర్ లావణ్య నాయక్ జాదవ్ హైదరాబాద్ మహిళా భద్రత విభాగం డీసీపీ

డ్రగ్స్‌కు అలవాటుపడితే చదువు, కెరీర్ ఎలా నాశనమవుతుందనేది.. ఉదంతాలతో చెప్పాలి పిల్లలిచ్చిన సమాచారంతో కొన్ని అంతర్రాష్ట్ర డ్రగ్స్ ముఠాలను అరెస్ట్ చేశాం.

– ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య.



- ఈనాడు, హైదరాబాద్



భరతమాత వీర పుత్రికలు

స్వాతంత్య్రం కోసం ఉప్పు సత్యాగ్రహం, విదేశీవస్తు బహిష్కరణ తదితర కార్యక్రమాల్లో మహిళలూ ముందుండి నడిచారు. గోదావరి తీరానికి చెందిన దుర్గాబాయ్ దేశ్‌ముఖ్, కాశీభట్ల వెంకటరమణమ్మ, దువ్వూరి సుబ్బమ్మ, శివరాజు సుబ్బమ్మ, పెద్దాడ కామేశ్వరమ్మ, మద్దూరి వెంకటరమణమ్మ, గుజ్జు నాగరత్నం, పాలకోడేటి శ్యామలాంబ, తల్లాప్రగడ విశ్వసుందరమ్మ, గూడూరి నాగరత్నం, బారు అలివేలమ్మలు ఈ కోవలోని వారే. వారి స్ఫూర్తిని భావితరాలకు చెప్పే ఉద్దేశంతో రాజమహేంద్రవరం నగరానికి చెందిన చరిత్రకారుడు వైఎస్ నరసింహారావు నగరంలో ఓపార్కును దత్తత తీసుకుని 2000 సంవత్సరంలో ఈ మహిళా ఉద్యమకారుల విగ్రహాలను ఏర్పాటుచేశారు. –న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం

డీఓబీ 17-6-1953 ఇప్పటికింకా నా వయసు నిండా ఇరవై మూడే



దేశరాజు వెంకటశంకర రావు.. వయసు 73. నివాసం.. భద్రాచలం రాజ వీధి. ఎస్‌బీఐ డిప్యూటీ మేనేజర్‌గా 2013లో ఉద్యోగ విరమణ చేశారు. అంతకు ముందు సంవత్సరం బైపాస్ సర్జరీ అయింది. అయితేనేం.. తనకున్న ఆసక్తితో నలుగురికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ నెల 2 నుంచి 7 వరకు కేరళ కోజికోడ్‌లో జరిగిన జాతీయస్థాయి మాస్టర్ (40 ఏళ్లు పైబడిన వారికి) పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. ఇందుకోసం ఆరు నెలలు శిక్షణ పొందారు. స్క్వాట్ అంశంలో 60 కిలోలు, బెంచ్ ప్రెస్‌లో 60 కిలోలు, డెడ్ లిఫ్ట్ అంశంలో 100 కిలోల బరువును అవలీలగా ఎత్తి మూడు బంగారు పతకాలను పొందారు. మూడు విభాగాలలో స్వర్ణం రావడంతో ఓవరాల్‌గా ఛాంపియన్‌గా నిలిచి మరో పసిడి పతకం అందుకున్నారు. అక్టోబరులో దక్షిణాఫ్రికాలో నిర్వహించే అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించారు. – న్యూస్‌టుడే, భద్రాచలం



నాటి యతి తపోతలం

నాగార్జునసాగర్‌కు 25 కిలోమీటర్ల దూరంలో ఉంది 'ఎత్తిపోతల'. మాచర్ల వెళ్లే మార్గంలో ఎత్తిపోతల స్టాప్ నుంచి 3 కి.మీ. లోపలకు వెళితే వస్తుంది ఈ సుందర ప్రాంతం. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వరద నీటితో జలకళ సంతరించుకుంది. సుమారు 70 అడుగుల ఎత్తు నుంచి నీరు లోయలోకి పడుతున్న దృశ్యం పర్యాటకులకు కనువిందు చేస్తుంది. పూర్వం రుషులు తపస్సు చేసిన ప్రదేశం కావడంతో యతి తపోతలంగా పిలిచేవారని.. కాలక్రమంలో ఎత్తిపోతలగా మారిందని స్థానికులు చెబుతారు. – న్యూస్‌టుడే, నాగార్జునసాగర్

యూరియా పాలు.. ఇనుము టీ!



కూరగాయలకు పోతే పుచ్చుల్లేకుండా చూసుకుంటాం
చీరలకెళితే చిరుగుల్లేకుండా చూసి ఎంపికచేసుకుంటాం...
మరి... రోజూవాడే పాలు... తాగే టీ అసలువా నకిలీవా చూసుకుంటున్నారా? ఇవే కావు... మిరియాల నుంచి బఠానీల దాకా కల్తీ విచ్చలవిడిగా జరుగుతున్న తరుణంలో... నకిలీలను గుర్తించడమెలా?

తాగే పాల దగ్గర్నుంచి తినే ఆహారం వరకు మార్కెట్లో అనేకం కల్తీ అవుతున్నాయి. ఆయా పదార్థాలను పోలి ఉండే వాటిని కలిపి వినియోగదారులను మోసం చేస్తున్నారు. శుద్ధమైనవా.. కల్తీవా అనే అనుమానాలున్నా ఎలా తనిఖీ చేసుకోవాలో తెలియక సామాన్యులు అలాగే వాడేస్తున్నారు. అనారోగ్యం పాలవుతున్నారు. నిత్యావసరాల్లో కొన్ని కల్తీవో కావో ఇంట్లోనే సులభంగా గుర్తించవచ్చని జాతీయ పోషకాహార సంస్థ(ఎన్ఐఎన్) వెల్లడించింది. వీటిపై విద్యార్థులకు, సామాన్య ప్రజలకు అవగాహన కల్పిస్తోంది.

కష్టాల 'పాలు'

పాలను ప్రస్తుతం పలు రకాలుగా కల్తీ చేస్తున్నారు. ఇదివరకు నీళ్లు ఎక్కువ కలిపేవారు. ఇప్పుడు ఏకంగా యూరియా, స్టార్చ్, డిటర్జెంట్లను కలుపుతున్నారు. ఇవి చాలా ప్రమాదకరం. ఎదిగే పిల్లల్లో హార్మోన్ల అసమతుల్యతకు ఇవి కారణమవుతాయి. సాధారణంగా పాలు పితికిన కొన్ని గంటల్లో వేడి చేయకపోయినా, శీతలీకరించకపోయినా విరిగిపోతాయి. నగరంలో ఉదయం తీసుకున్న పాలు మధ్యాహ్నమైనా విరగకపోవడంతో వినియోగదారులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. నమూనాలను తీసుకెళ్లి ల్యాబ్‌లో పరీక్ష చేయించే ఓపిక లేక అలాగే వాడుతున్నారు.



- పాల కల్తీని లాక్టోమీటర్ ద్వారా గుర్తించవచ్చు. ఇది తక్కువ ధరకే దొరుకుతుంది. టెస్ట్ ట్యూబ్‌లోకి పాలను తీసుకుని అందులో లాక్టోమీటర్ ఉంచితే రీడింగ్ (సాంద్రత) 1.020 నుంచి 1.030 మధ్యలో ఉంటే కల్తీ లేనట్లని ఎన్ఎన్ఐ సీనియర్ టెక్నికల్ అధికారి డాక్టర్ నవీన్‌కుమార్ తెలిపారు. అంతకంటే ఎక్కువగా లాక్టోమీటర్ పాలలో మునిగితే ఎక్కువ రీడింగ్ చూపిస్తుంది. నీరు ఎక్కువగా కలిసినట్లు భావించాలి.

యూరియా...

ఇంట్లోనే యూరియా కల్తీని గుర్తించవచ్చు. పాలను ఒక టెస్ట్‌ట్యూబ్‌లోకి తీసుకుని అందులో కొద్దిగా కందిపప్పు పొడి లేదా సోయాబీన్ పొడి వేయాలి. బాగా కలిపిన తర్వాత దాంట్లో లిట్మస్ పేపర్ ముంచి బయటికి తీయాలి. ఆ కాగితం ఎరుపు నుంచి నీలం రంగులోకి మారితే కల్తీ అని నిర్ధారించుకోవాలి.

స్టార్చ్ కలిస్తే..

ఈ మధ్య పాలలో స్టార్చ్ కలుపుతున్నారు. గాయాలైనప్పుడు ఉపయోగించే టింక్చర్ అయోడిన్ ఒకటి, రెండు చుక్కలు పాలల్లో వేయాలి. పాలు నీలం రంగులోకి మారితే కల్తీ అయినట్లే.

డిటర్జెంట్ కలిపితే..

టెస్ట్ ట్యూబ్‌లో 5 ఎం.ఎల్ పాలు తీసుకుని షేక్ చేయాలి. పై భాగంలో నురగ ఏర్పడితే డిటర్జెంట్ కలిసినట్లు. ఎలాంటి నురగా లేకపోతే అవి స్వచ్ఛమైనవని అర్థం.

టీ పొడి



మార్కెట్లో ఈ మధ్య టీ పొడి కల్తీ ఎక్కువగా జరుగుతోంది. హైదరాబాద్ పాతబస్తీలో టీపొడి కల్తీ ముఠాను ఇటీవల పట్టుకున్నారు. ఇందులో ఇనుప పొడిని కలుపుతున్నారు.

టీ పొడిలో అయస్కాంతం వేయడం ద్వారా ఇనుపపొడి ఉంటే దానికి అతుక్కుంటుంది. ఆ విధంగా కల్తీని గుర్తించవచ్చు.

తేనె

ఇంట్లో ఎక్కువగా ఉపయోగించే పదార్థాల్లో తేనె ఒకటి. నిజమైందా లేదంటే బెల్లం, చక్కెర పాకంతో కలిపి చేస్తున్నారా? అనే అనుమానాలు చాలామందిలో ఉన్నాయి. మార్కెట్లో చాలా కల్తీ కూడా జరుగుతోంది. ఒక చెంచాలో తేనెని కొద్దిగా తీసుకుని గాజు గ్లాసులోని నీటిలో వేయాలి. వెంటనే నీటిలో కలిసిపోతే కల్తీదనే అర్థం. తేనె అయితే అడుగు భాగంలోకి చేరుతుంది.



మిరియాలు



ఖరీదు ఎక్కువగా ఉండే, వంటల్లో ఉపయోగించే మిరియాల్లో బొప్పాయి పండు గింజలు కలుపుతున్నారు. చూడటానికి రెండు ఒకేలా ఉంటాయి. నీటిలో వేస్తే బొప్పాయి గింజలు తేలుతాయి. ఆ విధంగా కల్తీని గుర్తించవచ్చు.

బఠానీ

హైదరాబాద్ వంటకాల్లో ఎక్కువగా పచ్చ బఠానీలు వాడుతుంటారు. వీటికున్న డిమాండ్ దృష్ట్యా రంగు వేసి మార్కెట్లో అమ్ముతున్నారు. కల్తీ కారణంగా క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉంది. బఠానీలు అరగంట పాటు నీళ్లలో నానబెడితే రంగు పోతుంది.



- ఈనాడు, హైదరాబాద్

EENADU Vol: 52, Issue: 6 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao